కాశీభట్ల వేణుగోపాల్

# నేనూ - చీకటి



# నేనూ – చీకటి

కాశీభట్ల వేణుగోపాల్

**NENU - CHEEKATI** *(Novel)*
by KASIBHATLA VENUGOPAL

First Edition : October, 2001
Second Edition : May 2013

© Author

*Cover Design :*
**ULCHI**

*Published by :*
**AKSHARAM PRACHURANALU**
87/1345-10, Nandyal Checkpost
Kurnool - 2
Cell : 95500 79473

*For Online Purchases & e Book*

Kinige www.kinige.com

*Printed at*
**Sri Sri Printers**
VIJAYAWADA - 520 002
Cell : 9490 634849

₹ : **100**

## అంకితం

అమ్మకూ.....
ప్రకృతిలో ఆడతనానికంతటికి
ఈ చీకటి పేజీల
చిట్టా పద్దు.

**– వేణు**

# ఈ నవల ఒక బౌద్ధిక భూకంపం

**"నేనూ - చీకటి"** చదవటానికి దాని చిత్తు ప్రతి తెరిచాను. నా అనారోగ్యస్థితి మూలంగా కొంతభాగం అప్పుడు చదివి మరికొంత భాగం మరోరోజు చదివి అలా అంచెలవారీగా ముగిద్దామని అప్పటి అలోచన. కానీ మొదటి నాలుగు లైన్లు చదివానో లేదో కరెంటు పాకినట్లు నఖశిఖ పర్యంతం ఆ రచన నాలో పాకిపోయింది. మధ్య లంచిచేశానే కానీ సాయంకాలానికి పుస్తకం ముగించాను. రాచకొండ విశ్వనాథశాస్త్రి కథలంటే నాకు చాలా యిష్టం. ఆయన్నే తెలుగు కథల్లో పితామహుడనుకునే వాడ్ని నేటివరకూ. కానీ "నేనూ–చీకటి" ముట్టుకున్న తర్వాత కథన కళలో యిలాంటి రచన యింతవరకూ రాలేదు అనితెలిసే సరికి భ్రాంతుడ్నయ్యాను. అడుగడుగునా యింత అశ్చర్యాఘాతం కొట్టే రచన! నేను దాస్తావ్‌స్కీ, తుర్జెనీవ్, ఛెకోవ్, టాల్‌స్టాయ్, కామ్యూ, కాఫ్క, జేమ్స్‌జాయ్స్, ఓ హెన్రీ వగైరా వగైరా నవలల్ని తిరగేసిన వాడ్ని. వాటి ప్రభావం "నేను–చీకటి" రచయిత మీద సోకినట్లనిపిస్తుంది. కానీ "నేనూ–చీకటి" వీటిలో దేనికి ప్రతిబింబంకానీ ఛాయ గానీ ఏదీ కాదు. అది తెలుగు నేల మీద పుట్టి పెరుగుతూ జీవన ఝంఝను ఎదుర్కొంటూ ముందుకు పోతున్న కాశీభట్ల వేణుగోపాల్ అనే ఒక మానవాగ్ని పర్వతం నుంచి కలిగిన ఒక "ఇంటలెక్చ్యుల్ బ్లాస్ట్" (బౌద్ధిక విస్ఫోటం అనే పదం చాలదు) ఆయన బుద్ధి అతి సాధారణ మానవుల జీవితాన్ని గురించి ఘుర్ఘురిస్తూ, ఘుర్ఘురిస్తూ, క్రోధాగ్ని అంటుకుని ధామ్మని ఒక విస్ఫోటం సంభవించింది. రచన అంతా గగనంలోకి ఎగిరే విస్ఫులింగాలు, దారినంతా దగ్ధం చేస్తూ ప్రవహించే కొండ చిలువల్లాంటి లావా ప్రవాహాలు, వాక్యాలు వాక్యాలు కావు, భాష భాష కాదు, వ్యాకరణానికి డైనమైట్ పెట్టినట్లయింది. శబ్దాలు శబ్దాలుగా ముక్కలు ముక్కలై చెల్లా చెదురై ఎగిరిపడుతున్న అగ్నికణాలు. మీద పడితే ఒళ్ళు కాలుతుంది హృదయం జ్వలిస్తుంది. భావావేశ విస్ఫోటనాన్ని ఏ భాష పట్టుకోగలదు. ఇది బుద్ధిపూర్వక, ఆలోచన సహిత, వాస్తు నిర్మాణం లాంటి రచన కాదు. అంటే ప్లాను వేసి రాసింది కాదు. అందుకే అన్నాను. ఒకవిస్ఫోటం అని... ఏ అపోలినైర్నో, ఏరేంబోనో, ఏలోత్రెమాంత్‌నో చదువు తున్నట్లుంటుంది.

జేమ్స్ జాయ్స్ రాసిన ఫిన్నెగన్స్‌వేక్‌లేక యుల్లిసిస్‌లాగా ఆధునిక బౌద్ధిక భూకంపాలకన్నిటికీ యూరప్ ఎపి సెంటర్ యుగయుగాన ఈ సెంటర్ మారుతూ ఉంటుది. సెంటర్ ఆఫ్ గ్రావిటి మారుతూ ఉంటుంది. అలా అంటే–

ఈ పుస్తక విషయంలో దానికంటే అర్థం మరేమి లేదు. వేణుగోపాల్‌లో ఉన్నవి సాధారణ మానవుల ఝంఝలే, ఎంత సాధారణమైతే ఆ ఝంఝల తీవ్రత అంత ఎక్కువ. సాధారణ అనే మాట (గంధకంలాంటి) విస్ఫోటక పదార్థం. ఆయన విస్ఫోటిత అభివ్యక్తి శకలాలు అద్భుతమై, ఈ ఆధునిక రచనా యుగంలో ఆయన మౌంట్ ఎవరెస్టు అయ్యారు.

స్నేహమూర్తి 'భగవాన్లు' పాత్ర కొన్ని శకలాలు పోగు చేసుకుని అతికించుకుంటే గానీ దొరకదు. జేబులో చిల్లి గవ్వలేకుండా ఆకలితో వచ్చిన మిత్రుడితో తిండి తినమని చెప్పే భగవాన్లు మాటలు– "నాకు తెలియంది నీ దగ్గరేం మిగిలి యుందిరా గాడ్దెకొడకా! రాత్రొచ్చింతర్వాత మాట్లాడుదాం" వాడు "భగవాన్లు ఖాకీ తొడుక్కున శవాల టాక్సీ డ్రయివర్ యం.ఏ. డబల్లిట్‌గాడు" "గాలై, సుడిగాలై సందుమలుపులో సుడులు తిరుగుతూ" (వెళ్లిపోయాడు).

గతిలేక సెక్సుదుకాణం పెట్టుకున్న ఒక వనిత పాత్ర!

భగవాన్లు యిచ్చిరమ్మన్న డబ్బు యివ్వడానికి ఆ వనిత అంటే జానకి యింటికి వెళ్లాడు. ఇంట్లో "గాజు పగిలిన గడియారంలోకి చూశా... మూడు..." ఆమెతో సంభాషణ (తను తప్పతాగిఉన్నాడు అప్పటికే) ఆమె "తలెత్తి చూస్తే... తడి జుట్టుకి టవల్చుట్టుకుని చిన్ని నీలంపువ్వుల తెల్ల చీరలో మల్లు జాకెట్లో మంచు కడిగిన నందివర్ధనంలాగా–" "ఏమిటీ వద్దన్నానుగా... మళ్లీ ఇంకోటి వేసుకుంటున్నారు ఆ..." విస్కీసీసా గట్టిగా పట్టుకుని పల్చటి శుష్కించిన చెయ్యి నా గడ్డంలో వేళ్ళుజొనిపి... ఏదియిటుచూడండి..." ఈయన ఆమెతో "నాకే కోరికాలేదు. నువ్వు... నువ్వీరోజు... యిప్పుడు... ఈ క్షణం మరీ అందంగా ఉన్నావు అంతే... అంతే కానీ ఆవేశానికక్షరాలు దొరకవంతే–" ఆకలేస్తోంది... ఊ... లెండి... జబ్బ పట్టుకుని లేవదీయబోయి... తలక్కట్టుకున్న టవల్ వీడిపోయి... ఝల్లున దూకిన నల్లటి జలపాతమల్లే నన్ను నిలువెల్లా తడిపేసిన వెంట్రుకల్ని... మళ్ళీ టవల్తోకలిపి కట్టుకుంటూ చితికినసంధ్యల్లే..." కొంచెం తర్వాత..." ఎక్కడి స్నేహలివి... జానక్కి నేనెవరు రాస్కాల్నికోవ్‌కు సోనియా ఎవరు?"– "ఎన్ని యుగాలు స్రవించినా ఎండిపోదీ కన్నీళ్ళ ఊట... ఎంత వరదై పొంగినా... తడవదీ బండ నాగరికత...". "నేను తన్నుకున్న కాఫ్కా... పెట్టె పక్కన తొంగి చూస్తూ ముందుకు వంగి అందుకున్నా... పసుపు రంగు రెక్సిను బౌండు పుస్తకం బంగారం రంగు ముగ్గుల డిజైన్లతో... ముఖాన్ని తొలగించా... ఏటవాలు అక్షరాలతో అందంగా ఆర్. గౌరీ మనోహరి, బి.ఎస్సీ, ఫైనల్ అనుంది! ఎక్కడ గౌరీ... మనోహరి... గౌరీ...మనో..హరి..

స్వరజ్వాలాముఖీ విస్ఫోటంలో జ్వలించిన ద్రవశిలా గానలహరీ...(అంటే 'జానకి' బిజినెస్ కోసం పెట్టుకున్న మారుపేరన్నమాట)... సిగరెట్టు వెలిగించుకొని పొగల్పీల్చి పొగల్వదలి పొగలో అలా...అలా–" ఇంతకుముందు ఎన్నో శకలాలు ఇంద్రధనుస్సు విరిగి మస్తిష్కం మీద రాలిన కాగితం మీదికి జారిన వర్ణ శకలాలు: "నాకాలికి విశ్లథ రక్షణను తొడిగిన పరిమళం! లేచి, లేవలేనితనం". "బార్లో నుంచిబజార్లోకొచ్చిన నాగరికత". "బైబిలు మధ్యన పవిత్ర నిశ్శబ్దంలో!". "వైభవోద్రిక్త దినాన్ని భుజాన వేసుకుని భగవాన్లనివెతుకుతూ వెళ్ళా" "ముక్కులోంచి నీళ్ళు, సారాయి, బ్రాందీ కాక్‌టెయిల్ అయ్యి..." ఇలాంటి అద్భుతమైన ఆశ్చర్య విద్యుత్తు ప్రవహించే వైర్లూ వైర్లముక్కలు చెల్లా చెదురుగా పడి ఉన్న రచనాలయం ఈ నవల–వల. "నేనూ–చీకటి". ఇది తెలుగు సాహిత్యంలో ఈ శతాబ్దానికి కిరీటం అని నిస్సందేహంగా చెప్పవచ్చు. దీని కర్త కాశీభట్ల వేణుగోపాల్ యింకో ప్లానెట్ నుంచి మన ప్లానెట్ మీదికి దూకిన విద్యుత్ప్రాణి.

జ్ఞాన్‌బాగ్ **గుంటూరు శేషేంద్రశర్మ**
హైదరాబాద్–12 13.12.1997

# ఒక్కక్షణం...

ఆలోచన అన్నది యింతవరకూ మనిషికి అంతుచిక్కని అద్భుతం... ఆలోచనకి అక్షరాలే కావాలి అన్న నియమం లేదు... చిత్ర విచిత్ర చిత్రాల్తో కూడా ఆలోచన వుంటుంది.

సాహిత్యం ఆలోచనల by product ఆలోచనెంత పురాతనమో సాహిత్యమూ అంతే పురాతనం. ఈ పురాతనమైన సాహిత్యపు పునాదుల లోతుయెంతో యే చారిత్రకుడూ చెప్పలేడు. కోట్ల వత్సరాల మాయామయ నాగరికతల పొరల్లో భాష యెపుడావిర్భవించిందో వూహకందదు.

కాలం పొరల్ని చీల్చి యిదుగో అసలు సిసలైన సాహిత్యం ఋగ్వేదం... అది వెయ్యిన్ని అయిదు వందల క్రీ.పూ. నాటిది. అని విర్రవీగే డాక్టరేట్లను... అయ్యా! పోయిన సంవత్సరం ఫలానా తారీఖున నువ్వెక్కడున్నావ్? నువ్వే మాలోచిస్తున్నావ్? అంటే స్పష్టంగా చెప్పలేడు... కానీ వేల సంవత్సరాల క్రితం, యిదుగో యిది యిలాగే జరిగింది! యిది యిన్నేళ్ళ నాటిది అని ఘంటాపథంగా చెబుతాడు ఆశ్చర్యాల్లోకి ఆశ్చర్యం!

ఈ సోదంతా యెందుకంటారా? ఇదుగో సాహిత్యం యిలా యిప్పుడు యిక్కడ పుట్టింది. దాని ఆవిర్భావ స్థానం యిదీ అనేందుకు రుజువులేవీ లేవు... దొరికిన రుజువుల్ని పట్టుకొని కాలకూపం లోతుల్లోకి దిగే సాహసం కూడా అందరూ చేయరు చేయలేరు. యెవరో యెక్కడో భా...శి. శంకరశాస్త్రి అనబడే ఆరుద్రలు తప్ప.

నిజానికి 'నాగబు' అన్నది మనకి లభించిన తొలితెలుగు మాట అని ఆయన సమగ్రాంధ్ర సాహిత్యంలో చెప్పినా... 'నాగబు' తోటే తెలుగుభాష ప్రారంభమైంది అనిచెప్పే సాహసం చేయలేదు. విజ్ఞుడు గనక... దొరికిన రుజువులలోకి అతి పురాతనమైన రుజువు అది మాత్రమే అన్నాడాయన.

సరే భాషా నదీమూలాలు వెదికే సాహసం చేయబోడం లేదు నేను... ఆలోచనా భాషా... సాహిత్యం మూడూ ఒక్కలాగునే పురాతనమైనవి అని మాత్రమే చెప్పదల్చుకున్నాను.

ఆలోచన విషయానికొద్దాం.

అసలు సిసలైన ఆలోచన యే వ్యాకరణానికి లొంగదు. ఆలోచనన్నది పుట్టిన తర్వాత దాని Metamorphosis అద్భుతంగా జరుగుతుంది.

అందులో వివిధ స్థాయిలుంటాయి.

మనిషి వైయక్తిక మానసిక స్థితి విద్యా పరిసరాల నిసర్గ గుణమూ... అతని చుట్టూ వున్న సమాజమూ... అతను పెరిగిన సంస్కృతీ... అతను నేర్చిన భాషా... ఆఖరుగా వ్యాకరణమూ అనబడే Different Stages నించీ Pass అవుతూ ఆలోచన, వాక్యం అన్న సీతాకోక చిలుకై శబ్దరూపమో, రచనా రూపమో తీసుకుంటుంది. Metamorphose కాని Raw naked thought ని వున్న దాన్ని వున్నట్టు దిగంబరంగా చూపిస్తే చాలా Confusion చెలరేగుతుంది... దాన్ని సహించడమూ Comprehend చేసుకోవడమూ కష్టమే.

ఈ నా "నేనూ–చీకటి"లో అటువంటి అభివ్యక్తిని చాలా చోట్ల చూస్తారు. ఆలోచనావిర్భావానికి Libido మూలస్థానమని Freud sigmund లాంటివాళ్ళన్నారు. అది నిజమని వాళ్ళు అనుకున్నా... ఆలోచించే మనకందరికీ ఆ విషయం తెలుసు.

హుస్సేన్‌కి గుర్రాల మీద మోజెందుకు? అతని చిత్రాలు అతని అలోచనలకి ప్రతిరూపాలు కదా! అతని చిత్రాలలోతుల్లోకి వెళ్ళి చూస్తే... అతని గుర్రాలకి అతని మానసిక చేతనలోకి Libidinous ఉగ్రూతలకీ Link మనకి తెలుస్తుంది. అతని (మక్బూల్ ఫిదా హుస్సేన్) హయమదన రచన జగద్విదితమే కదా!

చెప్పొచ్చేదేమంటే మౌలిక ఆలోచనా వ్యవస్థలో Libido అంతర్లీనమై సర్వత్రా వ్యాపించి ఉంటుందని...

అది యే కళాప్రక్రియ అయినా సరే ఖచ్చితంగా Libido చే Control చేయబడినదే అయి ఉంటుంది (అని నా నమ్మకం).

ఒక ప్రముఖ నట్టువగత్తె (నాట్యకళాకారిణి అనాలి కాబోలు) చెప్పారు... కొన్నికొన్ని భంగిమల్ని అభినయిస్తునప్పుడు orgasmic pleasure కలుగుతుందని. సమాజానికి బహిర్గతమైన మానవ వ్యక్తిత్వం చాలా చాలా కొద్ది మాత్రమే.

It is a tip of an iceberg psychoanalysis theory propose చేస్తూ sigmund freud అంటారు.

మనిషి మొత్తం మానసిక వ్యవస్థను ice berg తో పోలుస్తూ దాన్ని నాలుగు భాగాలుగా విభజించాడు. నీటి మీద తేలుతూ కనిపించే చిన్ని మంచు శకలం... సమాజానికి బహిర్గతమైన వ్యక్తిత్వం... నీటి అడుగున మహాపర్వతంలా పరుచుకున్నది వ్యక్తి అంతశ్చేతన అనబడే అసలు వ్యక్తిత్వం... దాన్ని Id..Ego..Super Ego లుగా మళ్ళీ విభజించాడాయన. అందులో ప్రముఖ స్థానం Libido చే control చేయబడే 'ID' ది.

Libidinous instincts అయినభోజన, నిద్రాభయమైథునాల ద్వారా శాసించబడి... ఒక వ్యక్తి వ్యక్తిత్వమూ, అతని సంస్కారము అతనిలో కళలూ రూపుదిద్దు

కుంటాయి... (కళల్లో సాహిత్యం కూడా ఒక్కటి అంటే నా కంటే మూర్ఖుడు యింకొకడుండడేమో!)

పైకి కనబడు చిన్ని శకలం (tip of an iceberg) లోంచే మనిషిలోని creativity కూడా బైటికి రావాలి... కానీ ఆ 'క్రియేటివిటీ' మీద గుత్తాధిపత్యం మాత్రం అతని బహిర్గతం కాని చీకటిలోని మంచుకొండ మనస్తత్వానిదే.

అది రచన అయినా... Painting అయినా గానమైనా... శిల్పమైనా యే కళ అయినా... అతని వ్యక్త వ్యక్తిత్వంలోంచి మాత్రమే సమాజం వాటిని చూడాలి... చూస్తుంది కూడానూ. నిజానికి ఆ కళ, క్రిందన చీకట్లో వున్న మౌలిక మానసికావస్థనించీ ఉద్భవించిందన్న సత్యం చాలామంది గ్రహించలేరు...

ఈ చీకటే ఈ 'నేనూ–చీకటి'లోని చీకటి.

ఓహోహో చాలా గొప్ప విషయాన్ని చెప్పాడురా వీడు... అస్తవ్యస్తపు రాతలు రాసి దానికి మానసిక విశ్లేషణ అన్న శాస్త్ర వర్ణాన్ని పులిమి వాణ్ణి వాడు Support చేసుకుంటున్నాడు చూడండి... అని అనుకునే వాళ్ళు చాలామంది వుంటారు... ఉండనివ్వండి.

* * *

మరపు అన్నది మెదడుకి లేదు... అన్న వాస్తవం జీర్ణంకాదు మనిషికి... ఒక్కసారి మెదడులో ఒకవిషయం register అయిన తర్వాత అది erase కాదు... ప్రతి విషయమూ మెదడులో రకరకాలుగా cipher కాబడి register అవుతాయి. recollection జరిగినప్పుడు మన conscious mind కి తెలీకుండానే decipher కాబడి గుర్తుకు వస్తాయి.

Recollection problem నే మనం మరపు అనుకుంటాం. అట్లా మేధస్సులోని పొరల్లో రకరకాల సంకేతాలుగా register కాబడిన విషయాలన్నీ 'అలోచన' అన్నవింత వస్తువుకి అంటుకుని ఉంటాయి.

సుప్తచేతనలో ఆ register కాబడిన విషయాల సంకేతాలన్నీ కలలుగానూ... ఆలోచనా స్రవంతిలో ముక్కలుముక్కలుగా తేలుతూ ప్రతిఫలిస్తాయి.

మనం ఒక విషయాన్ని ఆలోచిస్తున్నామంటే... దానికి Barnacles లాగా అతుక్కుని వేల వేల సంకేతాలు వుంటాయి. దాన్ని As it is గా చూపించడం Surrealism అన్న ప్రక్రియగా రూపొందింది. ఈ Surrealism అన్నది ఒక్క చిత్రకళకే పరిమితమైందని చాలామంది భావిస్తున్నా యిటు సాహితీ రంగానికి యింకా అనేక సాంస్కృతిక రంగాలకూ కూడా అది వ్యాపించి ఉంది.

Waiting for godot, becket నాటకం ఆ కోవలోదే. James joyce ulysses నవల ఒక ఉదాహరణ. తెలుగు సాహిత్యంలో కొన్ని నవలలీ ప్రక్రియతో వచ్చాయి.

చైతన్య స్రవంతినీ, స్వప్నమార్మికతనూ కలిపి కవితాత్మకంగా చెప్పిన కథ 'నేనూ–చీకటి'. ఇది అంతా కవిత్వపు దురదే అన్న మహానుభావులున్నారు... వాళ్లకి సంజాయిషీ కాకున్నా చెప్పవల్సినది గొప్పగా చెపుతున్నాను. వచన కవిత అన్న ప్రక్రియ వున్నప్పుడు... కవితా వచనం వుండడంలో తప్పులేదూ అని...

ఈ నారచన నిజంగా చీకట్లోనే వుండి పోతుందనుకున్నాను. దీన్ని ధారావాహికగా ప్రచురించిన ఆంధ్రప్రభ సంపాదకులకు దీని చిత్తు ప్రతిని సాపుచేసి వ్రాసిన శ్రీ జి.వెంకటకృష్ణ గారికి... చిత్రకారులు శ్రీ చంద్రగారికి... అర్థించిన వెంటనే ముందుమాట మాట్లాడిన మహాకవి 'శేషేన్'కి చదివి అలసిన పాఠకుడికి సేదతీర్చే మాట పేర్చిన రచయితా మిత్రులు శ్రీ స్వామి గారికీ, శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మగారికీ కృతజ్ఞతలు.

ఇకపోతే... ఈ నవల ప్రభలో ప్రచురితం కాక మునుపు 'ఒరే గడ్డపోడా! నీ రచనల్ని యెవ్వరూ అచ్చువేయరూ వేయలేరు... వాటిని అచ్చువేస్తే గీస్తే నేనే వేయాలి ఎప్పటికేనా అని నిజంగానే ఈ రోజున ఈనా 'నేనూ–చీకటి'ని అందమైన పొత్తంగా తీర్చిదిద్దిన ఆత్మబంధువు.. ప్రియమిత్రుడు... హితుడు... సన్నిహితుడు నేను ప్రేమగా 'బాషా!' అని పిల్చుకునే స్నేహానికి బాదుషాహ్ షౌకత్ ఆలీకి అక్షరాంజలి... తప్ప ఏమి యివ్వలేని వాడిని.

ఇక కదలండి నా అక్షరాలతో కదనానికి...

I wish you win.

**– కాశీభట్ల వేణుగోపాల్**

# నేనూ - చీకటి

తమో కిరణాల్లా వర్తించిన కాంతి శూన్యంలోకి యోచనాక్షరాలు చినుకు, చినుకై, చిట్లిన బిందువున నన్ను నేను ఆవిష్కరించుకునే పుస్తకాన్నై.

విస్తరిల్లిన ఆకాశాశనై...

మొదలై...

తుది ఆదిలో విడుదలై,

నిజానికి నాకప్పుడు తెలుసు నేను మనిషినని! నిజానికి నాకెప్పుడూ తెలియదు మనిషంటే ఏమిటని!

ఒక క్షణం... ప్రభవం

మరుక్షణం... విశ్లథం

"బాపన్నా కొడుకులంతా తాగి ఈ మాదిరి రోడ్లమీద పడతాంటే లోకం సంకనాకి పోక ఇంకేమయితాది?"

అదో స్వరం... మరో మనిషి స్వరం...

"సారూ! లెయ్ అంగడి తెరసాల."

నాగన్నా?... ఏమో? ఎవరికి తెల్సు.

నడుంకింద చెప్పు గుచ్చుకుంటోంది. చెప్పు? వాకిట్లో?... నా నడుం వాకిట్లో ఉందా...? రెండు చేతులూ పట్టి బలవంతంగా యీడుస్తూ నన్నెవరో లేపారు...

రాత్రి జరిగిన సంగీత సాహితీరసాభాసలు లీలగా జాడలుగా

బాదిలేర్... పో...

శ్రీనాథ వల్లభామాత్యులు...

'డబుల్లేవు... ఎంతుందేం చిల్లర?' ఆరా...

'నలభయ్యేడ్రూపాయలా పావలా...'

'చాల్లే క్వార్టరొస్తుంది.' మోజార్ట్ యహూదీమెన్యున్. ద్వారం, కార్పెంటర్స్.

జాయెతో జాయే కహా... తలత్.

సాహిత్యంలో పర్వర్షన్స్... పర్వర్టెడ్సాహిత్యం... సెక్స్ పేరున బూతులు తర్వాత?

అందరూ నన్నొదిలేసి

నన్నో కాందిశీకుడ్ని చేసి

నాగరికతల్ని అధిరోహించి వెళ్ళిపోయారు.

నేనో?

ఎడారి నోరు తెరిచి...

"సారా!సారా!" అంటూ... హనుమంతుగాడి రిక్షా యెక్కి ఆ గుడిసె ముందు... 'యేం సారూ!' కారా కిళ్ళీ గారపళ్ళ లక్ష్మి సకిలింపుల ఇకిలింపు ద్వారాలుదాటి... ప్లాస్టిక్ సంచీల్లో పరిమళిస్తూ పరిఢవిల్లే రుజిన ద్రవాన్ని...'త్వమేవాహం' అంటూ...

మళ్ళీ బయటకొస్తూ ఇంకో సంచీకొని... ఇక్కడికొచ్చా.

ఎస్! మెడికల్ షాపు ముందు కూచున్నా! యాంటీ సెప్టిక్ వాసన కొట్టే ఆ మూతేసిన అంగడి ముందు... మందుంచుకొని

స్ఫురణతో మరణాల్నీ,

జలజలా కన్నీళ్ళు రాలే రెప్పలకింద ఆనందాల్నీ యీ మెట్ల మీద ప్లాస్టిక్ సంచీ పుచ్చుకొని నేను తాగుదామనీ... తాగాలనీ... తాగా...

అంతే దాంతర్వాతేం... గుర్తులేదు.

నడుం కింద చెప్పు గుచ్చుకుంటోంది.

'సారూ లెయ్యి... ఇంటికి ఫో! రిక్షామాట్లాణ్ణా'

ఇదెవరు!... సహృదయతా?

బంకేసి అంటించినట్లున్న కనురెప్పల్నిచించి... ఒక్కసారి అటూ ఇటూ చూసా... యాంత్రిక వ్రణం పగిలిచీమూ నెత్తుర్లా ప్రవహిస్తున్న జనం...

మరుక్షణం.

కకావికలైన జ్ఞానధాతువులన్నీ

ఒక్కటై... ఒక్కటే అయ్యి...

నెమ్మదిగా లేచి... చెప్పు? వారతెగి పిన్నుతో కుట్టుకున్న నా నీలం రంగు రబ్బరు చెప్పు? వెదకి... వేసారి... మళ్ళీ వెదకి...

'ఇదిగో సారూ'!

నాకాలికి విశ్లథ రక్షణను తొడిగిన పరిమళం! లేచి... నిలబడలేనితనం... నిశ్శబ్ధంగా నా రెప్పల మధ్యనుంచి

వెచ్చటి రెండు, వుప్పటి కన్నీటి చుక్కలు, నేను...

మళ్ళీ మరో మనిషినై...

కుదించిన ఊకబస్తాలా...

ఆ రిక్షాలో జన్మించి... మళ్ళీ నేను.

"ధర్మాపేటలో మూడో సందులోకి ఫో! ఈ గడ్డంమనిషిని చూస్తేనే వాడి ఇంటిని చూపిస్తారు ఫో"

ఇస్త్రీ మల్లులో...నుదుటన మొదలైన పవిత్రతతో చెల్వారే నాగరకుడూసిన ఉమ్మి...

రిక్షావాడికి బాడుగో?

జేబులు తడుముకున్నా.

చినిగిన రెంద్రూపాయలనోటూ...

ఇందిరగాంధీ మంద్రంగా నవ్వే అర్ధరూపాయి కాసూ. ఇరవై పైసల సత్తూ... విరిగిన రెండు బీడీలు...

బీడీ?

యెక్కడివి? యెవరిచ్చారీ బీడీలు?

బార్లోంచి బజార్లోకొచ్చిన నా నాగరికత.

వీడికి బాడుగో?

ఈగో?

బైబిలు మధ్యన పవిత్ర నిశ్శబ్దంలో...

నా గూట్లో పుస్తకాల మస్తిష్కాల దొంతరలో పది నెంబరు అచ్చొత్తించుకున్న శ్రీ మహాలక్ష్మి చిద్విలాసంగా!...

ఓహో! సరే...

గది ముందు రిక్షా ఆగితే...

ఆడతనం! ఆరువేల రూపాలు దాల్చి...

నేనారాధించేదే... కనుబొమలు నిక్కదీసి... నిస్సిగ్గుగా నన్ను.

లోపలకెళ్లి... ఆ పది రూపాయలూ తెచ్చి వాడికిచ్చా

"చిల్లర్లేదు సా!"

మందు మీదుంటే అట్లాగే ఉంచుకోమనేవాడ్ని కానీ... ఊహూ... డబ్బుల్లేవు... అహం మరణించి...

"చిల్లర తెచ్చియ్యి... యెదురుగా హోటల్లో అడుగు" వాడొచ్చి, తెచ్చిచ్చిన చిల్లర తీసుకొని, వణుకుతున్న వేళ్ళని ఆ పవిత్ర పాపం చుట్టూ బిగించి నిశ్శబ్దంగా... నా గది తలుపులుమూసి... లోకం నుంచి తప్పుకున్న భ్రమతో...

నేను...

నా గదిలో...

నేను...

చీకట్లో...

ఆకల్తో...

చేతనా కలుషిత ఏకాంతంతో...

నేను...

తాలుకాఫీసు గుమస్తాగా...

నేను.

తాగుబోతుగా నేను.

ఓ శైథిల్యకిరణం చిత్రాతి చిత్ర వర్ణసంవర్తమై

నేను...

నా గదిలో... చీకటితో.

పాచిపట్టిన తొట్లో నీళ్లు...

యేదో పురాతనత్వం చేదిపోసుకుంటున్నట్టు చెంబు చెంబూ... చల్లటి నీళ్లు... నిన్నల... మొన్నల... గతాల వాసనలు కమ్మగా చల్లుతూంటే... చెంబు చెంబూ... నెత్తిన గుమ్మరించుకుంటున్నా...

నిన్నలను ఈ రోజులు చెరిపేసే చరిత్ర...

మరో పేజీ... నేనే పుస్తకాన్ని...

కాలం పఠిత!

* * *

వైభవోద్రిక్తదినాన్ని భుజాన వేసుకుని భగవాన్లని వెతుకుతూ వెళ్లా...

పూల వాసనల్ని దొంగిలించిన ఉచ్చల కంపు...

ఆగి సాగే యాంత్రిక వాహనాల పురీష తప్త రేణువుల్తో పరిమళించే నేల...

గోళీలాడే పిల్లలు...

పిల్లల కీచులాటలు...

'నీయమ్మా!' ప్రత్యుత్పత్తి క్రియను తిట్టుగా సంకేతిత్తూ తన ప్రత్యర్థిని... యేమి చేయలేని ఆశక్తతతో వాడి అమ్మకు... తిట్టుగా ఆపాదిస్తూ...

వో కుఙ్బవేధవ. నిండాపదేళ్ళు లేవు. వాడు... ఆ క్రియను వాడితే యిటువీడు వాడి అమ్మనూ, అక్కనూ యిద్దర్నీ కలిపి సంభోగిస్తానని.

భాష...! నాగరికత...!

బట్టలు విప్పుకుని నగ్నమై భయోద్విగ్నమై...

వాడెవడో నన్ను తప్పతాగినస్థితిలో యేమో అన్నాడన్న బాధెందుకు?

భగవాన్లుంటాడా?

"వొరే భగవాన్లూ!"

బొమ్మల చదరంగపు లుంగీ... బాధా వినిమయ తప్త భావనా ఛిద్రమయమైన బనీను... ప్రత్యక్షించిన భగవాన్లు...

భగవాన్లు... ఎమ్.ఏ. డబల్లిట్...! భగవాన్లు...

అనర్గళంగా ఆంగ్లంలోనూ, తెలుగులోనూ సాహితీకరించగల సాహసి భగవాన్లు...

శవాలు...

పరిమళించే... సుగంధించే శవాలు...

వహించే వాహనాల్ని... వాహనాన్ని నియంత్రించే నియంత...

భగవాన్లు...!

ఓ బకెట్‌తోనూ, మరో చేత అంచూడిన ప్లాస్టిక్ బిందెతోనూ నీళ్ళను మోస్తూ భగవాన్లు!

"కూచోరా... ఇంకో రెండురౌండ్లు పట్టిస్తే... రెండ్రోజుల వరకూ ఢోకా ఉండదు .. వారంతర్వాత నీళ్లొస్తున్నాయి" నిర్మలంగా నీళ్ళంతస్వచ్ఛంగా అన్నాడు.

వాడి గది తెరచి లోపలికెళ్ళా.

లోపల... గతాల వాసనల్ని పెనవేసుకున్న చీకట్లని చెండాడుతూ... వాడి

గదిలోకి ప్రవేశం. మూలన వాడి ఆకలిని నశింపచేసే అస్త్రం... కిరసనాయిలు పొయ్యి! దాని మీద ఉడుకుతోంది ఆకలి రోగపు మందు...!

ఎప్పుడూ వాడుమూత తియ్యని పెట్టె. తాళం వేసి మూసేసిన వాడి మేధస్సల్లే...!

చిరిగిన చాప...

దాని మీద రంగులు మాసిన... హంగులు కోల్పోయిన మడతల పరుపు... ఉడుకుతున్న అన్నం వాసన కమ్మగా ఉంది...

భగవాన్లకి తెలుసు... నేనంత ఉదయాన్నే వక్రరేఖనై వాడి గది గోడల మధ్య ఉదయిస్తే...

నా కడుపులో ఓ ఇథియోపియానూ.

నా జేబుల్లో ఆకాశాలనూ నింపుకొచ్చుంటానని...!

మరో విడత నీళ్లు తెచ్చి సిమెంటు తొట్లో పోస్తూ...

'సర్వో డబ్బాలో డబ్బుల్దీసుకుపోయి హోటల్లో సాంబారూ మజ్జిగా పోయించుకోర్రా"

నన్ను కన్నతల్లికయ్కూడా నా ఆకలిగురించిన అవగాహన అంతగా ఉండుంటుందని నేననుకోను... నీర్సంగా ఉంది. ఇంకా రాత్తిరి తాగిన సారాయి బ్రాందీలు కలగలపి వెచ్చటి పొగలూ సెగలుగా నిట్టూర్పుల రూపాంతరాలతో...!

ముక్కులోంచి నీళ్ళు కారుతున్నాయి... ఎడమ భుజానికి ముక్కుతలతో తుడుకుని లేచా...

రెండు అల్యూమినియం క్యాన్లతో వేడన్నం... సాంబారూ... సాంబారూ అన్నం... ఉల్లిగడ్డా... వంకాయ... అమ్మో సాంబారు...! అన్నం, వేడి వేడన్నం.

సాంబారు... బారు... స్వప్నాబారు... మసక వెలుతుర్ల మస్త్ నిషా ఖుషీల బారు... యెంతబారు... యింత... యిహింత... బూతు...

"ఏమిటయ్యా! ఈ నెల పదహారున మీ తల్లిగారి ఆబ్దికం ఉందిగా!?

పదహారున్నేనా?... పదిహేడా?... పదహారున్నేలే... శ్రావణ శుద్ధ షష్ఠి కదూ! ఆ మహాతల్లి కాలం చేసింది".

బజారున పడిన బ్రాహ్మణ్యం. ఇది ఇంకో ఆకలి. లౌక్యం తెలిసిన ఆకలి.

"అవునండీ అచ్చుతరామయ్యగారూ"! ముక్కులోంచి నీళ్ళూ, సారాయి, బ్రాందీ కాక్‌టెయిలయ్యి...

"మరి రామాలయం దగ్గరికొచ్చెయ్యి ఆ రోజున, నేనక్కడే ఉంటా" యెవరి వ్యాపారం వాళ్ళది.

"ఏం రోగమో!? పోయే గాలమో! బ్రాహ్మల కొంపలో బుట్టీ... ప్రారబ్దం ఆ తల్లిదండ్రు..." జనాల్లోకి విలీనమైన అనవసర విషయలాలస...

లోకంలో బ్రాహ్మణీకమంతా నా జన్మతోనే సమాధి అయినట్టు... పురుష సూక్తం సరిగ్గా ఉచ్చరించలేని ఈ బ్రాహ్మడనబడే అచ్చుత రామయ్యనబడే బాపన్నాకొడుకు... థూ!... కాండ్రించి... ఉమ్మి... ఉమ్మేసి... మళ్ళీ కాండ్రించి... గొంతు గరగర పొరలు లేచినట్టు... తెరలు తెరలై... దగ్గి... ఉమ్మేసి... బంకలు సాగి కొంత మీసాలకు, మరికొంత పెరిగిన గడ్డానికీ ఒరుసుకుంటూ తీగలు సాగిన శ్లేష్మం... చొక్కాపైకెత్తి మూతి తుడుచుకుంటూ లోకాన్ని చూశా!

నా అస్తిత్వాన్ని చూడలేని లోకాన్ని, చీకటి లోకాన్ని చూశా...

చీకట్లో లోకాన్ని

లోకంలో చీకటినీ...

మౌనంగా మనసు పలికే చీకటి రాగాల మేళా...!

ఉచ్చకంపుల రొచ్చుల మధ్యన నాగరికత నడుస్తూ... ఇస్త్రీ మడతల క్రింద శుభ్రత పేరును నడుస్తూ... విడుస్తూ... లోకం...

నాగరికత...

తడారిన నాలుక... నిన్నటి గత చరిత్రల మత్తుల... తత్తరిల్లే నాలుక...

సిగరెట్ తాగితే...?

యెంకటేశుల బంకులో సిగరెట్ కొనుక్కున్నా... దమ్ములాగ...నే కాండ్రించిన ఉమ్ములాగా...

దగ్గి... నేనే... నేనే... ఐ...

ఆకలికి... ఇంకో చీకటి కోరికకూ కేంద్రబిందువునై నేను... డబ్బుల్లేని నా జేబులో ఇప్పుడది జన్మించింది... ఒక్కటి... ఒక్కటంటే ఒక్కటి... నిజంగా వొక్కటే... నిఝంగా వొక్క ప్యాకెట్టే... నిస్సత్తువ నిస్తేజం... మరణించి... నా నరనరానా ఘరానాజీవం...

నా చెవులు వింటున్నా నేనేం వింటల్లే... నా కళ్ళు చూస్తున్నా నేనేం మాటాట్టల్లే...

ఛ...ఛ...వద్దు... సాంబారన్నం, మజ్జిగన్నం వేడిగా... చల్లగా... తిని ఆఫీసు కెళ్లొద్దూ...ద్దూ...

నేనెప్పుడో హోటల్ దాటిపోయాను...

నల్లకోరిక... నా వొళ్లు గుల్ల మహమ్మారిక... నన్ను నడిపించి మాయాలోకాల సింహద్వారం ముందుంచి...

డబ్బు...

శవాలు మోసే... భావాలు మూసే... భగవాన్లు డబ్బు... ఫార్మాల్డీహైడూ... పాడుబడ్డ శవాల వాసనా ఆ డబ్బులోంచొస్తున్నట్టూ...!

ముప్ఫై రూపాయల్తీసుకొచ్చా...!

నీళ్ళు నింపేసి వాడు అన్నం దించేసి... సాంబారు కోసం... చూడడులే... వాడికి తెల్సులే...

యెక్కడిదీ వ్యక్తిత్వం...

నేను నేనేనేఆ...?

ఎవరో... ఏదో ఏలిక... నేను!

## బానిస

చినిగిన ప్యాకెట్ లోంచి మండే లోహశలాకం చివ్వున చన్నీళ్ళల్లో మునిగినట్టు నాలో కసక్కున... జివజివ లాడిన జీవనాడులు మీట నొక్కిన మరుక్షణం. నరాల తీగల నిండా ప్రవహించే విద్యుత్తల్లే...

గుండె... మెదడూ దిటవు చేసుకొని యెట్లాగో రోడ్డుమీద కొచ్చేశా...

సాంబారూ... మజ్జిగా... కాలివేళ్ళ మధ్య చెప్పుకుట్టిన పిన్నుగుచ్చుతూంటే... హుషారుగా...

భగవాన్లు నన్ను చూసి నవ్విన నవ్వు... ఓహ్...

స్నానం చేసి గోడకి చేరగిలి 'రసికప్రియ' చదువుతూ సాంబారూ మజ్జిగా నేనూ నా లోపలికి చేరుకున్న పారదర్శక ద్రావకం... అన్నింటినీ కలిపి నన్నుగా చేసి... చూసి... భగవాన్లు నవ్విన నవ్వు...

"అమ్మా"...!

"మజ్జాన్నం గిరాకీ ఉంది. శవం యింకా మార్చురీ లోనే ఉంది... ద్రోణాచలం అవతలయేదో పల్లె. వొచ్చేప్పటికి బాగా లేటుకావచ్చు... చిన్న పని చేసిపెట్టు...

యాభై రూపాయలిస్తాను పనిక్కాదు... నిజంగానే యాభై యిస్తాను... జానక్కిచ్చిరా... తాగొద్దు... రూంలోనే పడుకో, కావాలంటే.

నేనొచ్చేప్పుడు మందు తెస్తా, యిద్దరం ఏసుకుందాం... వింటున్నావా? డబ్బు... యాభై... జానక్కిచ్చిరా... తాగొద్దు"

అలసిపోయినట్లుగా ఆగాడు వాడు భగవాన్లు... దొంగలాచూస్తున్న నేను... ఛ... నా దొంగతనం గురించే మాట్లాడ్డే...

దుఃఖం... పశ్చాత్తాప స్థానంలో తన్ను తాను ప్రతిష్ఠించుకుంది. రాల్తున్న కన్నీళ్ళని తుడుచుకుంటూ...

"ముప్పై తీశా డబ్బాలోంచి"

"కంచం కడుక్కొచ్చుకో... అన్నం తిని పోదాం... బండి ఇస్మాయిల్ గరాజ్‌లో వుంది. ఫ్రంట్ డోర్ లాక్కావడం లేదు. పోయి చూసుకుని మజ్జాన్నానికి తయారుగా ఉండాలాస్పత్రి ముందు".

"ఒక ప్యాకెట్ తాగొచ్చా"

"రాత్రికి రమ్ తాగుదాం. నీ లంచవర్లో పోయి జానక్కి డబ్బిచ్చిరా."

"నీకు తెలీకుండా తీసుకున్నా".

అలసిపోయినట్లుగా చూశాడు. ఎంతందంగా చూశాడు! స్ఫోటకమ్మచ్చల మొహంలో శాంత సముద్రాలైన ఆ కళ్ళ... లోంచి అందం ... నైర్మల్యం... "నాకు తెలీంది... నీ దగ్గర యింకా యేం మిగులుందిర గాడ్డెకొడకా! అన్నం తిను... రాత్రొచ్చిం తర్వాత మాట్లాడదాం." వాడు భగవాన్లు... ఖాకీ అంగీ తొడుక్కున్న శవాల టాక్సీ డ్రైవర్ ఎం.ఎ. డబల్లిట్‌గాడు... గాలై సుడిగాలై మరుక్షణం సందుమలుపులో సుడులు తిరుగుతూ...

మౌనముద్రలో జ్ఞాననేత్రం... సుమమై సుమ సంవర్తికలైన కనురెప్పలు... రెప్పలు ముచ్చెపు చిప్పలు... చేతికీ... కప్పలు నూతికీ... మరి మూతికీ? చివర్న నే న్నీ వందరూ కల్సి... కల్గల్సి... గోతికి... గో...తి...కి...!

"దానమ్మా నా మాదిరి ముండామోసి... దానింట్లో గడపాల్సుంటే యి లంజెకూ తెల్సొస్తాండె ముండమోపి బతుకు"

యెవర్దో అక్కసు...

అక్కసో? కక్కసో? ఫోరా ఫో...

అదెవర్తో అర్చుకుంటూందే ఒక్కతే... దాని కడుప్మంటేమో యెవరికి తెల్సు? యేమో?...

టాకీసు ముందునుంచి పోతున్నా!...

జారిపోతున్న లంగా పట్టుకుని... పైట లేనియెదని సగం రవికెలోంచి రోడ్డు మీదకి పారేస్తూ... హీరోయిను... హీరోయినెట్లా? షీరోయిను అనొద్దా...!

దామెర్ల రామారావూ... నువ్వు న్యూడ్లనురంగెత్తించడంకాదు... ఇలారా... ఈ సినిమా పోస్టర్‌ను చూసి ద్రవించు.

నానా రభసల సభలు ఏకకాలంలో...

ప్రపంచ వికృత ధ్వనులన్నీ కేంద్రీకరించబడిన ఆ బజార్లో మధ్యన... ట్రాఫిక్ ఐలాండు దగ్గర... నిశ్శబ్దంగా... నిరామయంగా... కళ్లలోంచి ప్రకృతి స్రవిస్తూ మరో జీవనాకృతికి మూలహేతువైన సృష్టి కార్యంతో మమేకమైన రెండు శునకాలు...

ఆడవాళ్ళనబడే సిగ్గులు... హిపోక్రటికల్లుక్కులతో..."అబ్బే! మేమేంచూళ్లా..."! అన్నట్టు...

"ముడి అంటే యిదే తెల్సా సవాయి సింగన్నా" కల్మషం లేని రిక్షా వాడొకడు... "హేయ్... ఛీ... ఛీత్..." ఛీదరింపొకటి... ఓ కుర్రాడు యెడమ చేతి చూపుడువేలునూ బొటనవేలునూ సున్నాలా కలిపి కుడిచేయి చూపుడు వేలుసందులోకి పోనిచ్చి ప్రక్కనున్న కుర్రాడ్తో అంటున్నాడు...

"లఫక్... చిపుక్..."

ఎప్పుడో యెవరో రాసిన కథ "కుక్కలబండి" గుర్తుకొచ్చింది...

మనకంటే... కుక్కలే నయం కదూ...

ఎస్!

కుక్క మనిషి కంటే చాలా నయం...

నయం... భయం... వినయం... వినిమయం... ఆలయం...

అంతా... అదోరకపుటయోమయం...

భగవాన్లిచ్చిన డబ్బుని తడుంకున్నా నొకసారి...

జానకిచ్చే డబ్బులవి...

జానకంటే సీతామ్మవారు కాదు...

జానకంటే... నీ లీల పాడెదదే...ఏ...ఏ... వా! కాదు...

జానకంటే... జానకే...

నడి బజార్న నడుస్తోంటే 'లంజెది' అంటారు.

ఆ జానకీ జానకి...

జానకంటే 'జాతస్య హి(ధ్రువో మృత్యుః' అన్నంత నిజం జానకి...

పాపాల పల్లకీ జానకి...

వికృత రాగాలాపనల వల్లకీ జానకి

కశ్మల సహిత కామనా పానకీ జానకీ

నిజానికి... యీ జానకి కరవీర పుష్ప మీ జానకి.

నాకా రోజు బాగా గుర్తుంది...

భగవాన్లు నన్ను జానక్కి పరిచయం చేసిన రోజు... రాత్రి పన్నెండు వరకూ యిద్దరం... వున్నదంతా వూద్చుకు తాగేసినాం... మండుతున్న కడుపుకింతన్నం కోసం... యిద్దర్దగ్గరా డబ్బుల్లేవు...

"వొరే గడ్డపోడా! మన మన్నం తిందాం... మంచన్నం... మంచంత మంచి మనిషింట్లో... అన్నం తిందాం... రా!"

శవాల టాక్సీలో... ఆ ఇంటిముందాపాడు తీసుకుపోయి..."దబదబా... దబాదబ్... దబ్"మని గుద్దుతున్నాడు తలుప్మీద కొద్దిసేపటికి...

ఆ చీలిన చీకటి వాకిట్లోంచి ఛిన్న కాంతి కిరణాల కవతల ఓ నీడ... ఆడనీడ... వీడేదో మాట్లాడాడు... ఆ నీడ అంతరించిపోయింది. ఆ గృహాంతరాళాల్లోకి...కారు దగ్గరకొచ్చి...

'రారా! రా! మనిల్లే... మన్దే... జానకంటే మనం మనమంటే జానకికంతా తెల్సొరే... దా!" లోపలికెళ్లా వాడ్తోపాటు.

వాడు 'దభీ'మని చాప మీద పడిపోయాడు. కొద్ది క్షణాల నిశ్శబ్దాన్ని మేసింతర్వాత... మెత్తటి అడుగుల చప్పుడు విని తలెత్తిచూసా...!

"వీడే"! వంకర నవ్వోటి నవ్వాడు.

ఆమె నన్ను చూసింది... ఆచూపు నేనీనాటికీ... ఏనాటికీ మరువలేను. కాటి కాపరి శవాన్ని చూసినట్లు చూసింది. ఎంత శూన్యం!? ఆణిమాదృష్ట సిద్ధులతో నాముందు ఆమె విపరీతంగా పెరిగిపోతున్న విచిత్ర భావన.

ఆమె పెరుగుతోందా?... నే తరుగుతున్నానా...

యేదైనా రిజల్టొకటేగా... బర్కిలీ... రిలెటివిటీ...యేమో...

"అబ్బే అదేం... కాదు. ఆకలైందంటే... ఇక్కడే ఆకలి..." గుండె కింద కడుపున్చూపిస్తూ భగవాన్లు నవ్వుతూ అన్నాడు.

ఆమె చూపు మారింది.

మరణించి కాలం శరణార్థియైన అమ్మైంది.

నిజం... ఎందుకో అమ్మలాగా... ముతక నేత చీరలో కరుకుదనం కప్పేసిన లాలిత్య చలిత ముఖియై జానకీ... ఈ జానకి, ఆ నా దన్నం పెట్టిన జానకింటికి.

ఈ మధ్యాహ్నం... మహోదగ్ర ఉద్విగ్న రవితేజో దగ్ధ మధ్యాహ్నం.

నేనామె వాకిట్లో...

జానకీ వాకిట్లో...

నేను...

తలుపులు మూసున్నాయి...

బిజినెస్సుందేమో?!... సందేహం... జంకు... ఇంటిముందు కట్టమీద కూలబడ్డా, ఓ సిగరెట్ వెలిగించికాల్చబడుతున్న సిగరెట్ పొగల్లో... జేబులో డబ్బుల్ని తడుముకుంటూ నేను.

మస్తానొచ్చెన్... మగతనం లేని మస్తాన్... ఏ తనం?

మగ... ఆడ... షండ... ముండ... రండ... గండరగండతనం... పతనం... ఏతావాతా మనిషి మనిషీ పడే యాతనం...

"యేం సార్! యీడ కూకున్నావ్?... లోపల్కి పోల్యా?... గిరాకీ ల్లేవ్... అంతా బుస్... మూడ్రోజులాయె... అక్కుంది ఫో." చెయ్యిజాచాడు...నే కాలుస్తున్న సిగరెట్ కోసం.

వాడికిచ్చి...

తలుపులు... తెరవని తలపుల, తలుపుల...వలపుల... పూమాలల, కైమూరల... కొలతల... వ్యథల... గాథల... శిథిల... తలుపుల... తట్టాను...

ఒకట్రెండ్మూడ్నాలుగై దారేడెన్మిదైందంతలో

ప్రజ్వరిల్లే నేత్ర సూర్యుల జ్వాజ్వల కాంతుల వాంతుల తప్పుకునే ప్రయత్నంలో... చేతులడ్డం పెట్టుకుని...

"నే... నేను... భ... భగవాన్లు పంపిస్తే... జా... జానకీ!"

మరుక్షణం, మంచుకమ్మిన ఆ ముఖాకాశం, చల్లనై, మెల్లనై...

"రండి"

తలుపు కడ్డం తొలగి...

ఇంకో పునర్జన్మ !

కొన్ని కోట్ల వత్సరాల నాగరకత పతనమై. విగతమై... శ్లథమై, ఆమె గదిలో, మదిలో, హృదిలో, వ్యథలో... నన్నో క్షణాన పురాతన శిలాజాన్నిచేసి... తలుపులు తీసి నన్ను లోపలికాహ్వానించి... విహ్వలచిత్తుడిని చేసి... నన్ను... ఆ క్షణాన...

"బిజీగా ఉంటావనుకున్నా... అందుకే బైట అలా కాచుకుని... "అర్థంలేనివిశ్లేష!

విడను దీయరాని పెదవులను పగల్దీసుకొని చిర్నగవనే ఛిద్ర కాంతిని నా చీకటి మానసం మీద చిమ్మి... ఉమ్మి... ఆమె... జానకి

అలా... చిరిగిన చాప మీద పరచిన పరుపీ్మద... వడలిన మరువంలా... ధవనంలా... విచిత్ర సువాసల్ని విసిరేస్తూ పూదండలా... ముండలా... రండలా... బండలా... అలసిన కళ్ల మీదకి మోచేతుల్ని కప్పుకొని వెల్లకిలా... 'సారీ! కాస్సేపలా కూచోండి మళ్లీ మట్లాడతా' అంది.

నిజమే... నేనింట్రూడర్ని... నేనపరాధిని... నను శాసించే హక్కు ఆమెకుంది.

ఆ గేహం... ఆ గాత్రం... ఆమెవి...

ఆమె దేవత

అది ఆలయం

ఆమె మజిలీ...  నేను పాంథుడ

ఆమె ఓ మంత్రాక్షరి.

నేను సాధకుడిని.

సాధన... వేదన... వాదన... లాజిస్టిక్స్... అరిస్టాటిల్...

కాలం... గమనం... ఐన్‌స్టైన్... నాల్గో కొలత

నా తల్లి శ్రాద్ధం... శ్రావణ శుద్ధ షష్ఠి...

"మమ." అనుకో అనే బ్రాహ్మడి పదాల్లో నా తరపున నా తల్లికి అర్ఘ్యం వదిలే వాడిని నే చూసి... చూసి కూడా యేం చేయలేని స్థితిలో...

నాశ్రాద్ధం...

దుర్మార్గుడా!...

ఎక్కడో... ఏదో మూల ఆమె లేస్తే బావున్ననే భావన... కానీ లేవదే!

జానకీ శవం...

శవం జానకి...

శవాల భగవాన్ల జానకి...

బ్రతికిన శవం... నేను... భావించే... శవజీవం జానకి.

"జానకీ"! పిలిచా.

ఆ కళ్ళ ఆకాశాల మీద నుంచి... మోచేతుల కనుమలు తొలిచేసి... తొలగింపచేసి, చూసిందామె.

"నేనాఫీసుకెళ్లాలి... భగవాన్లు నీకు డబ్బీమని చెప్తే తీసుకొచ్చా..." దిగ్గున లేచి కూచుంది.

ప్రాపంచిక లేమిని ప్రశ్నించే కళ్లతో...

"ఏమన్నారూ?" అంది.

"భగవాన్లు... నీకు డబ్బిమ్మని... నాకిస్తే... నువ్విలా".

"అతనెక్కడ?"

"ఏదో డెడ్‌బాడీ ఉంది... ద్రోణాచలం కవతల... రోడ్డు బాలే... బాగా లేటౌతుందని నాకు చెప్పి... డబ్బు నీకిమ్మనీ..." నీళ్లు నమిలా.

"ఎప్పుడు చెప్పాడు?"

"ఈ ఉదయం"

"సార్! ఈ ఉదయమో సంధ్యని తెలుసా మీకు?" ప్రకృతి వైచిత్రి ధ్వనించిన జానకీ స్వరం.

ప్రతి ప్రత్యూషం...

ప్రతి ప్రదోషం...

కాంతీ తమస్సంగమాలే...

నాకు తెల్సు... కానీ ఈ ఉదయం ఓ సంధ్యని నాకు తెల్సా? అన్న ప్రశ్న?

... యేమో? నాకేం తెల్సు?

"జా..జానకీ! నే వెళ్తా, ఈ డబ్బు తీసుకో..." మరణించిన జానకి శవం పునర్జన్మించి...

“సార్! నేను... నేను మీకు అంతమాత్రంగానే కన్పిస్తున్నానా?” అని ప్రశ్నించింది.

యెంత మాత్రంగా? అని నన్ను నేను ప్రశ్నించుకునే లోపలే

“సరే సార్! ఆ డబ్బక్కడ పెట్టిపోండి. అతనొస్తే... నేనడిగిన ప్రశ్నడగండి. చాలు”

యేమిటీమె?

ఐదు పది రూపాయల కాగితాల్ని చీకటి కిటికీలో పెట్టి... నీళ్ల గ్లాసును బరువుగా వాటి మీదుంచి... నేనో కలనై... అలనై... భావనారహిత శిలనై... అలా...అలా

ఆఫీసనబడే... ఆ కట్టడంలో ఫైల్స్ అనబడే అర్థరహిత వాక్యభరిత కశ్మలాల వెనుక టెక్కుల, పైకప్పుల మేకప్పుల కాత్యాయని... నా పక్క సీటే.

ఉన్మత్త చిత్ర ప్రభవ... వో చిరునామన...

పొద్దున్న పాకెట్టు ఎప్పుడో స్వేదమైంది.

రాత్రికి డబ్బుల్లేవు...

డబ్బుకు రాత్రుళ్లుండవు...

భగవాన్లొస్తాడా? రాత్రికి మందుంటుందా? లేదూ. జాన్సన్‌తో ఫారెస్ట్ ఫైల్ లాలూచీపడి ఓ వంద దండుకుందునా?

వద్దు... భగవాన్ల మాటే విందాం.

యెన్ని... యెన్నెన్ని కోట్ల భావనా శత్రువులతో ప్రతి రోజు నే యుద్ధం చేయడంలే?

ఎప్పుడూ మూయని ఆఫీసుని మూసిన మాయామయ భావనతో... మూసేసినట్టు ఊహించుకొని, మనసు చిక్కబట్టుకొని... భగవాన్ల గదికి... నా ట్రాన్స్మైగ్రేషను...

అక్కడ... ప్రత్యక్షమై, పరిధవిల్లే పాపమానసం... అనిమిషమై... ఆగమనార్థియై చూచే చూపు భగవాన్ల కోసం కాదు...

రెండు సారా చుక్కల కోసం...

వాడి గదిలో,

వాడి కోసం కాదు... ‘వా...డి...’ కోసం... వే...డి... కోసం

తమస్సమాధిలో
ఏవో వికృత భావనా విపంచులు
ఆ తమో కోణవీణియలు
మనోహస్త అంగుళులు
రెండూ నేస్తాలు.
నిర్జన నగరీ ద్వారాలు
నా స్వాంత ఏకాంత ఉత్సవాల్లో
విశ్వాంతరాళాలు స్మరించిన
రాగమయ మంత్రాక్షరులు
ఆకాశపు రంగులై
జరాకలుషిత గాత్రలలాటాన వళులై చెల్వారి
సుడులు తిరిగే అనుభవ–అను... భావ... వత్సరాలు
చినుకై చిట్లిన అనుభవం.
తనువున అణువణువూ...
ఘూర్ణిల్లిన జీవం...!

మనస్సంతా ఎక్కుపెట్టి... కారు శబ్దం కోసం... భగవాన్ల శవాల టాక్సీ శబ్దం కోసం... కాచుకున్న శవాన్నై... శవాల బండి కోసం... భగవాన్ల బండి కోసం... ఆ బండి స్పందించే ప్రకంపనల కోసం...

ఒళ్లంతా చెవులై... చెవులు ఒళ్లే ఐ...కాచుకున్న
నేను...
కలగబోవు వేడి కోసం... లేని చలిలో కలకాగుతున్న నేను
నేను... చీకటి.
నిరీక్షణ మధురం...
విధురహిత నిషద్వరావర్త చేతనలో... నికృంతన.

ప్రతి అక్షరమూ ప్రవల్హికై... కొన్ని కోట్ల క్వొశ్చెన్లతో మెక్‌డయార్మిడ్... సామాజిక చైతన్య గానం చేస్తే...

బధిర బీతోవెన్ గీతాలాపన... వినని... కనని... మాయా ముఖాలపై విసిరేస్తే
ద్వారం!... స్వరం...

మురళీ బాల్యం... రవళించే చేతనం...

సంగీత వికృతులు... ఒటాయనీ

ఝులంఝులలై...

ఘులం ఘులలై

మర్మర సంకేతాకృత పత్ర వస్త్ర వికీర్ణావళులై

నే...

"ఏయ్! తన్ను!... లంజాకొడుకు... వాణమ్మ... యాడికిపోతాడ్రా. పట్కో నా కొడుకుని... కుమ్ము... నీయమ్మా... లంజాకొడకా...!"

కలలోంచి మేల్కొని నేను... భగవాన్ల ఇంటి చుట్టూ పోలీసులు

కొద్దిసేపు అర్థం కాలేదు.

భగవాన్లింట్లో...

ఓ ఇంట్లో భగవాన్లు భాగమై...

ఆ ఇంట్లో... కాంతమ్మింట్లో... లక్ష్మీకాంతమ్మింట్లో పోలీసులు. నాకూ తెల్సు... చిన్న చిన్న భాగాలైన ఆ ఇంటి గదుల్లో... ప్రత్యుత్పత్తి క్రియ... విక్రయానికై విస్తరిల్లుతూ...

అదో లంజల కొంప...

సంధ్యకాంతుల రొంప...

పడిశెం చీమిడీ...

వీర్యం... కామెడీ...

అంతా ఒక్కటే... వొక్కటే ఐ

పోలీసులు...

"పాయిఖానా పక్కన దూర్తోంది. దాన్ని యెయ్యి... లంజాముండా మొన్న మా ఎస్సై రమ్మంటే ముట్టైనానని ఒట్టి కూతల్కూస్తావా...! ముండా... రా! ఈ రాత్రి స్టేషన్లో సూడే... ధగిడీ!"

"వాణ్నేసుకో ఏసోబూ! ఆ నాకొడుకు నిడిస్తే సూడు..."

ధనాధన్! ధబాధబ్... దెబ్బలు... పెడబొబ్బలు... ముసలి లక్ష్మీకాంతం పక్కన్జేరి... భుజమ్మీదో చెయ్యి... తొడ మీదో చెయ్యి... వేసి...

ఓ కార్పణ్యం విస్మరించిన కానిస్టేబులంటున్నాడు.

"సే! 'ఇప్పటికీ నువ్వు చానా బాగున్నావే... ఒక్కటంటే ఒక్క రౌండేసు కుందాం..దా!"

కాంతమ్మా, వాళ్ళమ్మా యిద్దరూ ఒక్క ఈడు వాళ్లైంటారన్న సంగతి వాడికీ తెలుసు...

తల్లుల్తో వ్యభచరించే సంస్కృతి ఆవిర్భవిస్తోంది...

పాయిఖానా పక్క గోడలు రోదిస్తున్నాయి... ఉచ్చులు... రెచ్చగొట్టే పర్వర్షన్లు... తెగిన జీవనాడుల... జీర్ణిల్లిన నాగరికతలు...

"రేయ్! లెయ్యిరా! నా కొడకా! నేనోసారేస్కుంటా." ప్లేగు... మళ్ళీ మనస్సుల్లో రేగి రేగి...

నిర్జీవ భావనా వాక్యమై.

నిస్తేజంగా... ఓ... కారణాలుప్త కావ్యాన్ని లాగా... నే...

నేనూ... చీకటి.

తమో వృక్షం క్రింద...

విమోచన లేని నేను...

ఆ యామినిలో...

భగవాన్లొచ్చాడు...

అప్పటికీ రొద...సొద, అంతా మటుమాయం...

అంతా నిశ్శబ్దం!

కొద్దిగా తడబడ్తున్నాడు... తాగొచ్చేశాడా!? వాడు తాగాడా! అన్న ప్రశ్నకంటే, నాకు మందు లేదా? అన్న స్వార్థ ఆవేదన ముందుగా... మందుగా... విందుగా... పసందుగా... రోడ్డు పక్కన కసికందుగా...

ఛూత్!... యాక్!

నువ్వో రోగానివిరా పందీ!

సర్లే!... వాడుమందు తెచ్చుంటాడా?

వాడి నడకలో తడబడ్డం మందు వల్లకాదని నేగ్రహించడానికి వాడు గదిలోపల గుడ్డి వెల్తుర్లోకి రావాల్సొచ్చింది... మోకాల్దగ్గర ప్యాంటు చినిగుంది... ఎక్కడో పడ్డట్టున్నాడు...

"యేమై...?"

"కార్లో సంచుంది తీసుకురా" ప్యాంటు విప్పేసి, డ్రాయర్తో నిలబడి... వికృతంగా కనిపించిన భగవాన్లు...

నేను వెళ్లి కార్లో జిప్పు స్లిప్పైన ప్లాస్టిక్ సంచీ బైటకు తీసి... నా మనస్సు ప్రమేయం లేకుండానే నా వేళ్లు ఆ సంచీని తడుముతున్నాయి... గాజుసీసా గట్టితనం తగుల్తుందా లేదా... ఉందా... లేదా... మందు అని.

"ఒరే! భ్రష్టుడా, ముందు వాడికేమైందో చూద్రాపోయి." చీకట్లోంచీ చిరు వెల్తుర్లోకి... చదరపు గది, చదరపు వెల్గుల్లోకి వచ్చా... చీకట్లోంచి.

నల్లటి వాడి మోకాల్చిప్ప పెచ్చురేగి ఎఱ్ఱగా ఉంది.

గూట్లో డెట్టాలుందని తెల్సు నాకు, తీశా... రెండు మూడు చుక్కలుందంతే... దాంట్లోనే నిండా నీళ్లుపోసి... తెల్లగా పాల నీళ్ళగా... నీళ్ళ పాలగా... ఎక్కడి రసాయన శాస్త్రమో ఆ చిన్ని సీసాలో... విచిత్రం...

వాడు గెడ్డం గీసుకుందుకి వాడే ప్లాస్టిక్ డబ్బాలోకి పంపేసా ఆ సీసాని.

'ఆ... హా ఊర్లో... వెళ్దామంటే హహ్హాహా...' రెండు వేళ్లూ చూపించి నవ్వుతూ భ...గ...వా...న్లు.

"లెట్రిన్లు లేవు ఆ గుట్ట పక్కనే అంతా... అందరూ... అంటే... ఓహ్హోహ్హో... ఓ... గుండ్రాయి... మీద కాల్బెట్టి కూచోబోతే... అది దొర్లి... యిహిది...అమ్మా." కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లుతూ వాడి మోకాలు దెబ్బ గురించి.

నవ్వుతూ...

సంధ్య వెల్గులు కలగలసిన వాన నీళ్ళను కాళ్ళరేకుల్తో చిమ్ముకుంటూ రోడ్డు మీద కేరింతలు పెట్టే పువ్వుల పాపల... నవ్వుల పసిపాప... భగవాన్లు...

చెమ్మగిల్లని కళ్లు నాకొద్దు...

రోజులో కొద్ది క్షణాలైనా ప్రతి మనిషి మనసులోనూ స్వార్థం మాయమై తీరాలి.

ఎస్... కొద్ది క్షణాలైనా...

"జానక్కి డబ్బిచ్చావా! యిచ్చుంటావ్... కానీ... వూరికే... మాములుగా... అంతే... ఎట్లుంది జానకి?"

ఈ ఉదయమో, సంధ్యని తెల్సా? అని నన్నడిగింది... నీకు తెల్సు తనతో నేనెక్కువ మాట్లాళ్లేనని... యేమో... ఆ ప్రశ్నడిగింది. నేనూరుకుంటే ఆ ప్రశ్న నిన్నడగమంది."

"నీర్సంగా ఉందా?!" ప్రకటితం కాని నియంత్రిత భావన...

అవునన్నట్టు తలూపుతూ... "బాగా" అన్నా...

సంచీ తెరచి రమ్ము బాటిల్ తీశాడు.

పుస్తకాలగూట్లో... మూల... మారుమూల నిశ్చల చిత్రాల్లా... అంటించని కుంపట్లు మాదిరి... అంగాలు ముడుచుకు కూర్చున్న... విహంగాల... స్ఫటికపు గిన్నెల... గాజు గ్లాసుల్ని తీశాడు.

వాడని తనపు నిజాలు... దుమ్మై... మసకై పేరుకున్న నిస్తబ్ధతని నే కడిగి... నిర్మలం చేసి... తేజోమయం చేయడానికి వీర్యమయం చేయడానికి... ఉద్విగ్నమయం చేయడానికి కడిగి... ధౌత దీధితులు నిండిన ఆకాశ చషకాలు తెచ్చా...

చిన్ని కూజా...

నీళ్లని మోసే చిన్ని కూజా...జా.. జాబిల్లి... కస్తూరిపిల్లి... రక్తపిపాసి... నల్లి లోకం... కనిపారేసి పారిపోయిన తల్లి...

"పొయ్యిరా..."

బిర్యానీ పొట్లాన్ని విప్పి కంచంలో కొంపుతూ భగవాన్లు... వేశా... రెండు ఎర్రాలార్జిలు... నీళ్లొంపా...

ఆనందాతిరేకంతో... జానకీ ప్రహేళికా ప్రశ్నలు గుచ్చుకుంటుంటే.

అయోమయంతో...

"కానీరా!" భగవాన్లు.

"ఏమిటి కానిచ్చేది?"

"కొట్టు... మందుకొట్టు."

గళంలోకి గరళం... గళ గళా... గలగలా... ప్రవహించి... ఘనీభవించి... విస్ఫోటించి... మళ్లీ ద్రవించి... ప్రవహించి... ఓ విపంచి... శూన్యరాగాలాపనా ప్రకంపనా తంత్రీకృత విపంచీ... గానం...

"ఈ ఉదయమో సంధ్యనీ?!!?"

వాడు... వాడు... భగవాన్లు... శవాల టాక్సీ డ్రైవరెమ్మేడబల్లిట్‌గాడు స్ఫోటకమ్మచ్చులు... మొహం మీద చెల్వారే భగవాన్లు... శాంతి సముద్రాల్ని మోసే భగవాన్లు.

'అవున్రా! జానక్కి కడుపొచ్చింది... మూడో నెల... అబార్షన్ కోసం పోతే

ఆస్పత్రిలో గర్భసంచీ మొదట్లో పుండుంది. కష్టమన్నారు. అయినా రెండ్రోజుల్చూసి... యాంటీబయాటిక్సిచ్చి....పిండాన్ని పిండేశారు... ఈ ప్రపంచంలో తనకెవ్వరూ లేరు... ఎవరికెవరూ లేరనుకో... కానీ... కొన్ని వందల మంది పాపపులిప్పన్నీ మోస్తూ... ఎవ్వడో... ఏ మత్తమృగమో... చిందించిన ఓ వీర్యకణాన్ని వ్రణం చేసుకోవడానికి నిజానికి...

జానకెవర్రా?"

"భ...గ...వా...న్లూ."

"కానీరా... గ్లాసెత్తు... మనమెవ్వరం? పాపపు భారం మోస్తూ పరిధవిల్లే జనాలు. కోట్లాది... మధ్యన మనమెవ్వరం...?! మనం చేయగలిగింది చేస్తున్నామా అని. ఒద్దులేరా" నిస్సత్తువగా గ్లాసు విదిల్చి... సిగరెట్టంటించుకొని... నిండుగా దమ్ములాగి

పొగొదిలి... దిగుల్ని నా కొదిలి... భగవాన్లు...

"యా...య్..."

లోకమా? నాకమా? ఎక్కడా?..."రేయ్... వద్దు... వద్దురా నిజమే... నాకిప్పుడు తెల్సింది...

ఈ ఉదయమో... సంధ్యని...'

"రేయ్ భగ్గీ! ఎందుకురా ఇదంతా...?!"

స్ఫోటకప్మచ్చల మధ్య సూర్యనేత్రాల్ని వికసింపచేస్తూ వాడు చూశాడు...

ముప్పైయెనిమిది వసంతాల క్రితం... ఓ శిశిరం... విసిరేసిన పత్రం... రోడ్డు పక్కన... రక్తాన్ని కప్పుకుని... విముక్తి కోసం... రోడ్డు పక్కన... పెంట కుండీ దగ్గర, గుడ్డు... కక్కు...రక్తప్మరకల పాత చీరల పీలికలు... మాయ... బొడ్డూడని... రోదన... కోస్తే... కాస్తా... రాస్తా... మూస్తే... రోదిస్తూ... ఆరిన... గర్భకుహర తిమిరాల్లోంచి లోకం... విలోకపు... చీకట్లలోకొచ్చిన... ఆ గంటల... శైశవం... శవం... అందుకేనా భగవాన్లు శవాలు మోస్తాడు? ఏమో.

"రేయ్!" మళ్ళీ మామూలుగా అనాథనబడే మహోన్నతుడీతడీ భగవాన్లు. "నా దగ్గర డబ్బుల్లేవు... వున్నంతలో జానక్కిచ్చి... యేదో సంతృప్తి. మరేదో, మరేదో? పొందుదామనే స్వార్థంతోనేరా... యాభైనీకిచ్చి పొద్దున్నే... పంపించింది..."

"నీకూ, జానక్కీ... యెట్లా కుదిరిందిరా..."

"కశ్మలానికీ, నదికీ యెట్లాగో అట్లా"

"అంతే... కాదురా... యింకేదో ఉంది... అదేమో నేనూ...

యీ మృగ ప్రపంచమూ తెల్సుకోలేమనుకుంటా"

"వద్దురా... మంచి పాట పాడు..." గ్లాసులోంచి... మా మనః ప్రాంగణాల్లోకి మధువునాహ్వానిస్తూ వాడన్న తర్వాత.

మళ్ళీ. మళ్ళీ... మరొొక్కజన్మెత్తి నేను... మనిషినై... చీకటి స్వరాల్నీ చిట్లిస్తూ...

నేను చీకటై...

చీకటి నేనై...

చీకటి నేనూ...

నేనూ... చీకటి...

ఎప్పటికి... యింకెప్పటికి వెల్తురు...?

ఈ చీకట్ల వాకిట్ల విస్తరిల్లే వికీర్ణ కాంతి పుంజాలు... యెప్పటికీ?

అప్పటి వరకూ...

చీకటీ... నేను...

ఆప్యాయతా, ఆత్మీయతా, స్నేహం... అనురాగం ఎంత మెత్తటి వెచ్చటి పదాలు...! మనసు రోసి... యావత్ప్రపంచమూ చెవిటిదై నీ రోదన, వేదన... శబ్దరూపం ధరించను సాహసింపలేని క్షణాన, ఆ బాధకంతటికీ భాషనిచ్చి... ఓదార్పుల జవాబులిచ్చి, బాధను మనలోనూ, తమలోనూ లేకుండా విసిరేసిపోయే... వింత రూపాలివి...

ఏమో! జానకి రోదనకు నేను స్నేహాన్నైవుండొచ్చా? భగవాన్లున్నాడు గదా...

మరి, యీ ఉదయమో సంధ్యని మీకు తెల్సా? అని జానకి నన్నడిగిందే..?

జవాబాసించి కాదా?

ఔనేమో!

భగవాన్లకీ జానక్కీ ఏదో సంబంధం, మామూలు ఆడా, మగా సంబంధం కాకుండా యింకేదో ఉంది.

నీకెందుకురా గాడ్డెకొడకా...

పరిహసించే మనసు,

వాడు... భగవాన్లైనందుకు...

అందుకు...అందుకే...!

మెదడు పొరల్లోంచి ఓ ఆలోచనా బీజం మొలకెత్తితే... చక్కగా చిక్కగా... తీగలా సాగిపోదెందుకో...

ప్రతిదీ ఓ వృక్షంలా పెరుగుతుంది... శాఖోపశాఖలై పెరిగి, విరిగి, పెరిగి, చిరిగి, చిట్లి... పెట్లి... యెన్ని... యెన్నెన్ని... యెన్నెన్నని... నానారీతుల చిట్లి... అసలాలోచనెక్కడికో... యేమో అయిపోయి...!

కాత్యాయనొచ్చి కూచుంది పక్కసీట్లో.

బానే ఉంటుంది గదా పాపం...

పాపమెందుకురా?

కాత్యాయని డ్రాయర్ తెరుస్తోంది...

యేయ్...! టేబుల్దే...

ఓ చేయి మడచి టేబుల్మీదుంచి మరో చేత్తో, ఇక్ష్వాకుల కాలం నాటి అతిపురాతనమైన టేబుల్ సొరుగు లాగుతోంది... ఈ మధ్యన చీర చెరగు తొలగి... పొలగి... చెలగి... చెలరేగి...

యెందుకీ లిప్స?

మూసుకున్నందుకా? యేమో?

తెరుచుంటే వుండదా?

ఒక్కసారి... నేనూ, కాత్యాయనీ, జాన్సన్, యల్లయ్య... మా యస్టీవో సుగంధరావూ, కుంటికాలు సరోజా... అందరూ...అం...దరూ, నగ్నమై... నాగరికతల్నెగరేసి... చేతుల్తో కాళ్లనీ, కాళ్లతో చేతుల్నీ గోక్కుంటూ... విచిత్ర శబ్ద సంచయంతో... అరుపులనే భాషల్తో... మిడిగుడ్లూ... యికిలింపులూ... కేకరింపులూ... ష్..ష్..ష్...

మెలకువ.

యల్లయ్యొచ్చి...

"సార్... పెద్ద సారు పిల్సుతాండు, పద్నూడు 'ఎ' తీస్కోనంటబో."

ఓరల్ తాఖీదిచ్చి బీడీ తీసివెలిగించుకుని వరండా మెట్ల మీద కూర్చున్నాడు...

బీడీ...?!?

బీడీనే... అవునీ బీడీనే... మొన్న... నాజోబులో... ఈ బీడీనే... వీడిదే...

యెల్లిగాడిదే... ఆ గుడిసె బార్లో... నా భుజమ్మీద చేయ్యేసి...

"సూడ్సై... అవుసరానికి అందరం వక్కటే..."

ఔనెల్లయ్యా... అస్సలీ లోకం... దీనెమ్మ... థూత్...

అస్సలిక్కడ్కే ముందొచ్చింటే బాంటాం డెల్లయ్యా... నేను... సారాయి మత్తు చిత్తు చేస్తే... చెయ్యి చాపి వీడి దగ్గర్తీసుకున్న హైన్యం.

ఎస్టీవో సుగంధ్రావు... యేం పేరో... యేమో... పాపం... దానికి వ్యతిరేకంగా కంపైతే కొట్టడు. కానీ సుగంధించడు... కూడా... 'మనోడే' అని నన్ను ఆప్యాయంగా అప్పుడప్పుడు మళ్లీ బేమ్మలనబడే బ్రాహ్మల్లో కల్పడానికి ప్రయత్నిస్తుంటాడు.

"మోనింగ్సర్"

తలెత్తి చూసి చిన్నగా నవ్వి. 'అందుకేనయ్యా నువ్వంటే నాకిష్టం... ఎంత మంచి ప్రొనన్సేషన్నీది. మంచిలాంగ్వేజుంది నీ దగ్గర... అయినా ఆ ఫాడలవాటొకటి'. పాడులో పాకు పొల్లిస్తూ దాని తీవ్రతను తెల్పాడు... పొల్లుది కాదు పాడుది...!

"డి.టి.ఓ.కు పోతున్నావ్ గదా... అక్కడ వైకుంఠం ఎల్టీసీ మీద అనకాపల్లె పోతున్నాట్ట, వచ్చేప్పుడు నాకు చక్రకేళీలు తెచ్చి పెట్టమన్చెప్పు..."

చక్రకేళీ...?!

చక్రకే...ళి..!!

శర్కర కదళీ... సక్కర కహళీ... చక్కర కేళీ... చక్రకేళి... భాషో భాష...భాష ఫైలాలజీ అంటే ప్రాణం నాకూ వాడికీ... వాడంటే వాడే భగవాన్లుగాడు.

"ఎస్సర్" వెళ్తూ వెళ్తూ వెనక్కు తిరిగి చూశా. అద్దాలున్నా... ఫ్రేం బైట నుంచీ నన్ను చూస్తున్నాడు. నిజమే. అస్సలు చట్రంలోంచీ బైటకొచ్చి చూస్తే చాలామందిలో చాలా చాలా... మంచికనబడొచ్చు. అంటే... నీలోపల చాలా మంచుందీ... దాన్ని లోకం చూడ్డం లేదనేనా నీ అక్కసు. నీ కాళ్ళకి నీవే మొక్కోపోరా ఫో...

సీట్లో కూచుంటూ కాత్యాయని పక్క చూశా... ఎడమ హస్తాన్ని ఓ విచిత్ర ముద్రలో పట్టి... చిటికెన వేలుని ఎడమ ముక్కులో వుంచి. అటూ... యిటూ... యిటూ... అటూ... కాస్తా... యింకాస్తా... పైకి మళ్ళీ అటూ యిటూ...

యా...క్...

ఎందుకు వాయ్ యాక్...క్కూ? అది ఆమె ముక్కు.. ఆమె వేలూ... నీవేలు ఆమె ముక్కులో పెట్టుకోలేదే... కాదూ నీ ముక్కులో ఆమె వేలూ పెట్టలేదు... ఆమె

ముక్కు ఆమిష్టం బిగబట్టుకున్న నవ్వు... చిత్రమైన శబ్దం చేస్తూ ఎంగిలితో పాటు బైటికొచ్చింది.

ఆమె తన్మయత్వం పోయి...

తపోభంగమైన ఋషిలా...

ఆసలిదేమిటి?

నేనేమిటి?

ఏమో... అంతా చీకటి

పన్నెండు ప్రాంతంలో మస్తానొచ్చినాడు...

నా సీటు వెనకే కిటికీ... బైట్నించే కిటికీలోకి తొంగి చూస్తూ... "సార్..సా..ర్సా..ర్..."

వాడి ముఖంలో వింత ఆదుర్దా... యేమైంటుందీ?

బైటికెళ్ళా... వెళ్ళీవెళ్లంగానే...

"సార్... ఆ సార్ని... యెవరో సావగొట్టిపోయినార్సార్".

భగవాన్లని కొట్టడమా! అందరు డ్రైవర్లూ చూస్తుండగా భగవాన్ల మీదచెయ్యా? యెవరూ? యేమీ? యెట్లా? అడుగుతూ కూచునే స్థితి కాదది.

"పద"

డి.టి.వో లేదూ.

సుగంధ్రావ్ లేదూ

వైకుంఠం లేదూ... చక్రకేళీ ల్లేవు...

పిసిగిన మనసు... మస్తాన్ న్నేనూమాత్రమే... అదీకాక నేను గోర్మెంటుద్యోగిని.

స్టాండులోకి వెళ్లంగానే... డ్రైవర్లంతా గుడి చుట్టి గుసగుసల్పోతున్నారు. నన్ను చూస్తూనే అందరూ నోరు మూసుకున్నారు.

"యేమైంది?"

యెవర్నీ ఉద్దేశించలేదు.

అందర్నీ కూడా ఉద్దేశించలేదు... బహుశా నాకు నేను వేసుకున్న ప్రశ్నేమో అనిపించేట్టుగా అందర్నీ అడిగా.

"ఏమైంది?"

ఎవరూ మాట్లాడ్లే

ఫిఫ్టీనైన్ ట్వొంటీటూ... యెత్తి రాజులు కొంచెం ముందుకొచ్చి "అన్నరూంతా నుండాడు... ఆడికి పోసార్... అని మాత్రమన్నాడు... ట్రాఫిక్ రద్దీకి కాస్తా స్లో అయిన సిటీ బస్సెక్కాం నేనూ మస్తాన్. భగవాన్లను కొట్టడమేమి?

అస్సలు భగవాన్లు... వాడు చీమకూ్కాడా హాని చెయ్యడే...

అస్సలు భగవాన్లని కొట్టిన చెయ్యి విరగాల్సిందే...

యేమైంది?... నాకు గుర్తుండీ భగవాన్లని కొట్టడం సుమారు ముప్పై సంవత్సరాల క్రితం చూశానంతే.

వాడి హాస్టల్ దగ్గరికి వాడి కోసం... ఆడుకోవడానికి పోతే... మిగతా పిల్లలు "సారూ...వాణ్ని..బాగా..."

చేతుల్ని వెనక్కి, తిప్పి కుడిచేతుల్ని కత్తుల్లా చేసి నరుకుతున్న యాక్షన్ చేస్తూ... అంటే... నేను భయం భయంగా... హాస్టల్ వెనక్కివెళ్ళి నక్కుతూ నక్కుతూ... పాయిఖానా దగ్గర.

'చెప్రాలంజెకొడకా యెవ్వరితోని గానీ అంటివా... నీయమ్మ... హాస్టల్లోంచీ తోలిపారేస్తా."

పల్చటి, నల్లటి స్ఫోటకమ్మచ్చల పిల్ల భగవాన్ల ముఖం నాకిప్పటికీ గుర్తుంది... జాలిగా... బేలగా...

జుట్టు పట్టుకొని వంగదీసి ధబీమని గుద్దాడు వార్డెననబడే నల్లటి మిడిగుడ్ల బట్టతల బుట్ట చెవుల... మానవరూపం...

"వా...క్..."మని కక్కుకున్నాడు పిల్ల భగవాన్లు.

"వ...ద్దు...సా...ర్..."

"ఏమొద్దురా?"

"కొట్టొద్దుసార్."

"మిగిల్నాకొడుకుల్కి చెప్పవ్ గదా?"

"చెప్పన్సార్".

"ఏం చెప్పవ్?"

"అదే సార్"

"అదే అంటే?"

"అదే... అంటే... అప్పుడూ... అప్పుడూ... నొప్పొతుందని చెప్పన్సార్".

"బ్రద్రం లంజె కొడకా". ఒక్క తోపుతోసి వాడెళ్లిపోయాడు. నాకూ భయమేసి నేనూ పారిపోయా.

ఏదో వికృతపైశాచిక చేష్టాజనితమైన బాధను... బాధ అని చెప్పుకోలేని అనాథ భగవాన్లు.

ఆ భగవాన్లు మళ్లీ ఇన్నేళ్ల తర్వాత యింకెవరు కొట్టడం చేసుంటారు?

☼ ☼ ☼

మేథో మంజూష...

కిర కిర కిరామంటూ... మూత తీస్తే.

నిన్నలు, మొన్నలు, పొరలై... పొగలై విడివడి... యెగసెగసి...

కాలం వదిలేసిన బానిస వీడు...

వాలం కాలిన గార్ధభం...

ధం...ధమా ధమ్డ మాధం... యెంత తీయని కోరిక...

అది యేరాగమో... అంతరాళాల్లో అంతరిస్తున్న లిప్సారాగాలు... రక్తచందన చందంబున నా కోరిక... మేరకు... తీరకపోయినా...

నీ కోరిక నరుక్కో...

"యేమైంది?"

ఫో...

"ముందేయేడవచ్చు గదా?"

అతి వయ్యారం... కులుకూ లుకూ లుకు లుకూ... పులుకూ మిడిగుడ్లేసుకు...

ఛీత్కారం నేత్రాల్లో... ఆరని అంగారం గాత్రంలో...

ఓ సంధ్యాసమయాన... వెచ్చటి ఆవిర్లు కమ్మే...

కమ్మని రంగులు పరుచుకున్న నా ప్రాంగణంలో... శ్వేత పంఖాలు విస్తరింపజేసుకుని వాలిన అందమా...! ఆనందమా...!

ఆ సంధ్యాకాశాన్నే కప్పుకుని వచ్చి వాలినట్టనిపించి...

నే వికసించని దృక్కుల్ని విసిరేస్తే...

పావురాయి పారిపోయె

సంధ్య ఛాయ మాయమాయె

కీచురాయి గబ్బిలాయి

ఘూకాయీా చీకటాయె

యామినీ నిచోళచ్ఛన్న భయానక రూపమోటి

తప తపతపా తప తప్మని

నగ్న పాద తాడనమున తాండవం

పారిపో

యెక్కడికి...?

వెలుతుట్లోకి...

వెల్తురెక్కడ?

చీకట్లేని చోట!

చీకట్లేని చోటెక్కడ?

వెల్తురున్న దగ్గర!

వెల్తుర్లో చీకట్లుండవా?

ఢా...ం..! భాండం.

పుట్ట పగిలిచెదపురుగుల్లా జనాలు... బస్ నుంచి... మస్తాన్నేనూ భగవాన్ల గది దగ్గరకొచ్చాం.

తాళమేసుంది.

యెక్కడి కెళ్లుంటాడీ వెధవ!

పోలీసుల్తీసుకు పోయుంటారా?

తొంగి చూస్తే పక్కింట్లో... సౌభాగ్య మనబడే దౌర్భాగ్యం జుట్టును రెండు పాయలుగా తీసి ఓ పాయ వెనక్కేసి ఇంకోటి ముందుకేసుకుని పేల దువ్వెనతో పళ్లు గిటక్కర్చి కసిగా దువ్వుతోంది.

స్స్స్..మని చప్పుడు ప్రతిసారీ దువ్వెన్తో పాటు జార్తోంది.

మస్తాన్ వైపు చూసి వెళ్లమన్నట్టు కళ్లతో చెప్పా.

“అక్కా! సారేడికి బోయినాడే”

అదేమి ఆనవాయితీనో ఏమో ఆ దౌర్భాగ్యం ఈ వెధవ కంటే పదేళ్ళు చిన్నై ఉంటుంది.

వందేళ్ళు చిన్నైనా అంతేనేమో?!

దువ్వెన్తోపాటు చెయ్యి వెల్లకిలా వేసి

ఏమో అన్న సంజ్ఞ... దౌర్భాగ్యానిది.

"సరే... నువ్వు పో...జానకింట్లో లేదు గదా?" అన్నా లేదన్నట్టు తలడ్డంగా ఊపి, చేయి చాపాడు.

జేబులోంచి రెండ్రూపాయల్తీసి వాడికిచ్చి... నేవెనక్కి... మళ్ళీ పిశాచాల... మృగాల... అరకొరగా... అక్కడక్కడా తగిలే మనుషుల మధ్య నుంచీ... వడివడిగా...

గుండె వేగం పెరిగింది...

యెదుర్రొమ్ము కేసి తన్ను తాను బాదుకుంటోంది...

కుడి చెయ్యి అప్రయత్నంగా గుండెమీది కొచ్చి...

నెమ్మది నెమ్మది అన్నట్టు... నన్ను నేను...

నా గుండెను... నా చేయీ...

నా బాధను... నా ఆత్మా...

నా వ్యథ... నా రొద... నా ఆవేదన

నాకు నేను... నేనే... నిమ్మళించుకుంటూ

ఇన్ని వేలమంది మధ్యయిదేమి ఏకాంతమో...?

భగవాన్లూ ఎక్కడ్చచ్చినావురా గాడ్దెకొడకా!...

కళ్లు మసకబారుతున్నాయి...

నాకు తెల్సు... నేనేడిస్తే లోకంలో బాధ పెరగదు...

నేన్నవ్వితే ఈ లోకం వికసించదు.

ముక్కులోంచి నీళ్లు... కళ్లు బిగబట్టినవి కార్తున్నాయి... చెయ్యి మడమతో తుడుచుకున్నా.

"నమస్తే సార్... పొద్దునొచ్చినా... ఆఫీసుకాడలేరు మీరు ఫైలు ఆయింత కానిస్తే నాకు లెక్క చేతి కొస్తాది... పాండి కాఫీ తాగుదాం"

ప్రపంచమంటే నేనొక్కడే కాదు... నాదొక్కటే కాదు. యాంత్రిక జంతువునై... అతని వెనుక... ప్రపంచం వెనుక... మళ్లీ నా వెనుక ప్రపంచం... ఆ వెనుక...నాకు నేను అయినప్పుడు... నాదో ప్రపంచం... నాదే ప్రపంచం... "వన్బైటూ" రెండు చేతి చూపుడు వేళ్లనూ ప్లస్ గుర్తులా పెట్టి అన్నాడు.

యెక్కడి ఇంగ్లండ్... ఇక్కడ ఈగలు వాలిన టేబుల్మీద ఒకటి రెండై...

"ఏం సార్ నా ఫైలు...?"

“నీకు తెలీందేముందన్నా?,,,! మా ఎస్టీవో సంగతి...”

“అవున్సార్ సూన్నీకట్టుంటాడు గానీ నాకు తెల్దా బాపన్నాకొడుగ్గదసార్”

... అమాయకత్వం...

భళ్లున నవ్వా... కళ్లల్లో నీళ్లు తిరిగేట్టు నవ్వుతూనే ఉన్నా...

వాడు బెంబేలెత్తిపోయి చూస్తున్నాడు.

వాడికిప్పటికిప్పుడు నేనూ బాపన్నీ కొడుకునే అనంటే మరుక్షణం నా ముందుండడు. జాన్సన్‌గాడు వీడ్నించి పైసలు దండుకుంటాడు.

అవసరం... విషయలాలస... మనో వైకల్యం... స్వార్థం...పాశవికత... అన్నీ కల్సి కలగల్సి అవినీతి అనే రూపంలోకి మెటంసైకోసిస్. పరకాయ ప్రవేశం.

పళ్లికిలిస్తూ, మాట్లాడుతున్న నన్నునేనద్దంలో చూసుకోలేనిప్పుడు.

ఇంతకంటే అసహ్యంగా నేనెప్పుడూ వుండను.

వాడికీ ఓ మూడొందలకీ విడాకులిప్పించి...

వాడి చీమాలచ్మిని... చ్చి చ్చి చ్చీ... బుచ్చీ... చ్చీ అనే జేబులో బుజ్జగించి... ఈగల్తోలుకుంటూ.... అందరూ ఉమ్ముతున్న రక్తప్మరల్లాంటి పాన్, కిల్లీలనబడే తాంబూలమిళిత లాలాజలం మధ్యలో నిలబడి... మెడలు చాచి మునిగాళ్ల మీంచి నిల్చొని “భై రెండు రెడ్విల్సియ్యి”! అని గట్టిగా వాడిచే అరిపించి... అక్కసుగా ఆనందించి ఆ శ్లేష్మాల మధ్యన్నే... రోగాల మనుషుల మధ్య ఈగల మధ్య... వాడు వెలిగించుకున్న సిగరెట్‌తో నేనోటి వెలిగించుకొని...

దర్పంగా...

లోపల్లోపల మనసు చతికిలబడుతున్నా...

గర్వంగా...

“వస్తా! మండే... అహ... కాదులే వెన్స్‌డే వచ్చి పైసల్తీసుకుపో...

పార్టీ... హిహిహి... మిగిలిందీ... వస్తా మరీ.”

కరిగిపోయిన కశ్మలాన్నై...

జనవాహినిలో...

ఆఫీసుకొచ్చేప్పటికి వైకుంఠం భూతద్దాల్లోంచి చూస్తూ భూతం లాగానే బైటికొస్తున్నాడు. వాడినంటి సుగంధ్రావ్... పువ్వూ... తావీ... కిసుక్కున అని... ఫక్కున

నవ్వుదామని గిలి... పాపం సుగంధం... మనోడేగదా... అవునూ ఈ వైకుంఠ శుంఠ కూడా మ...నో..డే... గదా...దా!

యేమి యీ హుషారూ?!

ష్..పారా..హుషార్...! పారా....... సారా..... హుషార్

చుచ్చూ... బజ్జోమ్మా...! చీమాలచ్మీ...మీ

"ఏం వాయ్ కుంఠీ! వైకుంఠీ" బ్బా...యేం పన్నూ!

"అక్కడికి నీ కోసం పోతే ఇక్కడ ప్రత్యక్షమైతే ఎట్లా వాయ్‌కుంఠీ"

"సర్లేబా! వూకో సార్ చెప్పినాడు గానీ"

వీడి పిండాకూడు వీడూ... వీడూ వీడి ఎల్టీసీ... యెవరికి తెలీదు గనక... యీ సౌగంధానికి తెలీదా?

అంతా ముచ్చు ముండాకొడుకులే...

మరి నువ్వో...?

అహ్హహ్హా.. స్వేనో... పేహేద్ద...

మ్రుచ్చిలు కాడ...

ఏకాడో... మునక్కాడ

జాం... జాంగున్నాది భాయీ... తప్పున తెంపేయి రమ్మీకాయీ మరి...

భ...గ...వా...న్లో...!?

❊ ❊ ❊

మరో మందిరం శూన్యమై, శూన్య మానస మందిర ఏకాంతంలో సామాజిక చైతన్యాభాతి భీతిచే అభివ్యక్తి వాకిట్లో ఆవలి వైపో భావన.

విప్పి చెప్పుకుంటేనేం.

మనుషులం... సామాజికులం...

మృగచేష్టలకు... భావాలుండవ్...

కానీ భావసమృద్ధి గల్గిన మృగాలుంటాయి...

సృగాలాల్లాగా...

ఆ కవోష్ణ కాదంబరీతప్త నిషద్వరాకాశం క్రింద... ఒక కన్ను మూసి మరో కంటితో...

నాకాన్ని చూస్తూ... మళ్లీమరో కన్ను మూసి ఈ కన్ను తెరుస్తూ... మూస్తూ... తెరుస్తూ...

శ్రీ మహాలక్ష్మి చిల్లపెంకులైంది.

పిన్నుతో కుట్టిన నీలంరంగు రబ్బరు చెప్పులాగే ఉంది. పిన్నుతో సహా... తెచ్చుకున్న ఫుల్ బాటిల్లో దాదాపు సగమైపోయింది. అరిటాకు వాసన కొడ్తూ అన్నంలో వుడికిన కోడి... గుప్పు గుప్పుమంటోంది.

చెవులు మూసుకుని ప్రవర చెప్తున్న చిన్న... చిన్ని... నేను... పచ్చటి ఒంటి మీద అతి పచ్చటి యజ్ఞోపవీతంతో... చిన్ని పట్టుబట్టతో... అఖండజ్యోతి వెల్గుల్లో... విచిత్రద్యుతులు వేలార్చే తామ్ర పాత్రల్లోంచీ... పాలరంగుల హంగుల వెండిగిన్నెల్లోకి... ముద్రాంకిత హస్తాన్ని...

... చిన్ని... లేతహస్తాన్ని...

పావవం చేస్తూన్న పావని...

లీలగా ఏవో నీడలు...

ఇంకో పెగ్గేసుకుందాం...

పక్కకు తిరిగి సీసా చేత్తో పట్టుకు.. గ్లా..గ్లాసేదీ? వంచుకొని వసంతాల వాకిళ్లు తీసుకుంటూ...

ఒక్కటొక్కటే... వెనుతిరిగి...

పరిగెత్తి... పరిగెత్తి... వగరుస్తూ... ఆగి... ఆగి... మళ్లీ సాగి... పరుగులెత్తి...

ఒక్కటొక్కటే... ఒక్కటొక్కటీ... ఏవో గతాల భవనాల ద్వారాల్లోంచీ...

ఒక్కో ద్వారం నుంచీ... వెనక్కి... వెవ్వెనక్కి... కొంచెం కొంచెమై... వృద్ధాప్యపు మొదటి రంగు నుంచీ...

యవ్వనాల జోరుగా...

కౌమార్యాల హుషారుగా...

బాల్యపుటానందంగా...

శైశవపు అసహాయతగా...

అట్నుంచటు... ఏవో... ఏదో... ఎవర్దో...

ఎవర్దో ఎవరిది... అమ్మది...

నిబిడాంధకార గర్భకుహరాల్లోనికి...

ఆ చీకటుల, భ్రూణాకృతిలో...

ఆ వెనక్కు... పిండం బ్రద్ధలై...

అండమై... వీర్య కణమై...

రెండు జీవనాడుల ద్వారాల్లోంచి... ఫట్,

ఎన్ని కోట్ల వత్సరాల మాయ...

అంతకు ముందు నేనెవరు?

నా ముందు ముందు వాళ్లెవ్వరు...

మళ్లీ ఎడమ కన్ను మూసి ఆకాశంలోకి చూస్తూ

ఏమో...?

పక్కనున్న ఉడికిన అన్నంలో కోడి... కోడన్నం... న్యూస్పేపర్ తొడుగున్న అరిటాకు పొట్లం... దారం రెండు పోగులుగా వేలాడుతోంది... రెండెందుకు?

ఒకటిమొదలు

ఇంకోటి తుది...

యేది మొదలు?! యేది తుది?!

కోడన్నం...

గోరింటాకు పండిన తెల్లటిచెయ్యి. ఎఱ్ఱ గాజుల చెయ్యి... బుల్లి వెండి కంచెంలో మీగడ పెరుగూ అన్నం కలుపుతూ... ఊరేసిన నిమ్మబద్ధ...కొద్ది...కొ

"ఆ..."

ఎన్నో విశ్లథ కుడ్యాలు దాటుకుంటూ దాటుకుంటూ

ఎప్పుడు ఆ గర్భాలయాన్ని నే చేరేది...?

ఇవే వెచ్చటి రాత్రిళ్ళు కుంకుడు నీళ్లూ సీకాయతో తలంటి... తెల్లటి...

బుల్లిలాల్జీ పైజామా వేసి...

సాంబ్రాణి పొగలు...

వెచ్చటి కమ్మటి... అమ్మవాసనలూ...

"ఊ"

ఆ గుడిశెల్లో మానవత్వ శైథిల్యాలను మళ్లీ మళ్లీ గళాసుల్లోకి ఒంచుకుంటూ... నాలుక చిరిగే కారపుటూరగాయలో వేళ్లు పెట్టి 'చపుక్'మని శబ్దిస్తూ... బూతుగా "నీయమ్మా"...

ఉలిక్కిపడి ఎప్పటికీ జ్ఞాపకం రాని కల కలచివేస్తే... బుల్లి... చిన్ని నోరు బార్లా తెరచి

"మ్మా!"

"మ్మా!"

"మ్మా!"

"మ్మా!"

"వొరే...! వరేయ్ గడ్డం నాయాలా!రేయ్!"

ఎవరు? అమ్మా!

అమ్మకు మగగొంతెందుకు...?

"రేయ్!"

ఎక్కడో విన్నట్టు లీలగా... ఎవర్ది ఆ గొంతు

"లెయ్యి... లఫూట్"

"ఆ... భగ్గీ! భగాన్లూ... రేయ్...దా! ఇందా మందు...ఏస్కో".

'రేయ్... విన్రా నేనెక్కువ సేపుండలేన్రా... రేయ్ గడ్డం నా కొడకా ఈరోజే నీకు డబ్బుల్దొరికి చావాల్నా? రేయ్...!"

"ఛట్... కసిగా గ్లాసులో నీళ్లునింపికొడ్తున్నాడు మొహమ్మీద

"లెయ్యి లెయ్యి లమ్డీకొడకా! లెయ్యి" పది నిమిషాల్తర్వాత నేను గోడకి చేరగిలి కూచున్నా...

వాడు ఆబగా కోడన్నం బొక్కుతున్నాడు.

ఆకల్ని జయించిన భగవాన్లు...

విజృంభించి ఆ ఆరిటాకు పొట్లాన్ని పొడిచి పొడిచి... కసిగా కుమ్మేస్తున్నాడు... ఏమైంది వీడికి...? నిన్ననగా మాయమై యింత రాత్రి యిట్లా చీకట్లో దొంగలా...గా... మచ్చల ముఖపు ముచ్చిలుకాడు... ఛా... తలవిదిలించుకున్నా.

చిన్న కూజా పైకెత్తి ఖాళీ చేసి దింపాడు. నా ముందొచ్చి కూచుని కుక్కిరిగాళ్ళ మీద...

సిగరెట్ వెలిగించుకొని దమ్ములాగి... పొగవదుల్తా...

"ఒరేయ్! మొన్న నేను శవాన్నేసుకుపోయినాను చూడు, ముసల్దాని శవం! భయంకరంగా ఉండింది. ఎవ్వరూ కార్లోశవంతోపాటు రావడానికి వొప్పుకోలేదు...

"నువ్వొక్కడే తెస్తావా?" అని నన్నడిగినారు. సరేనన్నాను. సరే దింపి ఆ రాత్రొచ్చినాను కదా! మళ్లీ పొద్దున్నే వాళ్ళ గాసగాడొచ్చి అయ్య పిలుస్తున్నాడు రమ్మని పిల్చుకు పోయినాడు... హోటల్రూంలో వాళ్ళు.

నల్గురున్నారు. గంజి ఇస్త్రీ ఖద్దర్లు నల్గురు రూంలోకి పోయి పోకముందే తలుపు వేసి ఆ నల్గుర్లో ఇద్దరూ, ఆ గాసగాడూ, కల్సి గట్టిగా పట్టుకొని 'రేయ్! మర్యాదగా ఆ దుద్దులిస్తావా లేదా' అనడిగినారు. ఆ ముసల్దాని శవం చెవులకున్న దుద్దులేమో 'నాకేం తెలీదో'

అని పది నిముషాలు చెప్పుకొన్నా... 'సరేఫో' అని పంపించేసినారు. నేను స్టాండు దగ్గరికొచ్చేప్పటికే అక్కడ ఇంకొంత మందున్నారు. ఆ ముసల్దాని ఇంకోవైపు బంధుత్వ మనుకుంటూ... నేను అక్కడ కాలు పెట్టినానో లేదో... అంతే... అంతా కల్సి కుక్కను కొట్టినట్టు కొట్టినారు..."

వెనక్కు తిరిగి ఖాఖీ అంగీ పైకెత్తినాడు.

ఎముకలు తేలిన నల్లటి మశూచికప్మచ్చల వీపు మీద తెట్లు తెట్లుగా గుర్తులు...

అంగీ దించేసి మళ్లీ తిరిగి నాకభిముఖమై...

అసహాయపు భగవాన్లు...

ఆ ముప్పై సంవత్సరాల క్రితం అనాథల హాస్టల్ వార్డెన్ గుద్దిన గుద్దులకు కక్కుకున్న లేతాభగవాన్లు...

ఆ ముప్పై సంవత్సరాలకు ఎనిమిది సంవత్సరాల ముందు...

కసపుకుండీ పక్కన... రక్తపు గుడ్డుగా... యుక్తాయుక్త విచక్షణ మరచిన మానవత్వపు మరకగా... చుట్టూ మూడు కుక్కలు కోరలు తెరచుకుని గుర్రుగుర్రుమని చొంగ కారుస్తూ ఎప్పుడు చైతన్యం ఆగిపోతుందా... ఎప్పుడు చీలికలు పీలికలు చేసి లప్టాయిద్దామా అని... చూస్తుంటే... బ్యాండేజీ బట్టల కట్టల, ముట్టు బట్టల కంపులో, ఆపుకోలేని అవసరాలు తీర్చేసుకుని తుడిచేసిన చేతి గుడ్డల మధ్యన మలమూత్రాల మధ్యన ఏడుపు తప్ప ఏమి తెలీని...

యీ... యీ భగవాన్లు...

శవాల టాక్సీ డ్రైవరెమ్మే డబల్లిట్‌గాడీ భగవాన్లు...

ప్రకృతితో ప్రపంచంతో అవిశ్రాంత రణం సాగించిన ఈ భగవాన్లు.

నా నీడ...

అర్థమైంది... వాళ్లు సంఘంలో పెద్ద మనుషులు. వీడో మామూలు శవాల టాక్సీ డ్రైవరు.

"ఎక్కడికిపోయినావురా మరీ?"

"మళ్ళీ చెప్తా... మళ్లీ వచ్చిం తర్వాత చెప్తా... డబ్బులేమైనా ఉన్నాయా?" చొక్కా, ప్యాంటు జేబుల్లో మిగిలిన చిల్లరంతా కుమ్మరించా... నూటా మూడ్రుపాయలా నలభై పైసలు... చిల్లరతో సహా అంతా జేబుల్లోకి మార్చుకున్నాడు.

"జానకి దగ్గరికి పొయ్యిరా... ప్రపంచం ట్రాష్... నువ్వు నిజం... మళ్ళీ వచ్చి మాట్లాడ్తా..."

వెళ్లేవాడు మళ్లీ తిరిగొచ్చి,

"గడ్డపోడా! అమ్మతెలీదు... అబ్బలేడు... ఆకలి తీర్చుకోలేని వయస్సులో హాస్టల్ ఆశుద్ధంతో... యీ దుమ్మూ, ధూళిలో... అమ్మ మీ అమ్మా నువ్వూపెట్టిన పిడికెడు ఆప్యాయతా, స్నేహాల్తో... ప్రపంచంలో అక్కడక్కడా చటుక్కున మెరిసే మానవత్వం విదిలించిన ఆర్ధ్రత చినుకుల్లో..."

వాడి కళ్ళల్లో వజ్రాల్లాంటి నీటి, కన్నీటి చుక్కలు...

వాడి మొహమ్మీద గుంటలు దాటుకుంటూ... కుంటుకుంటూ

పొట్టి గడ్డం క్రింద పెద్ద చుక్కై వ్రేలాడుతూ...

చీకట్లో... చీకటైపోయిన భగవాన్లు...

ఆ చీకట్లోంచీ సన్నగా వినిపించింది.

"మళ్ళీ వచ్చి మాట్లాడ్తా... నీ..జా..ర.."

చీకట్లో గాలి మాత్రం వీస్తోంది.

ఝుయ్యిమని...

నిశ్శబ్దంగా... నిర్మానుష్యంగా...

నిర్లజ్జగా... నగ్నంగా పడుకుని వీధి...

మళ్లీ వికసించమని నను కవ్విస్తోంది.

❊ ❊ ❊

ప్రపంచ యుద్దాలొచ్చినా సరే ప్రభవించడం మానడు వీడు... కిటికీలోంచి వెచ్చటి రేఖా నఖాల్తో గిల్లుతున్నారు...

కలగా లీలగా గత రాత్రి...

భగవాన్లొచ్చిపోయినాడు కదా!?

మోచేతి మీద బరువేసి హెన్రీమూర్ శిల్పాన్నై... చుట్టూ కలయజూశా బాటిల్లో రమ్ అట్లాగే ఉంది... గ్లాసు అడ్డంగా పడుంది... తలుపు బార్లా తీసుంది. ఎవ్వడైనా వచ్చినా రమ్ బాటిల్ తప్ప ఇంకేం దొరుకుతుంది?

కడుపు నిర్లిప్తంగా నిర్వికారం ఉంది.

రాత్రి కూడా కూడు తిన్లేదే?! ఆకల్లేదేం?!

లివరౌటా? అయ్యే ఉంటుంది... ఈ లెవెల్లో తాగుతూంటే, లివరేం ఖర్మ... కిడ్నీలు గుండెకాయ... అన్నీ అవుటే...!

లేచి నిలుచున్నా...

నా పరిసరాల బొంగరానికి నేను ములికినైనట్టనిపించింది...

పరిసరాల్తోపాటు నేనూ...

నాతో పాటు పరిసరాలూ...

అన్నీ...

గిరగిర గిరాగిరమని... రయ్యిమని...

ఠప్పుమని మళ్లీ కూచున్నా.

స్పీడు తగ్గిందంతే, తిరుగుతూనే ఉంది...

కళ్లు గట్టిగా మూసుకుని... ఊపిరిబిగబట్టి ముడుచుకున్న తొడల కింద చేతుల్నదిమి పట్టి... కాస్సేపు... మూసుకున్న కళ్ల చుట్టూ ఏవో నల్లటిసుడులు... అలలు అలలుగా ఒకదాంతర్వాతింకోటి... చీకటి కోనేట్లో వెల్తుర్రాయేసినట్టు...

చినిగి చినిగి...

వెచ్చటి నిట్టూర్పుల్తోపాటు... రమ్ము వాసనా సిగరెట్ల కంపూ కలగల్సి దుబ్బు మీసాల్కి వేడి గాలి తగిలి... బుగ్గల మీద గుండా ప్రయాణిస్తున్నాయి నా మొహమంతా... ప్రయాసతో లేచి, గదంతా శుభ్రం చేసి, వంటిల్లనబడే ఆ యిరుకు మూలకు వెళ్లి చూశా...

బియ్యమున్నాయి... కొద్దిగా వెచ్చాలూ ఉన్నాయి కూరగాయల్తప్ప... 'శహబాష్ బేటా' అని నా భుజం నేను తట్టుకుని, 'లెట్రిన్' అనబడే ప్రపంచ కుళ్ళు కూడలి కెళ్ళా...

ఎవరిచ్చిన వరమో తెలీదు గానీ... నా ఆంతరంగికత నాతోటే ఉంది.

'పబ్లిక్కు'... కాలేదు.

ప్రయత్నించి... ప్రయత్నించి సఫలీకృతుడ్ని కాలేక...

అవ్వడానికేముంది గనక కడుపులో... నెప్పి మాత్రం మిగుల్చుకొచ్చి...

అసలైతే... ఒద్దుగానీ... మహాపరమాత్మా...! నీకెళ్ళే బాధుంటే తెల్సొస్తుండే... మీరంతా దేవుళ్లయ్యా! మీకీ బాధలుండవు... బ్రష్మీదపేస్టేసి... కస కస కసామని నోట్లో పెట్టి రుద్దేసి... ఉమ్మేస్తే...

చిక్కటి యెఱ్ఱటి నెత్తురు.

పళ్లూ... చిగుళ్లూ... విడాకుల్దీసుకుని... ఏండ్లూ పూండ్లూ గడిచిపోయె. పట్టించుకుంటేనా...

అశుభ్రంగా నోరు కడుక్కున్నాననే...

పక్కింట్లోకి తొంగిచూశా... ఆశతో...!

ఉంది... ఉంది...! ఉందంతే...!

అది...అదీ... లక్కంటే! బ్రదర్..ర్..ర్...

అహల్యుంది... అమ్మహల్య... హమారేలియే... అమ్మహల్య...

"అమ్మా"

ఎండిన ఫారం కంపను చిన్న చిన్న ముక్కల మీద నరుక్కుంటూ... నన్ను... నన్ను కాదసలు... నా శబ్దం విని... నా వాసన కని... పిరుదుల మధ్య చిక్కుకున్న చీరని అసభ్య సమాజపు కుళ్ళు కళ్ళ నుంచీ లాక్కోవాలనే ధ్యాస కూడా లేని...

అమ్మహల్య... లేచి... అహల్యమ్మ, ఇంట్లోపలికి...

లోపల్నించి తెచ్చిన గిన్నెల్ని మూయాలనే శుభ్రతా యోచనల్లేని...ఆ...స్త్రీ. 'గ్లాసెచ్చుకోపో... కాప్పోస్తా... రాత్రన్నమింత మిగిలింటే తిరిగేసినా... ఈగిన్నెత్తుకో... ఆ ముండాకొడుకింకా లెయిల్యాఫో... తొందర్గానిచ్చుకో"

అహల్య...! బొంగురు... మగ గొంతుకతో ఆడతనం...

అమ్మ... అహల్య...

అహల్యే... అమ్మ...

అదో మళ్లి... మళ్లీ యేడుస్తావ్ బాడ్ఖావ్!

రాత్రి తాగిన రమ్ముగ్లాసులోకి వుడుక్కాఫీ... అనబడే ద్రావకం చద్దన్నం పోప్పెట్టిన... విచిత్రాన్నం... తెచ్చుకుని...

ఊదుకుని ఊదుకుని, కాఫీ ద్రావకం... మళ్ళీ... కాస్సేపుండి... ఆ విచిత్రాన్నం... కడుప్నిండా... హాయిగా... చల్లగా... వేడిగా తిని...

"అమ్మహల్యా!" అనుకుని...

తేజోభరితుడనై...

వీర్యవంతుడనై...

ఆ రోజుకి... మళ్ళీ... ఇంకోనేనై... తయారై...

* * *

ఆదివారం...

దేనికిదాదో తెలీదు గానీ...

జేబులు ఖాళీ... రాత్రి భగవాన్లు నున్నగా ఊడ్చుకుపోయినాడు.

అవునూ... ఎక్కడికెళ్లుండొచ్చబ్బా? ఒకటి మాత్రం నిజం... ఆ గంజి యిస్త్రీ ఖద్దర్లకి భయపడి... దొరికితే చంపేస్తారేమోనని. నిజమే, వాళ్ళకి ప్రాణాల విలువ తెలీదు, వాళ్ళకి పోలీసులు న్యాయస్థానాల మీద నమ్మకం లేదు... వాళ్లే పోలీసులు, వాళ్లే న్యాయాధీశులు. ఆపై రెండూ వున్నా వాళ్ళ మాటకి కట్టుబడి వుండాల్సిందే...

హా... ఫోన్లే... రెండు రోజులు ఎక్కడో గడిపేసొస్తాడు... నిమ్మళంగా... మరి మనకతేందిబై...

చలో ఆఫీస్... యెవడో ఒకడు దొరక్కపోడు...

సెంటర్లోనే వైకుంఠ శుంఠ దర్శనమైంది.

"ఏంవాయ్..." ఇంకా పూరించకముందే,

"ఏందిబా వూకో అట్టబిల్సాకు నన్ని" చిట్లించుకున్నాదు పాపం. అమాయక ప్ముండాకొడుకు.

"సర్లే గానీ ఏం పొద్దున్నే... జోరుగా?"

"సుగంద్రావ్ సార్ పిల్సుతాండు పోంపా... ఇంటి తానున్నాడు."

"ఎల్టీసీ టికెట్లా?"

"కాద్లే పోంపా".

"సంధ్యావందనం దేవతార్చనైనాయా?"

తల యమజోరుగా వూపేశాడు... 'అయినై' అని

'మంత్రాలు కూడా యిట్లే చదువుతావా?'

మొహం మాడ్చుకున్నాడు...

మనసారా హాయిగా నవ్వా నాదివారం పొద్దున్నే...

సుగంధ్రావెస్టీవో యిల్లు. వీధి మీంచి బాగా లోపలికుంది. ఎవ్వరితోటీ యే యిబ్బందీ ఉండదు... స్వతహాగా మనిషిసౌమ్యుడు... ఇంకస్సల్ ప్రాబ్లెమ్ లేదు. వెళ్లేప్పటికి ఈజీ ఛైర్లో దిండు పెట్టుకుని రెండు చేతులూ తల వెనుక ఇంటూ వేసుకుని, కళ్లు మూసుకుని... రమణి వేణుగానం వింటున్నాడు.

టపాటపామని కొట్టుకునే నా నీలం రంగు పిన్ను కుట్టిన రబ్బరు చెప్పుచప్పుడికి పిల్లిలా కళ్లు తెర్చి చూశాడు.

"మోనింగ్సర్" కావాలనే యింకొంచెం యాక్సెంటుని అమెరికనైజ్ చేసి నేనల్టింట్తో ...

మూతి ఆకర్ణాయతమైంది.

"రండి రండి... వైకుంఠం! ఆ కుర్చీ లాక్కోవయ్యా".

"ఏం సర్ ఉదయాన్నే పిలిపించారు?"

వాయ్గాడు... సుగంధం... మెడలు సాగదీసుకుని ఒకరికొకరు తలలు ముందికీ వెనక్కీ ఆడించుకుంటున్నారు... తొండల్లా... నువ్వు చెప్పంటే నువ్వు చెప్పని.

"సార్ ఫ్యామిలీ యాగంటికి" వాయ్గాడు ఇంకా పూర్తీ చెయ్యలే... సుగంధం మళ్లీ ఆకర్ణాయతమూతుడై "సండే కదా ఎప్పుడూ రోటీనెందుకూ... కొంచెం వెరైటీగా టైం పాస్ చేద్దామనీ... ఒక్కణ్ణే అంటే బోరు... నిన్న సాయంత్రమే వైకుంఠానికి చెప్పా నిన్ను పిల్చుకు రమ్మని, అందుకని ఇది... అన్నమాట".

"హి...హి...హి..." భూతద్దాల వాయ్గాడు...

"చెప్పండ్సర్ మీరేం చెప్తే అది" నాన్ కమిటల్గా అదీ కాక యీ మహాదేశమే పైసా దేదో బాబా... బాబా అని దేశదేశాలూ తిరిగి అడుక్కుంటూంటే, చిల్లి జేబు పిల్లనాయాల్ని పైగా ఎస్టీవో... డబ్బులడగడం బాగుండదు... మరి వైకుంఠ శుంఠగాడు ముందుకొంగి...

"లైట్గా... పార్టీ... హినబడిందా బా..." గుసగుసనబడే ఘోరమైన శబ్దంతో నా కుడి చెవిని వాడి ఎంగిలి తుంపర్లతో తడిపాడు. థూత్... వాయ్గాడు... వీడికీ మెళ్లో ఓ రాగి రేకు కట్టాలి.

"నాతో రహస్యాలు మాట్లాడే వాళ్లు ఎంగిలి తుడుచుకోవడానికి వేరే దస్తీ గుడ్డ పెట్టుకోవలెను" అని.

"పార్టీనా?" గట్టిగానే అన్నా.

"లైట్... లైటంటే మా కలవాట్లేదు గదా అందుకని..."

అమ్మ, సుగంధ దుర్గంధరావూ... ఏమో అనుకున్నా కదరా... వీడూ... ఈ వైకుంఠిగాడూ... మందు పేరు చెప్తే చచ్చినెలక వాసనొచ్చినట్టు ముక్కు మూసుకునే ముచ్చు ముండాకొడుకు అమ్మాదేశం ముందడుగేస్తోంద్రోయ్...

"సరే సర్... ఏం తీసుకుంటారు... లైటంటే బియర్ తీసుకుంటారా... చెరో బోటిల్...?

"బీరా?" నన్నో అంబేదకప్పుండాకొడుకును చూసినట్టు చూశాడు శుంఠిగాడు...

"అదిగాదుబా! మొన్న ట్యాంకు కూడా జాన్సన్‌గానోల్లు పిల్సుతే పొయ్యినా జిన్ను తాపిచ్చినారు. బలే బాంది బా... ఇయ్యాల కూడా జిన్నే ఏస్కుంటం... నేనూ, సారు".

వరే శుంఠీ... నీతో చాల్జాగ్రత్తగుండాలొరేయ్!

"మరి... తిండీ? గీతా భవన్నుంచి క్యారియ్ తెమ్మంటారా సర్"

"గీ...? గిహీ తాహా అహ్హాహ్హాహ్హా"

"వాయ్ కుంఠీ!" ఠప్పున నోరు మూశాడు.

దుర్గంధంగాడు వాయ్‌గాణ్ణి తినేసేట్టు చూస్తున్నాడు.

"లేదు లేవయ్యా ఈ రోజు మనం వైకుంఠానికి చికెన్ తినిపించాల్సిందే". ముసిముసిగా నవ్వుతూ వేలిగోళ్లతో సుతారంగా క్రాపు సవరించుకుంటూ... ఒరే వికార్రావూ... అనిష్టానికయ్యంభట్లని యీ వాయ్ వెధవే దొరికాడా నీకు... వాడి పేరెందుకురా నీకు తినాలన్పిస్తే డైరెక్టుగా కుయ్యొచ్చుగదా... చికెన్ తినాలనుందని... సరే... అయితే... సరేరా... మీ తాట వలిపిస్తా నక్క నాయళ్లారా...

"సరే సర్... అంతే... ఈ రోజు వాయ్‌కుంటికి కోడి తినిపించాల్సిందే, ఏం వాయ్‌గుంటీ?!"

దుర్గంధం కుర్చీలోంచి లేచి హేంగర్కి వేలాడుతున్న ప్యాంటు జేబీలోంచి వ్యాలట్ తీసి... వాడు మాకు ముడ్డితిప్పి... అటు తిరిగి... దాంట్లో పైసలెక్క పెడ్తున్న చప్పుడు... కసకసామని... క్రిస్పనోట్స్

పకడ్బందీ యవ్వనంలా... పెళపెళా...

స్వీట్ సిక్స్టీనియరోల్డ్ సిరిమగాలచ్చిమి...

అయిదు వంద నోట్లు నాచేతిలో పెట్టాడు.

"ఏమీ అనుకోకండయ్యా ఇట్లా పంపిస్తున్నానని... నేనొస్తే బావుండదందుకనీ..."

సర్లేవోయ్ సింగినాదం... చాల్చాలు పైసలిచ్చినావు ఇంకోడైతే అదీ మా నెత్తిన్నే దొబ్బేవాడు...

వైకుంఠం నేనూ పొద్దున్నే గంగా యాత్రకు బయల్దేరాం... పదింపావు టైం...

బ్లూ డైమండ్ దగ్గర్కొచ్చాం......... "వైకుంఠం! నువ్వు పోయి ఒక అరడజనరటి పండ్లు, మూడు పాన్‌లు, రెండు ప్యాకుల రెడ్‌విల్స్ తీసుకుని పైకిరా... నేను పైకి పోయి మందూ, పుడ్డూ రెడీ చేపిస్తా" అని వాడికింకే మాత్రం మాట్లాడ్డాని కవకాశమివ్వకుండా మెట్లేక్కేశా...

భూతద్దాల్లోంచీ వక్రీభవించిన వాడి చూపులు నన్ను చేరుకునే లోపలే నేను పైనున్నా...

ఒకటై... ఇంకో దాంట్లో సగమై... మనుషుల రూపురేఖలు మారుతున్నై... వైకుంఠం... భూతద్దాల్తీసేసి కర్చీఫ్‌తో మొహం తుడ్చుకుని గుంట కళ్లతో చూస్తున్నాడు.

దుర్గంధం... తనకొచ్చిన ఇంగ్లీషునంతా... నానా రకాలుగా హింసించి చంపి... ఛిద్రం చేసి... అతికించి... మధ్యలో తెనుగు... ఇంకొంచెం టీవీ హిందీ... అన్నీ జోడించి ఓ విచిత్రభాషకు జన్మమిచ్చి... విర్రవీగుతున్నాడు... నేనో?! కనీసం మూడు వరకూ మత్తు బయట మడి కట్టుక్కూచునే రకాన్ని...

ఒకటిన్నరైంది. ఆమిట్ట మధ్యాహ్నవేళ... సభ్యత గడపలోంచికాళ్లు బైట పెట్టిన సుగంధ వైకుంఠాలు...

కుంటి సరోజ... కాత్యాయినీ; అలవోకగా అలా వచ్చి తొంగిచూసిపోతున్నారు. సంభాషణలనబడే వదరుబోత్తనంలోకి...

"ఫైవ్ హండ్రెడంట సార్ జాన్సన్ చెప్నాడు మొన్న పార్టీల".

"అంతవర్తెక్కడుందిలే వైకుంఠం"

"యాల్యా సార్ చానా మజానిస్తాదంట"

వాడి కళ్లలోకి వితరణతో చూస్తే వాడప్పుడామెను ఆ కుంటి కాల్సరోజను తనివిదీరా అనుభవిస్తున్న భావం.

లోఫర్ నాయాండ్లు... వీళ్లండీ పెద్ద మనుషులు...

పెద్ద కులప్పెద్ద మనుషులు...!

తాగి, యుక్తాయుక్తాలను మరచి వదరే ఈ కుక్కల్ని రేపు సరోజతో ధైర్యంగా ఆ విషయమే అడగంౘ్రా అంటే ప్యాంట్లలో ఉచ్చ పోసుకు చస్తారు.

ఛీత్కారం చేసేసుకుని... యా...క్కు...థ్పూ...గబ్బు... మనోకవాటాల్ని... జ్వాజ్వలమేధో ప్రపంచంలోకి తెర్చేసుకున్నా.

అసంపూర్ణ జీవిత చక్రంలోంచి... మగ్గాలక్లచ్ క్లచ్‌ల మధ్యనుంచీ... ఆ ముందు... బానల్లో సెగలై పొగలై బుడ బుడ బుడమని ఉడుకుతున్న నీళ్లలో హత్య చేయబడి... రాట్నాల రహదారుల్లో... తకిలీ నకిలీ నాట్యంలో...

వాగులై...

పోగులై...

నాగరికత దారులై...

దారాలై...

కండెలై... చుట్టలై... రంగురంగు రంగుల్లో... హంగుల్లో

డుబుక్కుడుబుక్కుమని... స్నాతమై... పునీతమై...

మగ్గాల... ఆ... మగ్గాల క్లచ్ క్లచ్ కచ్చేల్నుంచీ... ఫట్‌మని...

పట్టుబట్టై... భయపడి, నలిగి, ఒదిగి, చెదిరి... మళ్ళీ

చిక్కుల మక్కువై చేరి చేరి...

బయల్పడిన భావనావస్త్రాలు...

కప్పుకునో...?!

విప్పుకునో...?!

ఏమై? చెప్పు... ఏమై?చెప్పూ!

చలి పొద్దుల... నులికాంతుల... నీలి కొండల... తోటల్లో పదైదడుగులునిల్చిన 'సిరియస్ పెరూవియానస్' లాగా ముళ్ళ ప్రశ్న నా ఎదురుగా నిలుస్తే... నిలిస్తే... నిన్ను కొలిస్తే... కొలత మానేసి... నిజం నిన్ను దేవతంజేసికొలిస్తే... కొలతిస్తా... కొలిస్తే... కమర్ జరా కమ్ కరో బాషా! దోయించ్... పేట్ కమ్ హోగయ్ నహీ?! హీ...హి...హ్హి...హీ...

వద్దు... దయచేసి నా దారికడ్డు రావద్దూ... వద్దన్నానా వినడే వీడు.

దొంగవెధవ... ఏగలేనమ్మా... తలారా నీళ్లు పోసుకు చద్దెన్నం తింటానంటాడేమే... అప్పుడే చూడు ముక్కు కార్తోంది, నాపూర్వ జన్మ శత్రువు నాకడుపు చీల్చుకొచ్చినాడే... దొంగభడవా... నిన్నూ... మ్...ప్చ్... మానాయనే... నా దేవుడా... ఎట్లాగమ్మా... ఈ ముండావాణితో... నా కన్నప్పా... మనస్సంతా ఎప్పుడో తడిసిపోయిన అశ్రుతప్త నయన...

పారిపో...! ఆదాచేసెయ్యి జీవితం... ఇంకో రెండుముక్కలే...

జీపొస్తోంది...

అపరాహ్ణం అమవస నిశి...

చిమ్మని...క్రీక్చీకటి.

క్రీచ్... క్రీచ్... క్రి...క్రీచ్...చ్చ్...

ఝీరుకలు

బుద్ధదేవ్ దాస్గుప్తా సరోద్...

ఇంజనీరంట... తీగలు టంగ్టంగ్ మని మీటే ఇంజనీర్...

మిస్ర్ పీలూ...

ముఖోపాధ్యాయుని తక తరికిటల్తో...

జానకి నీ క్లోజ్... గ్లూకోజ్... చైనీస్ రోజ్... బటన్... గ్లటన్... మటన్... టన్... ఠన్...

"జానకి నీక్లోజంటనే...?" తొడ మీద గిచ్చుతున్నాడు వాయ్గాడు...

శ్రాద్ధ పిండాల బలి భోంచేసే వాయసగాడు, బలిభుక్... వైకుంఠం,

మళ్లీ ఈ లోకంలోకి...

చీకటి లోకంలోకి...

* * *

జానకి ప్రసక్తి రాంగానే లేచి నిల్చున్నా; నాకు తెలుసు పర్యవసానం ఎట్లా ఉంటుందో...

"సారీ సర్... నాక్కొంచెం పనుంది... వస్తా... వస్తా... వైకుంఠం" మరు ప్రశ్నకు చోటివ్వకుండా... ఆ చీకట్లోంచే రోడ్డు మీద మనుషుల మధ్య... ఆదివారసగభాగాన... జేబులో ఇంకా నూటేభై చిల్లర సౌగంధానిది... భరిస్తూ... హసిస్తూ... బూజుదులుపుకున్నట్టు... రోడ్డు మీదున్నా...

ఏ నాగరికత తయార్చేసిన మనుషులు వీళ్లు?

మాయామానుషరూప నిశాచరులు... కోరల్లేవు...

కొమ్ముల్లేవంతే... రాక్షసులు...

నా కాళ్లు తిన్నగా జానకింటికి చేర్చాయి నన్ను...

మూడు పెగ్గుల మందు నిర్లక్ష్యంగా మార్చేసిన నన్ను...

తలుపు గొళ్లాన్ని టకటక లాడించా...

కష్టమరుంటే? ఈ మిట్ట మధ్యాహ్నప్పేళ ఆ కార్యం? వేళాపాళా లేకుండా సంవత్సర మంతా క్రీడించే మృగం మనిషొకటే... తలుపు తీసిన జానకిని చూసి విస్తుపోయా...

ఆరోజు 'ఈ ఉదయమో సంధ్యని మీకు తెల్సా' రోజు కంటే బలహీనంగా ఉంది.

మౌన ఆహ్వానాన్ని విసిరేసి ఇంటిచీకట్లో కెళ్ళింది... లోపలి కడుగుపెట్టి తలుపు గొళ్లాన్ని వేశా...

ఇ... ఇదేమిటిది..!? తలుపు గొళ్లెం ఎప్పుడూ వేయలేదే... ఈ వేళేమిటీ చిత్రం.!!

లోపల చీకటి గదిలో గుడ్డి వెలుతుర్లో పెద్ద చెక్క పెట్టెని సర్దుకుంటోంది...

"రండి"

అడుగేయడంవేయడం పుస్తకమ్మీదేశా... చూశా... చేతిలోకి తీసుకున్నా...

నా కాలిదెబ్బ తిన్నవాడు 'కాఫ్కా..'

కా..ఫ్కా..?!! జాన...న...కి...కా..ఫ్కా!

"పుస్తకాల్నిండా వెండి చేపలు... దులిపి... ఏమిటీ ఎందుకలా... చూస్తున్నారూ...? "పుస్తకం...జానకీ...జానకీ పుస్తకం...

"ఓ కాఫ్కానా... అవునూ మీరు విపరీతంగా చదువుతారట మీకెప్పుడైనా అన్పించిందా... 'అసమర్థుడి జీవయాత్రా'..." 'దిట్రయల్'... ఎక్కడో ఏ మూలనో ఒక్కలాగే ఉన్నాయనీ...?'

పుస్తకాల్తోపాటు నా మస్తిష్కాన్ని కూడా దులుపుతోంది... జానకి... "జా...న...కీ!"

"ఏం సార్! మేంచదవకూడదా ఏం? మీరూ సానిదానికి పుస్తకాలెందుకూ? అదే ఓ పుస్తకమై విస్తరిస్తే చాలదా అని అంటారా?"

"స్టాపిట్... ఫార్స్టివెన్నెస్క్... ప్లీజ్ స్టాపిట్ డోన్టెవర్ కాల్‌మీ సర్... ఎస్... నెవర్ కాల్ మీ సర్."

చల్లటి చెయ్యి... మనసు మీదేసినట్టయ్యింది, పొద్దున్నుంచీ కాలిపోతున్న మనసు మీద...

"ఏం... ఈ రోజు ఉదయాన్నే తాగేశారేం? అవునూ వాసనొస్తోంది... ఊ..."

"అవును... ఉదయాన్నే రెండు కుక్కల్తో కల్సి రొచ్చుగుంట నీళ్లు తాగా."

"అన్నం తిన్లా...?"

"ప్లీజ్ ఊరుకో" మడిచి పెట్టుక్కూచున్న తొడల కింద రెండు చేతులూ గట్టిగా బిగించి...

ఏమో అవుతోంది... ఏమది?! ఏమిటది?!

"పోనీ కాఫీకాయనా... కాఫీతాగి కాస్సేపుండి అన్నం తిందురుగానీ." నన్ను తాకుతూ వెళ్లింది వంట గదిలోకి... ఏదో ఒక పురాతన పరిమళం నన్నావరించి... కాస్సేపటికి మళ్లీ వస్తానన్నట్టు ఎప్పుడో... ఏండ్లు... యుగాలు... ప్రళయాల క్రితం... ఇప్పుడే వస్తానని చెప్పి వెళ్లిన పరిమళం...

పెట్టెలోంచీ బైటికొచ్చిన మేధావులంతా... అంతా...

ఫ్రాయిడ్, యంగ్, బాక్, ర్యాండారుద్రులు... షూట్...

గోపీచల శ్రీనాథ పోతనామాత్యుల శ్రీరంగ బైరాగులు...

అమృతాలు కురిపించేటాయన

ఇంద్రజాల కవీంద్రుడెవరిదో రామాయణ పారాయణ... జీవ పరిణామం వాదించుకుంటూ... ఎవరు వీళ్లంతా...? ఈ పెట్టెలోంచీ నా చుట్టూ పరచుకుని...

బళ్లోంచీ బయటి కొచ్చిన పిల్లలల్లే కన్పిస్తున్నారు.

ఈమె... జానకి... టూ హండ్రెడ్రు పీస్ ఫర్వన్స్ జస్ట్ దట్... ఆ... మేధోబాలల్ని తప్పించుకుంటూ వంట గదిలోకెళ్ళా; స్టౌ వెలిగించడానికిబ్బంది పడ్తోంది.

"లే"

చటుక్కున తలతిప్పి... విశాలమైన కన్నుల్నింకా వికసింపచేసి... నాకేసి ఆశ్చర్యంగా ఏం ఆధార్టీ? అని...

"నువ్వు కూచో అట్లా... నే కాస్తా కాఫీ ఇద్దరం తాగుదాం". అల్యూమినియం గిన్నెలో నీళ్లు... స్టౌ... డబ్ బ్ మంటోంది నా గండెలాగా...!

అన్నీతెలిసినట్టు ఆ వంట గది నా కంతా పరిచితమైనట్టు కాఫీ పొడి... చక్కెర... గ్లాసులూ... అవునన్నీ నాకుతెలుసు! ఎలా?

'దెజావూ?' ఏమో! గోడ దగ్గర మోకాళ్లు దగ్గరికి లాక్కొని చేతుల్తో వాటిని బిగించి... మోకాళ్ల మీద తలానించి నన్నే చూస్తోంది కాఫీ రెండు స్టీల్ గ్లాసుల్లోకి నింపి లేవకుండానే మోకాలు మీద ముందుకు జరిగి ఓ గ్లాసిచ్చా జానక్కి... అందుకోకుండా అట్లాగే చూస్తో...

అంది

"మీరు చాలా అందంగా ఉన్నారే"

"ఓ... షటప్"

"నిజ్జెం"

ఏమైంది జానక్కి...? జానక్కా...? నాకా?... ఏమో ఇంతకీ ఏమో అవుతోంది.

"రాత్రి భగవాన్లొచ్చిపోయినాడు" ఆరిపోయి సన్నగాపొగ చిమ్ముతున్న స్టౌని చూస్తూ అన్నా.

"అనుకున్నా లేపోతే మీరు మజ్జాన్నం రావడమేమిటి అందునా ఆదివారం... ఇంతకీ ఏమిటట రగడ?"

చెప్పాలా...? అవసరం లేదేమో... అందునా భగవాన్లూ జానకి ఇద్దరికీ ఎట్లాంటి సంబంధం?...'జానకి దగ్గరికి పో' అని వాడు పోయినాడు ఎందుకు... మనుషులు మనుషుల కర్థం కారు? నాకు నేను అర్థం కావడం లేదు... ఇక ఇతరులూ...?

ప్చ్...?

"ఏమిటీ అంత బాహాటంగా ఆలోచించేస్తున్నారు?"

"నథింగ్"

"సంథింగ్ కాల్డ్ నథింగ్" చదివారా?"

"అవునూ... జానకీ...! ఇన్ని... ఇలాంటి పుస్తకాల్నీ దగ్గిర? ఎస్... వాటెపూలయామ్... ఐషుడ్వావ్ నోన్... భగవాన్లు... ఎస్ భగవాన్లు... నువ్వా... అందుకే ఐ కెన్మేకిట్ నౌ."

ఆమె మౌనంగా... కాఫీ గ్లాసు కింద పెట్టి అలనాసక్తంగా చూట్టమ్మొదలు పెట్టింది.

"భగవా..."

"ఆపండి... ఆ గదిలోకెళ్దాం" నీరసంగా... ఇంతకు కొన్ని క్షణాల ముందున్న హుషారంతా ఎక్కడా? స్టౌలోంచీ తెల్లటి పొగ చిన్నగా పాయలాగా పైకి ప్రవహిస్తోంది... హఠాత్తుగా సాన్నిహిత్యం స్థానే ఓ ఇనుప తెర పడ్డట్టు... ఒక్కో క్షణమో పేజీయై... ఈ బతుకు పుస్తకం... ఎక్కడో నిజం తెల్సేది... చివరికైనా తెలుస్తుందా? ఆ దారుమంజూష ముందు మోకాళ్ల మీదకూచున్నామె, ముడుచుకున్న ఒదిగున్న కాకలాలైన మేధావుల్ని, మెత్తగా జాగ్రత్తగా ఒకరొక్కర్నీ దాచేస్తోంది... తన్ను తాను కూడా...

"వెళ్తా" వినీ వినపడక... హఠాత్తుగా అలవాటైన ఏకాంతం మళ్లీ చుట్టేస్తే మనస్సంతా చేదుగా అయ్యి... గొళ్లెం తియ్యాలని తడబడ్తూ... ఆ మసక చీకటిలో తలుపు దగ్గర... మళ్లీ... ఆ... అదిగో అదే పురాతన పరిమళం చల్లటి ఇనుప గొళ్లెం మీద నాచేయి... ఆ చేయి మీద జానకీ చల్లదనం...

"ఎందుకనీ?" లోహయవనిక చిన్నగా కదుల్తోంది కదూ... అనుకుని "మిమ్మల్నే! ఎందుకనీ...అలా? రావడం పోవడం అంతా మీ ఇష్టమే?" "కాదు... ఎందుకో నీకిబ్బందిగా ఉందనిపించింది అందుకే అందుకని..."

"ఎక్కడికీ?"

చిన్నగా... చిన చిన్నగా పెద్ద పెద్దగా గాట్టిగా నవ్వా... చొక్కా చెయ్యి పట్టుకుని వెనక్కి విసురుగా లాగింది. చొక్కాలోంచి దూసుకొచ్చి ఆమె వేళ్లు చురుగ్గా నా జబ్బకి గుచ్చుకున్నాయి... చిత్రంగా, తమాషాగా వేలాడ్తోంది చినిగిన చొక్కా చేయి... ఒక్కసారి దూకే జలపాతమై...

రివ్వునలేచే గువ్వల మూకై

కళ్లలోంచి నీళ్లు కార్తున్నా అలా... అలా నవ్వుతూనే ఉంది.

"హమ్మా!" తెల్లగా పాలిపోయిన ఆమె పల్చటి చెక్కిళ్లలోకి ఎక్కడో ఇంకా కొద్దిగా మిగిలిన రక్తం...

"నాకు తెల్సు మీరెక్కడికి పోతారో... అయినా ఇదేం మనిషి మీరూ చిన్న పిల్లాడిలా అలిగి అలావెళ్లిపోడమే...? ఎంతుందేం జేబిలో అంతధయిర్యంగా వెళ్లుతున్నారు...ఊ?" మొహమంతా కళ్లై జా...న...కి...

పావురాళ్లు.

తెల్లని నెమిళ్లు.

కువకువ... చిన్ని మువ్వల గలగల...

పాలపుంతలు నా కన్నుల వాకిట్లో...

చినిగి వేలాడుతున్న నా చొక్కా చేతిని ఆప్యాయంగా నా కుడిచేయి...

"నూటేభైయ్యింది."

"అమ్మో! కష్టమే... ఇప్పటికే సుమారుగా వేసినట్టుంది గానీ ఏదీ... ఇట్లా ఇవ్వండా డబ్బు."

"నో... జానకీ ప్లీజ్... నేనెళ్లొస్తా... నిజంగా వెళ్ళి మళ్లీ వస్తా... ఐ కాంట్రెసిస్ట్... జస్ట్ వన్లార్జ్... దిస్... దిస్వెరీ సెకండ్ నీడ్స్ సెలిబ్రేషన్... ప్లీజ్..." నాకే వినపడక...

అరణ్యాక్షరాలు జ్వరించే స్వరాలు.

"సరే...సరే...సరే...సారూ! సారీ... అనను... ఇంకెప్పుడూ అలా పిలువను... అబ్బా... అలా చూడకండీ అలా నిల్చోండి" మేధావుల్ని దాచేసిన ఖజానా గదిలోకి... కాంత్యంతరాల్లోకెళ్లి పీయూషకలశాన్ని... చిన్నిముండ ఎంత ముద్దొస్తోందో... అరవిరిసిన హాససూనాలు పరిమళిస్తూ... తెచ్చింది జానకి...

"వూ... వెళ్లక్కర్లేదన్చెప్తే వినాలి."

గూట్లో తాళం... తాళంచెవుల గుత్తి తీసుకుని తలుపు తెరచి బైటికి తొంగి చూస్తూ... వెనక్కి తిరిగి పళ్ళూ చిగుళ్ళూ కన్పించేలా నిశ్శబ్దంగా నవ్వింది. కనకాంబరాలూ, మల్లెలూ కల్పి కట్టిన దండల్లే...

మళ్లీ హఠాత్తుగా నగ్నాలోచన.

ఎవర్నేను... ఎవరీమె... ఇక్కడేం చేస్తున్నా...

ఎక్కడో ఏదో ముడి విడివడి

ఏవో విలువల వలువలు జారి

ఓ భావం... నగ్నమై మనోజ్ఞమై

నులి... తొలి వెల్గుల్లో... కాకుల మూకై

కాకులు, లక్ష్మణ కాకులు... కాకుల్లక్ష్మణ్...

లక్ష్మణ్ అర్చుదు... రంగుల్విరుస్తాడు... కాకుల్కోసమే కాదు, కామన్ మ్యాన్ కోసం కూడా, శోభాడే కూడా అందదే.

ఏది కామన్... కహామన్... హోమన్... మన్మోహన చిర్నగవులగన్... టపటప టపామని... ఆ కూలిపోయిన కోట గోడ చుట్టూ... నలిగినచిన్నదార్లో రాళ్ళ బెచ్చులిసురు కుంటూ... దూకి... దూకి... కాలేజీలోంచొచ్చి... గన్నేరు కొమ్మల్ని విదిలించుకుని... సమాధుల

మధ్యకి జన్మించి...

అంతంలో మొదలయ్యి...

నా మొదలంతంలోనా? అయింత మాత్రం అంతంలో మొదలా?

ఎక్కడ? ఎదలో... మెదడుపొరల్లో... అరల్లో...

"ఏమిటీ...హల్లోసా..."

చిన్న చిన్నగా అన్ని మెట్లూ దిగి... ఆఇంట్లో జానకింట్లో కొన్ని క్షణాల్లో ఎన్ని యోజనాలు?

మంచమ్మీద కూచోబోయా...

"వద్దూ...!" నా చెయ్యి గట్టిగా పట్టుకొని, 'వద్దు... దాని మీద కూచోవద్దు... వద్దు... మీరు..."

ఎందుకనంతాయాసం?

"రండి వంట గదిలో కూచుందాం... ఇక ఈ రోజుకి మీరిక్కడే బందీ."

"ఎట్లా?"

"బైట తాళం వేసుంది సా..సారీ" కళ్లు చిత్రంగా మెరుస్తున్నాయి.

గాజు గ్లాసూ నీళ్లూ ఎదురుగా పెట్టి...

"అంతా తాగెయ్యొద్దూ... ఏం? ఎందుకనో ఈ రోజంతా... ఇట్లా మాట్లాడుతూ... రోజంతా మీతోనే... ఎందుకనో ఒంటరిగా అన్పించి"

ఒక్కక్షణం దగ్గరై... మరుక్షణం ఆకాశమై... మళ్లీ అంతరాళాలసన్నిహితత్వమై... మళ్లీ మళ్లీ నిజమై... మరీ దగ్గరై...

కంచంలో బియ్యం వేసుకుని నా ఎదురుగా కూచుంది...

గోడకి చేరగిలబడి... రెండు కాళ్ల మధ్యా రెండు చేతుల్తో గ్లాసు... మంత్రజలం నిండిన చిత్రాంకిత చషకం... పట్టుకుని...!

కాలకుడ్యం చిన్నగా పెరుగుతోంది... మౌనక్షణాలు పేర్చుకుంటూ, తల గోడ

కానించి... ఎక్కడో మనసు మూల పొరల్లో చెమ్మగిల్లుతోంటే... అలా ఎంతసేపో తెలీదు... ఎక్కడ్నుంచో సన్నటి రోదనాస్వనం... కళ్లు తెరిచి...

మోకాళ్ళ మధ్య తలదాచుకుని జానకి... భుజాలు సన్నగా ఎగిరెగిరి పడ్తున్నాయి...

"జా...జానకీ".

దగ్గరకెళ్లి మోచెయ్యి తట్టి మళ్లీ పిల్చా...

తలెత్తి చూసింది.

మందార నేత్రాల్తో...

"ఏ ఏమైంది... ఎందుకనిలా... జస్ట్ ఐ కాంట్బేర్దిస్, ప్లీజ్...

ఊ...?'

"సారీ... ఎందుకనో ఇన్సెక్యూర్ ఫీలింగ్ అందుకనేనేమో ఎక్కువగా మాట్లాడ్తున్నా నీరోజు భయంగా ఒంటరిగా" గప్పున ఉప్పొంగిన నీళ్లు మళ్లీ...  చేతి మీద భయంలేదన్నట్టుగా నెమ్మదిగా తట్టి పక్కనే కూచున్నా...

తల విదిలించుకుని...

"స్టౌ వెలిగించి అన్నానికి పెడ్తారా? మీరు చాలా బాగా వంట చేస్తారని విన్నా..."

మరుక్షణం మళ్లీ నిర్మలంగా నవ్వుతూ అంది.

"ఓచ్ ఒట్టన్నమే గదా... సరెసరు పెట్టేస్తా... ఏ? నువ్వెక్కడికీ?" ఇది నేనేనా? ఇదినా జీవితంలో ఓ రోజేనా?

స్టౌ వెలిగించి అన్నానికి పెట్టి మందు చిన్నగా చప్పరిస్తూ కూచున్నా, స్నానాల గదిలో నీళ్ల చప్పుడు... గాజు పగిలిన గడియారంలోకి చూసా... మూడు...

ఇదే రోజూ? రోజా రోజు కాదూ...?!

మైసూరు చందన పరిమళం గదంతా...

తలెత్తి చూస్తే తడి చుట్టుకి టవల్చుట్టుకుని చిన్ని నీలంపువ్వుల

తెల్ల చీరలో మల్లు జాకెట్తో...

మంచు కడిగిన నందివర్ధనం లాగా

"ఏమిటీ... వద్దన్నాను గదా... మళ్లీ ఇంకోటి వేసుకుంటున్నారు...ఆ?" వంచిన తలెత్తకుండా అట్లాగే బాటిల్ని గట్టిగా పట్టుకొని... భౌతిక సౌందర్యం నిజంగానే భయంకరంగా ఉంది... ఆమె వేపు ఆ సౌందర్యం వేపూ చూడాలన్పించీ... చూడాలంటే

భయమన్పించి తల ఇంకా కిందికి వంచుకుని... విస్కీ సీసా ఇంకా గట్టిగా పట్టుకుని...

పల్చటి శుష్కించిన తెల్లటి చెయ్యి నా గడ్డంలో వేళ్లు జొనిపి...

"ఏదీ ఇటుచూడండి... నిజమా? ఊ? నిజంగా నిజమా ఎందుకనలా మనస్పంపుకోవాలీ? ఇంతమందాకల్తీర్చిన శరీరమిది ఇంకొక్కరెక్కువా? ఊ...?"

"నో..."

బహుశా... తాళం వేసిన తలుపుల వెనుకాల్నించిలోకానికి నా గొంతుక స్పష్టంగా విన్పించుంటుంది.

"నాకే కోరికా లేదు... నువ్వు... నువ్వీరోజు... ఇప్పుడు... ఈ క్షణం మరీ అందంగా ఉన్నావంతే... అంతేకానీ..."

ఆవేశానికి అక్షరాలు దొరకవంతే.

నా గడ్డంలోంచి చెవిమీదుగా... తలవెంట్రుకల్లోకి అలా అలా కదలి...

"సారీ! మరిటుచూడండి... ఎందుకనలా... వద్దూ వద్దంటే... వినరే... వేసుకున్నది చాలూ..."

ఎక్కడో జ్ఞాపకాల పొరల్లో ఎవర్దో మెత్తటిస్వరం... "వద్దన్నానా... వినడే వీడు... దొంగవెధవ ఏగలేనమ్మా'

"అమ్మా!"

గ్లాసూ సీసా చేతుల్లోంచీ లాక్కొని...

"లెండి... లేచి మొహం శుభ్రంగా కడుక్కరండి అన్నం తిందాం..."

"ఆకలేస్తోంది... ఊ...లెండి"

జబ్బ పట్టుకులేవదీయబోయి... తలక్కట్టుకున్న టవల్ విడిపోయి... ఝుల్లున దూకిన నల్లటి జలపాతమల్లే... నను నిలువెల్లా తడిపేసిన వెంట్రుకల్ని... మళ్ళీ టవల్తో కలిపి కట్టుకుంటూ... చితికిన సంధ్యల్లే...

మొహం కడుక్కొచ్చేటప్పటికి

కంచంలో వేడన్నం మధ్యలో ఎఱ్ఱటి అవకాయతో...

"నెయ్యి కాచడం మరచిపోయా... అన్నం వేడిగా ఉందిగారండి..."

పొద్దున్న అహల్య పెట్టిన విచిత్రాన్నం... ఎక్కడుందో అవకాయన్నం ఎర్రటి ఆవకాయన్నం నెయ్యీ కల్పుకొని... నోట్లో పెట్టుకోపోతూ చూశా... కాళ్లు ముడుచుకుని... కుడిచెయ్యి కంచంలో ఎడం చెయ్యి మడిచి కుడిమోకాల్ని పట్టుకుని...

ముంజేతి మీద గడ్డమాన్చి మొహమంతా కళ్లై... కళ్లే మొహమై కంచంలోని కుడిచేతిని చాచి...

"నాక్కాస్తపెట్టరూ... ఎంతబాగా కలుపుతారు మీరు ఆవకాయన్నం..."

ఎక్కడి స్నేహాలివి?

జానక్కి నేనెవరు?

రాస్కాల్నికోవ్కి సోనియా ఎవరు?

ఇదో అద్భుత ప్రపంచం.

అంతా తెల్సుననుకుంటూ... ఏమీ తెలీనితనపు చీకట్లో బతకడం మాత్రం బాగా తెల్సు.

వెల్తుర్లనే చీకట్లో... తమోమయ మాయాకాంతుల్లో మరుక్షణం ఎటో, ఏమో తెలీని...

అజ్ఞానాంధకారం...

జ్ఞానుల ఖజానా గదిలో చిమ చిమలాడే విచిత్ర శీతల వాతావరణంలో... ఆగదికి గవాక్షాల్లేవు... చిన్న విద్యుత్పిండం వ్రేల్లాడుతూ... స్నానానికి ముందు జానకి వంటి మీదున్న చీర దండెమ్మీదుగా కొండ చిలువల్లే...

"ఊఁ"

చిన్న వెండికూజా... లవంగాలు ఏలకులు జాజికాయ జాపత్రి పరిమళం... నా మొహం ముందుకు చాచి...

"తీస్కోండీ"

మూలనున్న చాప తీసి పరచి... దాని మీద... ఓ రౌజాయ్ మఖమల్ రౌజాయ్... పరచి... మెత్తటి దిండు... ఓ ఉతికిన తెల్ల చీర తెచ్చి దాని మీదపరచి...

'ఊఁ... ఇప్పుడుకూచోండి"

'జా...నకీ!"

ఆమె చివ్వున తలెత్తి తీక్షణంగా చూస్తూ.

"ఎందు...కు? ఎందుకిలా నన్నలాగే పిలుస్తారు? అంటే; నేనేమో... ఏమిటో మరచిపోతానని ప్రతిక్షణమూ గుర్తుచైదానికా...

"అలా... కాక ఇంకెలా పిలువను? నాకు తెలిసిన పేరదే... జా...నకి...

నువ్వేమిటో గుర్తు చైడానికి నేనేమో నాకు తెలియాలి కదా అయినా... ఇంకెలా పిలువనూ?"

"నిజెం?"

"అవునదే నిజం"

"అతనేం చెప్పలేదా... అంటే... నేను... నేను కాదనీ... అస్సలేమీ... నిజెంగా... తెలీదా?"

నాకు తెలీదన్న నిజం... నిజం కాదనీ... అబద్ధమనీ... అనాలనీ...

"స్వార్థపరుడు" కసిగా అంది.

"జా...న...ఏ...? ఏమనీ? ఎలా... పిలువను...?

"లంజా అని."

హోరెత్తి... ఘూర్ణిల్లే... సముద్రం... కనురెప్పల భూమ్యాకాశాలను చీల్చేసే మహోదగ్రప్రళయం...

ఓ నక్షత్రం పేలిపోయి... పాలపుంత నా సొంతం మింగేసిన నిశ్శబ్దపు భీకరత్వం... చీకటి సుడిగుండాలై...

ఇంకా తడారని ఆమె జుట్టు దిండంతా పర్చుకుని...

ఆ చీకటి చిక్కుల్లో ఎక్కడో ఓ తునకై కన్పిస్తున్న ముఖ శకలం...

ఎన్నియుగాలు స్రవించినా ఎండిపోదీ కన్నీళ్ల ఊట...

ఎంత వరదై పొంగినా... తడవదీబండ నాగరికత...

భగవాన్లు తనగురించంతా చెప్తుంటాడని... అన్నీ... అంతా తెల్సీ నేను తెలీనట్టు ప్రవర్తిస్తున్నానని.

అవునూ... భగవాన్లైనా యెందుకో యెప్పుడూ దాటేస్తాడు.

ఈ రోజు ఆ పుస్తకాల్చూసిం తర్వాత అప్పుడే అన్పించింది మామూలు మనిషి కాదు జానకని...

అయినా సరే... భగవాన్లని స్వార్థపరుడందేం? యెవరు కాదు? నేను కానా? తాను కాదా? అందరంయెంతో కొంత స్వార్థపరులమే... అయినా యేదో తెలీని భగవాన్ల చీకటి కోణం...

యిన్నేళ్లుగా తిరుగుతూ కలిసి మెలిసి... నిజమే నేనేమిటో భగవాన్లకి పూర్తిగా తెల్సా?! తెలీదు...

అంతే యిదో ఆట...

దోబూచీ... దొంగాట...

మనస్సంచీలో రకరకాల ముఖాలు దాచుకుని... కావల్సినప్పుడో కావల్సిన ముఖాన్నీ తగుల్చుకుని మనసలు ముఖమేదో మనమే మరిచి...

ఉచ్ఛ్వాసలూ నిశ్వాసలూ... క్రమబద్ధమై...

జా... ఉహూ...

యెవరో యీమె...

జానకని నేనిప్పటి వరకూ అనుకునే జానకి కాని ఈ ఆడతనం...

గాఢ సుషుప్తిలోకి వెళ్ళిపోయింది...

ఏడ్చి ఏడ్చి... అలసి... నిస్సత్తువతో

చుట్టూ కలియజూస్తున్నా... బడెగ్గొట్టిన పిల్లాడిలా బడిగోడ పక్కనుంచి నిక్కి నిక్కి చూస్తూ... కాఫ్కా...

నేతన్నుకున్న కాఫ్కా... పెట్టెపక్కన తొంగి చూస్తూ ముందుకు వంగి అందుకున్నా... గుడ్డి వెలుగైనా కనిపిస్తోంది.

పసుపురంగు రెక్సిన్ బౌండ్... పుస్తకం... బంగారపు రంగు ముగ్గుల డిజైన్లతో... ముఖాన్ని తొలగించా... ఏటవాలు అక్షరాలతో అందంగా... ఆర్... గౌరీమనోహరి, బి.యస్.సి. ఫైనల్... అనుంది.

గౌరీ మనోహరి?

ఎక్కడ? ఎక్కడి? గౌరీమనోహరి?

చతుష్ఫృతి ఋషభ సాధారణ గాంధార శుద్ధ మధ్యమ పంచమ చతుష్ఫృతి ధైవత కాకలీ నిషాదాలు రవళించే... మేళకర్త... ఇరవై మూడు... ఖరహర ప్రియకావల... ఇదియే రాగమో? నా ముందు చిక్కగా పరచుకున్న విస్తరించిన వెంట్రుకలతో తెల్లటి బట్టల్లో ఘనీభవించి... స్తబ్దంగా ఉన్నదే రాగమో?

గౌ... గౌరీ మనోహరీ...

స్వరజ్వాలాముఖీ విస్ఫోటంలో జ్వరించిన ద్రవశిలా గానలహరీ...

సిగరెట్ వెలిగించుకుని...

పొగల్పీల్చి పొగలొదిలి పొగల్లో

అలా అలా...

గుడ్డి తిరుమలగిర్రావు... పదేళ్ల కూతుర్నడిపిస్తూంటే... వయొలిన్ డబ్బాలో బిగించిన రాగాల్ని వేళ్ల చివర్ల మీటుకుంటూ...

మాణిక్యాంబ... అబ్బులు గాడు... మామిడి తోట చివ్వర చెట్టు కిందో చెడిపోయినాటాడితే... గండు చీమలొళ్లంతా...

రఘుపతి రాఘవ రాజారాం భజన్చేసే నామాల్తాత పిల్చి మాణిక్యాన్ని మాత్రం వొళ్లో కూచోబెట్టుకుని ముద్దాడ్తోంటే... చేతల సైతానులు వయసుతో యేంపోవు... దౌష్ట్యం... అంతే... ఆస్పత్రిలో చేరిన మాణిక్యాంబని మళ్ళీ యేమైందే మణీ, అంటే... దెయ్యం చూపు... పుస్తకాల్మధ్యన్నెమిలీకల్ఫీకి... రోజుకెంత... ఇంత... ఇంతంటే ఇంతని సీతాపతీ, రగ్గాడు, లక్షింబాయి... ద్రాక్షతోట బావి దగ్గర... సుబ్రావన్న ఎస్తేర్రాణీ... గుళ్లో... పెళ్లికి... మంగలి తిమ్మిగాడు తాళం కొడ్తూంటే... 'యువస్టాఫ్బీనెమ్యాస్నైనౌ'... రంగారాజుల్గాడత్త కూతురైదరబాదీ... ఎఱ్ఱరంగు డబ్బాల్తో యెదిరించిన గోడలపై మొఖాలకి బట్టల్కట్టుకు బ్రష్షుల్తో దాడి... పిరికి దాడులు... యే వాదాలో... యే జీవనాడులు మీటిన నాదాలో... ఇది... ఇదే రాగమో... ఔనిదే రాగమో?

గౌ...రీ...మ...నో...హ...రి...

కళ్ళరెప్పలకి

నిద్రాభారం వ్రేలాడుతూ...తూ...తూ...అలా...అలా... వరిగి... ఆమె పక్కనే...

☼ ☼ ☼

ఎక్కడో... లీలగా ముబారక్బేగంమత్తుగొంతుతో 'కభీ తన్హాయి యో మేయూ'... కళ్ళు చిన చిన్నగా చికిలిస్తూ తెర్చి... ఈ లైటేమిటి?... ఇది నాగది కాదే?... ఈ పొగలేమిటి కమ్మటి వాసనల్తో...? నాగదిలో కొచ్చే పొగ అహల్య పెట్టే ఫారం కంప పొయ్యిది... మరీ తియ్యని వాసనల ధూపాలేమిటి? నాతల కింద దిండు మైసూరు చందనప్వాసనేస్తోందే...మి... టీ...! పక్కకి వత్తిగిలి... తలపైకెత్తి చూపులింకా విస్తరించి...

జానకి పెట్టె కానుకుని రెండు చేతుల్తో స్టీల్ గ్లాసును చుట్టి నన్నే చూస్తోంది.

చేతిక్కట్టిన గాజు పగిలిన గడియారంలోకి చూశా... ఎనిమిదిన్నరైంది. లేవాలకున్నా లేవబుద్ధి కావడంలే... మళ్లీ దిండుమీద తలవాల్చేసి వెల్లకిలా పడుకున్నా...

లేచొచ్చి పక్కన కూచుంది. నన్ను తాకుతా...

"కాఫీ కలుపుకురానా? మొహంకడుక్కుంటారా?"

"ఊ"

"ఊ యేమిటి ఊ..." నా మీంచి చెయ్యి అటువేపు ఊతగా... నా మీదకొరిగి.

గుండె వేగం... చిన్నగా పెరుగుతోంది... నిశ్వాసలు వేడెక్కుతున్నాయి...

"యేం? కాఫీతేనావినపడ్డంలే..." ఇంకాస్త ముందుకు వరిగి... గుస గుసగా...

వదులుగా అల్లుకున్న లావు జడ నా గుండెల మీద చుట్లు చుట్లుగా లీలగా చెమట వాసన్తో కలిసి మైసూరు చందన సుగంధం...

ఎక్కడో... మారుమూల... నా అంతరాంతరాళాల్లో యెవ్వరూ ఎప్పుడూ... మీటని... ఏదో తీగను... చిన్నగా... చిన చిన్నగా మీటుతున్నట్టె

"మొహం కడుక్కుంటా" సగం శబ్దం మాత్రమే మిగిలిదంతా నిశ్శబ్ద...ం...

మొహం కడుక్కుందుకు బాత్రూంలోకెళ్లొచ్చేప్పటికి పొగల కాఫీ గ్లాసు చేతికిచ్చింది. మళ్లీ ఆ రొజాయ్ మీద కూచుని గోడకానుకుని గుక్క గుక్కా.. వేడి కాఫీ... మత్తులోంచి జాగ్రత్తలోకి

నెమ్మదిగా...

"నేనూ ఇప్పుడే లేచా..."

"......"

"ఔనూ... మీరేం... నా పక్కన పడుకున్నారూ...?"

"......"

"ఏ ఉద్దేశ్యంతో అని?"

"......"

"పాపం బుజ్జబ్బాయికి నిద్రొచ్చేసిం..."

"నే వెళ్తా" లేచి నిల్చున్నా...

ఆ కళ్లలో దీపాన్నెవరో ఉఫ్పన ఊపేపిసనట్టు నాకెవరిచ్చారీ అధికారం... అశాంతులు చల్లడం నా జన్మహక్కా?

కాళ్ల మధ్యకి తలొంచుకు నుండిపోయింది....

రేపు కిటికీలోంచి ముందుకు దారి లీలగా... అలవోకగా కనిపిస్తోంది.

ఔను... అది... నాదే... ఆ దారి... రేపటి గురించిన నిర్ణయం జరిగిపోయింది. మోకాళ్ల మీద ఆమె ముందు మోకరిల్లి...

రెండు చేతుల్తో ఆ మొహాన్నందుకుని నెమ్మదిగా పైకెత్తి...

"గౌ...రీ...మ...నో...హ...రీ...?"

వణుకుతున్న పెదవుల్తో... చిప్పిల్లుతున్న కన్నీళ్లతో ఔనన్నట్టు తల ఊపింది...

"కళ్లు తుడ్చుకుని నన్నీ జైల్నుంచీ బైటకి వదుల్తావా లేదా...వూ?" తడికళ్ళు విశాలంగా తెర్చి... మూసి... మళ్లీ తెరిచి

'ఊ'

"ఊ ఏమిటి ఊ?

ఫక్కున నవ్వింది"

రెల్లు పువ్వులు గాలికి అల్లల్లాడినట్టె

చిరిగిన చొక్కా చేతిని గాలికలా వదిలేసి రోడ్డు మీద నడుస్తూంటే... చాలా నిర్లక్ష్యంగా జల్సాగా ఉంది. రికామీగా రౌడీగా

లైటుస్తంభం క్రింద ఎవరో ముసల్ది ఎప్పుడూ చూళ్లేదే... అదేదో ప్రతి రాత్రీ ఈ రోడ్లోనే నడిచే వెధవ లాగా... సంపెంగలమ్ముతోంది... సంపెంగలు లేత ఆకుపచ్చ రంగులో మందపు రేకుల... సంపెంగలు... అయిదు రూపాయలిచ్చి కట్టించుకున్న చాంపేయాల్ని మోసుకుని... మళ్ళీ వెనక్కి...

తలుపుతీసి నన్ను చూసి కళ్ళింత ల్చేసి తను

"అవ్వ" నోటికి చెయ్యడ్డం పెట్టుకుంటే

ఆ పొట్లం రెండు చేతుల్లో పెట్టి రెండు చేతులూ చల్లగా వెచ్చగా మూసి...

"గుడ్ నైట్" అని నాదారుల్లోకి నేను.

* * *

దొడ్లో మడత మంచం వాల్చుకుని... మనస్సంతా... రంగురంగుల భావాలు జాతర చేస్తుంటే గజిబిజిగా... దుమ్మూధూళిగా... కేరితంలుగా... ఆటలై పాటలై... గుంపులు గుంపులై...

ఒక్కటీ సరిగ్గా నిలవదేం... అన్ని చత్రాల్లోనూ లీలగా ఇంకో బొమ్మ.

గౌ...రీ...మ...నో...హ...రి...

భగవాన్లు స్వార్థపరుడా...? ఎందుకు...? జాన... ఊహు...! గౌరి... వూహుబాలే... యెలా... మనోహరీ...? హరీ...! హ్హహ్హహా...మనో...? మనూ?...ఫ్చ్... ఏమో... భగవాన్లు గాడు తన గురించి చెప్పలేదనా...? నాకు తెలిసిన భగవాన్లు తన గురించి నా కెందుకు చెప్పలేదో ఊహించగల్ను... ఎవ్వరూ... లేని... ఎవ్వరికీ ఏమీ

కాని భగవాన్లుతోపాటు... ప్రపంచం పట్ల వాడికున్న కసి కూడా పెరుగుతూ వచ్చింది. వాడికీ, ప్రపంచానికీ మధ్యఎప్పుడూ ఏ గోడ ఉంటూనే ఉంది. తన మనిషిగా చెప్పుకునేందుకు... ఒక్క మనిషి కోసం... వాడన్వేషణల్లో స్నేహం దారుల్లో నేనూ... కామం దారుల్లో జాన... ఊహూ... గౌరీ మనోహరీ... దొరికాం... స్ఫోటకమ్మచ్చల్తో బాహ్యసౌందర్యం కూడా ప్రకృతి వాడినించీ దోచేస్తే... అనాధ... ఈ మహోదగ్ర కాలప్రవాహంలో ఏద్దొరికితే దాన్ని పట్టుకోవాలని చేతుల్చాచి... అసహాయుడై... భగవాన్లు... బగ్గిగాడు... జానకి... తనకు తనకు మాత్రమే ఏకాంతంలో స్వంతంగా తన గుండె లోపల్లోపలి సింహాసనమ్మీద కూచోబెట్టుకుని... నా మనస్తత్వం... బ్రహ్మచారి తనం తెల్సీ... ఎక్కడ ఏ క్షణాన... నా మనస్సామె వేపు మళ్లుతుందో అని.. ఉ న్న ఒక్క...యస్...నిజం... కాని ఈ రోజుజ్జరిగిందేమిటి? వాడేదైతే కాకూడదను కున్నాడో... అదే అయ్యింది... యస్. కాదంటే హిపోక్రసీ... నన్ను నేను మోసగించుకోలేను... అద్భుత సౌందర్యం... అఖండ మేధో సంపద... అపురూపమైన ఆడతనం... కాని...

ఓహ్...

నిన్న మిగిలిన రం ఉందిగా... సగం గ్లాసు వొంచుకు నలాగే...

ఎక్కడికి పోయుంటాడీగాడ్దె కొడుకు...?!

ఎందుకీ ప్రపంచం ఇట్లాంటి అసహాయుల్తోనే ఆడుకుంటుంది...?

నాకాక లేసినపుడమ్మల్లే అన్నం పెట్టే భగవాన్లు...

దాహమేస్తే సారాకని డబ్బిచ్చే భగవాన్లు...

మెదడెడారై జ్ఞాన వర్షం కోసం తహతహలాడ్తే... వెళితే... భాషా నదీ మూలానికి తీసుకెళ్లే... ఎక్క.. ఎక్కడీ భగవాన్లుగాడు...?

ఎక్కడి చిత్రమిది...

ఈ రోజుదయాన్నే అనుకున్నా...

ఆదివారం... దేనికిది ఆదో అని...

గౌరీమనోహరీ... ఏం మనస్సిది...? ఈ వయస్సులో అల్లరి... చేస్తోంది... బ్రహ్మకైన కల్లు రిమ్మతెగులు...

ఊ...ఊ...!

ఇది వట్టి ప్రత్యుత్పత్తి క్రియాసక్త జనిత భావనా వీచికనా? కాదే... అది కాత్యాయన్లాంటి వాళ్ల న్యూస్తే అప్పుడప్పుడు కల్గేది...

మరిదేంటమ్మా...ఆ...?

నిజమొప్పుకోరా దొంగనాయాలా... నీకిష్టమైన అమ్మాయితో అది... అంతేనా?

ఇష్టమైనమ్మాయితో అది

అదిష్టమైనమ్మాయితో అది

ఇష్టమైన దాంతో... అమ్మాయి...

ఇది... అదే...

అదే ఇది...

నీశ్రాద్ధం... అవునూ... అమ్మ శ్రాద్ధం శ్రావణ శుద్ధ షష్ఠి. 16న అంటే...?!

పరిగెత్తి... క్యాలెండర్ను...కాలాన్ని ప్రార్థిస్తూ... ఈ రోజింకా పంచమి... ఉంచు... రేప్పొద్దునకి... కొద్దిగా షష్ఠి ముష్టి వెయ్యి.

కాలానికి కనికరం లేదు...

నిరామయంగా పయనిస్తూనే ఉంటుంది.

ఈరోజే షష్ఠి...

ఎందుకప్పా! దేవుడూ! వద్దురా నాయనా... నీ కంట్లో నీళ్లొద్దురా

అ...అ...మ్మా...!

అమ్మా... అదికాదే... గౌరీమనోహరీ... నిజ్జంగానే అమ్మా... ఏంలేదు...

ఊరికేనే... ఎందుకే అట్లా చూస్తావు... ఆకళ్లు మూసుకోవే ముసలిముండా! నిజమే అమ్మా...మా...! నిజం మా...

నేన్నిజంగా మర్చిపోయినామా! ఇదో ఇక్కడ... ఇక్కడంటే ఇక్కడ నువ్వెప్పుడూ ఉంటావే... అట్లా చూడద్దే...మా! అమ్మా!

దబా దబా తలుప్పప్పుడు... వెళ్లి అలాగే తలుప్తీశా...

ఎదురుగా ఎంకట్రాముడూ... అహల్యా... వాళ్లంచూసి తర్వాతెల్సింది... నేను బైటికి మాట్లాడుతున్నానని... మాట్లాడ్డమేమిటి అరుస్తున్నాననీ... ఏడుస్తున్నాననీ... కళ్లు కూడా తుడ్చుకోలేదనీ... వాళ్ళని చూడగానే దుఃఖమింకా ఎక్కువైంది...

దానికి తోడు ఆల్కహాల్ ఇన్డ్యూస్డ్ డిప్రెషనొకటి

"ఎంకట్రాముడనా! అమ్మ... దినమన్నా... ఈపొద్దు నే...నేం...చెయ్యలే... నాగ్గుర్తులేదన్నా..."

అమ్మహల్య కండ్లొత్తుకుంటూ...

"పొన్లేనాయనా... అవిటి మాటేంటిగ్గానీ... దా... ఇంతన్నం తిందువుగానీ దా... ఏమిటికిరా అట్లా సూస్తుండావింకా... సిలికెయ్యి..." మోచెయ్యి దగ్గరోచెయ్యి... నడుం చుట్టూ ఇంకో చెయ్యివేసి అహల్యమ్మ... అమ్మహల్య...

వాళ్ళ ముగ్గురు పిల్లలు నిద్రాభంగంతో లేచి... కండ్లన్నీవిప్పార్చి... విస్మయంతో చూస్తుంటే ఎంకట్రామయ్య... స్టీలు కంచం కడుక్కొస్తే... అమ్మహల్యనబడే అహల్యమ్మ కంచంలోకన్నం వేసి ఏదో పచ్చడి వేసి... నూనె వేసి కసాబిసా కలిపికలిపి... చూస్తుండగానే...

"ఇంద పట్నాయనా... ఇద్దిను..." అని నా చేతికిస్తే...

"అయప్పతినే దాంట్లోండాడేమే ముండా" అనిఎంకట్రాముడంటే

ముద్ద ముద్దా... పిండం...

అమ్మ శ్రాద్ధం...

అమ్మ... చచ్చిపోలేదు...

లేదు...

అమ్మకు చావులేదు...

అహల్యై... గౌరీమనోహరై... ఆడతనమై ఈ ప్రపంచమంతా విస్తరించింది అమ్మ.

"మా!"

## పీయూషం

కళ్లు మిటకరిస్తూ అమ్మ ఫోటోముందు...

ఒకటిన్నరైంది... మధ్యరాత్రి...

నా తప్పెంత?...

ఈ ప్రపంచంలో ఉన్న వొప్పెంత...?

తలుపు చిలుకేసి... తాళమేసి... రోడ్డు మీద నేను నడుచుకుంటూ నడుచుకుంటూ... కాళ్లకి ఆ తెగిన రబ్బరు చెప్పుల్యూడా లేకుండా... నడ్చుకుంటూ... అలా...అలా... జానకింటిముందు

ఏ... ఇన్హిబిషన్ మాట్లాడదేమి? ఎందుకు?

దబ...దబ...దబా...దబ్ దబ్మని... చప్పుడ్చేస్తే తలుపు తెర్చిన తను...

"ఊ?... మీరా?... ఏమిటిదీ... అరే...! ఛీ... ఉండండి... అరే... అదేమిటిది...? మెల్లగా... ఊ... రండి..." లోపల్కి తీసుకువెళ్ళి...

"ఏమైంది మళ్లీ! ఇలా వచ్చేశారేం?... నేనప్పుడే చెప్పలా...వద్దూ...వెళ్లొద్దూ అని...ఊ?"

జ్ఞానుల ఖజానాలో... రొజాయి మీదనన్ను కూచోబెట్టి.

"తలుపుతాళం వేసొస్తానుండండి..." అని... వచ్చి నా పక్కనే నన్నానుకుని కూచుని...

"ఊ చెప్పండి... ఏమిటి? ఇంకా తాగారు కదూ?"

"గౌరీ!"

"ఊ"

"నా గౌరీ!"

"మీ గౌరీనే చెప్పండి"

"ఈ రోజూ"

"ఊ... ఈ రోజూ..."

"అమ్మ... తద్దినం... గౌరీమనోహరీ..."

కళ్లు మళ్లీ డిప్రెషన్తో వర్షిస్తున్నాయి.

నా రెండు చంకల కిందా రెండు చేతులూ వేసి... నన్ను లాక్కుని... వెచ్చని పెదవుల్తో నా తడి రెప్పలమీద వొత్తి వొత్తి...

"వద్దు... ఏం... చెప్పొద్దు... పడుకో... అస్సల్మాట్లాడొద్దు... నీ గౌరి చెప్తోంది కదా... యేం...?"

ఆ మృదువైన హస్తం... నా తల నిండా... మెడనిండా... వీపుపై... ఒళ్లంతా...

"గౌ...గౌ...రీ!"

"వద్దమ్మా! వద్దన్నానా... పడుకో..." మళ్లీ ఆ వెచ్చని పెదవులు నా బుగ్గల్ని తడుపుతుంటే...

"గౌరీ...రీ...నేచచ్చిపోతా... నువ్వెళ్ళిపోగ్గౌరీ!"

"నిన్నొదిలి నేనెక్కడికి రా కన్నా!" తీగల్లే నన్ను రాగమల్లే నన్ను అల్లుకుంటూ...

"గౌరీ!"

"ఊ...మ్...దా... ఇంకా... ఇంకా... లోపలికిరా... నీగౌరీ కాదూ ఇది... నా పిచ్చి... ఎందుకే... నువ్వే నన్నొదిలి పోవద్దు... యేం?"

యే మాయామయ అనుభూతుల్లోకి...

చినుకు చినుకు చినుకై రాలి...

చిట్లి...

చెదిరి...

తడిపి...

తేమై...

వాగై...

వరదై...

ఫెటిల్లని... ఓ పెద్ద అలగా...

"ఆ"...

నెమ నెమ్మదిగా... దింపే తెరచాపై

చుట్లు చుట్లుగా...

దిగి...

ఎన్ని మెట్లు?

ఒక్కటొక్కటీ...

మళ్ళీ ఆలయం మొదటి మెట్టుకి...

"గౌరీ!"

"ఊ"

"నా...గౌ..రీ...!"

"ఊ"

"గౌ...రీ...మ...నో...హ...రీ!"

## మధురం

చుర్రుమని ఎండ మొహాన్ని తాకుతుంటే అంటుకుపోయిన కన్రెప్పలు... పెదవులు... నాలుక నోటి నిండుగా ఉంది.

జ్ఞానేంద్రియాలన్నిటినీ కలుపుకునేందుకు నాతో నేను యుద్ధం చేసుకుని...

ఏమైంది? ప్రతి ఉదయం వేసుకునే ప్రశ్నే... ప్రతి తాగుబోతూ వేసుకునేదే... లీలగా సుగంధ్రావ్ వైకుంఠపర్వం నుంచీ జానకింటికి...

జానకేనా ఇంకా? గౌ...గౌరీ...మనో..హరి... మళ్లీ సంపెంగల్తర్వాత ఇంటికి... అవునహల్య ఎంకట్రాముడూ అన్నంపెట్టి... మళ్ళీ జానకింటికెళ్లానే... అద్భుత ఆనంద వనాల విహారం చేసానే... ఏవో అరణ్యాల్లో... ఏవో తుఫానుల్లో చిక్కుబడిముక్కలు ముక్కలై... మళ్ళీ ఒక్కడినే నేనిక్కడ?

ఎలా?

పై నుంచీకిందికీ చూసుకున్నా, చొక్కాఎడం చెయ్యి చినుగుంది... అయితే మధ్యాహ్నం నిజం... వంటి మీద అదే ప్యాంటూ అదే చొక్కా...

కలనా...?

అది వట్టి కలేనా?

పక్కింట్లోంచి అహల్య మధ్య కూతురు చింపిరి జుట్టుతో నిక్కి నిక్కి చూస్తోంది... అంటే అహల్యన్నం నిజం...

లేచి లోపలికొచ్చా... తెగిన నీలం రంగురబ్బరు చెప్పు పిన్నుతో సహా అలాగే ఉంది...

కాదు... కాదది కలకాదు...

గౌ...గౌరీ... పరిమళం.

'బహుమనుతే ననుతే తను సంగత'

నేను కన్నది కలే అయితే కలల్లోనే బ్రతకాలనిపించేంతటి మెత్తటి అనుభూతి.

కాదు... కానే కాదది కల.

నిజ భ్రాంత ప్రపంచం స్వప్నమై.

నా స్వప్నానుభూత ప్రపంచం నిజమై.

స్టౌ మీద గిన్నె పారేసి నీళ్లు వేడిచేసుకుని... ఇన్స్టెంట్ కాఫీ చిక్కగా కలిపి... నల్లటి కాఫీ... గ్లాసులో పోసుకు గోడకు చేరగిలబడి...

రాత్రి నిజమైతే మళ్ళీ నేనిక్కడికెలా వచ్చాను.

బ్లాకౌటేమో!

జేబు తడుంకున్నా.

జేబులో డబ్బుంది... సుగంధ్రావ్వి... మిగిలిం డబ్బులు... ఈ మధ్య యెప్పుడూ కాలేదిలా...

ఒత్తిపట్టిన స్ప్రింగ్‌లా ఉంది శారీరిక మానసిక స్థితి....

నిన్నటి మధ్యాన్న క్షణాల్లో ఆస్ప్రింగ్ మీదున్న ఒత్తిడి ఒక్కసారిగా ఎగిరిపోయి...

ఓ ఇల్యూషన్...

కాదు... కాదిది... కల...

తలుపప్పుడు... తెరిచ్చూస్తే అహల్య పెద్దబిడ్డ...

'మామా... నాయన్రమ్మంటున్నా...' పరిగెత్తిపోయింది. తలుపులాగే వదిలేసి కాఫీగ్లాసు చేత్తో పట్టుకునే వెళ్ళా...

ఏదో నోటీసు చేత్తో పట్టుకుని నా కోసం చూస్తున్నాడు....

"దా! ఊ... కాప్తాగంతాండవా... ఇజ్జాడు మొన్న మున్సాబ్లీ నాకొడుకులిచ్చి పొయ్యినారంట... వీళ్ళమ్మగార్ల గంటంతా మేం తినేదే ముద్దుందో సూడు సూడన్నా"

ఎంక్రోచ్‌మెంట్ వార్నింగ్ నోటీసది... అదే చెప్పా...

'నేన్రోడ్లోకొచ్చినానా... లంజికొడుకులు నా నడిమింట్లో రోడ్డేసిపోయిరి కదన్నా... నేన్రోడ్లో కొచ్చేదేమిడ్డి? ఎవుడొచ్చేం పెరుక్కుంటాడో చూతాం. సంగటి గెలక్తాంది... వక ముద్దం పిత్తునానా?"

ఎక్కడి వాత్సల్యాలివి...?

ఇంకా డిప్రెషన్ ఆల్కహోల్ది... పోలే... కళ్ళుమసకబారుతున్నాయి....

"నువ్‌బోనా... సాం జెయ్యిఫో... ఆపీస్కి మళ్లా బోవాల్గద"

"ఎన్నాళ్లని ఎంకట్రాముడన్నా... నన్ను మేపుతావ్?... వద్దు...

నాలాంటోళ్ళ కోసం... మీమంచితనాన్ని ఖర్చు చేసుకోవద్దు..." కళ్లు రుద్దుకునే నెపంతో తుడ్చుకుని...

సుడిగాలై అహల్య...

నాకు తెల్సు... యిద్దరూ... మళ్లీ వాత్సల్యంతో నన్ను ఎడా పెడా... భరించలేదీ ప్రిదిలిన హృదయం...

లేచొచ్చేసా...

మామూలే... అహల్య పెద్దదొచ్చి అమ్మిచ్చిందని ఓ గిన్నె... గిన్నె నిండుగా

రాగిసంకటి... మధ్యలో గుంతగా చేసి దాన్నిండా పేరిన నెయ్యి కొరివి కారంముద్దా... అహల్యమ్మా...

తలారా స్నానం చేసి ...

చ(టం నిండా కళ్లేయై... అమ్మ చూస్తుంటే సిగ్గేసి...

సూట్‌కేస్ తెరిచి...

నాఫ్తాలీన్ వాసనల్పీలుస్తూ...

నల్లటి ప్యాంట్...

తెల్లటి చొక్కా...

మడతలు మడతలుగా...

తొడుక్కుని...

యేమైంది నాకు?... మదన బాణం తగిలిందా...

యే బాణం...?

అరవిందం? అశోకం? చూతం? నవమల్లికా? నీలోత్పలమా?...

అన్నీ... అన్నీ కల్సి... కలగల్సి...

తెగిన, పిన్నుకుట్టిన నీలంరంగు రబ్బర్చెప్పు వేసుకోబుద్ధికాలే... చూశా!... గూట్లో బూట్లున్నాయి... రోడ్డు మీదున్న నేను... నేనేనా?

నాకే కాదు... చూస్తున్న ప్రతి కళ్లలో అదే ప్రశ్న...

నాకిప్పటికీ అనుమానమే... రాత్రి... ఆఅనుభూతి కలనేనా? అని... యేమో... వెనకల్నించీ... వెంకట్రామయ్యా అహల్యలు... ఒళ్లంతా కళ్లేయై చూస్తున్నట్లు నాక్తెల్సు...

సంగధ్రావ్... కూడా... నన్ను... నేనుకాదన్నట్టు... "సార్... నిన్న... మీరిచ్చిన... డబ్బుల్లో చిల్లరింకా మిగులుంది..." అని తీయబోతూంటే...

"ఛ... ఛ ఛా...యేమిటిది... వూరుకో... మళ్లీ చూస్కుందాం... అయినా యెందుకలా మధ్యాహ్నం సడన్‌గా వెళ్లిపోయావు?" సమాధానమాసించికాదు... సీట్లో కూచున్నానో లేదో... ప్రత్యక్షం...

"సార్! నా ఫైలు?"

"నిజంగా నువ్ యెదురుగా కూచుంటావా? యీరోజు సాయంత్రానికి పూర్తి చేస్తా... యేమంటావ్?"

"కానీండి సార్"

రెండు గంటల్వరకూ... వాడి ఫైలే... దాదాపు పూర్తైంది....

"ఏమన్నా... రేపే నువు పైసలు తీస్కోవచ్చు అయిపోయింది".

"థ్యాంక్యూసార్... యిప్పటీక్కి లెక్క పెట్కో మల్లొచ్చి... ఆయింతయిస్తా" అని తేనెటీగలాగా మాయమైనాడు.

చేతులో డబ్బు...

వుబ్బుగా... డబ్బు...

యెంతుండొచ్చు?... యెంచగూడదుగా?

అందరూ భోజనాల్పేరుల్తో... లేరు... కాత్యాయని మాత్రం... కుర్చీలో విలాసంగా కూచోని... నవలనబడే ఓ వింత సాహితీ ప్రక్రియను చదువుతోంది....

జానకింటి కెళ్దామా... యెందుకనో కలో... నిజమో... ఆ అనుభూతి సిగ్గు కలిగిస్తోంది... కళ్లు మూసుకు కుర్చీలో వెనక్కువాలి...

నిన్న నేడూ రేపుల గురించి...

రేపంటే అస్సల్తెలీన్నేను రేపటి గురించి ఆలోచనా?

నా వెనుక కిటికీ బైట నిలబడి జాన్సన్ మరింకెవ్వడో మాట్లాడుకుంటున్నారు.

"ఎల్లయ్య గాణి బిడ్డవుందంట కదా"...

"ఔ డిగ్రీ ఫస్టియరంట..."

"వాడే పిల్చుకొస్తాడంట కదా?"

తలవిదిలించుకుని... ఛీ... యేమో నిజమేనేమో... కూతుళ్ళతో వ్యభిచారం చేయించే తండ్రులెంతమంది లేరూ...

లెక్కల్లోకొచ్చే దేశంలో ఇరవై ఒక్క లక్షల మంది ఆడవాళ్లావృత్తిలో కుళ్లుతూ... మగ్గుతూ... ఢిల్లీ జీబీ రోడ్డైతే ఏం... బొంబాయి కలకత్తాలో ఎర్రకాంతుల వాంతులైతేనేం... పెద్దాపురం... రాజమహేంద్రాలు... ఎక్కడ్చూసినా... రోడ్డు పక్క... మురికికూపాల్లో... పాపాలు మోస్తూ... రోగాల్తో... గుర్తింపులేని బిడ్డలు... లంజెకొడుకుల్లా, కూతుళ్లుగా. బళ్లల్లోకెళ్లలేక వాళ్లు మళ్లీ బ్రోకర్లుగా... వేశ్యలుగా... కాత్యాయనిబైటికి నవ్వుతోంది... పుస్తకంలో జోకు చదివేమో...

కాత్యాయనీ అందరూ అన్నట్టు నువ్వదేనాఅనడిగితే చెప్పుతో కొట్టనైనా కొట్టగల్దు... లేచి బీరువా తాళాలేసి...

వచ్చేశా...

బజార్లో అందర్నీ తెల్సినా తెలీకపోయినా... ఒక్కొక్కర్నీ నిలబెట్టి అందర్తోటి ప్రేమగా మాట్లాడాలనిపిస్తోంది.... భగవాన్లుగాడెక్కడ్చచ్చుంటాడో...

యేమో అన్నాడు వెళ్తూ... "మళ్లీ వచ్చి మాట్లాడ్తా నీ... జా... ర..." యేమైయ్యుండొచ్చు... జా... అంటే జానకా... అంతే జా అంటే జానకే... యేంచేసినా లంకె కుదర్డంలేదే?...

అలవాటు తప్పి... కాళ్లు బూట్లల్లో వూపిరాడక వుక్కిరి బిక్కిరౌతున్నాయి.... సిగరెట్ బంకు దగ్గర ఆకులు కొంటూ... అచ్చుత రామయ్య... అమ్మశ్రాద్ధం పెట్టలేదని... మొహం చటుక్కున తిప్పుకుని... యెన్ని రోజులుంటుందో యీ గిల్ట్?

టాకీసు ముందు సందులో వురుకుల పరుగుల్తో నలుగురు... వాళ్లచేతుల్లో వుచ్చుల్తో... పాపం... చిన్నసైజు సూకరం... అది దిక్కులు దద్దరిల్లేట్టరుస్తోంటే మనుషులు పాశవికులై... పశువు అసహాయయై... అతి బాధాకరమైన పద్ధతిలో దాని వృషణాలు తొలగించేసి... బూతుజోకులేసుకుంటూ యెంత నిమ్మళంగా వున్నారీ మానవులు... దాని జన్మహక్కునీ ఆనందాన్నీ లాగేసే హక్కు యెవరిచ్చారీ మనుషుల్కి...? వీళ్ళకీ యిట్లే చేస్తే... వీళ్లంతా మస్తాన్లౌతారా యింత మంది మస్తాన్లౌతే అప్పుడెంతమంది జానకులు!

తలుపు తట్టబోతుంటే మస్తాన్ వద్దన్నట్టు వారించాడు అంటే...? మొహం మీద చెళ్లున చరిచినట్టై... కాళ్లల్లో శక్తిహరించుకుపోయి... యెందుకిలా జరుగుతోంది... నేనెవరికి ద్రోహం చేసాను... నేను ఆకలిగొన్న మనస్సుతో ఆప్యాయతల్నదుక్కుంటుంటే యెందుకింత దుర్మార్గంగా మనస్సు గిన్నెల్లోకి వుమ్మేస్తారు...

తలుపులు ధనాల్మని తెర్చుకుని ఓ భీకరాకారం గబ గబా వెళ్లిపోయింది నన్ను తోసుకుంటూ...

వెనక్కి తిరిగివెళ్ళబోతూంటే... మస్తాను చెయ్యి పట్టుకు లోపలికి పంపించాడు... ఆ మంచం మీద... బట్టలు... అస్తవ్యస్తంగా జుట్టు చెదిరి... అనుమానమొచ్చి...

''జానకీ... జా...జాన... గౌరీ!...గౌరీ మనోహరీ...'' జవాబులేదు కదలికల్లేవు.... భయమేసింది... బైటికి పరిగెత్తి...

"మస్తా...న్" గట్టిగా అరిచి వాడిని పిలిచి... లోపలికొచ్చి గ్లాసులో నీళ్లు తీచ్చి మొహం మీద చిలకరిస్తే... చిన్న కదుల్తో...

"అక్కా! అక్కా" మస్తాన్... "సుబ్బలచ్చమ్మ కోడిగుడ్లు తెమ్మంటే పోయినా

నక్కా... యీ లంజకొడుకింతలో లోపల్దూర్నాడు... నిజమక్కా నాకేం తెల్దు" ఒళ్లంతా చల్లగా అయ్యి... చెమటలు పట్టి... పల్స్‌చూసా... బాగానే... ఏమో... బాగో కాదో తెలీదు కొట్టుకుంటోంది...

"గౌరీ! లే...కొంచెం నీళ్లు తాగు..." లేపి భుజాని కానించుకుని గ్లాసు వడలిపోయిన పెదవుకందిస్తే... ఒక్కగుక్క నోటినిండా పీల్చుకుని...

"ఛూ" అని వుమ్మేసి నిశ్శబ్దంగా ఏడవసాగింది...

ఆమె చేతి మీద నెమ్మదిగా రాస్తూ నేను, అరికాళ్ళు రుద్దుతూ మస్తాన్...

పది నిముషాలకి మామూలు మనిషైంది.

అప్పుడు గమనించా... పైట జారితే అచ్ఛాదన లేని వక్షం... రవిక విప్పలేదు... పెరకబడుంది... పైట తీసి మళ్ళీ నిండుగాకప్పితే... తలపైకెత్తి నా కళ్లలోకి చూసి "ఇందుకేనా నేను బతుకుంది" అంది...

మస్తాన్ లేచి లోపలికి పోయి... వచ్చి... "అక్కా పొయ్యిమీన నీల్లు పెట్నా... బైటుంటా పిల్సు" అని తలుపు చేరవేసి...

"యేమండీ!"

"ఊ"

"యెప్పుడూ యెప్పుడూ నాతో యిట్లాగే వుంటారా... మధ్యాహ్నం తలుపప్పుడైతే మీరే అని పరిగెత్తిపోయి తలుపీస్తే... యీ పశువు... లేదుకాదు వద్దు ఫో అంటే కూడా... మీద మీద కొచ్చి ముట్టైనానని చెప్తేనన్నా వెళిపోతాడేమోనని ఆశతో ముట్టైనానంటే... అట్టైతే యింకా మజాగుంటుంది రా... నాకేం పర్వాలా... రెండు కాకపోతే ఐదొందల్తీస్కో అని డబ్బు లిసిరేసి...ఆ

పంది... ఆ పశువు... అంత బలాన్ని యెదిరించే శక్తేదీ..."

నేను భరించలేను... మృదువుగా ఆమె నోటి మీద చెయ్యివేసి...

"గౌరీ! వూరుకో... మనకు మంచిరోజులొస్తాయి... ప్లీజ్... మర్చిపో"

మెల్లగా ఆమెని లేపి నిలబెట్టినప్పుడు కొట్టిందిగుప్పున వాసన... మదపువాసన...

ఆ మృగమీమె వొంట్లో చిమ్మిన చీకటి ద్రవపు వాసన...

"బాస్టర్డ్"... పళ్లు పటపటా కొరుకుతూంటే...

ఆమె చెదిరిన జుట్టు కలిపి ముడి వేసుకుంటోంది....

మంచం కింద... మీద... చెదురు మదురుగా ఐదు వందల రూపాయల నోట్లు... తోకలెక్కడో వున్న పాముల పడగల్లాగా...

మస్తానొచ్చి వేణ్ణీళ్లూ... చన్నీళ్లూ తొలిపి స్నానాల గదిలోకి తన్ని తీసుకుపోయి... వచ్చి... గదంతా చిమ్మి... రూపాయల్నోట్లు దొత్తిగా చేసి దిండు కింద పెట్టి పోబోతుంటే...

"మస్తాన్... నాక్కొంచెం మందు తెచ్చి పెట్టు అనంటే" బాధగా తలూపి... ఈ ఖొజ్జా మస్తాన్, షండ మస్తాన్... ముండల, రండల... బ్రతుకుల పిండిన చీకటి చుక్కల చిక్కుల చిక్కని మరకల తుడిచే హిజ్డా మస్తాన్.

కనుచూపు మేరల్లో నాక్కనిపిస్తూన్న ఒకే ఒక మానవత్వపు రూపమై మస్తాన్.

బాధగా తలూపి... మళ్లీ వెనక్కొచ్చి వంట గదిలో కెళ్లి ఫ్లాస్క్ భుజానికి తగిలించుకుని... జానకి బైటి కొచ్చేప్పటి కొచ్చేశాడు...

ఓ పెద్ద గాజు గ్లాసు మూడొంతులు కాఫీ పోసి జానక్కిచ్చి నా మందు పొట్లాలు గోడవారగా ఉంచి...

జానకి దగ్గరికెళ్లి చెయ్యి పట్టుకుని...

"అక్కా... ఇంపగొల్సోస్టెచ్చుకోని కుక్క లెక్క ఇంగ తలుపాకన్నే పడింటానే... యాడికీపోను" అని భోరున ఏడుస్తూ బజార్లోకెళ్ళిపోయాడు...

జ్ఞానుల ఖజానాలో అదే ముఖమల్ రొజాయి మీద పక్క పక్కన ఒకర్నొకరు తాకుతూ కూచుని... ఆమె కాఫీ, నేను విస్కీ చప్పరిస్తూ... బరువైన వాతవరణాన్నెలా తేలిక చేయాలా అని ఆలోచిస్తూ...

శత సహస్ర... శిశిరాలు సభలు చేసిన
శిలారామంలో
ఆలాపన మరచిన అభిశప్త గాయకుడిలా
నేనూ...
తప్త తమో కోణ పాణీ స్థిత
లుప్తతంత్రీ వీణియయై
ఆమె...
మౌనాలై మేము...
గాయాల గానసభలు చేస్తున్నాం...

"కొండగాలి తిరిగింది... పాడరా...? మీరు చాలా బాగా పాడ్తారట కదా"

"ఇప్పుడు పాటేం పాట... ఊరుకో"

"ఊహూ ప్లీజ్ పాడండీ"

కొండగాలి తిరిగింది... మలయమారుతం... మెత్తటి కవిత వెచ్చటి సంగీతం... ఆరుద్ర పుస్తక మొచ్చుండాలది యెమెస్కో వాళ్లు బాపూ... సత్తిరాజు లక్ష్మీనారాయణ బొమ్మతో యస్ వచ్చింది... అప్పుడెప్పుడో చూశా...

"అబ్బ... పాడండీ"

"ఊరుకో గౌరీ!"

"మీరలా పిలుస్తే ఎంత బావుందో తెల్స?"

"ఎంతా?"

"ఇంత" నా చుట్టూ చేతులు వేసి నా నుదుటి మీద చల్లగా...

"గౌరీ!"

"ఊ"

"మనమెవరం?"

"మనమెవరైనా మనతో ఆడుకునే వాళ్లు ఎవరూ అన్నది ముఖ్యం... యహూదీ మెన్విన్ వయొలీన్ని ద్వారం చేతికిస్తే ఏమౌతుంది.. ద్వారం స్వర కల్పనలే వస్తాయి.. అంతే"

"గౌరీ!"

"ఓయ్"

"ఏమిటా ఎకసెక్కం"

"ఛీ ఊరికే తమాషాకి అంతే"

"నీకు నచ్చిన పుస్తకం పేరు చెప్పు"

"అట్లాస్ ష్రగ్డ్"

"ఎందుకనీ... ఫీమేల్ షావనిజం కాదూ...?

కాదు... నేనో డాగ్నీటాగర్ట్‌నై... కొత్త ప్రపంచపు పునాదులకి కొన్ని రాళ్లు వేయాలనీ... ఫ్చ్... ఏమిటో..."

"ఇంకో పుస్తకం...?"

"బాక్ ఇల్యూషన్స్"

“ఎందుకో”

“ఎందుకూ... ఎందుకంటే! నిజ్జెం చెప్పేదా? మట్టిలో ఈత కొట్టాలని... నీళ్ల మీద నడవాలనీ... మీకు అనిపించదూ?”

“ఇంకోటి?”

“ఏం? నేనేం చదివానో తెల్సుకుందామనా... అమ్మో!”

“కాదు... భవిష్యత్తు కోసం... రేపుకోసం... మన తమోపంకిల జీవితాల మరో రూపు కోసం... నిన్నింకా తెల్సుకోవడం కోసం”

దీనంగా ప్రేమగా... జాలిగా... నామోకాలి మీద తలాన్చి... మోకాల్ని ముద్దు పెట్టుకుంటూ... మళ్లీ నా కళ్లల్లోకి చూస్తూ తెల్లపావురాలు రేకులు విప్పినట్టు నవ్వి...

“థాంక్యూ... థాంక్యూ సోమచ్... నిజం... థాంక్యూ...”

“చెప్పు, ఇంకో పుస్తకం”

“ప్రొఫెట్”

“ఖలీల్ జిబ్రాన్?”

“ఊ”

“బొమ్మలు బాగా వేశాడుకదూ?”

“అద్భుతంగా”

“మరింకో పుస్తకం...?”

“నేన్చెప్పను... అన్నీ నేన్చెప్తే... మరి మీరేం...? వూరికే పంతుల్లాగా ప్రశ్నలేస్తారా, పాపం...! నేనిప్పుడు పంతులమ్మని... ప్రశ్నల్నావి... జవాబుల్మీవి...అంతే”

“ఒకే...మామ్”

“మీకు ముక్కు నచ్చిందా?”

“నికొలోయ్ గోగోల్ముక్కా? నీదా?”

“ఛీ నాదికాదు... యెప్పుడూ యేడ్చి చీమిడి కార్తుంది... గోగోల్దే...?”

“యేమో ఇప్పటివరకు సరైన ఇంటర్ప్రిటేషనివ్వలేకపోతున్నా”

“ఆహా గౌరీ మనోహరేమిటి?”

“ఈ గౌరియా... సరిగమ పదనిస గౌరా”

“నిజ్జంగా మీరెంత వరకూ నేర్చుకున్నారు సంగీతం...?”

"రెండు చేతులూ ఆమెముఖానికానించి..."ఇంతవరకు" గ్లాసెత్తి తృప్తిగా ఖాళీ చేశా...

"మీరెప్పట్నుంచిలా తాగుతున్నారూ?"

"యేం? మానిపిద్దామనా?"

"ఛీ... చేతిలో మందు గ్లాసూ... వేళ్ల మజ్జెన్సిగరెట్టూ లేకుంటే... మీరసలు మీరు కానే కారు..."

"ఏం అవి నా ట్రేడ్ మార్కులా?"

"పక్కా!"

క్షణాలు, శిలలక్షణాలు... కళ్ల ముందు రూపాంతరం చెందుతూ...తూ... జిల్లేడ్పిత్తనాల్లాగా... అలా అలా మా ముందు... మా కళ్లముందు... ఆశలు నింపుకున్న, రేపటి ఆశలు నింపుకున్న మా కళ్లముందు...

"నీకు నచ్చని పుస్తకం చెప్పు గౌరీ!"

"వూ పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా"

"యెందుకనీ?"

"యేమో... అందులో అంతా ఆక్యుజిషన్సే... యెందుకో గోపీచంద్ కన్పించడందులో"

"ఆ ఆక్యుజిషన్స్ అసమర్థుడికథలో కూడా చేశాడే గోపీచంద్?"

"వూ... ఆత్మవిశ్లేషన్తోపాటు చేసినందుకు వప్పుకోవచ్చు".

"నీకు పోతనిష్టమా గౌరీ"

"యిష్టమా...! పాణం...! సి.నా.రె.... మందార మకరందాలొచ్చినప్పుడు పది కాపీల్కొని నాక్తెల్సిన వాళ్లందర్కీ పంచా... భాగవతం కొని పంచాలంటే కాస్ట్లీ ఎఫేర్ కదా... చాలామంచి పన్జేశాడు సినారె... మీకన్పించలా?" చటుక్కునాపి... చిలిపిగా చూస్తూ...

"అవునూ? యేమిటీ, పెళ్ళిచూపుల్లో వేసినట్టు వేస్తున్నారు ప్రశ్నలూ...?

ఆ వుద్దేశమేమైనా ఉందా యేమిటి?

"అనుకో పోనీ"

"ఉత్తుత్తిగా అనుకోడం నాకు నచ్చదు బాబూ"

"నిజ్జంగానే అనుకో"

“ఒక వాక్యం చదవనా?”

“వూ”

“నా సుషుప్తిని నీ మనో ప్రాంగణాన పరిచా రంగు రంగుల రంగవల్లుల కలలల్లవూ?”

“నువ్వు రాసిందేనాగౌరీ!”

“.............”

“కలలు చిత్రించుకుని బతికే వయసుకాదు గౌరీమనోహరీ నాది, నలభై యొస్తున్నాయి... స్పష్టంగానే మాట్లాడుకుందాం...” గ్లాసులోకి విస్కీ నింపి... నీళ్ల కోసం చూస్తూంటే లేత నీలం ప్లాస్టిక్ జగ్‌తో నీళ్లు తెచ్చి... విస్కీ గ్లాసు చేతుల్లోకి తీసుకుని... “హౌడూయూ లైక్యువర్ డ్రింక్సర్?”

“స్టిఫ్”

“యింగే పారంగ్సార్... తన్నిపోదుమా...?”

“ఆ... ఆ... మది... మది... ”

“మీకు మలయాళం కూడా వచ్చా”

“నీకు మాత్రం తమిళమొచ్చని నాక్తెల్సా?”

“అమ్మో! మీతో చాల్జాగ్రత్తగుండాలి బాబోయ్...”

“మరేమనుకున్నావ్” కాలరెగరేశా...

“అవునూ... మీరేమిటీ ఆర్ట్‌సినిమాలో హీరోలాగా యీ రోజు చాలా జోరుగా వున్నారు... పైనించీ కిందికి అప్యాయంగా చూస్తూ... పొద్దుటి సిగ్గు భావంమళ్ళీ... “అమ్మో... దిష్టి తీసేయాల్సిందే యీ రోజు... మరీ... నిజం చెప్పనా చెవులో చెప్తా...”

అని నా మీదికి పూర్తిగా వొరిగి...

“ముద్దు కూడా వస్తున్నా..రూ..” గుసగుసమని... కువకువమని. “ఎక్కడా రాందే...”

“వస్తుందొస్తుంది... కళ్లు మూసుకుంటే వస్తుందట”

“వూ”

చిట్లిన వానచుక్కల్లో రంగులై దూరేసంధ్యలు...

“గౌరీ!”

“వూ”

"ఇప్పుడు చెప్పు... గౌరీ మనోహరేమిటి?"

"రాగం"

❊ ❊ ❊

ఏడున్నారా ప్రాంతంలో భగవాన్లు గాడి గదికెళ్లా వచ్చుంటాడేమోనని... తలుపు చేరేసింది... అమ్మయ్య వచ్చేశాడువెధవ... గాడ్దెకొడుకనుకొని... తలుపుతీసి లోపలికెళ్తే... భగవాన్లగాడి పరుప్మీద సౌభాగ్య దౌర్భాగ్యం... వెల్లికిలా... ఆ దౌర్భాగ్యం మీదక్లీనరు సామేలనబడే నవ్వ సామ్యూల్ వగరుస్తున్నాడు.

రక్కున బైటున్నా... సిగరెట్ వెలిగించుకున్నా, ఓ రెండు నిముషాలరవాత దౌర్భాగ్యం... నా ముందు నుంచే లంగాతో, నల్లగా మకిలి పట్టిన బ్రాని కిందికి లాక్కుంటూ వెళ్లిపోయింది... స్త్రీ సహజమైన సిగ్గునూ లాలిత్యాన్ని... యీ సమాజమెప్పుడో చిదిమేసింది... సౌభాగ్యంలో...

నల్ల సామేల్గాడు ఇంజనాయిల్మరకల లుంగీ సామేల్గాడు దొంగలాగా బైటకొచ్చాడు...

"తాళాలెక్కడివిరా నీకు?"

"అన్నిచ్చినాడ్సార్"

"యెప్పుడు...?"

"మొన్న రాత్రి స్టాండ్ కాడ బూవమ్మచాయ్ బంకు కాడ సార్"

అంటే అదేరాత్రి వాడ్నన్ను కల్సిన్రాత్రి.

"యేం చెప్పినాడ్రా?"

"యేం చెప్పల్యాసార్, వూకేనేతాలమిచ్చి రూం తానుండ్రా సామేలూ అన్జెప్పినాడ్సార్"

"నువ్ ఫో! తాళమేసి, చుంచుమీద పెట్టిపోతా"

మరుక్షణం మాయమైనాడు వాడు.

లోపలికెళ్లా... యెన్నో యేళ్లుగా వస్తున్నా యెందుకో ప్రతిసారీ కొత్తగానే వుంటుంది వీడి గది.

పరుప్మీద మానవరూపంలో ఓ భాగం కాబోయి తప్పిపోయిన జీవధాతువు తడి మరకలు... కాల్తో చుట్టిమూలకి తన్నా పరుపుని... కసిగా... పరుపు కింద అయిదారు బూతు పత్రికలు. యెందుకవి చదవడం. వూహించుకోవచ్చుగా... వుహూ...

యేదో వికృతం... యేదో కవరు... ఉబ్బుగా ఉంది. యథాలాపంగా లోపల్చుశా... ఫోటోలు... ఆసక్తితోబైటకు తీశా... సౌభాగ్యానివి. పూర్తి నగ్నంగా ఉన్నవి. రకరకాల భంగిమల్లో, ఫోటోల స్థలం యీ గదే... భగవాన్ల గది... వెనుక గూట్లో సర్వో డబ్బా కన్పిస్తోంది ఫోటోలో... ఫోటో స్టూడియో వరదరాజులోసారి భగవాన్ల గాడికి వెయ్యి రూపాయలీడం గుర్తొచ్చింది... యేదో 'పాతబాకీ' అని అడక్కుండానే సంజాయిషీ యిచ్చిన అప్పటి భగవాన్ల ముఖంలోకి యిప్పుడు చూస్తే... ఔను నిజాయితీ కన్పించడంలేదు. మనిషీ... నీ మనో వల్మీకంలో యెన్నెన్ని రహస్యపుదారుల గదులు...? ఫోటోలు కవర్లో పెట్టేశా... యెందుకో... వుండాలన్పించడం లేదు... అయినా... పుస్తకాల గూట్లోకి చూస్తూ నిలుచున్నా... సురవరం సమగ్రాంధ్ర చరిత్రలోంచియేదో కాగితప్పూల బొమ్మతొంగిచూస్తో... తీశా... అదీ ఫోటోనే... కానీ సూదిలాంటిదాంతో మొహమంతా కన్నాలు కన్నాలుగా గుచ్చుంది... తేరిపారి చూస్తే ఒక్కసారి గుండె ఝల్లుమని... జానకి... గౌరీ...గౌరీ...మనోహరి ఫోటో అది.

భ...గ...వా...న్లూ...

వాడిపెట్టెలోకి చూడాలని... యెట్లా? తాళాల కోసం చుట్టూ వెదికా... గది తాళానికి ఇంకో రెండు మూడు తాళాల్వేలాడుతున్నాయి. జేబులో వున్న విస్కీ తీసి... గూట్లో గ్లాస్ తీసి ఓ పెగ్గేసుకున్నా... సిగరెట్ వెలిగించి... ఆ తాళాల్తో పెట్టె తాళం... ప్రయత్నించ బోతుంటే... దౌర్భాగ్యం లోపలికి కొచ్చి...

"రెండు సిగరెట్లీ సార్" అని కావాలని వచ్చి దగ్గరగా దాదాపు ఆనుకుని "ఉంటావా?"

"పో పో...తల్లీ నేనే దొరికానా..." అని తులుపేసేసి పెట్టె తాళం తీశా... ముందు నా దృష్టి నాకర్షించాయి... పెట్టుడు గడ్డం, మీసాల సెట్టు... యెందుకివ్వాడికి?

నల్లటి బ్రా... చూచుకాల్దగ్గర గుండ్రంగా కత్తిరించి భయమేస్తోంది... నాలుగు మందపాటిబౌండు పుస్తకాలు అన్నీ పోర్నోగ్రఫీ అక్కడక్కడా ఖాళీల్దగ్గర బూతు మాటలు నాకు తెల్సుది భగవాన్ల రాతే...

యేమిటది... వీడో ఆస్కార్వైల్డా? యేమో? ఓ పోలిథిన్‌సంచీ నిండా వెంట్రుకలు... రబ్బరు బ్యాండ్ వేసుంది. తీటానికి పోలేదు... యేం వెంట్రుకలో యేమోనని... ఓ రక్తంలో తడిసిన అట్ట కట్టిన గుడ్డ... అదేమో వూహించడం కష్టం.

కాలేదు...

యేడెనిమిది కర్చీఫ్‌లు... చిన్నవి... ఆడవాళ్లవి... మడత పెట్టిన కాయితమోటి విప్పితే ఓ ప్రముఖ నాట్యతార... సినీ బూతుపత్రిక సెంటర్ స్ప్రెడ్...

బొమ్మనిండా జుగుప్సాకరంగా మరకలు మరకలు...

ఇంక తీయాలన్పించలేదు... మనస్సంతా చేదుగా... కొత్తగా... బాధగా... బరువుగా... అయిపోయింది... అన్నిటినీ ఒక్కొటొక్కటీ పెట్టెలోకి చేర్చి... భగవాన్ల చీకటి ముఖం మీద మూత వేసి తాళం వేశా.

గదుక్కూడా తాళమేసి పైనచూరు మీద తాళాలొదిలి మెల్లిగా బజార్లో నడుస్తూ...

జేబులో డబ్బులున్నాయి... బాగానే ఉన్నాయి...

చెప్పుల్కొందామా, లంచప్పెప్పులు... అయినా చెప్పుల్కొనాలనే ఆలోచనేమిటీ... గౌరీ మనోహరి... కాళ్లకున్న బూట్లు హ్హాహ్హాహ్హా అన్నవ్వుతున్నాయి... ఎనిమిదిన్నరైంది. కన్పడ్డ చెప్పులంగట్లో దూరా... పక్క నున్న బట్టలంగట్లోకి దూరా... అక్కడో చీర మూడొందల్పాతికపెట్టి... యింకో పంచెల్జత కొని బేకరీలో బిస్కెట్లూ కేకులూ కొని... యింటి దారి... యిన్ని చేస్తున్నా... భగవాన్ల పెట్టె భయంకరంగా వెంటాడ్తోంది....

వెళ్ళడం... తిన్నగా అహల్యింట్లోకి వెళ్లా... చిన్నదాన్ని... వీప్మీదెక్కించుకుని నాలుక్కాళ్ల మీదా గుఱ్ఱమై యెంకట్రాముడు...

“ఆ దానా...దా..దిగేముండా!” అని దాన్ని ముద్దుగా కసుర్కొని... అది దింపించినందుకు... నన్ను కొరకొరా చూస్తూ వాళ్లక్క దగ్గర్కిపోయింది.

“యెక్కడా... మా అన్నపూర్ణమ్మ” అనడిగితే

“సేయ్...” గుండెల్పగిలేట్లర్చి వెంకట్రాముడు బీడీ తీసి నల్చి... వూది నోట్లో కొరికినట్లు పట్టుకొని వెలిగించి... దవడలు గుంతలు పడేట్టు గట్టిగా పీల్చి... పొగ తృప్తిగా వదలి...

“వూ సెప్పన్నా కతలు...” అనంటుండగానే లోపల్నించహల్య... చెమట మొహంతో కుంకుమ చెదిరిచండీరాణీలాగా...

“యేమిటికీ అట్ల గొంతుచించుకునేది”... యింకాయేమో అనబోతూ... నన్నుచూసి ఆగిపోయి...

“యేం నాయనా అఫీసైపాయినా... కాస్తాగతావా?”

వేరే మాటలునేనూహిస్తే అది శుద్దంగా నా తప్పు... అంతే...

"యేం లేదమ్మా మీ యిద్దరిట్లా కూచోండి... అని ఆమెనూ కూచోబెట్టి ఆ చీరా, పంచెల్జతా చేతిలో పెట్తే...

"యేంటికినా..." "అయ్యో ఇదేమిద్దప్పా"

యెంకట్రాముడూఅహల్యమ్మా అశ్చర్యపోయేంతలో పెద్దదాన్ని పిల్చి ఆ బిస్కెట్లు కేకుల సంచీ యిచ్చినే నింట్లో వున్నా...

మనస్సంతా తీయ తీయగా చేదుగా... యెలాగో ఉంది. బూట్లు తన్ని, పిన్నుకుట్టిన్నీలంరంగు రబ్బర్చెప్పును చూసి హీనంగా నవ్వి... కొత్త చెప్పుల్డబ్బా అక్కడే వేసి... నా గతాలు నిండిన... నీళ్లతొట్టి... పాచిపట్టిన్నీళ్ళతొట్టిలో నీళ్లు చల్లటి నీళ్లు... దబ దబ దబామని హాయిగా... చల్లగా...

దొడ్లో మడత మంచమేసుకు మళ్ళీ

నేనే...

నే...నే..నా?

కళ్లు మూసుకుని... గుండె నిండా గాలి పీల్చుకుని... మనసు నిండా గౌరీ మనోహరిని ఆవాహన చేసుకుని... నాకై... నేనై... నాకు నేనే చల్లటి నీలికాంతుల గదిలో సాంబ్రాణి పొగల మసకల్లో నల్లటి చీరలో తెల్లటి గౌరీశరీరం... గౌర శారీరిణి గౌరీ... అడుగుపడీ పడక... ముందే మడుగులై పరచుకున్న నా వసంత భావాల దారిలో... చూపు చిట్లీ చిట్లక ముందే అటు ప్రత్యూషై ఇటు ప్రదోషమై... దోషమై...

దోషం... దోషం... గుసగుసలుగా... ఆ నల్లటి బ్రా కళ్లకి గంతల్కట్టుకు నెవ్వరది ఆ రంధ్రాల్లోంచి... ముగ్గురు... నల్గురు... సర్కస్ ఫీట్లు... కుస్తీ కసరత్తుల రతుల భంగిమ లెంగిళ్ల ముంగిళ్లు సౌభాగ్యమ్మీద సామేలు సవారీ... యెంకట్రాముడన్న గుర్రుమల్లే... గుర్రాలుస్సేను... హుస్సేన్సుర్రాలు... నగ్న పాదచారి గడ్డం హుస్సేన్సుర్రాలు... తెల్లటి చెయ్యెత్తినకృష్ణ గుర్రాలథాయథాహి ధర్మస్యగుర్రాలు... జట్కా బండి పీరుసాయిబు బక్క గుర్రం... ఛల్ ఛల్... వెనీసులో డవిన్చీ గురువుల గుర్రాల్బలే...గై... మడతెక్కిన పేపర్లో రంగుల యింకుల అచ్చై ఘనీభవించిన అపహాస్యపు లాస్య భంగిమలో కసితో చిమ్మిన మచ్చల మొహంతో కచ్చతో... మడతేసి...! మరకల్చేసి హసీనా హర్మహీనా రొచ్చు జోకుల్గడ్డకట్టిన గడ్డల నెత్తుట్లో అట్ట కట్టిన బట్ట దాక్కొన్న పెట్టెల్లో...

గడ్డమ్మీసాల్పెట్టుకుని మస్తాన్పరిగెత్తినట్టు... నా నీలం రంగు రబ్బర్చెప్పు, గౌరెత్తుకు పోతే... గౌరి... గౌరీ... గౌరీ...

గౌరీ మనోహరీ... మనోహరీ...

☼ ☼ ☼

మర్నట్రోజంతా మహోత్సవమే. ఉదయం తొమ్మిదిన్నర కంతా ఆఫీసులో వున్నా... సుగంధ్రావ్ని రికార్డ్రూమ్‌లోకి పిలిచి... ఆ ఫైలు రావల్సి న్లెక్క... మా మా వాటాలు అన్నీచెప్తే... "అవునయ్యా... ఆ జాన్సన్కెందుకు... యేమొద్దు... అది కూడా నువ్వే తీస్కో... నాకో అయిదు పారెయ్యిచాలు" భాగాలు నిర్ధారించుకుని... మళ్ళీ సీట్లలో మౌనంగా కూచుని... ఫైళ్లు చూస్తున్నట్టు నటన... మనసంతా వాటా పైనే చాత్రోజుల్కి పెద్దకేసు...

వాడు రావడం... కూల్‌డ్రింగ్‌లు, సిగరెట్లూ, లక్షా తొంభైవేల నగదు... వాడుతీసుకుని... మా భాగాలు మాకు బాహాటంగానే పంచి అయిపోయిన పెళ్లిల్లు చేశాడు. నా బోబిచాలా నిండుగా ఉంది... ఏడువేలాఏడొందలు నా వాటా... లేచి సుగంధం దగ్గరికెళ్లి... "సార్ ఈ రోజు ఆఫ్ తీసుకుంటా... పనుంది..." నసిగితే...

"ఆ ఆ నాక్తెల్సులే నీపనేమో..." అని వికారంగా నవ్వి దుర్గంధ్రావ్ నన్నొదిలేశాడు... ఆఫీసొదలి బైటికైతే వచ్చా... మజిలీతెల్సు మధ్యనేమో అంతా గజిబిజిగా వుంది... నిన్న రాత్రి మనసు పుస్తకాన్ని తెరవగానే తెల్లటి పేజీలో ముద్రితమైన నల్లచీర తెల్లగౌరి బొమ్మకళ్లముందు కదిలింది.

ఆ... పద అనుకుని నాల్గైదు బట్టలంగళ్లు తిరిగి నాకు నచ్చిన చిన్నంచు నల్లచీర కొని ఇంకొద్దిగా ముందుకెళ్లి షరాఫ్ బజార్లో వెండి పట్టీల్తీసుకుని... ఓహాఫ్ బాటిల్ పీటర్స్కాట్ కొని... అన్నీ కలిపి ఓ మార్కెట్ బ్యాగులోకి మార్చుకుని... ఆత్రంగా జానకాలయానికికెళ్తే... తాళమేసుంది. ఉస్సూరని నిట్టూర్చి తిరిగి వెళ్దామనుకునే లోపలే సందుమలుపులో రిక్షాలో...

"హో" మని హాయిగా నిట్టూర్చి...

ఆ యెండలోంచి లోపల్కొచ్చేప్పటికి కళ్లు బైర్లు కమ్మీ...

"యేమిటో ఉదయాన్నే వేంచేశారు?"

"పొమ్మంటే పోతా" కచ్చిగా అన్నా.

"రమ్మంటేనే వచ్చినట్టూ"

చీకటి కలవాటౌతున్నాయి కళ్లు...

మెల్లిగా దగ్గరికొచ్చి... చూపుడువేలూ బొటనవేలూతో నా గడ్డం వెంట్రుకలు కుచ్చుగా పట్టుకుని...

"అవునూ యీరోజైనాకాస్త నీట్‌గా ట్రిమ్ చేసుకురాకూడదూ"

"యిప్పుడెళ్ళి చేయించుకురానా?"

"లక్షణంగా... యెన్ని లేవీ దార్లో సెలూన్లూ"

"నిజంగానా"

"ఊ..."

"యెందుకూ?"

"ముద్దు పెడ్దామంటే ముక్కునుదురు తప్ప నాకింకేం కన్పించట్లే దందుకనీ" వెక్కిరింతగా...

"అయితే యిప్పుడే వెళ్తున్నా" నిజంగానే వచ్చేశా...

క్రాపింగ్ కూడా చేయించుకుని... హాయిగా చెవులకి గాలి తగుల్తోంటే... వచ్చి... తొంగిచూస్తే...

సంచీ లోంచీ ప్యాకెట్లన్నీ పక్కకుతీసి సర్దుకుంటోంది... "ఆ యిప్పుడూ వుండండి" అని ఓ ప్యాకెట్ చింపి ఓ కలంకారీ లుంగీ తీసిచ్చింది... "కట్టుకోండి"

"ఆ దండెమ్మీద టవలారేసుంది వెళ్లి స్నానం చేసి రండి..."

లుంగీ చేతుల్లో వుంచుకుని అట్లాగేచూస్తోంటే...

"వూ" వీప్మీద రెండు చేతులూ వేసి తోసుకుంటూ స్నానాల గదికి తీసుకొచ్చి లోపల్కి తోసి బైట గొళ్లెం వేసి వెళ్లిపోయింది.

స్నానం చేసి దబదబా తలుబ్బాత్తే... పకపకా నవ్వుతూ తలుప్తీసీ... నన్ను చూసి ఒక్కసారి నవ్వాపి... చూపులు మరల్చుకుని... వెళ్లి చేతికింకో పెద్ద ప్యాకెట్టిచ్చింది... విప్పి చూశా... అండర్‌వేర్, తెల్లటి పాలనురగ ల్లాంటి నా కిష్టమైన లాల్చీ పైజమా జత... తలెత్తి చూస్తే లేదు, లుంగీ లోంచి లాల్చీ పైజమాల్లోకి మారిన్నేను మూడ్రోజుల్లో ముప్పైయేళ్ల మార్పు పొందినట్టు... తనూ స్నానం చేసొచ్చినట్టుంది... వట్టి చీర మాత్రం తడి వంటికి చుట్టుకుని వంటగదిలోకి నడిచెళ్తోంది. తడి పాదముద్రల్ని మెత్తగా వేస్తూ...

చిన్నంచు నల్లచీర ప్యాకెట్ తీసుకుని వంట గది గుమ్మంలో నించుని...

"గౌ...గౌరీ!" సుతిమెత్తగా పిలిస్తే

"ఏయ్... అక్కడే అక్కడే రావద్దు... బట్టల్మార్చుకుంటున్నా" గట్టిగా అరచింది...

"వద్దూ... మార్చుకోవద్దూ... అయినా సరేనేనొచ్చేస్తున్నా... నీఇష్టం.." అని కళ్లు మూసుకు గదిలో తడబడుతూ ఒక్కో అడుగే వేస్తూ... "గౌరీ... దగ్గిర్రా... ఎక్కడా... ప్లీజ్... ఈ ప్యాకెట్... నీ కోసం... గౌ...? మెత్తగా, మత్తుగా, అసంకల్పితంగా కళ్లు తెర్చా... తెల్లటి లంగా గుండెల మీదుగా కట్టుకుని... నన్నానుకుని... కళ్లలో ఆర్తితో... రెప్పల చివర కన్నీటి చుక్కోటి వేళ్లాడ్తూ... చెంప మీద చిన్నగా తట్టి... "ఈ చీర ఇప్పుడే కట్టుకో ప్లీజ్" బైటికొచ్చేసి... ముఖమల్ రాజాయీ మీద దిండు మీదకి సగం వాలి ఉమర్ ఖయ్యూం పోజులో... అవును... ఈ రోజు చిత్తుగా మత్తుగా...

మెత్తటి అడుగుల్చప్పుడ్తోపాటు... సాంబ్రాణి పొగల పరిమళాలు... ఇల్లంతా పొగ... సాంబ్రాణి పొగ మసక మసగ్గా... కళ్లు మూసుకు ఆ అద్భుత సుగంధాన్ని ఆస్వాదిస్తున్నా... కట్టుకున్న నా రెండు చేతుల్మీదుగా చల్లగా మెత్తగా...

"గౌ...రీ" భుజం చుట్టూ మెత్తగా చేయి వేసి... రొజాయీ మీద నా పక్కన కూచోబెట్టుకుని... చూసి చూళ్లేక చూడాలనీ... రెండు చేతుల్లో ఆ పూవురేకుల మొహాన్ని తీసుకుని దగ్గరగా కళ్ల నింపుకుందామంటే...

సూదిలాంటి దాంతో మొహమంతా ఛిద్రం చేసిన గౌరీ ఫోటో భయంకరంగా భగవాన్లింట్లోది, చటుక్కున వదిలేశా...

అట్లాగే దిండు మీదికి వాలిపోయా వెనక్కి... జరిగి నా పక్కన నన్నానుకుని కూచుని... "ఏమైందీ"

ఏమన్చెప్పను... దాదాపు ముప్పై ఏళ్లు కల్సి తిరిగిం తర్వాత నిన్న నాకు భగవాన్లది ఇంకో రూపం... భయంకర రూపం కన్పించిందని చెప్పనా... తన ఫోటోని వాడి మొహంలా గుంట గుంటలుగా గుచ్చి గుచ్చి వికృతానందాన్ని పొందే వాడి గురించి చెప్పనా...

"గౌరీ!"

నా తల్లోకి వెన్నెల వేళ్లు పోనిచ్చి... గట్టిగా పట్టుకుని...

"ఊ"

"భయమేస్తోంది... గౌరీ!"

చూపుడు వేల్తో నా కిందిపెదవిని రాస్తూ... నే పోగడ్తా మీ భయాన్ని... మీ

భయాలన్నింటికీ మందు నా దగ్గరుంది...” అని నే తెచ్చిన పీటర్స్బాట్ బాటిల్ తీసి పెట్టింది.

లేచి కూచున్నా ఆమె ముఖం నా ముఖానికి దగ్గర్లో... అంటే నిట్టూర్పుల్తగిలేంత దగ్గర్లో... మనసు వశం తప్పుతోందెందుకు... గుండె వేగంగా... నిట్టూర్పులు వడివడిగా

“గౌరీ...”

తలెత్తి చూసిన ఆకళ్లల్లో మౌనకాంతులు, ఆహ్వానాలు చల్లుతున్నాయి. రెండు చేతులూ జాచా వణుకుతూ... వెల్లువై ఒక్కసారి... నన్నల్లుకుపోయింది.

“గౌరీ... నా... గౌరీ... లేదు... నాకేం భయంలేదు”... సడన్‌గా కొన్న వెండి పట్టీలు గుర్తొచ్చాయి.

“ఏయ్... ఉండుండు” అని పరిగెత్తి ప్యాంట్ జేబులోంచి ఆ పొట్లాం తీసి... వచ్చి కూచుని...

“నీకాళ్లిలా పెట్టు”

“ఏం, పాద పూజ చేస్తారా ఏమిటి?”

“ఊ గౌరీ మనోహరీదేవి పాద పూజ”

“ఛీ ఊర్కోండి”

“నిజం గౌరీ! ప్లీజ్ కాళ్లిట్లా పెట్టు” అని రెండుపాదాల మీద చేతులు వేశా... “వద్దు... వద్దు... ఛీ చేతుల్తీయండి... కాళ్ల మీద... ప్లీజ్ మీకు దణ్ణం పెడతాను... కాళ్లు పట్టుకోవడమేమిటీ... వద్దూ...”

“వినకపోతే చంపేస్తాను...”

కళ్లు విశాలంగా తెరచి వింతగా చూస్తూ... “యేమన్నారూ!”

“చంపేస్తానన్నా.”

చిన్న చిన్నగా చిన చిన్నగా... చిర్నవ్వు హాసమా... పక పక పకా...

కుడి పాదం పట్టుకు లాగి ఒళ్లో పెట్టుకున్నా... కుడిపాదం తెల్లని... పల్చని నున్నటి పాదం... పొట్లం విప్పి ఓ పట్టీ తీసి తగిలిస్తే కొక్కీ వదులుగా ఉంది... ఎలా... పట్టకారుంటే నొక్కేసిండొచ్చు... ఆ లేత నాజూకు పాదాన్నలాగే పైకెత్తి పళ్లతో ఆ కొక్కీ నొక్కేశా... అట్లాగట్లాగే ఆ పాదం మీద పెదవుల్తో వెచ్చగా అద్ది వదిలేస్తే!

రెండు చేతులూ వెనక్కానించుకుని తలో పక్కకి వాల్చి వామపాదాన్ని వంచి... నా ముందుంచి...

"ఊ" విలాసంగా అంది...

ఆ చిగురుల పాదాన్నలాగే పట్టుకుని నా మొహానికానించుకుని పెదవుల్తో తడిపీ తడిపీ... ఆ వెండి పట్టీ తొడిగి... మళ్లీ పెదవుల్తో చిన్నగా తాకి... సున్నితంగా ఆ పాదాన్ని నా వొళ్లోపెట్టుకుంటే... కాల్లాక్కుని... నిశ్శబ్దంగా తడిసిన ఆనందాన్ని భరిస్తూ... వొంటినిండా ధరించి... వంట గదిలోకెళ్ళి గాజు గ్లాసు... లేత నీలం రంగుప్లాస్టిక్ జగ్‌లో నీళ్లు తెచ్చి... సీసా తెరిచి... కరిగిన ఆస్వర్ణ జలాన్ని స్ఫటిక చషకంలో వొంపి... నీళ్లు కలిపి... నాకుడి పక్కన కూచుని... ఆ గ్లాసుని నా పెదవుల కందిస్తే...

"ఊహూ" అన్నా.

ఏం? అన్నట్టుచూసింది. చూసి... నా కళ్ళ పుస్తకాల చూపుల వాక్యాల భావాలర్థమై... వామ హస్తంతో నా తల వంచుకుని మెత్తగా పెదవులు ఒత్తి... గ్లాసు నా చేతిలో పెట్టింది.

"వంటింకాచైలా... ఏం చేయనూ?? ఉంటారా... ఏమో తిక్క మనుషులీమీరు. ఏం? మాట్లాడ్రేం? ఏమిటలా... ఊ... నన్ను గానీ తినేస్తారేం అట్లా చూస్తున్నారు? చెప్పండి."

"ఊ"

"అంటే తినేస్తాననేనా?"

"ఊహూ... శేషేంద్ర పాట గుర్తుకు రావడంలే?"

"ఏదీ? నిదురించే తోటలోకి పాట ఒకటి... అదేనా?"

"కాదు"

"మరీ?"

"అటు చూడు వనమంతా ఇటు చూడు జగమంతా ఎటు చూడు రంగేళీ పూల సంత... అదీ"

"శేషజ్యోత్స్నా?... కదూ..."

"ఔను... ఎగ్జాక్ట్లీ"

"లోపల కవితల కంటే ముందు... "నేనా... నా నెమిలీ నెమిలీ నా నేను... సరిగ్గా వర్డింగ్ గుర్తు రావడంలేదు. అదే కదూ... ఊ...? చాలాబావుంది... కుదించిన డాంటే డివైన్ కామిడీలా ఏమంటారు?"

"ఊ"

"ఛీ... మీరసలు వట్టి ఆ... ఊ... మనుషులు... మాట్లాడ్రే?"

గాజు పగిలిన గడియారం పదకొండు ఏభై ఐదుని చూచిస్తోంది.

"అవునూ... యీ రోజు వర్కింగ్‌డే కాదూ... ఇక్కడ కూచుని నాతో సరసాలాడుతున్నారు మీరూ? ఊ?"

"దుమ్మా... ఈ రోజంతా... ఇక్కడే... నీ కభ్యంతరంలేకపోతే..."

నా భుజమీదున్న ఆమె చేయి చటుక్కున జారిపోయింది...

ఎంత సూక్ష్మమీ మనిషీ? నేను అనుకుంటే నాకంటే! కష్టమే...!

గ్లాసులో విస్కీ... ఖాళీ చేసి... సిగరెట్ కోసం వెతుక్కుంటుంటే

"ప్లీజ్... వద్దు... కడుపులో తిప్పుతుంది... అందునా ఈ గదికి వెంటిలేషన్ లేదు... ప్లీజ్" తలవంచుకుని... బాధగా...

"ఒహోయ్! ఏంటీ అంతగా... మరి... తెగ ఫీలింగ్సైపోతున్నారూ?"

"ఏ యాసా ఇది?" నవ్వుతూ...

"పర్లేదే మీరు వట్టి మరీ సీరియస్ మనుషులనుకున్నా"

"అస్సలు నేన్జోకులేస్తే... అందరూ.. మందుపార్టీలో అయితే అన్నీ నావే జోకులు..?"

"అవునూ అన్నమొద్దా...? అట్లాగే విస్కీ... తాగుతూ...మీకేం...మీరుంటారు... నాక్కష్టం బాబూ... స్టౌమీద ముందు అన్నానికేసొస్తా... కావాలంటే మీతో అవకాయన్నం కలిపించుకోన్తినొచ్చు..." లేవబోయి... కాలివేళ్లు చీర అంచుల్లో చిక్కుబడి... ముందుకు పడబోతే... అమాంతం చేతుల్చాచి... అడ్డుకోబోయి... నేనూ ఆగలేక... వెలకిలా నేనై... నేను... నేను పరచిన శ్వేతవస్త్రానై...

నా మీద జలజలా రాలిన తుషారాలహుషారుల కడిగిన పారిజాతపుష్పాలై... ఆమె...

అట్లా... నా గుండెల మీద... కుడిచెవి పెదవులకి తగుల్తో... ఆనంగ అంగారం... చిటుక్కు చిటుక్కుమని... చిట్లుతూ... రగులుతూంటే మెదడు పొరల్లో... పొదరిండ్ల నక్కిన మృగమల్లే నిన్నటి సంఘటన తొంగి చూస్తూ... నన్ను మనిషిని చేస్తే... "ఏయ్ లెయ్... నేనేం యూఫోం పరుపుననుకున్నావా? లెయ్..." చిన్నగా ఆ చెవిలో అంటే...

తల తిప్పి... నన్నింకా అల్లుకుంటూ... ఆ పెదవుల్తో... నిశ్శబ్దంగా శబ్దిస్తూ అంది...

" నా రత్న కంబళీవి నువ్వు"

ఈ మైమరపు... తెర తొలగకపోతే... కష్టం... అనుకుని "ఏమిటీ ఆ ఏకవచన ప్రయోగం?? ఊ?"

"వచనం లేదూ. పద్యం లేదూ..." విసురుగా అని లేచి... నన్ను చూసి... సిగ్గుగా నవ్వి... నన్ను చెయ్యిపట్టుకు లేపి...

"మీరు తాగే కొద్దీ... మరీ జాగ్రత్తపరులౌతారే?" అని వెళ్లిపోయింది... ఎర్రగా కందిన మొహంతో వచ్చి కూచుంది... ముక్కు ఎగబీలుస్తూ... "మస్తాన్‌తో కూరల్తెప్పిస్తా... నాచేత కాదు... ఆ స్టౌతో ఏం తెప్పించేదీ...? అవునూ మీరుబ్రామ్మలుకదూ...? మాంసం తినరు కదూ... లేదే... మీరు చికిన్ భలే కమ్మగా వండుతారని విన్నా... ఎట్లాగబ్బా...?

"నువ్వు న్నావు చాల్లే నాకు... నిన్ను నంచుకుంటా?"

"ఆహా... బహుభేషుగ్గా..." అని నా మొహంలోకి తీక్ష్ణంగా చూస్తూ... "ఎందు... ఎందుకని? అలా ఇంతకు ముందు...?" నిర్భయంగా అడిగేసింది... ఏమని చెప్పను...? గర్భస్రావం చేయించుకు నాల్రోజులు కాలేదునిన్నాపశువు... బయంకరంగా చెరచిపోతే... స్పృహ తప్పి... చచ్చిపోయిందేమోనని భయపడి... ఎలా... ఎలా చెప్పేది... కానీ చెప్పాల్సిందే... ఆ కళ్ళల్లో ఆ డిమాండ్ కనబడుతోంది... "గౌ...రీ... ఈ ఏకాకి మనస్సెడారిలో... ఏదో మోడనుకున్న... ఎండిన... చెట్టుకు పట్టిన... నాజూకు చిగురువు నువ్వు... నిన్ను... నే...నెలా... ఎప్పుడో... నాకు తెల్సు... పూర్తిగా హరితాన్ని చల్లి... ఓ వెచ్చటి తోటను చెయ్యి యీ మనసును... ప్లీజ్!"

"నా... దేవుడా... నన్ను... క్షమిస్తావా?"

"ఛా... వూర్కో, పెద్ద మాటాల్మాట్లాడొద్దు..." అన్నేనంటే... నా వొళ్లో వాలి... బావురుమంటూ... తడిసిన గువ్వల్లే...

❋ ❋ ❋

మర్నాట్రోజాఫీసుకు పోతే తెల్సింది... కాత్యాయని కిర్సనాయల్పోసుకు కాల్చుకుందనీ... చావుబ్రతుకుల్లో కొట్టుకుంటోందని...

ఇంటెన్సివ్ కేర్ బైట్నుంచే అద్దాల్లోంచి తొంగి చూసి... తెల్ల కాత్యాయని...

దుబ్బ కాత్యాయని... వైకుంఠాలు... జాన్సన్‌లు... దుర్గంధాలు, నాలాంటి కశ్మలాలు... బూతులనుకున్న కాత్యాయని కాలిబొగ్గై చేతుల్నీలిగిజుట్టుబోడి తలగా మాడిపోయి... అసహ్యంగా... మాంసం బైటిక్కనబడ్తూ...

కుంటి సరోజ కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది... నిజంగానే మనస్సు పట్టలేని దుఃఖాన్ని కన్నీళ్ళు, చేసి వెక్కివెక్కి ఏడుస్తోంది.

చచ్చిపోకూడదా కాత్యాయనీ... త్వరగా చచ్చిపో మనస్ఫూర్తిగా అనుకుని పక్కకొచ్చేస్తోంటే...

కుంటి సరోజ చుట్టూచేతుల్బిగించి మెల్లిగా నడిపించుకుంటూ... ఆ మూల బెంచీ దగ్గర్కి తీసుకుపోతున్న సుగంధ దుర్గంధ్రావ్‌గాడు... ఆమె దుఃఖాన్నాసరా చేసుకుని... అనునయమ్మనే నయవంచనతో... వయస్సు పొంగుతున్న ఆమె శరీరాన్ని తడుముతూ... చొంగకారుస్తూ... థూ... కుళ్లిపోయిన ఆడశవాల్తో కూడా ఆడుకునే మృగప్పుండా కొడుకుల్వీళ్లనుకొని... నెక్రోఫీలిక్ బాస్టర్డ్స్

అవునూ, కాత్యాయని మొగుణ్ణిచూళ్లేదే... వాడెక్కడా? తర్వాత్తెలిసింది వాణ్ణి పోలీసులరెస్టు చేశారని... బెయిల్మీద బైటికొచ్చినాడనీ...

కాత్యాయని ఉత్తరం రాసిపెట్టి మరీ కాల్చుకుందిట... తన ప్రొమోషన్కోసం భార్యని ఆఫీసర్దగ్గరికి పంపించి... ఆ తర్వాత రోజు చిత్రాతి విచిత్రమైన పద్ధతుల్లో ప్రశ్నించి వేధించి హింసించేవాడని... ఇక ఓర్చుకునే శక్తి లేదనీ... తన చావుక్కారకుడా దుర్మార్గుడైన భర్తనీ...

ఏ ఉత్తరాలేంచేస్తాయి... ఆమె కోల్పోయిన మనశ్శాంతుల్ని తెచ్చిస్తాయా... కాల్చి తగలేసుకున్న జీవితాన్నితెస్తాయా... మన వ్యవస్థ ఇట్లాంటి రుజువులెన్నింటినైనా మాయం చేయగల్దు... మచ్చల్కూడా మిగల్కుండా... కాలం అన్నిటినీ గుర్తులుగా చేసి తనతో చుట్టుకుపోతూనే ఉంటుంది. కాత్యాయనీ శవబ్బొమ్మెంత? ఈ మనుషుల అశాశ్వత... దుఃఖమెంత...? కుళ్లికుళ్లి ఏడ్చిన కుంటి సరోజే చచ్చిన కాత్యాయని సవతి కావచ్చు... ఏమో...? నానా భ్రష్టు కూతల్కూసే జాన్సన్... సన్యాసం బుచ్చుకొని సర్వం వదులుకోవచ్చు... అంతా... అనిశ్చితం... నాన్సెన్స్... అబ్సొల్యూట్నాన్సెన్స్... భగవాన్లెకడ... శవాల బండి డ్రైవరెమ్మే డబల్లిట్పర్వర్ట్‌గాడు... ఏమైనాడనుకోవాలి? ఇంతేనేమో... మళ్లీ పదేళ్ళ తర్వాతెక్కడో, సూళ్లూర్పేట్లోనో, సూదిరెడ్డి పల్లెలోనో, కన్పడి 'లప్డీ కొడకా! గుర్తున్నానా?' అని ప్రేమగా పల్కరిస్తాడేమో...?

వాటి చీకటి బ్రతుకు వాడిదే... నా చీకటి బ్రతుకూ నాకు ఉంటుంది. వాడి బలహీనతల్కి నా స్నేహాన్ని పణంగా పెట్టను... వాడి లోపాల్ని ఆహ్వానించలేని నేను... స్నేహాన్ని ఏవిధంగా పంచివ్వగల్ను... భగవాన్లు, 'హారే... గాడ్డికొడకా"... 'ఐలవ్యూ బగాన్లూ.." గౌరికిష్టం లేకపోయినా... గౌరిక్కూడా వాడి కొచ్చినట్టు స్ఫోటక మొచ్చుంటే...! నేనీనాడు... ఇట్లా ఆమెను ప్రేమించే వాడ్నా...? వద్దూ, ప్రమాదవశాత్తూ... కాత్యాయన్లా అయ్యి, బతికీ, నీ మెదడు చితికే... నువ్వు... అశుద్ధం గతికీ, యూజ్‌లెస్‌ఫెలో...ఆ...

జీవిత పూర్ణత్వం గురించి... నానా శకలాలైన మనస్సాలోచన చేయడం వింత... షేన్బర్గ్... బోమ్‌లతో కృష్ణమూర్తి తత్వ చింతన సామాన్యుడి... జీవితానికేం వండి వారుస్తుంది?

ఖొజ్జా మస్తాన్కి... రిక్షా హన్మంతుగాడికీ... సౌభాగ్యం సవారీ సామేలుగాడికీ... ఆ దౌర్భాగ్యానికీ కూడా...

'నీలో వైరుధ్యాన్ని నువ్వు వదుల్చుకోలేని క్షణాలుంటాయని' నేన్చెప్తే... పాపం... సారు మల్లా ఏసోౖనొచ్చినాద్రారేయ్' అని మాత్రమనగలరు. ఇలాంటప్పుడింకోప్పుడైతే ఉపశమనం 'మందై'య్యేది కానీ యిప్పుడు... దాంతో పాటు నా గౌరీ మనోహరుంది...

ధైర్యంగా... గర్వంగా అనుకుంటూ... జానకి దగ్గరికెళ్లా.

మస్తాన్వాకిట్లోనే

నన్ను చూసినవ్వి... నా కాలుస్తున్న సిగరెట్ కోసం చేయి చాచి ప్రసాదంలా అందుకుని కాలుస్తూ... వీడికీ పర్వర్షన్లుంటాయా? అని నేననుకుని...

లోపలికెళితే...

మధ్యాహ్నం పన్నెండున్నరకి నిద్రపోతూ జానకి గౌరీ మనోహరీ జానకి...

అదే నల్లచీరకట్టుకు తెల్ల గౌరి...

ఓ కాలు మడచి... ఎడం చేయి దిండున్చుట్టి నిన్ననే తొడిగిన వెండి పట్టీ ఒకటి గట్టిగా పట్టుకుని... పాపల్లే... ముకుళమై నా గౌరి...

ముఖముల్ రొజాయీ మీద... రాణల్లే నా గౌరీ... ఎంత శాంతి...!

ఓషో భాషణల్నిజమేమో... ఆలోచించాలనిపించేలా...

చీరకూ రవికెకూ మధ్య తెల్లటి పల్చటి పొట్ట ముడత పడి మరీ... నేనెవ్వర్ని...? వంగి పెదవుల్తో స్పృశించీ స్పృశించక... వదల్లేక... మృదువుగా గౌరీ... నా గౌరీ...

అనుకుంటూంటే... నిద్దట్లో మసలి... వెల్లకిలాయై... నా మృగ మానసాన్ని దా...! దా...! అని ఆహ్వానిస్తో నా గౌరీ...

"నో"... నాకు నేన్చెప్పుకుని... ఆ పెదువుల కదుల్తున్న కలని ఓ మాటు చిన్నగా తాకి వెళ్లిపోదామనుకుంటే... అనుకుంటూంటే... 'ఊ' కళ్లుచిట్లించి... నన్ను చూసి... కలవరపడక... చాలా సేపట్నుంచీ నన్ను చూస్తున్నట్టు నన్ను చూసి... ఆ వెండిపట్టీ బిగించిన చేతిని నామెడ చుట్టూ వేసి...

"ఊ...దా..." అని లాక్కునీ...

నేనూ... కావాలనే కావాలనుకునే... వద్దనుకుని... ఆ మెత్తటి గుండెల మీదొరిగీ...

"గౌరీ..." అని గొణిగితే...

"ఎంత సేపట్నుంచీ... ఈ దొంగాటా?" గుసగుసగా అడిగింది...

"ఇప్పుడే రెణ్ణిమిషాలైందంతే" అన్నేనంటే

"మరి ఒళ్లంతా తడిసి పొయ్యిందేం?" మత్తుగా నవ్వి నా గౌరి...

ఒక్కసారి నాలో జ్ఞాన చక్షువు ఉన్మిషించి...

కాలిన కాత్యాయనీ... రుజిన మానస సమాజం.

కుంటి సరోజా... వక్ర సుగంధ్రావూ...

షేన్బర్గ్! బోమ్‌లతో జిడ్డూ... అన్నీ గుర్తుకొచ్చి...

కాళ్ల మధ్య మొహాన్నుంచుకొని... మళ్లీ నాకు నేనై... నేనే అయి... చిరు చీకట్లో...

"ఇంతట్లోనే... యిలా అయితే..." నన్ను మళ్లీ చుట్టి నా పెదవుల్నిండా పెదవులై... మధువులై... వెచ్చని ఆవిరై...

"గౌరీ...!"

"వుహూ... లాభం లేదు... నేనొదల్ను... ప్లీజ్... నన్నల్లుకోరా!... మళ్ళీ మళ్ళీ యేవేవో వస్తాయి నీ చుట్టూతా... రా! నీ గౌరీని కానూ నేను... చూడు... చూడమంటూంటే... అరే! చూడూ... నీ గౌరి కాదూయిది. మ్..." గుండీల్విడిపోయిన్నా గుండెల్మీద... నా గౌరీముఖం. నేను నెమ్మదిగా మనిషి పట్టుకోల్పోతో...

మృగం...లో...లోపలి మృగం...

విజృంభిస్తూ...

మృగమౌతున్న నేను...

కాకూడదనీ, అయితే

బాగుండుననీ... ఆమె

వక్షం మీద... వెచ్చటి

మెత్తటి వక్షం మీద

చేయి పడి... ఆ చెయి తీయాలనీ...

అలాగే వుంచాలనీ... మెత్తగా వొత్తాలనీ...

మరుక్షణం పెరకబడిన జాకెట్ గుర్తుకొచ్చి...

నేన్నేనై...

'గౌ...రీ!!"

భళ్లున తలుపెత్తెర్చుకు మస్తాన్ పరిగెత్తుకొచ్చి... మధ్యలో తెగి వేలాడుతున్న స్వప్నానికి తన్నుకుంటూ... ఛిద్రమైన గౌరీ మనోహరి జానకీ...

మేథావుల్లారా...!

యీ మనసును విశ్లేషించి మాకో దారిచూపండి...

* * *

"సారీ గౌరీ! నా కొలీగ్ కాత్యాయనీ కాల్చుకుంది... తనకు తానే కిరోసిన్ పోసుకు చచ్చిపోయుంటుందేమో యిప్పటికి... మనసు ఎట్లాగో అయ్యీ... యిట్లా... నీదగ్గరుంటే కొద్దిగానైనా చల్లబడుతుందనీ... యేమో... అంతా... ప్రపంచమంతా యెంత స్వార్థం! వూహూ... అందుకే నీ దగ్గర్కిలా..."

"కాస్సేప్పడుకోండి... మందేసుకుంటారా... ఓ పెగ్గు?... కాస్సేపలా నిద్రపోండి... కొంచెం నిమ్మళిస్తుంది... వూ?" తల్లో వేళ్లుపెట్టి...

"వద్దు... మందొద్దు... నువ్విలాగే కూచో నా దగ్గర" అని... ఆచేతినిచుట్టేసి, కళ్లు మూసుకుని ఆ రోజాయీ మీద ముఖ్మల్ రోజాయీ మీద... ఆ జ్ఞానులు ఖజానా గదిలో... ఆ ఖజానా... రాణి గౌరీ మనోహరి మదిలో...

నిజంగానే నిద్ర కమ్మేస్తోంది...

నీడలై... జాడలై... యేవేవో చిత్రాల్విచిత్ర చిత్రగతిన... చకచక చకామని... ఒక్కటై... ఒక్కొక్కటై... మొదటనే కుదుట పడని ప్రశ్నై... ప్రశ్న... కృష్ణప్రశ్న...

యెమ్మేయెమ్ఫిల్ కృష్ణ ప్రశ్న... కాత్యాయనెందుక్కాల్చుకుచావాలనే... చావు ప్రశ్న... నన్ను చంపే ప్రశ్న...

కాత్యా... కాత్యాయనీ... కాలిన్కాత్యాయని స్త్రీత్వం... త్వం... త్వమేవాహం... అనుకునే... నేను... కాలిన స్త్రీత్వం... యేం...? యెందుకనలా?... బతుకు భారమై?... యెమ్మేయెంఫిల్ కృష్ణుడి ప్రశ్నకు బదులై... వదులై... నా భావనల్నదులై... ప్రిదిలి... కదిలి... మెదిలి... తుది తెలియని... నదులై... మెదలుకి... మళ్ళీ... మొద... మొదలునికదిలి... కదలి... చెదల దారులై... చదల్... హృదుల్... మదుల్ మృదు మధుర భావనా తరంగచలిత చలిత లోలిత... లాలిత్య విధుల్... నీ శ్రాద్ధం... కామనా?! యేమీ వేమనా? గోచిగుడ్డ... పెరిగిన గడ్డం... ముడ్డి మీదడ్డం లేకుండా నగ్నంగా... యిదేం... చోద్యం...

హృద్యం... మనోజ్ఞం...

యజ్ఞం... భయోద్విగ్నం...

హవిస్సు... తెల్లటి... పొగల... నెయ్యి వాసనల శోచిస్సు... కాంతికి వాసనలేమిటి? వాసనల్లేని కాంతులుండవా? కాంతుల భ్రాంతులు... నేన్నిన్ను నమ్మనా?... నువ్వు నన్నమ్మవా?... యెంతకూ?! యింతకు... కంతకు... కంత... యింతకమ్మదా? అమ్మకంత... ఛీ...ధూ...త్... లంజకొడకా... అదికాదు... మరియిది అదేందదో... రేయ్... అప్పుడ్నువ్పొసిస్కంత కాదది... యింకేదో...

యింకి... చుక్క... చుక్కా... యింకి... యింకి... అంటే కంతలోనా?

కాంత కంత... కంత... కాంత... వింత కాంతుల్కాంత కంత...రే...తస్సుల యింకించుకు...యింకింతనే... యింకా... యింకా... యింకింతనే... కాంతల కంత ధూత్... బాస్టర్డ్... వొద్దొద్దొరే... కాదొద్దొరే... కాదొద్దొరే... కంతల్మారొద్దరే... వింతల్జూసొరెరే... యోచనా దొంతర్లో దొర్లొద్దొరే... పొర్లొద్దొరే...

కాత్యాయనికాల్లేదనే భావం... నా జీవనా... భావనా శవం... భావం... శవం... అనుభావనం... ఓహ్!... హైక్లాస్... సూపర్లేటివ్ భావనా తరంగం... నేనూ ఆలోచిస్తా... కృష్ణుడాలోచిస్తాడు... అభ్యుదయంగా... యెర్రగా... రంగులు రంగుల్లా... కాత్యాయన్శవం కామోపాసనా శకలమైన కాత్యాయన్శవమాలోచిస్తుందా?... అని...

సరే బావుంది... మావోత్సేటుంగు... ఠంగుమని గంట గొడ్తే... ఓ రక్తబిందువు... చిట్లి పెట్లి... మీ ఒకటో తరగతి గది తలపుడత్తే పెదవులు పెగలని ఓ అమాయకపు

నోరు 'అమ్మా!' అని కమ్మగా అరిస్తే 'గోర్కీ' అని గోడల రాద్ధాంతపు సిద్ధాంతాలకి పూనుకుని... వైయక్తిక నిజాలని శాయశక్తులా సిద్ధాంతీకరించబూనుకునే విశుద్ధతల్గని... తవ పిండః! కాత్యాయని గోడలెక్కిందా....? గోడలెక్కిన కాత్యాయని... కాత్యా...కాత్యా... అని నే రష్యన్నై... కాదే మరేమిటిది?

కాత్యాయని... కాత్యాయని... కృష్ణ కాత్యాయని... చరిత్రలచదివి చిత్రగతాల్విరిచిన కృష్ణుడడిగిన కాత్యాయనీ చిత్ర విచిత్రమిది... నిజానికి వాడడిగాడా? లేదే?! వాడు నువ్వై... నువ్వు నీకై అడక్కున్న ప్రశ్న... యిది... కాదా?...

మెదడలసిపోయింది...

యెంత సేపునిద్రపోయానో తెలీదు... కళ్లు తెరచి పగిలిన గడియారం చూసుకుంటే... ఆరు... అంతసేప్పడుకున్నానా? యింకా లేవాలనిపించక గోడవైప్తిరిగి పడుకున్నా... యేవో అడుగుల చప్పుళ్లు.

కళ్లు తెరవాలనుకున్నా... తెరవలేకపోతూ... అలాగే... చల్లటి చెయ్యి నుదిటి మీద గౌరి..."అమ్మో! ఒళ్ళు కాలిపోతుంది... మస్తా... చూడూ..."

మెల్లిగా ఒత్తిగిలి... మండుతున్న కళ్ళు తెరచి... చల్లటి గౌరిం చూసి నవ్వి... "తలనెప్పిగా వుంది గౌరీ"... అన్నేనంటే...

"తలేమిటీ... ఒళ్ళూ కాలిపోతుంది... యేవనాట్రీయో ఉంటుంది.

లేవగల్గుతారా... చిన్నగా... కాస్త మొహం తుడుస్తా... డాక్టర్దగ్గర్కెళ్లండి..." తల వెంట్రుకల్ని రెండు చేతుల్లో వెనక్కి దువ్వి... అలాగే పట్టుకుని... గౌరి... యెంత హాయిగా వుందీ... వద్దు... వద్దు... యింకే మొద్దీ ప్రపంచంలో అనిపించేంత హాయిగా...

జాలిగాచూస్తూ... కళ్ళనిండా... మనస్సు నిండా చూస్తూ...

"యెంత... సుకుమారం మీ మనసూ?! అని...

నుదుటి మీద మంచు ముద్దోటిచ్చి... లేచి వెళ్ళింది....

కష్టంమ్మీద నేనూ లేచా... బాత్రూంకెళ్లాలని... బాత్రూం తలుపు వరకూ వెళ్ళి... తలుప్తీయ బోతూ... ఒక్కసారి ఒళ్లంతా చల్లగా అయ్యి. కళ్ళ ముందునల్లటి తెర దింపినట్టు...

"అరే... మీరే... యెందు... నేనొస్తున్నాగా... అదేమిటలా తూలున్నా... మస్తాన్" గౌరి అరుస్తో పరిగెత్తికొచ్చి నన్ను చుట్టుకుని... కప్పుకుని పట్టుకోలేక... అసహాయంగా... గట్టిగా యేడుస్తో...

"మస్తా... మస్తా..." అని... నన్నలాగే బాత్రూం గడప దగ్గర జాగ్రత్తగా కూచోబెట్టి ఒరిగిపోకుండా పట్టుకుని...

"వొరే దేవుడా... యింకా యింకా యెందుకురా నన్ను క్షోభపెడతావు... యింకా యెంత కసి మిగిలిందిరా నీకు నా మీద... రేయ్... మమ్ముల్నారికే చంపెయ్యిరా... వో!"

గౌరీ... ఒక్కతై.

మస్తానొచ్చి... "అక్కా... అకా..." అనడం గుర్తుంది. లీలగా... మళ్ళీ స్పృహలో కొచ్చేటప్పటికి... రోజాయీ మీదున్నా... మస్తానెదురుగా... గడప దగ్గర... నా మొహం తడిగుడ్డతో తుడుస్తూ గౌరి నా పక్కనే...

"అమ్మయ్యా... యెట్లా ఉంది... వూ... యేమైందీ... వెళ్దామా... డాక్టర్దగ్గరికి... ప్లీజ్... రెణ్ణిమిషాల్లో... రిక్షాలో? వూ?"

నా మొఖానికి మొహమానించి లాలనగా.. కళ్లనిండా నీళ్లతోనే చెయ్యెత్తి కన్నీళు తుడిస్తే ఆ చెయ్యలాగే పట్టుకుని దాంట్లో మొహం దాచుకుని... వెక్కి... వెక్కి... మనోహరి... "వద్దు గౌరీ! యెక్కడికీ వద్దు... ప్లీజ్ నువ్వూరుకో... కొంచెం కాఫీ యివ్వు చాలు..." లేవబోతూంటే... మస్తాన్ ఖొజ్జా దేవ మానవ రూప మస్తానొచ్చి... దృఢంగా... అవలీలగా నన్ను జాగ్రత్తగా లేపి గోడకు ఆనించి... కూచోబెట్టి... గౌరి తల చుట్టూ నా తల చుట్టూ చేతుల్తిప్పి యేవో గొణుక్కుంటూ... మెటికల్విరుచుకుంటూ... నవ్వుతూ... నల్లటి మేఘమల్లే మస్తాన్... బైటికెళ్లిపోయాడు...

పక్కనున్న గిన్నెల్లోన్చల్లట్నీళ్లతో మొహం బాగా తుడిచి... మోకాళ్ళ మీద నన్నానుకుని... చీర కొంగుతో నా మొహాన్ని తుడుస్తోంటే... అంత జ్వరం యింకిత మరింతై అదుగో... ఆ పల్చటి తెల్లటి పొట్ట మడత లేకుండా యిప్పుడింకింతందంగా...

చూపుడు వేల్తో అలా రాస్తే...

"యేయ్..." అని కుప్పకూలి... నోటి మీద కుడి చెయ్యి వెల్లికిలా వేసుకుని... కళ్లు విప్పార్చి... "అమ్మో" అని కందర్పబాణ తూణీరమై నా గౌరి..." అలసటనిపించినా నవ్వుతూంటే హాయిగా ఉంది... "యేమిటా రౌడీ చేష్టలూ... అస్సలే నేన్చచ్చిపోతూంటే" పక్కకి ఒరిగి ఓ చేతి మీద తలానించుకుని... కళ్లు వాల్చుకుని రతీ గౌరీ...

'ఠంగ్'! మెదడు గజిబిజి దారుల్లో... యెక్కడో... యేవో మూకల... అల్లర్ల... దాడులు... రౌడీలమ్మో... పారిపొండి... పరిగెత్తే కాళ్లకి కుచ్చిళ్లడ్డం పడ్డం... నాగరికత

అడ్డం పడి... నడవడం మానిపించి... ఒకడు... యిద్దరు... ముగ్గురు... నల్గురైదుగురై... కుచ్చిళ్లో చేతికి... రవికో చేతికి... స్తనమో చేతికి...

పైశాచీతనం ప్రతి చేతికి... నట్టనడి రోడ్డున...

"అన్నా...! అన్నా...! నన్నిడ్సండన్నా! మూణ్ణెల్ల కడుపన్నా... నీకాల్లు మొక్కుతానన్నా... అన్నా.. అమ్మో!"... 'యెయ్ లంజెని'...

"నీ మొగుడుకి జెప్పే... ఆ మాట...'

"రేయ్ తెర్సు... కటికో నంగడి..."

"యెయి దీన్ని లోపల్కెయ్యి...' మాంసం... చచ్చిన గొడ్డు మాంసం చకా చక చకా నరకబడే మొద్దు మీద... నగ్న...మై... విడి వడి... నశించిన స్పృహ స్రవించిన రక్తం... జీవన్ముక్తభ్రూణం... కిటికీసందులోంచి కనువిందు... రహస్యంగా ఆనందించే, సుఖ హీన సుందరమ్మ పళ్లు కొరుక్కుంటూ...టూ...ష్..అబ్బా... వాడెవడే ఆ నల్లటోడు రెండోసారి మళ్లీ...

మృగమా... ఆడ మృగమా?

రౌడీలు... రౌడీలు... పోలీ...

బంకుల సందుల... ఉచ్చల రొచ్చులోంచి... కుప్పల తెప్పలై తీగలై పరిగెత్తి పరిగెత్తి... పోలీసులు... పోలీ... రౌడీ... రౌడీ...

ర...వు...డీ...

చెమట ధారలుగా కారుతూ... కళ్లు శూన్యమై... విడిగి విప్పారి పెదవులు విడివడి... 'రౌడీ'మెల్లగా గొణిగితే... మళ్లీ ఆదుర్దాగా చెంగుతో నుదురంతా తుడుస్తూ... "దేవుడా! కనకుండానే పాపనిస్తావా?" అమ్మనోహరి...

జ్వరం... తగ్గుతోంది... నను ఒళ్లో వాల్చుకుని... తడిసిన నా తల వెంట్రుకల్ని... చిన్న తుండుగుడ్డతో తుడుస్తూ... నిండుగా వున్న కింద పెదవిని తెల్లటి పంట నొక్కి... జానకమ్మ...!

"గౌరీ"

'ఊ...'

"నే... నేన్రౌడీని కాన్గౌరీ"... అనంటే...

"అమ్మా! ఆ...వూ...యీ... ప్రపంచమింకా అందుకే నడుస్తోంది నా దేవుడా!"

అని... నన్నుక్కున కర్చుకుని... దుఃఖమేతానై... సుఖానికి మొదలై... కొలతై... గౌరీ మనోహరి...

"పాలు తాగుతావా?" అనంటే...

"ఊ..."అని నేనంటే... మళ్లీ నైర్మల్యం కడిగిన నా కళ్లలోకి చూసి...

చూస్తూ... చూస్తూ... గౌరీ... "యేమ్! దొంగా...ఛీ...అది కాదూ...!" అని సిగ్గిల్లిన బాలక్రీడా నట మారతః గౌరి... రవికె తప్పించి నన్నో ఆకలి కేకల పాపన్చేసి నన్నేలోకాల్కి...?

మర్నట్రోజుదయానికి జ్వరం తగ్గిపోయింది. చెమటతో నేనూ రొజాయి దిండూ బాగా తడిసిపోయి సన్నగా వాసన గొడ్తూ...

లేచేటప్పటికీ కొత్త బ్రష్ మస్తాన్తో తెప్పించి పెట్టింది... బ్రష్ చేసుకుని వంటగదిలో కొచ్చి పెచ్చులూడిన గోడ కానుకుని స్టౌ ముందుకూచుని ఆక్కూర తరుగుతోన్న తన్ని చూసి... తను నన్ను చూసీ...

"ఆఫీసు కెళ్లొద్దు... ఇంకా బాగా నీర్సంగా కనబడుతున్నారు... ఏం? ఈ వేళకి మాత్రమే... స్నానం చేస్తారుగా... మళ్లీ కాస్సేపాగిలెండి...

"ఎంత త్వరగా స్థానభ్రంశం? వారం ముందు నేనెక్కడ... ఈ రోజు ఇదేమిటి? ఏ శాస్త్రం... ఏ మేధావి... దీనికి సమాధానం చెప్తారు...?

నాస్త్రాదమస్నడగాల్సిందే... శాస్త్రల్పన్చేయవు... ఏమో మళ్లీ రేపేమౌతుందో... భగవాన్లొస్తాడా? నన్నిలా ఈ స్థానంలో చూసి... వాడి వికృతమానసంతో... ఏమౌతాడు? అసలు భగవాన్లగాడెక్కడ?

"మళ్లీ వచ్చి మాట్లాడ్తా నీ...జా...ర" అని వెళ్లాడు... ఏంమాట్లాడ్తాడు...? నీ... అంటే... నీతో అనా? నాతో జా...నకి..'ర' అంటే రహస్యమా? నాతో జానకీ రహస్యం మాట్లాడ్తాడా... ఏమై యుంటుంది? ఎక్కడో ఏదో నామనస్సీకటి కోణంలోంచి 'రేయ్ భగవాన్లూ! నువ్వు రావొద్దురా' అని నాదే పీలగొంతు... వాడొస్తే... ఊహూ... ఈ ప్రపంచమంతా ఏకమైనా సరే గౌరి... నాదే... నాదే... గౌరి...

"ఓయ్! ఏమిటీ నా పేర్జపిస్తూన్నారూ? కొత్త పిచ్చి కదూ... కాఫీ... ఊ..." చెయ్యిచిన్నగా గిచ్చి...

"గౌరీ!"

మళ్ళీ స్టౌ ముందు కూచునితలెగరేసి ఏం? అన్నట్టు... ఎంతందం ఆ కళ్లల్లో!

"భగవాన్లగాడొస్తాడా?" ఠక్కునకాంతి మాయమైందా మొహంలో, ఎందుకూ? ఏదో భయం కూడా లీలగా కన్పడుతోంది... భయమా? ఏమో, ఏదో భావం... భయంలాంటి భావం...

"నేనెట్లా చెప్పగలనూ..." కావాలని నా చూపుల్తప్పించుకుని, సులభంగా తెల్సిపోతుంది... చెప్పకనే చెప్తోందామె ఆ విషయం, అసలు భగవాన్లగాడి విషయం మాట్లాడ్డమిష్టం లేదని...

అయినా సరే నిర్ణయించేసుకున్నా అప్పటికప్పుడు... ఈ రోజు జానకితో మాట్లాడాల్సిందే... మళ్లీ వాడొచ్చి... వాడి జాలిమొహం చూసి, నేనేమో అయిపోయి... నా గిన్నెలో అమృతాన్ని వాడాకులోకి వంపి... ఊహూ... వంపను... వంపనుగాక వంపనంతే... నా వంక నేన్చూసుకున్నా...

ప్యాంటు షర్టులోనే ఉన్నానింకా... హాయిగా స్నానం చేస్తే బావుంటుంది... నిన్న గౌరి తెచ్చిన బట్టలున్నాయి కదా...

"గౌరీ... లుంగీ..."

"లోపల్గదిలో బీరువాలో ఉంది చూడండి ఉదికుంచా... చెయ్యి...

ఉల్లిపాయల్వాసన... తీసుకోరా...?"

లోపల్గది... అంతరాళం... మేథోఖజానా... ముఖ్మల్ రోజాయీ మీద పునర్జన్మించిన నా ఆనందం... గోడలో కున్న బీరువా చెక్క తలుపెత్తెరుస్తూనే... ఏదో వింత పరిమళం... గౌరీ... పరిమళం... ఎస్... ఎన్ని పర్ఫ్యూమ్ల మధ్యనైనా గుర్తించగలనీ పరిమళాన్ని ఎట్లా? ఏమో శుభ్రంగా ఉదికి మడిచి... లాల్చీ పైజమా ఇస్త్రీ కూడా అయి ఉన్నాయి. అంతట్లోకే అందుకునేమో ఆడది లేనిల్లు కాదది' అన్నారు... ప్యాంటూ షర్టూ తీసేసి లుంగీ చుట్టబెట్టుకుని పైకి మడిచి కట్టుకు మళ్ళీ వంట గదిలోకెళ్తే నన్ను చూసి నవ్వి...

"హేవిటదీ అరవ సినిమాల్లోలా... దించండది ముందు... వంటినిండా ఆ బొచ్చూ మీరూ... ఛీ... దించమంటూంటే, టవల్కప్పుకోండి స్వామీ ముందు... ఎలుగుబంటిలా ఉన్నారూ..."

"అవునూ... నిన్ననే అడగాలనుకున్నా... బ్రాహ్మలు కాదా మీరుజంధెం లేదేం?"

"ఎప్పుడో తెంపేశా... అయినా నన్ను బ్రాహ్మడంటే బ్రాహ్మలు నిన్ను కొరతేస్తారు... జాగ్రత్త..."

"యూ... ఎనౌట్కాస్ట్?

"ఎస్. అయాం. అండ్మైవెరీ ఎగ్సిస్టెంస్సీ జెశాక్రిలెజ్ ఫార్దీస్ సోకాల్డ్ బ్రాహ్మన్స్... అండ్ బ్రాహ్మనిజం..."

"వద్దొద్దూ... తమాషాకి... ఇంతకీ మనకే కులాలున్నాయి ఒక్క వ్యాకులం తప్ప. మీరూ, నేను ప్రతి కులంలో ప్రతి మతంలో, ప్రతి నాగరికతలో కూడా ఉన్నాం...ఉంటాం... అంతే"

"పొద్దున్నే... మరీ పొద్దున్నే... నీర్సంగా ఉన్న నాతో ఇట్లా మాట్లాడ్డం బావుందా... చెప్పు... గౌరీ... దీనంగా అడిగితే...

అయ్యయ్యో... మీ బ్రాహ్మణీకం పాడుగానూ నా డికాక్షనంతా పొంగి... చ్చొ...చ్చొ..చ్చ్... స్టౌ ఆరిపోతే నేన్చచ్చినట్టే... ఇక" గబగబా గిన్నె దింపేసి ఇంకో రెండు కాఫీలు కలిపి నాకిచ్చి తానోటి తీసుకుని నా కభిముఖంగా నుంచుని... చూపుడు వేల్తో నా కుడి గుండె మీద చుట్టు చుడ్తూ...

"అరే...! మీకిక్కడ పెద్ద సుడుందే మజ్జెన్మచ్చ కూడా" అంటూ... గుండెమీద వెంట్రుకల్లో సుడి చుడ్తూ... లోపలెక్కడో... ఏదో శూన్యంలోకి లాగబడ్తున్న సుడిగుండంలా...

ఆ చెయ్యలాగే గట్టిగా పట్టుకు నొక్కేస్తే...

"అబ్బ... వదలండీ... అవునూ... మీరేం నీర్సంగా ఉన్నారూ... ఇంత బలముంది మీ చేతుల్లో... మీ వరస చూస్తూంటే... కష్టంలాగే ఉంది..."

చెయ్యొదిలి... మళ్లీ గోడకి చేరగిలి కాఫీ తాగుతూ... తలుపుకానుకుని ఓ చెయ్యి మడిచి... కాళ్లటూ ఇటూ వేసుకుని... కాఫీ చప్పరిస్తూన్న గౌరినీ... గౌరీ వెండి పట్టీ కాలిని... మడత పడ్డ కాలివేళ్లని... ఒత్తిడికి రక్తం ఇంకిపోయిన కాలిగోళ్లని... తెల్లని కాలిగోళ్లన్చూస్తూ...

"నీకు డాన్స్ తెల్సా" అనడిగితే

"ఓ"

"ఏది!"

"కథాకళి"

"నిజం...!"

"లేకపోతే ఏమిటీ ఉదయాన్నే... ఒకవేళ నాకు వచ్చినా కూడా నాకు తెలుసు

అన్చెప్పను... ఎందుకనంటే... నాకు డాన్సొచ్చూ అంటే ఇప్పుడే ఆడమనేట్టున్నారు గనకా".

వచ్చి కాఫీ గ్లాసు కోసం చెయ్యి చాచి నిల్చుంది.

ఖాళీ గ్లాసిచ్చి...

"నీతో జవాబెట్లా రాబట్టాలో నాక్తెల్సులే" అని బాత్రూంలోకి దూరబోతూంటే...

"అరే... అదేమలాగే ఉండండి నీళ్ళు వేడి చేసిస్తా... ఒక్క పదినిముషలంతే..."

"వద్దు... నేన్చన్నీళ్లే స్నానం చేస్తా..." అని దూరేశా లోపలికి...

"స్నానం చేస్తోంటే హాయిగా ఉంది. సోపుముక్కనూచ్చస్తే ఒక్కసారి అవ్యాజానురాగం కలిగింది... గౌరి...గౌరీ మనోహరి... చలువరాతి దేహమంతా తానై... తాను ఫేనమై తాకి తాకి... తరించిన మైసూరు చందన పరిమళం గడ్డ కట్టి ఆ చిన్న పెట్టెలో ఇదీ ఒక రకపు పర్వర్షనేమో... భగవాన్తైతే ఈ సబ్బు బిళ్లనేం చేసుండేవాడు... కసికసిగా కన్నాల్పొడిచుండేవాడా...? భయమేసి... తలి విదిలించుకుని...

ఫిర్ వహీ శామ్... వహీగమ్... వహీ తన్హాయీ హై...

తలత్ని మిమిక్చేస్తూ... పాటంతా పాడి...

తలనుంచి వొళ్లంతా... యెంత హాయి... చిన్నగా వణుకుతూ... చాల్చల్లగా ఉన్నాయి నీళ్లు... తలుప్తీసుకు బైటికొస్తే... తలుప్ముందే గోడకానుకునిచేతల్కట్టుకుని కళ్లు మూసుకుని... తలూపుతూ... గౌరి... తలుపు తెర్చిన శబ్దానికి కళ్లుతెర్చి...

"ఆహా ఇలా దొంగలా... వినాల్సొచ్చిందన్నమాట మీ పాటని... యెంత కమ్మగా పాడారూ..." అని వెళ్తోంటే జబ్బపట్టుకు నాపి...

"మరేం లేదా?" అనంటే...

"యేమిటీ? యేం లేకపోడం... అంతా ఉంది... కానిప్పుడ్లేదంతే..."

"అయినా ఈ హుషారేమిటి బాబూ..."

"బాత్రూంలో నీ సబ్బుబిళ్లనడుగు..."

కళ్లు చిన్నవి చేసి... "నన్ను" నిశితంగా చూస్తూ... దగ్గరగా వచ్చి "లాభం లేదు. యెంత టెంప్ట్ చేసినా... రాతిలాకరగనంతే" అని ఠక్కున పాదరసంలా జారిపోయిన్నా గౌరి... తల తుడుచుకుంటూ ఖజానా గదిలో పరవశిస్తూంటే...

"వూ... వూ... రండి త్వరగా యిట్రండి..." అని ఇనుపరేకు మీద నిప్పుల కుప్పతో జల్లెడతో...

నేనట్లా... అనిమిషుణ్ణై చూస్తుంటే...

"అరే! రమ్మంటూంటే యేమది... రండి... త్వరగా నిప్పులారిపోతాయి... రండీ!"

"గౌ..."

"ష్షో...వూ.." జబ్బ పట్టుకుని నిప్పుల్మీద సాంబ్రాణేసి జల్లెడ బోర్లించి...

"వూ..." అని నా తలవంచి... నా తలనిండా వేళ్ళయి....

"వూ..." లెండని మోకాళ్ళ మీద కూచునికళ్లు మిటకరిస్తూన్న నన్ను... చూసి... దగ్గరికొచ్చి తలచుట్టూ చెయ్యేసి యెడమ బుగ్గ మీద... వెచ్చగా... మెత్తగా పెదవుల్తో వొత్తి...

"ఇదీ... పాటకి..." అని సాంబ్రాణీ పొగల్లో ఇంకో మేఘమల్లే... వెళ్లిపోతుంటే...

"మ...నో...హ...రీ" అని పిలిస్తే...

భూమ్యాకాశాల అంతరాళాల కన్రెప్పల్తీసి... అటో సంధ్య, ఇటో సంధ్యై... ఆ కన్యాకుమారీ గౌరి...

లాల్చీ పైజమాల్లోకి మారి... ఆ ఖజానా ముందు మోకరిల్లి... నెమనెమ్మదిగా మూత తెరచి... చూద్దామని మళ్ళీ... ఛీ చూడకూడదనీ... వంటగదిలో కెళ్తే...

స్టౌ ముందు మోకాళ్ళ మధ్య మొహం పెట్టుకు గౌరి...

వీప్మీదంతా చెమటతో తడిసీ... పల్చటి మల్లు జాకెట్లోంచి... అస్సల్శరీరమే అనిపించేట్టు... యెందు... యెందుకనలా...? వూహించుకుని... పక్కన కూచుని...

"గౌరీ...!"

తలెత్తి... "ఇది నిజం కదూ... చెప్పండీ... చెప్పండీ... ఇది నిజమనీ... మీరు మీరనీ... నేన్నేననీ... ప్లీజ్... చెప్పండిది నిజమేననీ."

వెక్కి వెక్కి ... గౌరీ మనోహరి...

అర్థంచేసుకోగల్ను... నా లాంటి మనస్సే అది...

"గౌరీ...!"

పావురాన్ని పొదవి పట్టుకున్నట్టు పట్టుకుని... యెత్తుకుని... నా గుండెకు

హత్తుకుని... "గౌరీ...! నా మనోహరీ! ఇది నిజమే... నేనూ... నువ్వూ... మనం... నిజం... గౌరీ! యేయ్... చూడిట్లా...గౌ..."

పెదవుల్తో ఆ కన్నీళ్లు చప్పరించి...

చేతుల్తో ఆ మెత్తటి తనువు స్పృశించి...

"వచ్చి... ఆ పెట్టె తెరుస్తావా?... పుస్తకాల్చూస్తా..." అని నేనంటే...

"ఇంకా మూసున్న పెట్టే కన్పిస్తోందా మీకు" అని విస్తరించిన గౌరి...

వచ్చి రోజాయీ తీసేసింది... "పైన యెండకి ఆరేస్తే కొద్దిగా...యేం? అట్లా చూస్తున్నారు? మీరిష్టమే స్వామీ... మీ చెమట వాసన కూడా ఇష్టపడాలంటేయెట్లా?"

దిండు సంచినీ మార్చి... మరో లేత నీలం సంచీ తొడిగి... వట్టి చాప మీద వేసి... "అదో మీ యిష్టం... పుస్తకాలున్నాయి... నన్నో గంట డిస్టర్బ్ చెయ్యొద్దు. వంట, స్నానం అన్నీ ముగించుకొస్తా... తర్వాత మీ ఇష్టం...ఆ...ఆ... ఇష్టమంటే అంతా కాదు... అశొద్దమ్మా"

తల్లో వేళ్లు పెట్టి... తలంతా చెరిపి...

"దీవాన్‌యే గాలిబ్" తీసుక్కూచున్నా... హిందీ దేవనాగరిలో ఉంది... పుస్తకం... పోనూ పోనూ... గౌరీ మనోహరి... కష్టంగా...

నా ముందు ముద్చుకున్న ప్రవల్హికలా...

దేవనాగరీ గాలిబ్ గౌరీ మనోహరీ ప్రహేళికా...

హిందీ చదవగల్ను... కానీ ఇది ఉర్దూ... హిందీలోకి ట్రాన్సిలిట్రేట్ చేయబడి... "వెహషత్, షోహరత్, కత ఆ, తఅల్లుక్, అదావత్' కష్టం కాదూ... కాదులేతెల్సుగా... మధురమైన భాష ఉర్దూ...

మద్యాన్నీ, మంచి పద్యాన్నీ పోల్చి శ్రీశ్రీ...శేషేన్ గురించా? అవుననుకుంటా... కవీ నీది మంచి పద్యమా ఫ్రెంచి మద్యమా అని.

ఆకలేస్తోంది... నీర్సంగా ఉంది... పడకుంటే మళ్లీ నిద్రొచ్చేట్టుంది... యెందుకు జ్వరమొచ్చిందినిన్నా...? గౌరీ 'సాన్నిహిత్యం కోసమేమో...! యేమో పూర్తిగా లోపలి కొచ్చేసినట్టు గౌరి... నాలో లోపల్కి... యేదో ఉత్తేజం... యేమేమో... కాత్యాయన్నచ్చి పోయుంటుందా...? పోయుంటుంది... పోతేనే మంచిది... చాల్సేపట్కి... యెంతో కాలానికి... యెప్పటికో గానీ రాలేదు గౌరీ... వచ్చినప్పుడు మాత్రం వసంతమై...

వక్కరంగు చీరలో... తల విరబోసుకుని... నుదిటి మీద పెద్దగా... గుండ్రంగా కుంకుమ అద్దుకుని... విచిత్రంగా... యెందుకూ... ఇంకా కుంకుమ?

వచ్చి 'హమ్మయ్యా' అని గోడకి నా పక్కన్నే చేరగిలి...

"వూ చెప్పండిప్పుడేమేం చెప్తారో" అని...

కమ్మటి గౌరీ... యేమో నముల్తోంది...

"యేమిటదీ లవంగమా!"

"వూ" నాలుక చివర బైట పెట్టి

భుజం మీ్మద చెయ్యేసి... మొహాన్ని నా పక్కకు తిప్పుకుని ఆ కళ్లలోకి చూస్తూ... నిగ్రహించుకోవల్సినవసరం ఉందా అనుకుని...

ఆ పెదవుల్మీద... మధువుల పెదవుల్మీద... నా పెదవుల్తో...

"వూ...?" గౌరి...

"వూహూ" నేను...

"ఇన్ని సంవత్సరాలు వ్యర్థమైపోయాయనిపిస్తోందా?" అంది.

"వూహూ... ఇన్నేళ్ళ నా ఉపాసనకి... ఈ రోజు వరం"

"మీరు వేణువూదుతార్ట కదా?"

"ఇంకా యేమేం తెల్సు నా గురించి...?"

"అబ్బో! యెన్నో... మీరు మంచి కవితల్రాస్తారు... బొమ్మల్గీస్తారు కమ్మగా వంట చేస్తారూ... మస్తుగా తాగుతారూ... పిచ్చిగా చదువ్తారూ... తాగిబూతుల్మాట్లాడ్తారూ... అట్లా యెన్నెంటే... యెలా?"

"ఎవరు నీకిచ్చెప్పిందివన్నీ? భగవాన్లా...వూ?" కదూ"

అవునన్నట్లు తలూపింది...

"మరి... మరి నీ గురించి నాకెందుకస్సలేమీ చెప్పలేదు వాడు?"

"యేమో... అతనికి మాత్రం మీ అబ్సెషన్ చాలా ఉంది... యేమొచ్చినా సరే వాడైతే ఇట్లా చేస్తాడు"... ఇదే వాడైతే ఇట్లాగనిండేవాడు... అలా... అలా... అన్నిటికీ మిమ్మల్ని పోలుస్తాడు... మీ గురించి వినీ విని... నిజం చెప్తా... ఒక్కోసారి విసుగనిపించేది".

యస్.... భగవాన్ల పెట్టెలో పెట్టుడ్గడ్డం మీసాల్సెట్టు నేనైవాడు... వాడు మచ్చల మొఖపు పిచ్చి భగవాన్లు... యెక్కడ్నుచ్చినాడో... అనాథ వెధవ...

మనస్సంతా చేదుగా అవుతోంది...

"ఇదుగో ఇది కూడా... ఇలా ఉన్నట్టుండి... బైటి ప్రపంచంతో సంబంధం తెంపేసుకుని మీలోకి మీరెళ్లిపోతారని... వూ... 'అంతర్ముఖుడు' అవునంతర్ముఖుడౌతాడు... అనే వాడతను!!"

"ఇంకా?"

"ఇంకా...! ఇంకా... అట్లాగే... దాదాపు మీ గురించితనికేమేం తెల్సో... అంతా... నాకు నూరిపోశాడు... యేమో... నా మంచికే అన్పిస్తోందిప్పుడు..."

"యెలా?"

"ఇలా" నా వొళ్లో వాలి... నా చేతిని గుండెల్మీద గట్టిగాహత్తుకుని... నా వొడి నిండా పరచుకున్న వెంట్రుకల్తో...

"మరి... వాడు... భగవాన్లొస్తే..." యెట్లా చెప్పేది...

"వస్తే? నేన్నిజం చెప్తున్నా నాకు ముందునుంచీ అతన్తో యెట్లాంటి సెంటిమెంటలటాచ్మెంటూ లేదు. అతనికి నాతో ఉంటే అది నా తప్పు కాదు. తన గురించంతా చెప్పుకున్నాడు. నిజమే, అతని జీవితం వింటే యెవ్వరికైనా బాధకలుగుతుంది. బాధపడే మనిషి... ఇంకో బాధపడే వ్యక్తికి స్నేహాన్నిచ్చి రెండుసాంత్వన వచనాలు పలకడం సహజం... అందునా... నా శరీరాన్ని కొనే వ్యక్తుల్ని చూసి చూసి అలసిపోయి... అతన్లాంటి వ్యక్తితో కొంత రిలీఫ్ పొందవచ్చు... యేమో... మొన్న నేనబార్షన్చేయించుకున్నప్పుడు డబ్బిచ్చాడు... నా దగ్గర్లేక కాదు... ఆ రోజు మీరిచ్చిన యాభై కూడా... అదో మనస్తత్వం... ఏదో లేని దగ్గరతనాన్ని చాటుకోడం... అయినా సరే, ఏదో మూల నా కతనంటే జాలి... అందుకే అతనెప్పుడొచ్చినా నేనన్నం పెట్టేది. మొదట్సారి మిమ్మల్ని పిల్చుకొచ్చినప్పుడు... నా గుర్తుంది... అప్పటికే మిమ్మల్ని చాల్సార్లు చూశా... బిడియంగా... తలొంచుకు కూచున్న మిమ్మల్ని చూసి... బాధేసి... తాగుడు... దాని మీద వంటరితనం మనిషిని ఎట్లా మార్చగలవో అనుకుని ఆ రోజే మీరంటే... ఊ... ఏం చెప్పనబ్బా... ప్రేమా?... ట్రాష్ కాదు... ఏదో ఇది లెండి... అనిపించి... అతన్తో చాల్సార్లడిగా... మిమ్మల్ని పిలుచుకురమ్మని... దానిక్కాదులెండి... ఊరికే ఇలాగా... ఇలాగంటే ఇట్లా కాదు. ఊరికే భోజనానికి లాగా... అన్నమాట... "వాడురాడుఅంతే" అనే వాడతను... నిజం చెప్పనా... మీరు కవితల్రాస్తారన్తెల్సిం తర్వాత ప్రభలో పడ్డ మీ కవితల్చదివించుకో

డానికి... చాలా బాగా చదువుతాడతను... అదే అంటే... 'ఈ కవిత అసలు వాడి నోట్నుంచి వినాల్సిందే' అంటాడు... నాకు తెల్సు... హివాంట్సుబిక్వైట్ పొసిసివ్ ఎబౌట్మీ... ఏమో అదీ కాక మొన్న...

ఠక్కున లేచి కూచుంది... "ఏమిటీ కనీసం ఆ వూలు కూడా లేకుండా?"

"గౌరీ...! అర్థం చేసుకోగల్ను... వాడు నన్ను నీ నుంచి చాలాదూరం పెట్టే ప్రయత్నంలో నిన్ను నాకు దగ్గర్చేశాడు... ఏమైనా సరే... నేన్నిన్ను అడగొచ్చో లేదో నాకు తెలీదు... కానీ... చెప్పాలనిపిస్తోంది... వాడితో నువ్వు... నో అయ్ జస్ట్ కాన్సేరిట్"
"యూ నో సంథింగ్! హి నెవర్ స్లెప్ట్ విత్మి అదే కదూ మీరడగదల్చింది?"

"గౌ...?!"

"వాడికి నువ్వంటే ఆరాధన..." కానీవాడిగదిలో సురవరం పుస్తకం మధ్యన చిల్లులు చిల్లులైన గౌరి ఫోటో... ఏమిటీ కకావిక!"

"మరి మీకున్నదేమిటో?"

"నిజం చెప్పు... నీకు తెలీదా?"

"వూహూ..."

"నిజెం?"

"వూహూ"

"నిజ్జెంగా?"

"నిజ్జం... నాకేం తెలీదు మీరుచెప్పరూ?"

"నిజం చెప్పు నీకు తెలియదా...?

నువు కనురెప్ప లార్పినప్పుడో సంధ్యనీ

నీ మనోముఖం తెరచినపుడో ప్రబంధమనీ... నిజం చెప్పు...

ఈ అరణ్యాల ఆకుపచ్చటి రహస్యాలనరుస్తున్న

ఆకులకు తెల్సా...

స్ఫటికపు నీటి పొరల తెరల మాటున శిలాసంధ్యల కుసుమించే శిలీంధ్ర ఇంద్రజాలాలు...?

ఆ ఆకులకు తెలుసా

ఈ బదనిక మదన పత్రికై

కొమ్మ కొమ్మకో కమ్మని కథ చెబుతూ ప్రభవిస్తుందని?

నిజం ఎవరికి తెల్సు?

నువ్వూ నేనూ పరిమళించే పాపాలమని

రంగుల రేకులు విసిరేసే దీపాలమనీ...

ఎవరికి తెలుసు...

ఈ చీకట్లో ఎక్కడెక్కడి కిరణాలో ఒక్కటై అల్లుకున్న ఆలయ శిఖరాలమని?

నిజం చెప్పు నీకు తెలియదా

నువు కనురెప్పలార్పినప్పుడు నాకో సంధ్యని...!!"

నా తలని రెండు చేతుల్తో పట్టుకుని... కళ్లంతా తెరచి...

"నే... నేనేనా...? అదంతా...వూ? ప్లీజ్... నేనేనా...? ఎట్లా... ఏమని... ఓహ్... నిజం...? నే...నే కన్రెప్పలార్పితే మీ...కో సంధ్యని... నాకు తెల్సా?... ఓ... గాడ్! ఎట్లా? రెసిప్రోకేట్ చెయ్యను? ఎందుకలా నేన్భరించలేని ఆనందాన్ని నా మీద కప్పుతారు... ప్లీజ్ మరొక్కసారి... మరొక్కసారి ఆ ఆఖరిలైన్లు చదవరా... ఎక్కడెక్కడి కిరణాలో... ఈ చీకట్లో ఒక్కటై అల్లుకున్న ఆలయ శిఖరాలమని... వూ?... ప్లీజ్..." కన్నీళ్లైన ఆనంద వివశత...

"గౌరీ...! అరే... ఎందుకని... ఛీ ఊరుకో ప్లీజ్ వద్దు" భుజంచుట్టూ చెయ్యి చుట్టి దగ్గరికి లాక్కోబోతే...

"వద్దు... వద్దూ... ప్లీజ్ నన్ను తాకొద్దు... వూహూ..."

రుధిర నేత్రాల్తో... క్షుభిత గౌరి...

పొరపాటు చేశానా? ఏమో... ఎందుకో... ఊహించొచ్చు... కానీ... కాస్సేపలా మౌనంగా ఉండడమే మేలు...

ఎంత సేపు నిశ్శబ్దాన్ని పంచుకున్నామో తెలీదు...

గౌరి... అట్లా దూరంగా జరిగి చాప మీద్నుంచి... ఆ మేధావుల జైలు పెట్టె నానుకుని... తల విరబోసుకు... చెదిరిన కుంకుమతో... పగిలిన సంధ్యాకాశంలా... లేచి పక్కన కూచున్నా...

"గౌరీ...!"

శూన్యంగా నన్ను చూస్తే... భరించలేక...

"వద్దు... వద్దు గౌరీ! అలాగైపోకు... వద్దు..." రెండు చంకల్కిందా చేతులేసి లేవదీసి... నిలువెల్లా... అల్లుకుని... చాపమీదికి తెచ్చి... దిండుగోడకేసి... కూచోబెట్టి...

"గౌరీ! గౌరీ!" పిలిస్తే...

ఏవో లోకాల్నించి... మేఘాల్నించి... దిగినట్లు...

"వూ?"

"ప్లీజ్... చూడూ... ఏయ్... గౌరీ! నన్నింకా హింసించకు... చూడూ...

"నేన్భరించలేను... ప్లీజ్..."

ఆ పల్చటి చెంపల్నీ... ఆ నిండు పెదాల్ని... ఆ మెడనీ... ఆ గొంతుకనీ... ఆ వక్షాన్నీ... ఆ పల్చటి పొట్టనీ... పెదవుల్తో తడుపుతూ...

ఆ వొడిలో ఆగిపోయి... నడుం చుట్టూ చెయ్యి బిగించి... నే నొదికిపోతే... ఆ వెన్నెల వేళ్లు... చీకటి చిక్కుల సవరిస్తూ...

నా తల్లో...

"నేన్నీ ప్రపంచానికి క్యాన్వాస్ని... నీ బొమ్మలన్నిట్నీ రాసుకో" అని గౌరి... ఒక్కసారి వెల్లువలా... ఉప్పెనలా... నను లేపి... చాలదా... ఆ పిడికెడు కాలం...?

"ఆకలేస్తోంది...గౌరీ!" అన్నేనంటే

నా మొహాన్ని చుట్టేసి... "మొమ్ము పెట్టేదా? వూ...? మ్..."

నాగరికతల్ని చింపుకుని శివమెత్తిన... నా ప్రథమ మనో ప్రవృత్తి తాండవమాడితే...

* * *

ఈ రోజు

ఈ రోజే నిన్నటికి రేపై...

రేపటికి నిన్నై... యేదీ యేదీ కాని చైతన్య సమాధిలో

ఎప్పుడో చిన్న పాపడినైన నేను... నేనిప్పుడో ఆడతనపు

ఒడిలో మళ్లీ గతాలకు తిరోగమించి...

ఏ గమనం...? యెటు పక్కకి...?

అది మొదలనుకున్న భ్రమలోంచీ... అంతమనే చింతన లోకి అమేయానం దాన్నలాగే చుట్టుకు... కప్పుకునుండలేక... అది జారీ జారీ... మళ్లీ మళ్లీ అందుకునే శైశవ యత్నాలతో... నిజంగా మనిషి యెదిగాడా?

నాగరికతల్నిర్మించబడ్డాయా?

ఇన్ని మేధో వీధుల్నిండా భావ జీవ జాలం నిండుగా ప్రవహిస్తూ... ఎన్నెన్ని...

సంబంధాలో... యెంత బాంధవ్యం... ప్రతీ క్షణం నవ్యం... దివ్యం... మళ్లీ భయం... భయం... వెలుతురు వాకిళ్లు తెరిస్తే అంతా కురిసే తమస్సే... కానీ... ఈ క్షణం... నేను... నేనెవరిని అనుకునే నేను కాని నేను... మరెవ్వరు...?

ఈ దేహం నుంచీ విడివిడి... శూన్యాన నిలబడి... నన్ను చూసుకునే నేను కాని నేనుని... ఈ దేహమేదంటే... నాదని...!

నా చొక్కాలా... నా దువ్వెనలా... నా గౌరీలా... నా గౌరీ లవణిమలా... అంతా... సరే... నేను మాత్రం కాక, చొక్కా నేను కాను... దువ్వెన్నేను కాను... గౌరిన్నేను కాను... మరి?

నే...నో?

ఈ పారభౌతిక అస్తిత్వాన్ని ఎలా చెప్పను?

ఏమని చెప్పను?...

నేనో ఆలోచనని మాత్రమే అని...

నేనన్నదో భావ చిత్రమని...

చిత్ర విచిత్ర భావమని... ఎలా?

నేనన్నది నేను కాదనీ...

నేను లేననీ...

నేను శూన్యమనీ... శూన్య భావ తమస్సునని...

నేను...

నేను... చీ...క...టి...నని...

* * *

మర్నట్రోజు మధ్యాహ్నం...

జాన్సన్గాడు... ఏదో మంచి గిరాకీ తగిలినట్టుంది. బైటికిపోతూ పోతూ... 'వస్తావా? లైట్‌గా రెండు రౌండ్లేసుకుందాం' అంటే... మనసు మాట వినని నరాల... మాట విని... నా దేహం కదిలి జాన్సన్తో... బ్లూడైమండ్ బార్లో... చీకట్లో... చినుకులైరాలే... మత్తు కోసం... ఉన్మత్తతలో... ఆ గ్లాసుల్లోకి... ఆత్మల విదిలించి అస్తవ్యస్త ప్రేలాపనల్తో... నేను కాని నేను జాన్సన్‌తో... ధన్మాలని తలపోసుకు... మస్తాన్

"మ...స్తా...న్?"

పెదవి చిట్లి... రక్తం స్రవిస్తూ... ఏడుస్తూ... మస్తాన్

కన్నీళ్లు రక్తం... ఎంగిలి... కలిసి... పెదవి చివర్నించీ కారుతూ... "సార్... రా... సార్... అక్క... అక్క నా లంజెకొడ్కులు సంపేస్తార్సార్...

అక్క... అక్క..."

నా చెయ్యి పట్టుకు బలంగా... ఆ ఖొజ్జా మస్తాన్...

"మస్తాన్?"

"నువ్వేం చెప్పాకు, రా సార్... ముగ్గుర్సార్... ఆ నా కొడుకులు రా... అక్క.. సచ్చిపోద్ది... సార్ నీ కాల్లు మొక్కుతా..."

మరుక్షణం రోడ్డు మీద నేనూ, మస్తాన్...

ఆ మరుక్షణం... నా దేవాలయం ద్వారంలో...

లోపలి కడుగేసి...

నా ప్రాణాల్ని విసిరేసి...

మంచం పక్కన కింద నేల మీద...

పూర్తిగా... నగ్నంగా... కాళ్లు విడివడి... ఆ కాళ్ల మధ్య రక్తం ధారలై స్రవిస్తూ... నా గౌరి... నా బొమ్మ... నా అమ్మ... నా దేవతా గౌరి...

ఆ కాళ్ళ మధ్య స్థానం వధ్యస్థానమై

నాగరికతలన్నీ నరకబడి... నా తల్లి గౌరమ్మ 'గౌరీ'

చలనం లేని... మనోహరి...

ఆ మదనాంగం పైశాచీ కదన రంగమై...

చల్లటి మంచల్లే...

చచ్చిపోయిందా?...

'గౌ...రీ...!" నేను...

"అ..క్కా!" మస్తాన్...

'దేవుడా... ఆ చీరచుట్టరా..." అన్నేనంటే...!

టవల్తీసి... ఆ రక్తం తుడిచి... నేన్నిలబెట్టిపట్టుకుంటే ఒక నిముషంలో చీరకట్టి... ఆ ఖొజ్జా... షండ... హిజ్డా... ఎవరు ఎవర్రా మగ వెధవలు...

రేయ్ లంజకొడుకుల్లారా... ఎక్కడ్రా మీ మగతనాలు... ఈ పైశాచికత్వాన్ని

తలుపుల్చాటు నుంచి మీ భార్యల భుజాలపై నించీ చూసే మీరు... మీరు... మీరంతా... ఖొజ్జా[లా... రేయ్...

అక్కా... అక్కా... ఏడుస్తూ... బైటికి పరిగెత్తి మస్తాన్ మాయమై... మరుక్షణం... మళ్లీ దేవుడై ప్రత్యక్షమై...

"సార్... బండొచ్చింది పా..." అని గౌరి నెత్తుకోబోతే.

"వద్దు... వద్దు మస్తాన్... అని నా గౌరిని... లేత ఆకల్లే ఉన్న నా గౌరిని... చిరిగి ఛిద్రమైన మానత్వం... పొట్లం కట్టినట్టున్న నా గౌరిని చేతుల్లో కెత్తుకు బైటికొస్తే... ఫిఫ్టీనైన్ ట్వంటీ టూ యెత్తి రాజుల శవాల బండి...

తెల్లటి గౌరి నీలంగా కన్పబడ్తోందేం...?

మాట్లాడదేం...?

వద్దు... నా తల్లి... నా గౌరీ... నన్ను వదిలి... వద్దు... కళ్ళనీళ్ళు దృష్టిని దూరం చేస్తూ... శవాల బండిలోకి... గౌరీశవం...

"వ...ద్దూ" అన్నేనరిస్తే...

"అన్నా...నివ్విడ్సన్నా బండి... జల్దీ... అదిమ్మొక్కునా...

అక్క సచ్చిపోతాదన్నా..." మస్తాన్మానవత్వం... డాక్టర్... ఉమానాథరావు... వచ్చి చూసి... చెయ్యి పట్టినాడి చూసి... పెదవి విరిస్తే... నా గౌ...రీ...

మళ్ళీ జీవ చైతన్య శబ్దవేదిని చెవులకు తగిలించుకు చూసి...

"సిస్టర్... క్విక్... షీయీస్టిల్ అలైవ"ంటే...

ఒళ్ళంతా ఆనందమై... ఆ వరండాలో... గోడకు కూలబడి... నోరంతా తెరిచి 'అమ్మా' అనేడిస్తే...

నా చుట్టూ, బలంగా... దృఢంగా... చెయ్యేసి... మస్తానన్న...

"ఛి వద్దుసా...ఊకో... అక్కకేం గాదు... నువ్వూకోసా..." అని నా కన్నీళ్లు తుడిస్తే...

పరిమళిస్తున్న మానవత్వాన్ని మస్తాన్రూపంలో చూసి వంగి ఆరెండు పాదాలకి నే నమస్కరిస్తే...

"ఛూ ఊకోసా..." అని నన్నక్కున చేర్చుకుని

మ...స్తా...న్...

కామం...! ఎందుకిలా...? మృగాల్లో కూడా లేనివిధంగా... ఎందుకీ

వికృతత్వం... స్వాముల కాముల... పాముల గుసగుస మంత్రాల్బుస బుసలై కామం...

చెసబూల్కిందా చెరచబడ్డ చేస్టిటీ యై కామం... నన్నరీల్లో కన్నెరికాల కసిగా కామం...

నెబకోవ్, లోలితాల లాలిత్యాన్ని పదేళ్ళ పాపను మొగ్గలోనే పువ్వును చేసే కామం... నల్లటి పరదాల్లోపల సరదాల కురేసి స్త్రీత్వ శవాలను మతానికి వేలాడేసే కామం...!

యేమతం?

యే ఆచారం?

యే నాగరికతలివి?

ఆడతనమాహారమై... ఆకలి గొని ఊరే లాలాజల వీర్యాలుమ్ములై...

కామం...

కొద్దిసేపటికి మస్తాన్ ద్వారా తెలిసింది.

వచ్చిన వాళ్లు... గంజి ఇస్త్రీ ఖద్దర్లు... నాల్గురోజుల్గా జానకింటి చుట్టూ జీపులో తిరిగి... ఈరోజుదయాన్నే వచ్చి... బలవంతంగా లోపల్దూరి... అడ్డుపడ్డ మస్తాన్ని కొట్టి...

"ఆ శవాలోడు నీ లవ్వరంట కదనే... ఆ దుద్దుల్నీకిచ్చినాడు...త్యా" అని ఒకడంటే...

"దాన్నా మాదిరడిగితే సెబ్తదాన్నా?... పండేయిముందు..." అని ఇంకోడు పశువైతే... గదులన్నీ చిందర వందర్చేసి... పెట్టెలోని మేధావుల్ని ఇంటి నిండా తరిమేసి... బీరువాలో చీరలు లాగి, బట్టలన్నీ గుట్టలుగా... చేసి... ముగ్గురూ పాశవికంగా... లేత జానకీగౌరిని... కసికసిగా నలిపి హింసించి... జవాబు రాబట్టలేక... ఆ మేధావులంతా మౌనసాక్షులు కాగా...

డాక్టరొచ్చాడు...

దైవం లాగా... నల్లగా తెల్లకోట్లో... మెళ్లో ఆ జీవ చైతన్య శబ్ద వేది వేళ్లాతుడూ... దేవుడల్లే ఉమానాథ వైద్యుడు... "యేం పర్వాలేదు... ఏదో షార్ప్ ఆబ్జెక్ట్...తో ఆమె ప్రైవేట్ పార్ట్ని... హర్ట్ చేశారు... అందుకే ప్రొఫ్యూస్ట్ బ్లీడింగ్... బ్లడ్ కూడా దొరికింది... కొంచెం జాగ్రత్త... పోలీస్ కేస్... యెమ్మెల్సీ చెయ్యాల్సిందీ... మీరు మానేజ్

చేసుకుంటే... ఓకే...” నవ్వి... ఆప్యాయంగా భుజం తట్టి... నడుస్తున్న దేవుడై... ఉమానాథ్రావ్...

ఎందుకిలా?... ఆమె... గౌరి... ఆడతనమైన మనోహరి... మానంలో ఏదో కరుకు వస్తువు పెట్టి కసికసిగా... మానవత్వం మసిగా మారి... మగతనంలేని... భ్రష్ట సమాజం... నపుంసక వ్యవస్థ...

అమ్మా... నేపుట్టిందక్కడేనే...

తల్లి... చెల్లి... అక్క... ఆడతనం... ఆకలేస్తే అన్నం పెట్టే మానవత... పరిఢవిల్లే ఆ నాజూకు తల్లిని ఇట్లా... ఈ విధంగానా మీరు సత్కరించేది?

సమాజమా! నీ సభ్యతెక్కడ?

చెప్పు... అస్సల్నువ్వెక్కడ?

షండల్లారా! రండిరా... నాముందుకు...

గౌరీ!...

కన్నీళ్లై నా అసహాయత ప్రవహిస్తోంటే... జీవకారుణ్య రూప మస్తాన్.

“సా!లెయి... ఆ... సెట్టైనిక్కిబోయి... ఇదికొంచెం గొట్టు... అక్కకాడ నేనుంటాలే ఏం కాదుసా!” అనంటే... ప్రేమించమని ప్రబోధించిన ప్రవక్తక్రీస్తు శరీరాన్ని చీల్చుకుని దిగినవి కూడా సూదిమొన మేకులేగా అనుకుంటూ... మస్తానెచ్చిన మందుసీసా పట్టుకు... ఆ చీకటి చెట్టు వెనక్కి... తమాల వృక్షం చీకట్లోకి... వెల్తురుకోసం మళ్లీ...

నే నొంటరినై... ఆ స్ఫటిక కలశం పట్టుకు...

భాషను మింగేసిన పాండిత్యంలాంటి పరిపక్వ స్వప్నం ఒకటి నా చేతనా సుషుప్తి నుంచి రాలి... పడమటి సూర్యుడిలా పగిలి పగిలి రంగులు కక్కి

నే... గతంలోకి జారిపోయి...

వాసన వీడనియేవో నవ్వుల్ని మళ్ళీ మళ్ళీ... నా జ్ఞాపకాల దోసిళ్ల నింపుకు వస్తూంటే... ఓహ్! ఇంకా... ఇంకా... ఇంకెంత దూరం... మధ్య నున్న ఆకాశాన్ని చుట్టుకుంటూ నేను అలసి... సొలసి...

గౌరి... జానకీ మనోహరి...

వాసంత సమీర గౌరీ మనోహరీ... నేనూ... కలిసి వెండివెన్నెల కలశాన్ని మోసుకొస్తూ...

కానీ... కలశం కదిలి తొణికి ఒలికిందేమిటి? నే కన్రెప్పల్మూసిన కాంతి... నా గుండె మెడదన్న భ్రాంతి...

చాలు...

చాలూ... చాలీ రాగం... తీగ తెగ్గల్దు... చాలీ రాగం... వియోగం మోయాల్సొస్తే?... చాలీ రాగం చీకటి పడ్తుంది... తీగ తెగిన రాగం చినుకు చినుకై రాలి... ధ్వాంతావర్త రాగం... చిత్రం! అరే... ఏమిటది?

కృతక హాసం

బతకలేని భావన...

పవిత్ర మృతి...

ప్రకృతి... కృతీ... పాశవికతా...

వద్దు... ఈ దూరం భరించలేను... ఈ శూన్యాకాశాన్ని చుట్టుకుంటూ...

సీసా లోంచి పచ్చి విస్కీ అలాగే... గుక్క గుక్కా.. తాగుతూ... సిగరెట్ వెలిగించుకు...

వెర్రెత్తిన కాలాశ్వపు భీషణ హ్రేషధ్వని...

శుష్క మస్తిష్కాన్నీ చిక్కబెట్టుకు... భైరవ ఘోషధ్వని...

కాల్వెనక్కి లాక్కుని... ఎక్కడ?... ఎక్కడివీ? అని జీవచ్ఛావాల... జానకీ... గౌరి... మానవ శవాల శీతల శోణాన్ని చప్పరించే నాల్కలు చాపుకున్న నక్కలవనీ...!

రేయ్...! యేం మోస్తున్నావ్రా నాగరికుడా?

నా గోరీకి రాళ్లు...!

పిచ్చి కొడకా...! నువ్వు గోరీలో చేరే సరికే... నువ్వు మళ్లీ ఒలికి మిట్టలో సైతానుల సేవకు తయారౌతావురా...

హి...హి...హి... మరి నువ్వు ఇప్పుడెక్కడున్నావ్? రేయ్... కళ్లు మూసుకు కొలుస్తున్నావేమిట్రా?

ఆకలి...! కలీ...!

దేంతో... కొలుస్తావ్రా...?

కోరికల్తో...!

అమ్మా...! ఎవరికే అన్నం పెడ్తున్నావ్?

నిశాచరులకూ, పిశాచాలకూ నాన్నా!

మరి కంచంలో అన్నం బదులేమో కనబడ్తోందేమిటే...

ఆడ మాంసం... రక్తం... నా తండ్రీ...

"మస్తానూ... ఒరే... నీకు మానవత్వముందా?"

"నే...ను...దే...వు...డ్ని...సా..."

తల విదల్చుకు... నేన్నేనై... మళ్లీ... సీసాఖాళీ చేసి చెత్తల్లోకి విసిరేసి... సిగరెట్ ఆఖరి దమ్ములాగి... రెండు జేబుల్లో చేతుల్పెట్టుకు మళ్ళీ... హాస్పిటల్లోపల్కి... భగవాన్లెక్కడా?... దొంగ నా కొడుకు... వాడి ప్రాణాల్తీపితో... నన్నొదిలి... రానీ... గాడ్దికొడుకుని... అనుకుంటూ...

విశ్లథ గౌరీ దేహ ధారి ఖట్టిక చేరి...

"మస్తాన్! నువు పో... పోయి ఇంతన్నం తినిరా..." అని చేతికి డబ్బివ్వబోతే... నన్ను చిత్రంగా చూసి... మాయమై మస్తాన్...

ఒళ్లు కొద్దిగా... వెచ్చ వెచ్చగా... అవుతూ... జీవనాడుల్లోకి ఏవేవో ఓషధీవాహక కృతక నాడులు పెనవేసుకు...

నా...జా...న...కి...

గౌరి...

మనోహరి స్త్రీ...

ఇంకా అచేతనంగా... బాహ్య ప్రపంచపు... భావనలింకా తాకక... అలా... అచలంగా ఆ...డ...త...నం.

హాస్పిటల్వెనక చర్చీ...

చర్చీ గోపారాల్వెనక చంద్రోదయం...

ఇటు ఇంకో పక్క సూర్యాస్తమయం...

ఒక వెల్తుర్చచ్చి... ఇంకో ప్రతి వెల్తుర్జన్మించి

ఇది అంతమై

అది మొదలై

వెల్తుర్లేమిలోంచి పల్చటి నీలి వెల్తురు పుట్టి... తొలి మలి సంధ్యల నడుమ నులికాంతుల... కాంతుల భ్రాంతుల...

ఇంతుల చేమంతుల రక్తపు వాంతుల...

ధ్వాంతాకాశాల ఉన్మిషితమైన పాలపుంతల పుంతల... సారా... ముంతల

వింతల... ఉపరథ్యలలోకాంతాల... అతలాకుతల స్వాంతాల... వ్యాకులతల... కకావిక... చెదరి చెదిరి... పచ్చిమందు... కడుపులో రెచ్చిపోతూ...

నేను మళ్లీ చీకట్లో ఒంటరినై...

అచేతనంగా పడున్న నా గౌరీ మనోహరి మంచం పక్కన స్టూల్మీద కూచుని... ఆమృదు హస్తాన్ని నా చేత్తో వెచ్చగా కప్పి...

రెప్పల్చీల్చుకు రాల్తున్న కన్నీళ్లని తుడుచుకునే సత్తువ కూడా లేక...

ఎప్పుడో... ఎన్నడో... ఏవో శతాబ్దాల క్రింద పరిథవిల్లిన నాగరికతా మనోజ్ఞతలు శిథిలాలై చెల్లాచెదురై... పడున్న పురాతనత్వం లాంటి గౌరి పక్కన కూచున్నా!

మేథోరణ్యాల దారులు చేసుకుంటూ వచ్చే భావజీవాలు...

నేనపశృతి విహ్వల ప్రకృతుల మధ్యన... మొలకెత్తిన మానవావశేషాలు అంతరించిన నాగరికతల్లో...

కొమ్మలై... రెమ్మలై... విస్తరిల్లే...

జ్ఞాన వృక్షాలు...

ఆత్మశోధనా క్షాళనంలో

చినుకు చినుకై రాలిన వివక్షలు...

నన్ను నేను అంతరింపజేసుకునే... సమాధులు

రేపటి ప్రత్యూష ప్రతీహారాలు వికసించి చూసే వీధులు...

రేపట్లో... ఈ రోజులు...

ఈ రోజు ప్రేపైన భావనతో నిన్నలు...

నిన్నల్లో మొన్నలు...

రేపటి ఉదయ పత్రికల...

ఈ రోజున మరణాల నినాదాలు...

ఏది... చరిత్ర...?

ఏది నాగరికత?

చిన్నగా కదుల్తోంది...

గౌరి...

"గౌ... నా తల్లీ... రేయ్... చూడ్రా ఇటు... అమ్మా! గౌరీ!" ఆత్రుత మాటల్ని

తడిపితే... చిన్న చిన్నగా రెప్పల్విడదీసి... ఆ క్షతగాత్రి గౌరి నన్ను చూసి... "ఆ..." ఆ వడలిన పెదవులు విడదీసి... బంకలు సాగిన ఎంగిలితో... కన్నీళ్ళిగిరి పోయిన కళ్ళతో... ఏడిస్తే... మగ పుటక పుట్టినందుకు సిగ్గిల్లి నేను...! ఆ నుదుటి మీద మృదువుగా చుంబించి...

"గౌరీ... నన్ను చూడ్రా... నా తల్లీ...! నువ్వేం ఆలోచించొద్దు... మనం... మనం... ఈ దౌష్ట్యం నుంచి దూరంగా... రేయ్...గౌ...!" మాటల్రాని భావన కన్నీళ్లై విడిగా ఉన్న వామహస్తంతో నన్ను... నా తలనూ... నా తలవెంట్రుకల చిక్కును... బలంగా... విపరీతమైన బలంతో... బలంగా గుంజుతూ... నీ...ని...జం... నీ...కోసం...కా...పోతే...నా కస్సలు... ఈ బతుకు... నా... దేవుడా...! నన్ను చంపేయి..."

"గౌ...రీ!"

"అవును"

"వద్దు... వద్దే... అమ్మా! నా తల్లీ... నా అన్వేషణ వ్యర్థం..." స్వార్థమా! అని నేనన్ను నేననుకుని... కృశిస్తే..."

ఆ చేత్తో నా తలని దగ్గరికి... ఇంకా... ఇంకా... దగ్గరికి లాక్కొని... ఓ విధమైన చెడువాసన వేస్తున్న పెదవుల్తో నన్ను పునీతుడ్ని చేస్తే... ఆ కశ్మలంలోంచి కమలంలా నేను ఉద్భవించి... ఉన్మిషించి...

శిశిరాల చిహ్నాలై రాలుతున్న ఆకులు, ఆర్తిగా కేకలు వేసే వసంతాల వేవిళ్లు... మళ్లీ మళ్లీ చివుళ్లై... అవున్నిజమే... ఏది? ఏది శాశ్వతం?...

నేను కాదు... నేనన్నదీ కాదు... ఏదీ ఏదీ కాదు ఈ నా చిప్పిల్లే ఉప్పటి కన్నీళ్లు... ఏవో ఏవేవో వసంతోత్సవాల చల్లే పన్నీళ్లు కావా...? ఎడమ కాలి చిటికెన వేలుని చిటుక్కున ఓ చిరు పిపీలికం కటుక్కున కాటేస్తే

"అ...బ్బా..."

ఎంత... ఎంతటి నేను... ఇంత... ఇంతటి చీమ వేటుకి... కాటుకి... భావనా వీధుల్నించీ పరువులెత్తి... ఎత్తి... భౌతిక సత్యాల అంచులకు... ఓ మనోజ్ఞ స్వప్నం ఛిద్రమై, శకలాలై పరుచుకున్నట్లు ఆ మంచం మీద గౌరి...

నేను... చీమకుట్టిన వేలుచుర్రుమంటుంటే... పాశవిక కామం పామైవేసిన

కాటు నుంచి కోలుకుంటూ ఇంకా... ఇంకా... ప్రమీలా గౌరి... కనులు తెరుస్తూ మూస్తూ...

ఆసుపత్రీ... బిల్వపత్రీ... కల్వకుర్తీ... మాచిపత్రి... కక్కుర్తి... పిండభుక్తి... ముండా నురక్తి... గండరగండ శక్తి... థూత్... ఎప్పుడో నీకు విముక్తి. ఈ వాడిపోయిన మోడును వికసింపచేసి పుష్పింపచేయను...

ఏ వియచ్చరస్త్రావాలి...?

దోహదమా...?

ముఖ సీధువా...?

ఆలింగనమా...?

తీక్షణ వీక్షణమా...?

మృదు కరస్పర్శనా...?

ముఖ రాగమా...? విముఖ యోగమా...?

సల్లాపమా...? మానసోల్లాస హాసమా...?

ఊర్పా...? మది నెమ నెమ్మది చేర్పా...?

పాటా...? ఎండిన బండల గుండెల చిప్పిల్లే ఊటా...?

నవ్వా...

ఓ పువ్వా... చివ్వున... ఈ చీకటుల వెలుగు రేఖల చిట్లి చిట్లి రేకు రేకై విస్తరిల్లి... నవ్వవా.

గౌరీ పువ్వా! నవ్వవా?

ఆసుపత్రి మూలల యేవో చీకటి గదల్లో బాధలు సుఖాలని అరుస్తూ కేకలై... మరణానికి ఓ చిటికెడు దూరంలోంచి... ఓ తల్లి కాన్పు... ఓ కేరింత... లోకంలో కొచ్చి జీవ చైతన్య రాగాల్లో కల్సిన ఇంకో స్వరం... ఇక్కడైతే ఆసుపత్రిలో కా...కానీ...

ఈ లోకపు చీకట్లో... చెట్ల కింద, గుట్టల ప్రక్క తూముల్లో... పబ్లిక్ పాయిఖానాల్పక్కన నాల్కలు జాపుకున్న... నరనరమూ తెంపే చేవ వున్న తమోజ్వాలల్లోంచి చివ్వున చిమ్మే చీకటి కిరణాలు...

మాయల్తో... ఆయాలు... బైటికి...

బస్టాండులో చేటల్లో చెల్వారే అసంపూర్ణ జీవాలు చీకటి కోరికల్పూసిన పూవులు...

చిరిగిన చీరల్కప్పి రోదిస్తూ నాగరికతల్తో వాదిస్తూ కాళ్లూ చేతులూ తప తప తపతప తపా తప్మని తన్నుకుంటూ...

"అన్న... బాబూ...

అనాధను... పచ్చిబాలింతను... ఒక్క... ఒక్క పది పైసల్దర్మం... బా...బూ..."

చీకటికి...

కుక్కల్నాకిన మూకిటికి

సమాజం...

సంఘం...

నా మనో సముద్రాల ఉత్తుంగ భంగం...

విరిగి విరిగి

ఒరిగి... ఒరిగి... మళ్లీ జరిగి జరిగి కాలం కడుపులోకి వెనక్కి వెనక్కి ప్రవహిస్తూ నాగరికతల్ని హసిస్తూ...

☼ ☼ ☼

మర్నట్రోజుదయాన్నే

ఓ హెడ్ కానిస్టేబుల్నన్ను విచారిస్తూ వస్తూ వస్తూ ఆగి...

"మీరు... మీరేనా సారూ? రండి మా సియ్యెబాబు గారు పిలుస్తున్నారు... రండి... రండి" అని నా భుజమ్మీద కరుకుగా తడితే... మళ్లీ మొదలు... సాంఘిక దురాచారాలనుకుని నెమ నెమ్మదిగా బైటికి కదిలొస్తే... జీపులో... వాడు... ఖాకీలో... వెంకు... వెంకనబడే వెంకటేశుల్రెడ్డి... స్టీరింగ్మీద చేతులేసి... చిద్విలాసంగా... "ఊ..." అని పక్కన సీట్చూపిస్తే భయంగా... భయం భయంగా జీపెక్కి నేను ముందే ముందో తెలీని నేను చీకట్లో...

డిగ్రీ చదువుతున్నప్పుడు ఆ హాస్టల్లో పక్కూర్నించొచ్చిన వెంకటేశుల్రెడ్డి గది మా అడ్డా... భగవాన్లూ ఈ వెంకూగాడూ బియ్యేలు నేన్బీకాంగాణ్ణి.

వాడీ ఊరికి సియ్యెగా ప్రమోటై వచ్చిన్రోజే భగవాన్లన్నాడు "ఒరే... గడ్డపోడా... వెంకుకాడ్సియ్యెగా వన్టొచ్చినాడ్రా... పొయి మాట్లాడిద్దామా..."

"ఏమో ఆ రోజు వెంకుగాడీరోజు ఖాకీ వెంకటేశుల్రెడ్డి సైయ్యె కదా మనం చూస్తే... ఇట్లా వద్దులే" అన్నేను...

జీపు వాడే నడుపుతున్నాడు. మొహం ఎంత కరుకుదేలింది... మీసాలు పురుల్దిప్పి పులి మాదిరి...

ఒంటికొస్తే ఓర్చుకోలేక బిక్కమొహమేసే వెంకుగాడు కాదీ ఖాకీ వెంకట్రెడ్డి... ఇంతవరకూ ఒక్క మాటా మాట్లాళ్లేదు... వీడ్తో మాట్లాడ్తేయే... ఏమని సంభోదించాలి వీణ్ణి?"

సర్... అనా...? ఒరే వెంకూ... అనా? వెంకట్రెడ్డీ అనా? 'మిస్టర్రెడ్డీ! అంటే..." జీపు ఊరి బైట పోలీస్ గెస్ట్ హౌస్దగ్గరాగింది. ఇక్కడి కెందుకు తెచ్చాడు? గౌరి విషయమై మాట్లడ్తాడా?

గంజి ఇస్త్రీ ఖద్దర్ల లాలూచీతో భగవాన్ల గురించడుగుతాడా? నన్ను కూడా ఇన్వాల్వ్ చేసి ఇరికించి నన్ను గౌరికి దూరం చేసి నా బతుకునింకా హీనం చేస్తాడా...

గౌరి గౌరీ! దగ్గర మస్తానున్నాడు... కానిస్టేబుల్నన్ను తీసుకుపోతూంటే ఆదుర్దాగా బైటికొచ్చి జీపు ఎక్కుతున్న నన్ను దీనంగా చూసిన మస్తానున్నాడు గౌరి దగ్గర. పరిగెత్తి ఆస్పత్రిలో గౌరి మంచం పక్కనుండాలని మనస్సు తడితడిగా కళ్లు అప్రయత్నంగా చెమ్మగా...

"కూచో" గొంతెంత కరుగ్గా అయిపోయింది... అవున్నిజమే వీడు వెంకూగాడు కాదు సియ్యై వెంకటేశుల్రెడ్డే.

"థాంక్యూసర్!"

భుజమ్మీద దబ్మని... బండ బారిన చెయ్యి చరిచింది....

"గాడ్దె కొడకా! సార్... వూ? సార్?... దొంగనాయాలా వెంకు... వెంకుఅన్రా... సార్ సారంటావ్రా! వాడు... బళ్లారి గుమ్మాల మచ్చుల్నాకొడుకు... ఊరందర్తో సావకొట్టించుకుని కూడా... మీ... ఈ వెంకు గాన్దగ్గర్కి రాకుండా పారిపోతాడా... ఏం నా కొడుకుల్రా మీరు?"

"వెం...వెంకూ...!"

"అ... అదీ వెంకటీ సంకటీ మూడుకాళ్ల కుంపటీ అనండ్రా"

మనస్సంతా చల్లగా అయ్యింది...

"అన్నీ తెల్సొరే నాకు మా కండ్ల పడకుండా ఏదీ జరగదు... సర్సరే గానీ అవన్నీ తర్వాత చెప్పు యేం తాగుదాం విస్కీనా? రమ్మా! విస్కీనే తాగుదాంలే... ఇంకా పదిన్నరే, టైం పర్వాలేద్లే. ఇదో సచ్చెనాయనా?" అని కొంచెం గట్టిగా అరిచాడు.

ఖాకీ ప్యాంటూ తెల్లచొక్కా వేసుకొని ఓ కానిస్టేబుల్ 'సచ్చెనాయనా' అనిపించుకున్నాడు. పాపం సత్యనారాయణ అయ్యుంటుంది వాడి పేరు.

"బాబూ" జీ హుజూర్ అన్నట్లు నీలుక్కుపోయి నిల్చున్నాడు...

"పొయ్యి... ఒక ఫుల్ మాన్షన్ హౌస్ విస్కీ... ఒక క్రేట్ సోడాలు... ఆ నెల్లూరోని హోటలుంది చూడు... బాలాజీ పక్కన నాకన్జెప్పి... చికన్ తందూర్ చెప్పిరా... లేటౌతాది వాడు చేసేటప్పటికి... మంచింకి... రెండు డ్రై చికెన్లు యేవైనా తీస్కరా ఫో... జీప్దీస్కపో... ఏసోబుంటాసూడ్నైట... తొందర్రా... మళ్లీ తర్వాత పోయి చికెన్ తందూర్ రెండు బిర్యానీలు తెస్తువ్గానీ..." హుకుంనామా చదివాడు... "బాబూ" ఇప్పుడు దీనర్థం అలాగే తప్పకుండా అన్నట్లు టప్మని సెల్యూట్ చేసి మాయమై...

సచ్చెనాయననబడు ఓ బడుగు కానిస్టేబుల్. వీడు వాడికి డబ్బివ్వడు... వాడు వాడికీ ఇవ్వడు... ఇది "మా...మూ...లు..." భారం మాత్రం సామాన్యుడి మీద పడ్తుంది"

"ఊ... ఇప్పుడ్చెప్పరా... యేంది కత... ఆ పిల్లకూ, నీకూ ఏం సంబంధం అనడగను... ఆ పిల్లెవరో మా డిపార్ట్మెంటంతా తెల్సు... కానీ... ఇంతవరకూ ఒక్కసారి కూడా బుక్కాలే తెల్సా ఆ పిల్ల. బాందిలే... మన మచ్చల్నాకొడుకు నుంచీ ఈ పిల్లకీగతి పట్టింది... అదే కదా... ఒరే ఒక్కసారి... ఒక్కసారొచ్చి... వరే వెంకూ... పరిస్థితులిట్టా ఏడ్సినాయిరా కొంచెం సూద్రాన్జెప్తే... మా గుడ్లెల్లకొస్తాందేనేంరా... ఇంక... సరే... ఇంక ఆ నాకొడుకులీ పిల్ల జోలికి రాకుండా చేస్తా... మనమంటే ఉచ్చల్పోసుకుంటారీ నా కొడుకులు... సి..యెమ్.. మా సిన్నాయనైపాయగదా దానికీ... అదురన్నమాట సచ్చినట్టూర్కోవాల్సిందే..." అని ఫోన్దగ్గర్కి లాక్కుని... ఓ నంబర్డయిల్జేశాడు... "హలో... నేనూ వన్టౌన్సీయై మాట్లాడుతున్నా... ఎవరు. పెద్దన్నకీ ఫోను... ఆ... లైన్లో ఉంటా... పిల్సు... జల్దీ..." నేను మిడిగుడ్లేసుకున్చూడ్డం తప్ప చేయగల్గిందేమీ లేదు...

"హల్లో... నమస్తే... నమస్తే... ఏం ల్యానా... నిన్న రేప్ కేసు... ఎమ్మెల్సీ... చేయాల్సొస్తుందేమోననీ..."

"...."

"నిజమే... నిజమే... కానీ పరిస్థితుల్చేతుల్దాటి పోతున్నట్టున్నాయి గదనా?"

"...."

"నేనేంది చెప్పేంది? మీ తమ్ముండ్లా మాదిరి చెలరేగిపోయి దిక్కూ మొక్కూ లేనోళ్లందర్నీ పిశాచల్లెక్క పీడిస్తాంటే నేనూరుకుంటాలేనా... లోకం... లోకం...

ఊకుంటాదా... ఆ సందులో సుబద్రమ్మ దెల్సు గద నీకు... దాని మీద దర్నా... దర్నా చేసి నిరాహారదీక్ష కలక్టరాఫీస్ముందు కూసుంటాదంట..."

నా వేపు తిరిగి కన్నుగీటి..." నాగ్గూడా తిక్కలేస్తాందిలే... ఎత్తకొచ్చి బొక్కలోకి దొబ్బి... నాల్రోజులు కుమ్మిన కుమ్ముడు కుమ్మకుండా కుమ్మితే"

"...."

ల్యాకపోతేందినా... మరీంత అరాచకమా... మేమెందుకింక? ఖాకీ డ్రెస్సేసుకొని... సీటీ లూపుకుంట సైకిల్లూస్కూటర్లూ పట్టుకునేదానికా... యింకేమన్నా పట్కునూగేదానికా?

"ఆల్లో...ఆ...ఆ... ఉన్నా... ఎంతా?... సూడుసూడింకా... నే సర్దుతాలేగానీ... ఆ నాయాండ్లని మూడేండ్లు నేనీ ఊళ్ల సూడన్నీకిల్యా... అవు... మూడేండ్లు... లెక్క... ఇప్పుడే పంపుతావా? పంపు... గెస్టొస్తానుండాలే... నీకు తెల్సిందే కదా... ఉంటా... బద్రం... ముందే చెప్పల్యా... అనాకు... చెప్తాండాసూడు..."

చెమట తుడ్చుకుంటూ ఫోన్ క్రెడిల్ చేసి... వికృతంగా నవ్వుతూన్న వెంకనబడే వెంకటేశ్వర్రెడ్డి... ఈ రెండు రాజకీయాల మధ్య నేనూ... గౌరీ... భగవాన్లూ... పావులుగా మారిన అనుభూతితో నేను...

వాడి భాషలో మాట్లాడ్తేనే వాడి కర్థమౌతుంది... ఆ పిల్లకు... ఇరవై అయిదు వేలు పంపిస్తారు... ఇప్పుడే... ఇంక... ఆ పిల్ల జోలికి రారు... ధైర్యంగా ఉండొచ్చు... మీరు... ఔ? లవ్వా? ఇన్నేండ్లకిదేం బుద్దిరా నీకు... నలభై వస్తున్నాయి. సరి సర్లే... మగనాకొడ్కులం మన్కేం గానీ..."

బెల్టూడదీసి షర్ట్‌ని పైకి పెకిలించి... మంచమ్మీద కిసిరేసి... వెంకు... కరకు... ఖాఖీసియ్యె వెంకటేశ్వరరెడ్డి...

ఎప్పుడో ఇరవై సంవత్సరాల క్రితం... హాస్టల్లో వాడి గదిలో... నీలి పొగల మసకల్లో లీలగా గుర్తున్న... బేల గుండె... వెంకూ గాడు... కాదు వీడు... ఏమో కరుకుదనం పైనేపైపైనే నేమో? సచ్చెనాయనా... ఇంకో కానిస్టేబులూ... ఇద్దరూ కల్సి లోపల్కొచ్చి బల్లమీద పొట్లాలూ... గ్లాసులు సోడాలూ... పెట్టి... పింగాణీకంచాల్లో కోడి ముక్కలు వంచి... నిమ్మకాయ పిండి... తరిగిన ఉల్లిగడ్డల్పరచి... నిశ్శబ్దంగా...

తలుపుల వెనక్కి... తరిమినట్లు మాయమైపోయారు... వెంకే వంచాడు... బోటిలోపన్చేసి... నాకు సోడా పోయ బోతొంటే అడ్డుకుని నీళ్ళొంచుకున్నా...

"చీర్లు చెప్పుకుని... ఆబగా ఎండిన గొంతుక... రేగడి నేలైనట్టు బొట్టు బొట్టు పీల్చేసుకుంటోంది...

కడుపులోకి పోతోందా...? అని అనుమానం...

సిగరెట్ వెలిగించి తృప్తిగా దమ్ములాగి పొగ వదుల్తే...

"రేయ్... రింగులిడ్చురా... ఒక్క దమ్ముకి ఇరబైయ్యారు రింగులిడ్చి... పద్దెద్రూపాయల్దండుకొంటివి గదరా..."

ఎప్పు... ఎప్పటి మాటది... ఇరవై వసంతాల వెనక... తెరలు తెరలై... ఒక్కోటీ పొరలు పొరలై... విడివడుతూ...

అడుగు... అడుగూ... నిడివి తెలిస్తేనా?

అడవుల నిడివి...

నిడివి తెలియ నడవులు... దారులు తెలియని డొంకల్లో వంకల్లో... మోకాల్లోతు నీళ్ళల్లో... బట్టల్విడిచి నగ్నత్వం... సిగ్గుకాని నగ్నత్వం... బట్టల్విప్పదీసుకు పగల్బడి నవ్వుతూ ముక్కు మూసుకు మునుగుతూ... హో... అని లేస్తూ... లేస్తూ... మళ్ళీ పడుతూ... ఆనందం శైశవమైతే... నాగరికత శవమైతే... నశించి... వసించి... మెరుపుల్వించి... విరించి... విరగ దీసి... చివ్వున రువ్విన బాణాలై...

అమ్ములు...

ఈతాకు రెమ్మలు...

కమ్మలు... కాకలాలు... అక్షరాలుమేకులై... కమ్మల చెర్మాన్ని చీలుస్తూ...

దిగబడి... దిగబడి

దిగబడి... దిగాల్బడి... మోడులై... వాడి... వాడి... మళ్లీ... దిగిన వాడై... కసక్కున చిమ్మి... ఉమ్మి... తుమ్మి పువ్వుల... తెల్లటి కమ్మదనం... శివార్చన... లింగాష్టకం... శవార్చన... అంగాల నిశ్చేతనం...

"చికెన్తిన్రా... బాంది చూడు... నీకింకా ఈ అలవాటు పోల్యారా... ఉన్నట్టుండీ... యాటికో పోతావు... ఇంద... ఈపీస్తీస్కో... బోన్లెస్లే... చీకే పన్ల్యా హహ్హహో..." స్ఫటికపు టాలోచన్లు చటుక్కున జారి భళ్ళున బద్దలై వాస్తవాల పెంకులై... మళ్లీ... "అవున్రా...? ఈ మచ్చల్నాకొడుక్యాడికి బొయ్యింట్రాడా? ఈ నా కొడుకుల్కి

బయపడి పార్నాడా?... ల్యాకపోతే... ఈ నా కొడుకుల్వాణ్ణి లేపాస్నారా?" ఒక్కసారి ఒళ్లంతా ఝల్లుమంది... "వెంకూ...?"

"ల్యాలే... ఊకెనే అనుకుంటుండాగానీ... అవురా.. నువ్వు.. ఈ జానకి పిల్లతో ఏందిరా...? పిల్లబాందిలే... బాంటే... పో... అంతేగాని.. ఇట్లా ఆస్పత్రి సుట్టూ ఏడ్సుకుంటూ.. నీ పెండ్లాం లెక్క.. ఏందోబా తిక్కనాకొడ్కువి నువ్వు ముందు గాల్నుంచంతే పో.."

ఏ... ఏమని చెప్పను వాడికి... గౌరి... మనోహరి...

నా మనస్సంతా... ఎండిన మనస్సంతా... మల్లెపూలై పర్చుకుందనీ... ఎట్లా...? చెప్పేదీ... చిన్నగా నవ్వి ఊరుకున్నా... కానీ మనస్సెరిగి... గౌరి పక్కన వాలిపోయింది.

"ఎట్లాగుందో గౌరి...?"

మస్తాన్చెప్పింటాడా నన్ను పోలీసుల్తీసుకెళ్లారని? చెప్పుంటే ఏడుస్తోంటుందా?... మొహం కడుక్కో నుంటుందా... మస్తాన్దేపుదు కడిగిచ్చి కాఫీ తాగించుంటాడ్లే... మస్తానుండగా ఇంకేం భయం... మనసు బుజం మీద ధైర్యం... ధైర్యం... అన్నేను నన్ను నేను తట్టుకుని... రెండో రౌండు ముందు కలిపా...

వాడి గ్లాసు సోడా బుడగల్లో అద్భుతమైన అందాలు విసిరేస్తోంది... ఎత్తి ఓ గుక్క తాగాడు వాడు. సచ్చెనాయన లోపల్కొచ్చి...

"బాబూ! తమ కోసం ఎవరో..."

బనియన్తో... కండల్తిరిగిన శరీరం... కదుల్తో అట్లాగే బైటికెళ్లాడు వెంకు... ఓ అయిదు నిముషాల్తర్వాత్తిరిగొచ్చాడు... చేతిలో చిన్న బ్యాగ్... వచ్చీ రాంగానే ఆ బ్యాగ్ని నా వొళ్లో విసిరేశాడు.

"ఇరవై అయిదు. ఆనా కొడుకుల్వి... ఆ పిల్లకేపో... ఆ పిల్లకంటే మీకే... నీకూ... ఆ పిల్లకీ... నీ అవతారం జూస్తాంటే... పర్మనెంటు ఫిట్టింగే... అన్పిస్తోంది ఔ?... యేమో పో... నే నీడ మూడేండ్లుంటారా ఆ కాడికి నీ యెంటిక్కూడా ఎవుడూ పెరకలేడు పో..."

సినిమాటిగ్గా ఆ డబ్బుని వెదజల్లేట్టు విసిరి... ఆమె... ఆమె మానానికి ఖరీదు కడ్తారా మీరు... ఛీ... అనేంత హిపో(క్రాట్ని కాన్నేను... కట్టాల్సిందే విలువ కట్టాల్సిందే... ఇది తక్కువ...

"తక్కువ" అన్నమాట అ(ప్రయత్నంగా బైటికి అనేశా... విన్నాడు వాడు...

"నిజమేరా తక్కువే... అదే అంటిగూడా... ఇంకా... ఇంకా... గుంజతా పోతే... ఈ లంజెకొడుకుల్తెంపినా తెంపుతారు... అందుకే వొప్పుకుంటి... మల్లా... నా వాటా నా కొస్తాద్లేఫా... అప్పుడ్జూస్తా..."

మనస్సు అవమానంతో మూలిగింది... బాధగా... కానీ... ఛీ... నన్ను నేనసహ్యించుకొని... చిన్నగా ఆ సంచినీ మంచం మీద కిసిరేసి...

"రేయ్... వెంకూ... కోలాటం పాట పాడ్రా" అంటే... 'సెయ్యి..." నా కొడకా... నీకింకా గుర్తుండాద్రా?'' మాట ముద్దుగా వస్తాంది... నాల్గో పెగ్గు... అయిపోవచ్చింది... గ్లాసెత్తి గ్లగ్‌మని మింగేసి... పురితిప్పిన్మీసాల్తుడ్చుకుని...

"ఊ" మెల్లగా రాగం దీస్తూ... లేచి... కిటికీ లోంచి బైటికి కాండ్రించి ఉమ్మి... తొంగి చూసి... కిటికీ రెక్క మూసి... మళ్లీ

"ఊ" రాగం తీస్తూ...

"లెయ్యి... లెయ్యి... లెయ్యా... లెయ్యి...

ఆ... అహ...

లెయ్యి... లెయ్యి...

లెయ్యి... లెయ్యి... మియ్యసాబూ...బు...

లెయ్యాడమ్మా మియ్యాసాబూ...

రొయ్యల్పులుసు సియ్సల్తోని తెచ్చిన రమ్మంటే...

లెయ్యాడమ్మ... అహ...

లెయ్యాడమ్మ మియ్యాసాబు...

కల్లూదాగీ ఒల్లూ దెల్కా

లెయ్యి... లెయ్యా... లేయ్...

అయ్యావారూ అదుమూతోంటే

మియ్యాగాడూ కదలాకుండే

తియ్యి... యేయ్... తియ్...

వారా మంచం గోడకు జేర్యా...

చీరా కుదురూ వదులైపోయా...

లెయ్... అహ... లెయ్...

సద్దారొట్టీ సల్లాగాయా...

ముద్దూ సుద్దూ మూటా గట్టూ...

లేయ్... అహ... లెయ్...

సందూలూనా బందూకెత్తీ...

బందూ... బంద్...

గుర్తుల్యారా..." వగరుస్తూ...

సరిగ్గా... ఇరవై సంవత్సరాలై యుంటుందా పాట విని...ఇంకా...ఇంకా... మధ్యన బూతుమాటల్జేరుస్తూ... కళాకారుల కోసం ... ఆడిటోరియం మధ్యనా... మ్యూజియం... క్యూల్లో... గ్యాలరీల్లో... కన్సర్ట్స్... పేరుతో కళనమ్ముకునే గొంతుల్లో...

రండి... రండి... అక్కడేం దొరుకుతుంది...

వెన్నెట్లో... యేటి పక్కన... ఇసుకలో...

కాళ్లగజ్జల్కట్టుకుని... చేతిలో కర్రముక్కల్పట్టుకుని

వినండి... చూడండి...

రండి... చూడండి... మనసుల్ని పావురాల్చేసి విసిరేస్తారు. వీళ్లు... వినువీధుల్లోకి వెన్నెల్ని గిన్నెల్లో కొంపి... పెదవుల కందిస్తార్వీళ్ళు...

రండి...

అయిదో రౌండు... టైం రెండున్నరైంది... తలగింగిర్లు కొడ్తోంది... కొహెరెన్సు కొద్ది కొద్దిగా తప్పుతోంది... తెలుస్తోంది... నిమ్మకాయ బద్దనాలిక్కేసి రాచుకుంటూ చప్పరిస్తూ...

వాడు బూతుల్మాట్లాడుతున్నాడు... కానీ స్థిరంగానే ఉన్నాడు... సచ్చెనాయన వెళ్లి తందూర్చికెనూ, బిర్యానీ భక్తిగా... పింగాణీ కంచాల్లో వడ్డించాడు. కెలికీ... కెలికీ... తిన్నాం అన్పించి... ఒళ్లు ఊగుతోంది... పరగడుపున హాఫ్‌బాటిల్లాగిస్తే ఊగక...?

"రేయ్... నేనిక్కడేపండుకొంటా... నువ్వో... సచ్చెనాయనా!" అనర్చి... అతనొస్తే

"సార్... సార్ని యాడగావలంటే ఆడదింపిరా... జీప్‌ల..."

"వస్తా" అన్చెప్పి వచ్చేస్తుంటే...

"రేయ్...!" అని అర్చి పిల్చి... నేను తిరిగితే ఆ డబ్బు సంచీ విసిరేసి...

'హి...హి...హీ..." ఖాకీ స్నేహం...

జీప్‌లోంచి హాస్పిటల్ముందు దిగుతోంటే...

గేటు దగ్గరే మస్తాన్... సంచీ... డబ్బు సంచీ... పాపాల గబ్బు సంచీ పట్టుకు ఊగుతూ తూగుతూ వస్తూంటే... ఆరున్నర టైం ఎంతలో ఎంత?

"సా! యే...యేమైందా్స?" అన్దగ్గర్కొచ్చి విస్కీ వాసన్చూసి... మనసు నిమ్మళించి...

"అక్క... పొద్దున... నువ్వు పోయిన కాన్నుంచీ యేం తిన్ల్యా తాగల్యా..." అనంటే... కడుపులో కసక్కున ఎవరో కనబడని కత్తుల్పెట్టి కసకసా కోసినట్టు... కళ్లుమూతల్పడు తున్నాయి.... విస్కీ...

"డాక్టరున్నాడా?" అనడిగితే...

ఆస్పత్రి కారిడార్లో నేన్నడుస్తూంటే పక్కన మస్తాన్ నేను తూలకుండా పట్టుకు నడిపిస్తూ...

అవునూ... వీడు... ఈ... ఈ మస్తాన్ అన్నం తిన్నాడా? తలవిదిలించుకు...

గౌరి... మంచం పక్కన స్టూల్మీద... పిల్లవాడు చల్లిన రంగుల వసంత మల్లే... నేను... కకా వికలుగా రంగులు రంగులుగా...

గౌరి చేతిని గట్టిగా రెండు చేతుల్తో పట్టుకుని... ఎత్తి పెదవుల కానించుకుంటే... మెల్లగా... కళ్లుతెరచి ఆత్రంగాన్నూ... మస్తాన్నూ చూస్తే... మస్తాన్ నా వెనుక వైపుంచీ గౌరికి సంజ్ఞ చేస్తున్నాడు తాగొచ్చానని.

తృప్తిగా కళ్లు మూసుకుంది... పెదవుల్మీదున్న తన చేతిని నా తల్లో చేర్చి... తడిమి... తడిమి... మరో మగ్దలీనా మనోహరీ గౌరి...

వెంకు దగ్గరన్నం తిన్లే... కెలికీ కెలికీ పారేసిందే అంతా... కడుప్మండుతోంది. జేబులోంచి ఓ ఇరవై నోటు తీసి మస్తాన్కిచ్చి... ఓ దజనిడ్లీల్తెమన్నా... మౌనంగా మాయమైన ఆప్యాయత... మస్తానై...

"యేం... యెందుకు పోలీసుల్తీసుకెళ్లారని మస్తాన్చెప్తే చేదుగా అయిపోయింది కడుపు... అందుకని యేమీ వద్దన్నా... అక్కడికీ రెండుసార్లు కాఫీ తెచ్చిచ్చాడు మస్తా..."

నాక్కంట్లో నీళ్లొస్తున్నాయి... అల్కహాల్ డిప్రెషన్... యెదురుగా చెదిరిన గాయంలాగౌరి... ఆగట్లే... ఉబికి... ఉబికి... ధారగా కారుతూంటే... తల అలా వంచుకుని గౌరిక్కనపడకుండా ఉండాలని కాపీ కొట్టే విద్యార్థి లాగా... నేను... ఆ పక్క రెండు మంచాల పేషంట్లూ... వాళ్ల మనుషులూ మమ్మల్నే చూస్తున్నారనే ధ్యాస లేకుండా... విస్కీ పూర్తిగా ఎక్కింది తలకి... పరుప్మీద తలపెట్టి...

'ఆ' అనేడిస్తే...

కళ్లు మూసుకు గౌరీ మనోహరి మౌనంగా ఎక్కడ్నించో... ఖండాంతరాల్లోకి చొచ్చుకొచ్చే ఋతుపవనంలా అమ్మహల్య... మేఘంలా, మేఘంతో పాటు చిట్లే చినుకల్లే ఎంకట్రాముడు, మరణ వాతావరణాన్ని హరిత గీతాచరణం చైడానికన్నట్టు...

"నాయనా! పా...ఇంటికి పా... నువ్వా... బా... పొండ్రి... నేనుంటాలే పిల్లకాడ..." అని అహల్యంటే...

"నేన్రాను... ఇప్పు... ఇప్పుడ్రానంతే... అదో మస్తానొస్తున్నాడు... నా గౌరి తిండి తిన్న తర్వాతేనే వస్తా"... తాగిం తర్వాత... సిగ్గు... సభ్యతా... ఎందుకు మరుస్తాం? "ఊ కానీప్పా... తింపిచ్చు... వచ్చినాడ్చూడాయప్ప"

అహల్యమ్మ... మనోహరంగా ఎందుకూ నవ్వుతోంది? ఏమో? మస్తానొచ్చి ఇడ్లీల పొట్లాన్ని నాచేతికివ్వలే... అహల్య చేతి కిచ్చాడు అంటే...?!?!

పొట్లం విప్పి నాలుగిడ్లీలు అరిటాకులో ఏసి... కొంచెంగా పచ్చడి వేసి... నా చేతికిచ్చి అమ్మహల్య...

"ఊ కానీప్పా... బిరీన తింపించ్చు అయమ్మకి..." అనంటే తడబడుతున్న చేత్తో... ఆకందుకుని... అందులో ఇడ్లీ తుంచి... పచ్చడద్ది... వణుకుతూ నా గౌరీ పెదాల కందిస్తే... తడిసి... జడిసి... గువ్వరెక్కలల్లే ఉన్న కన్రెప్పల్దీసి... ఆ వడలిన పెదవుల్విడదీసి...

"గౌ...రీ" నిశ్శబ్ద శబ్ధమైనే స్వరిస్తే

"ఏమిటీకి పరమాత్ముడు మమ్మల్నీలోకంలోకి అంపిచ్చినాడో ఏమో... ఇట్లాంటి దుర్మార్గాల్చూసే దానికా..." అని అహల్య నా చేతుల్లోంచి ఇడ్లీల ఆకు లాక్కుని నన్ను జరిపి... నా స్థానంలో కూచుని ఆ నాలుగిడ్లీలూ నిమ్మళంగా గౌరితో తినిపించి...

"ఇంకో రెండేతునామా?" అనడిగితే... గౌరి... రెండు చేతుల్తో... అహల్యమ్మ చెయ్యి పట్టుకుని... గుండెల్కానించుకుని... మళ్లీ మొహానికానించుకుని నమస్కరిస్తే "ష్షా" అని అమ్మహల్య...

❊ ❊ ❊

విశృంఖులతమోక్షుత్పీడనతో పాపపు లిప్సతో మరణానికి ఓ క్షణం ముందు అనుభవించే ఆక్రందించే...

అనామక ఏకాంతం... అందులో... ఆ చీకటి ఏకాంతంలో భళ్లున తెర్చుకున్న గవాక్షం...

నా ఆలోచనా క్షరం...

భౌతిక రీతుల అనువదింపబడి...

ఓ కావ్యమై...

ఓ అవతారమై...

నగ్నంగా నర్తించు వేళల...

నా ఆలోచనల్ని కప్పుకుని నే చంక్రమణం చేసే విహాయస వీధుల

నేను నాశన మౌదామని...

అశని అందాల సౌదామిని...

అని క్రీడిస్తూ...నే కాంక్షించే క్షణాల

నే...

నేను...మ...ని...షి...నై

మానుష్య తమస్సునై...

తపిస్తూ...

నేను... నేనై...

మళ్లీ...

నేనూ... చీకటి...

* * *

నాలుక మొద్దుబారింది... నా మీదెవర్దో చిన్న కాలుందే? నే... నెక్కడున్నా?... శరీరం... మెదడు ఏకం కావడానికి విముఖిస్తున్నాయి... అయినా ప్రయత్నించి ప్రయత్నించి సంధి కురిర్చేసరికి హా...

ఆ చిన్నికాలు... అమ్మహల్య మూడోకూతుర్ది... నెమ్మదిగా తప్పించి లేచి కూచున్నా... నా పక్కనే ఎంకట్రాముడన్న... మెదడు విచిత్ర కర్మాగారం... ఎప్పుడు ఏం కావాలంటే అదే తపీమన్తయార్చేసిస్తుంది....

కర... కర... కరామంటూ... అన్నీ... కర్మాగార యంత్రాలన్నీ పన్జేయడం మొదల్పెట్టి... జరిగిపోయిన్నా గత దినాన్ని మళ్లీ మళ్లీ తయార్చేయడం మొదల్పెట్టాయి...

హా... నిన్నటి వార్తల న్యూస్పేపర్లా... ప్రతిదీ వార్తే... అవును నాకిప్పుడు వార్తే... ఇడ్లీ... కడ్లీ... బ్లడ్లీ... మడ్లీ... వలికి మిట్టతవ పిండః!

మెల్లగా... మెలమెల్లగా... ఎంకట్రాముడూ మస్తానూ... వెనుకాల్నించీ గౌరీ అహల్య కళ్లూ ఆస్పత్రి బైటకు తెచ్చి... ఇచ్చి... గుచ్చి... ముచ్చి... నీక్పిచ్చి... అంతే... అంతే...

ఆటో...

"రేయ్... రారా... నాయాల... పిలిస్తే... ఇం... నీ... నా కొడకా రేయ్... తంతే... లేచిపోతావ్... రేయ్"

"సాసా..." మస్తాన్...

"నా..." ఎంకట్రాముడు...

అవును గుర్తుకొస్తోంది... ఆటోవాడి ఆటోని కాల్తో తన్ని... ఎందుకూ? అని ప్రశ్నించుకుంటే ఇప్పుడు సమాధానం దొరకదు... అంతే...

తా...గు...డు....

వాడు భయపడి... పిల్లవెధవ నిండా ఇరవైయ్యుండవు... ఆకలి... తప్పదు... పాపం... నన్ను పట్టుకుని మస్తానూ... ఎంకట్రాముడూ ఆటోలో కుదిస్తే... అవును... తిన్నగా ఆటో అహల్యమ్మింటి ముందాగింది... ఆటో అబ్బాయీ... ఎంకట్రాముడూ కల్సి కలగల్సి నన్నింట్లోకి చేరిస్తే... చీకట్లో తడబడ్తూ... ఇంట్లో కొచ్చి బలవంతంగా రెప్పల్దీసి...

"రేయ్... తమ్ముడూ... రా...రా! ఇంద తీస్కో" అని ఇరవై నోటిస్తే... ఎంకట్రాముడు... "నా... యిన్ని దుడ్లు మై మీదేస్కోని... అట్లా ఆ మాదిర్తాగితే ఎట్లన్నా" అని ఆ సంచీ డబ్బు... పాపపు గబ్బు సంచీ తీసి చూపిస్తే...

"ఏందో పో... నువ్వు" అని, పెద్దది లేస్తోంటే, "నాయమ్మే... మలిక్కోమా... వద్దులే... మామా నేనూ, ఇద్దరూ అన్నం పెట్కోని తింటాం లేమా నువు మలిక్కోమా..." దానికి పద్మూడు పద్నాలుగేళ్లుంటాయి... కానీ వీళ్ల కదింకా చిన్న... చిన్న బుల్లిపాపే... అది కూడా కళ్లు మిటకరిస్తూ... మిటకరిస్తూ... చూస్తూ ఠప్పున సుషుప్తి దేరాలోకి దూరిపోయింది...

ఎదిగొస్తున్న గుండెల్ని కప్పుకోవాలనే ధ్యాసలేని కసి... పసిపాప... అట్లాగే గాఢ సుషుప్తిలోకి

‘భాం...గ్’

కలకత్తా రెట్లైడేరియాలో ఎనిమిది సంవత్సరాల పాప మృతి... కారణం...

అరవై సంవత్సరాల వృద్ధుడు సవాయి రోగం తెచ్చుకుని నాటువైద్యుడి మాట విని... మందు... ఆ రోగానికి, ఆ వికృత మానసానికి కాక... పుష్పవతి గాని పిల్లన్చెరిస్తే నీ రోగం పోతుందని చెప్పిన పశువు మాటల్వినీ... వినేనా? కాక... లోలోపల ఇంకా లిప్స... ఎనిమిది సంవత్సరాల కసిమొగ్గను...మొగ్గా? అదింకా చిగురే.

చిగురు... ఆకై... రెమ్మై... కొమ్మై... ఎప్పటికో... పూతై... ఒకటికీ... రెండుకీ భేదం తెలీని అమాయకత్వం...

రోడ్డు పక్క నల్లా మీద కూచునోపాప... చిన్ని బుల్లిపాప... అన్నం కల్పుకు తినడం కూడా తెలీనిది... దాన్ని పాశవికంగా...

ఓ రోగం... రోగ నివృత్తి కోసం... ఆ నెపంతో

రే...య్...

ఇరవై వేల రూపాయలా పాపం ఖరీదు... లంజాకొడుకుల్లారా...

ఆ...

మెల్లగా... నెమనెమ్మదిగా లేచా... మత్తు దిగింది... ఎంకట్రాముడన్న పెట్టిన అన్నంతో ఆకలి తీరింది.

మళ్ళీ... మళ్లీ

దా...హం...

నేన్లేచినలజడికి ఎంకట్రామయ్య లేచి... చూచి

“ఏం నా...? యాటికి?” అనంటే

“నేనింట్లో పోయి పండుకుంటానా...” అని

తలుపైర్చుకుని... నా యింటి తాళం తీసి లోపల్కి చీకట్లో కొచ్చి... చూస్తే... శుభ్రంగా ఉంది.. ఊడ్చి.. తుడ్చి.. ఎవ..ఎవర్చేసుంటారు? అహల్యా, మస్తానో చేసుండాలి... అవును... అహల్యకూ మస్తాన్కూ పరిచయమైంది.... ఎట్లా? మూడ్రోజుల్నుంచీ ఇంటికి రాకపోతే ఎంకట్రాముడు ఆఫీసుకెళ్లి వాకబు చేసుంటాడు... పర్యవసానం పరిచయాలు.

యస్... పరిచయాల్విచిత్రంగా జరుగుతాయి...

బట్టల్విప్పి... విసిరేసి... దొడ్లోకెళ్లి...

తొట్లో నీళ్లు చల్లటి నీళ్లు... హాయిగా... మనస్సంతా తేలి తేలి... స్నానం చేసి పెట్టె తెర్చి... నలిగిన... లాల్చీ పైజమా తెల్లవి ముదుర్లు ముదుర్లుగా... నాఫ్తలీన్ వాసనతో తొడుక్కుని... గూట్లో వెదికితే...

హా... అమృతవర్షిణి...!

గ్లాసూ... లెడ్డూ... స్కెచ్చుబుక్కూ... తీసుకుని పరుపు గోడకి చేరువగా వేసి దిండ్లు... గోడకి వేసి... కళ్లు మూసుకు... మనఃకవాటాలు తెరిస్తే... భ...గ...వా...న్లు...

"కాలం... లోకం... కర్కశంగా నన్ను విసిరేస్తే... దేశాంతర కాందిశీకుడి ఇల్లు దోచుకునే దొంగకూ నీకూ వ్యత్యాసమేముంద్రా?" అని ప్రశ్నస్తున్నట్టు... లే... లేద్రా బగాన్లూ... ఇప్పుడు బైటికొచ్చినా... నాకు తెలీకుండానే కొన్ని యుగాల క్రితం నుంచే... నాకు... నాకు గౌరంటే ప్రాణం రా...

బాధగా... కళ్లు మూసుకు భగవాన్లు నిష్క్రమించాడు... తెరల వెనక్కి... కానీ ఆమొహం వాడిదేనా? కాదే...! ఎందుకు? ఎందుకనలా...? అది భగవాన్ల లోపలి ముఖమా?... స్కెచ్చుబుక్కనబడే నా లెటర్హెడ్ మీద లెడ్డు అప్రయత్నంగా కదుల్తోంది... ఆ ముఖం... భగవాన్లది కాని భగవాన్ల ముఖం... ఈ ప్రపంచాన్నీ... నన్నూ... అందర్నీ... నిరసిస్తూ అందరూ ద్రోహం చేస్తే... నిరాశ... నిస్పృహ... ఆర్తి... నిరామయ నిస్తేజం...

అవునది... భగవాన్ల మొహమే... గీశా... భగవాన్లూ! ఒరే... ఆత్మీయుడా! నా ప్రియుడా!... ఎందుక్రా... ఇట్లా... చీకట్లో...రా...రా!

మనసు రోదిస్తే...

సామాజిక దౌష్ట్యం వేదిస్తే... కళ్లు చెమ్మగిల్లుతున్నాయి...

నీ విదగ్ధ భావనాగ్ని కీలల దగ్ధ కాకలాల బూదిరా ఈ బ్రతుకు భగవాన్లూ! ఒరే రారా! గౌరిన్నే దోచుకోలేదురా... దాచుకున్నా...

ఏవో... ఏవేవో గుహ ల్లోపల... అంతరాళాల్లో కలిసే... నదీ జలాల్లా కల్సిపోయామంతే...

ఒరే భగవాన్లూ... గౌరీ... నేనూ... అంతే... అంతేరా!

* * *

మర్నట్రోజు...

ఆఫీసుకెళ్తే... ఖాళీసీట్లో... కాత్యాని మాయమై... శూన్యమై... మనస్సంతా ఎవరో పిసికినట్టైంది.

కుంతి సరోజ నిస్పృహతో కనబడుతోంది...

జాన్సన్గాడు... నిశ్శబ్దమైనాడు....

ఎల్లిగాడు పిల్లిగా తిరుగుతున్నాడు...

సుగంధ్రావ్... మాత్రం బాగానే ఉన్నాడు...

"ఏమయ్యా మూడ్రోజులు ఫ్రెంచిలీవూ?" అద్దాల బైటి నుంచీ చూస్తూ...

"సి... ఎల్పెడ్తున్నాసర్... రాలేకపోయా... కాస్త పనుండింది... కొంచెం ఫోన్చేసుకుంటా సర్..." అనంటే... వాడు 'ఊ...' అనే లోపల్నే...

వన్టౌన్పోలీస్టేషన్కి రింగ్జేసి... రింగ్ వింటున్నా...

'ఆలో...' అటువేప్నుంచి... వెంకుగాడ్దే గొంతు...

"వెం...వెంకూ...?"

"గడ్డపోడా?"

"అవున్రా... రేయ్... భయమేస్తోంద్రా... మచ్చల్నాయాలింకా రాలేరా..."

అనంటే...

"సేయ్... వాడ్యాడికి బోడ్లేరా... యాడికీ బోడు గానీ... రాత్రికి సిట్టింగ్పెడ్దామా... యాడంటావ్... నీ ఇంట్లోనే పెడ్తాంబో..."

"సరే నేన్మళ్లీ పోన్చేసి కన్ఫర్మ్ చేస్తా" అని ఫోన్బెట్టి... చూస్తే... సుగంధం... నన్ను వింతగా చూస్తున్నాడు...

కడచిన మూడ్రోజుల్కీ కల్పి నాల్రోజుల్కి క్యాజువల్లీవప్లై చేసి హాస్పిటల్ముందు వర్సగా నుంచున్న శవాల బండీల దగ్గరికెళ్లా... భగవాన్ల బండీ ఉంది... డ్రైవర్లంతా రెండు గుంపులై... పులిమేకా... మూడాకులూ ఆడుకుంటున్నారు... చక్కగా భగవాన్ల బండీ దగ్గరకెళ్లా... వెనక సీట్లో... అయిల్మరకల గళ్ళ లుంగీ... నల్లసామేల్గాడు... నోర్తెర్చుకుని ఓ బూతు పుస్తకం చదువుతున్నాడు....

నా నీడ పడగానే ఉలిక్కిపడి... లేచి... డోర్తీసి... తలెనకో చెయ్యి... నడ్డి మీదో చెయ్యా ఏసుకుని

"ఏం సారూ... అన్నొచ్చేనా?" అన్నాడు....

అంటే భగవాన్లు రాలేదు... సామేల్గాడు భగ్గీగాని బండీ తోల్తున్నాడు.... నిరాశతో

వెనుతిరిగి... రిక్షాఎక్కి గౌరిన్చేర్చిన నర్సింగ్హోమ్ముందాపించి దిగి... లోపలికెళ్దామనుకుంటూ... ఓ సిగరెట్కాల్చెల్దాం అనుకుని సిగరెట్వెలిగించి దమ్ము లాగి పొగ వదులుతూంటే...

అహల్య, మస్తానూ నన్ను చూసి...

"ఏం నాయినా... ఆ పిల్లకు నా అనే వాండ్లేల్యాకపోతే... నీకేమైంది జెప్పు... మేం లేమా... వచ్చింత సూడుమా! అంటే... నీకేమై తాండ్నప్పా...? నాకు నల్గురు బిడ్డలనుకుంటాంటి... మూడాడివి... నువ్వు ఇంకో మగబిడ్డవని... బంగారు బొమ్మా గుట్టుండాదే నీ పెండ్లాము... పో లోపల్కి... కాచుకో నుండాదాపిల్ల". వెళ్లిపోతూ పోతూ మస్తాన్వెనక్కి తిరిగి నవ్వితే... అమ్మదొంగ మస్తానూ అన్కొని... హాయిగా నవ్వుకుంటూ...

నన్ను చూసిన గౌరి కళ్లు హేమంతాల చేమంతులైతే... స్టూల్మీద కూచుని... చెయ్యి రెండు చేతుల్మధ్యా బిగించి

"ని... నిన్న తాగేశా... బాగా... సారీ..." అంటే...

"నన్నింటికి తీస్కెళ్లరూ...?"

"డాక్టర్నడగాలి గదా..." అన్నేనంటే...

"అడిగా ఉదయమే, వచ్చారు డాక్టర్గారు... మళ్లీ మూడ్రోజుల్తర్వాతొచ్చి కుట్లు తీయించుకోమన్నారు... ప్లీజ్... ఇంటికెళ్దాం..."

"ఎందు... ఎందు గ్గౌరీ... కొద్దిగా విశ్రాంతిగా... ఇక్కడే ఉండు. సూచర్స్ తీసింతర్వాతేవెళ్దాం..." అన్నేనంటే...

"ఊహూ... వద్దు... ఇంటికెళ్దాం... మీరూ... నేనూ... ఇంకెవ్వరూ వద్దు... ప్లీజ్..."

కళ్లనిండా నీళ్లు...

"..."

"మాట్లాడరేం..."

"మస్తాన్నిరానీ... వెళ్దాం..."

"మస్తాన్రాడు..."

"అంటే...?!"

"అక్క నింటి దగ్గర్దింపి... ఇంటికెళ్లి నీళ్లు మోసి నింపుంటాడు..."

మౌనంగా లేచిరిసెప్షన్లో కెళ్ళి డిస్చార్జి చేయించుకుని... బిల్లు కట్టి బైటికొచ్చి ఆటో మాట్లాడి... గౌరింటి ముందు దిగేప్పటికి పదకొండూ నలభైయైదు... చిన్నగా లోపల్కి నడిపిస్తూ తీసుకొస్తూంటే... కిటికీ సందుల్లో తలుపుల సందుల్లో రకరకాల వింత మొఖాలు... లోపలికెళ్లి తలుప్మూసీ మూయకనే... నా వేపు తిరిగి... రెండు చేతుల్తో నన్ను చుట్టి... అల్లుకుని నా గౌరీ లతిక... "ఛ... ఊర్కోరా... ఏం... ఎందుకనే... ఏమైందిప్పుడు... చూ...చూడూ... రేయ్... గౌరీ" నాలోకి ఐక్యం చేసుకునే ప్రయత్నంలో నేను...

వంట గదిలోంచి మస్తాన్... నిర్లజ్జగా వచ్చి నా మోచేతి మీద తట్టి...

"కిచిడీకి పెట్నా...పోయ్ మీన... పోయ్... గుడ్లు తెస్తా... వచ్చినెంక అక్కకి పెయి మీదికి నీల్లకి ఉడెక్బెడ్తా... ఒక్కిరవై ఇయ్యి..." అనంటే...

సిగ్గు సిగ్గుగా నా మనోహరీ గౌరి నేనో వందకాయితమిచ్చి "మస్తాన్మందు తెస్తావా?" అనంటే... బాధగా మొహం పెట్టి...

"పొద్దుగాలే యాలసార్" అని... సర్రున తలుప్తీసుకెళ్ళిపోయాడు... మెల్లిగా ఆ జ్ఞానుల ఖజానా గదిలోకి రోజాయీ మీదకి... పరుచుకున్న నవచైతన్యమై... నా గౌరి... వెళ్లిపక్కన్కూచున్నా... లేచి... నా ఒళ్లో తల బెట్టి పడుకున్న గౌరినీ...

ఆ గడ్డం కింద మెడ ఒంపునీ స్పృశిస్తూ... ఆ మెడ ఒంపులో చెయ్యి అలాగే ఉంచేసి... వంగి... ఆ పెదవులు స్పృశిస్తే...

"నేన్చచ్చిపోయుంటే?" అని గౌరంటే చావు... మృత్యువు... నిస్తేజ చైతన్యం... కస్తూరీ దుర్గంధం. గంధం... దస్తగిరిపీర్లు... దండెత్తి... బండెత్తి... కుండెత్తి... బొళబొళా... తలల్తడిపి... కణకణమండే... నిప్పుల్మీద... జలజలా వలవలా... అడుగులై... గోరీల్మీద... గంధాలై... మల్లెలై... మఖమల్బట్టలై... వీవనలై... కన్నీళ్లై... తోపిడులై... రాపిడులై... తొడ తొక్కిడి... రద్దీలై.. బాధల్లో.. ఖేదాల్లో.. పశుమోదాలై.. పిరుదుల్నదిమి.. స్తనాల చిదిమీ.. కాళ్ల మధ్యకాలం నిస్తేజమై నిలబడ్తే.. మనుషులం.. ఋషులం కాం.. పశువులం...

భుజం మార్చి...

అంబుజాల్వెదకీ...

సందుల్లో... మనిషిమొఖాలదవుల చీకట్లలో...

ఏ... ఏవేవో కాంతిరేఖ ల్వెతికి... వేసారీ... మృత్యువు...

"అన్నా!" అనిహత్తుకుంటే... ఆహాహ... మని నలిపి నలిపీ... నల్లటి సిరాల కోరికల లిపి... ఒలిపీ...

బుగ్గలు తడిమీ...

మొగ్గలు చిదిమీ...

మనుషులం... మానవులం... మాదో జాతంతే అని అహంభావంతో... లుంగీలెత్తుకు అంగలార్చే... దొంగలంజాకొడుకులం...

మేం...

మేం...మ...గ...వా...ళ్లం...

నిస్తేజంగా కళ్లు మూసుకుంటే... లేచి... ఆచి...తూచి... నన్ను కొలిచి... నన్నో దేవుడ్ని చేసిన... పీయూష తప్త మధురోష్ఠ హ్రాదినీ గౌరి...

మస్తానొచ్చి... గుడ్లతో అట్లు వేసి... కిచిడీ... దింపి... నీళ్లు కాచీ... వడలిన గౌరీ దేహాన్ని కడిగి కడిగీ...

కంచంలో కింత... కిచిడీ వంపీ... రెండు గుడ్లట్లేసి... ఊరగాయేసీ... సిల్వర్ కారియర్లో పెరుగు పెట్టి... నా ముందు మందు పెట్టీ... గాజు గ్లాసూ, లేత నీలం జగ్గులో నీళ్లూ సిద్ధం చేసీ పోతూంటే...

నల్లచీర కట్టుకున్నా గౌరి... మళ్లీ నిర్మలంగా... "మస్తా...న్" నేన్పిలిస్తే వచ్చి... "పోయి... ఇంకో కంచం తెచ్చుకో" అన్నేనంటే... "వద్దుసా...నేబోతా..." మస్తాన్...

"తంతా...ఫో... పోయి కంచం తెచ్చుకో..." అన్నేనంటే...

మౌనంగా... వెళ్లి ఇంకో సత్తుపళ్లెం తెచ్చుకు... విచ్చుకున్న మానవ పుష్పం మస్తాన్...

మస్తాన్కీ... వేడి వేడి కిచిడీ వడ్డించీ... సీసాలో ఊరగాయ చెంచాతో పంచీ... వో ఆమ్లెట్ వేసీ... "దా...మస్తా...దా...కూచ్చో..." అన్నేనంటే కన్నీళ్లొత్తుకుంటూ... ఆ దైవత్వం...

గౌరీ... మస్తాన్ కిచిడీ ఆమ్లెట్ కలిపి తింటోంటే...నే గ్లాసులోకి మందేసుకుని తృప్తిగా ఓ గుక్క తాగితే... "ఊ ఇంద...ఆ...అను" అని గౌరి ఆమ్లెట్ముక్కని నా నోటి కందిస్తే...

అస్తిత్వం లోపించి మస్తాన్ అదృశ్యుడై...

మళ్లీ మరుక్షణం ప్రత్యక్షమై...

"ఆ" అని ఏడుస్తూ...

నా భుజమ్మీదో చెయ్యీ, గౌరి నడుమ్చుట్టో చెయ్యీ వేసి... ఇద్దర్నీ కావులించుకునేడిస్తే...

లోకం... యీ భౌతిక లోకమింక నాకమే... అన్నేను... ఓక్షణం...

కాంతి ముయూఖాన్నె... సాయంత్రం పబ్లిక్‌ఫోన్లో వెంకుగాడితో మాట్లాడి, వాడిని ఏడున్నర కింటికి రమ్మన్చెప్పి, నే వెళ్లి... మందూమాకూ కొని... ఇంటికొచ్చి యెంకట్రాముడ్ని పిలిచి... "ఏం నా! నేనూ... నా ఫ్రెండూ కల్సి ఇంట్లో చిన్న మందుపార్టీ పెట్టాం వస్తావా అనడిగితే...

సిగ్గు సిగ్గుగా "ఊ" అని యెంకట్రాముడు...

వెంకు రావడం...

మందు కొట్టడం... రాత్రి పదకొండున్నర కెళ్లిపోవడమూ జరిగింది...

ఇంకో పదిసార్లు అష్యూరెన్సచ్చి పోయాడు...

చప్పుడ్చేయకుండా... కాలం ప్రవహిస్తూనే ఉంది. బాల కాలం కాలండరు గళ్లల్లోంచి, ఒక్కో గెంతే వేస్తూ...'యామైరైట్?' అనడగుతూ... జవాబక్కరలేకుండా... యస్సయామాల్వేస్ రైటనుకుంటూ... గౌరి మళ్లీ వెనుకటి జానకీ మనోహరీ గౌరైంది... గాయం మానింది... శరీరానికి కైంది...

జ్ఞాపకాల గాయాన్ని మాయం చేయగలిగింది ఒక్కటే... మృత్యువు... తప్పదు...

☼ ☼ ☼

ఆ రోజుదయాన్నే ఆఫీసుకు తయారై... హోటల్లో టిఫిన్చేసెళ్దామని రోడ్డుమీద కొస్తే... దూరం నుంచీ పరిగెత్తుతూ... వగరుస్తూ... అహల్య పెద్దది...

"ఏమే... దెయ్యమా... స్కూల్లేదా... ఎక్కడ్నుంచట్లా పరిగెత్తుకొస్తున్నావు?"

"మా... మామా రైలుకట్టకాడ ఎవర్దో పీనిగ... అందరూ... సెబ్తే పొయ్యొచ్చినా..." ఇంకా వగరుస్తోంది.

"ఫో... స్నానం చేసి స్కూలుకు ఫో" దాని వీప్మీద చరిచి... ఎవరో... ఎందుకు నాత్మహత్యల్చేసుకుంటారో... నా కిన్ని సార్లు వ్యథలు... వంకాయాలూ అన్నీ వచ్చినా... ఛస్తే చావుకు మాత్రం నో... బ్రతుకు మీద విపరీతమైన ప్రేమ...

ప్రేమ... గౌరీ ప్రేమ... ఇక గౌరి నిక్కడికి తెచ్చేయాలి... పెళ్ళి అవసరమా... ఏమో... మనసు మెత్తగా మూలిగింది.

హుషారుగా హోటల్లో దూరి... మసాలా దోసా... గరమా గరమ్ కడక్ కాఫీ కొట్టి... బైటికొచ్చి సిగరెట్వెలిగించి...

జామ్మని దమ్ములాగుతూ...

ప్రాపంచిక చైతన్యమంతా నేనేయై... నేను...

పదకొండూ... పదిహేను... టైం...

ఆఫీసుబైట కోడిజుట్టు పూలచెట్ల మధ్య నిలబడి... నేనూ... జాన్సనూ... ఇంకో పాసెంజరూ... అనబడే బాధితుడు నిలబడి... బేరాలాడుకుంటూ సిగరెట్లు కాలుస్తున్నాం...

జాన్సను ఉన్నట్టుండి నా భుజం తట్టి మెయిన్గేటు వంక చెయ్యి చూపించాడు... హన్మంతుగాడి రిక్షాలో గౌరీ... మస్తానూ...

ఇ... ఇదేమిటి... అంతగా అవసరమైతే మస్తాన్ని పంపుతుంది గానీ... తనే స్వయంగా... యెక్కడో అపశ్రుతి... పరుగులాంటి నడకతో రిక్షాని చేరా... గౌరి కళ్లు శూన్యంగా... చైతన్య రహితంగా...

"గౌరి... గౌ...ఏం...? ఎక్కడ్నుంచి... ఏమై..."

"అతను... అతను..." గౌరి గొంతుక పెగల్దం లేదు...

"అతను... అంటే...? ఎవరు...? గౌరి...! ప్లీజ్ క్లియర్గా చెప్పు..."

"అతను... చచ్చి...పో...యాడు..."

"ఎవరు?"

ఒక్కసారి... ప్రపంచం నా చుట్టూ ప్రపంచం... భయంకర నిశ్శబ్దంలో బ్రహ్మాండంగా బ్రద్ధలై మునిగిపోయింది... జీవ చైతన్యానికీ... నా నేత్రాలకీ మధ్య రక్కున జారిన తమో యవనిక...

వెనక్కి పరిగెత్తి... పొద్దున అహల్య పెద్దది... రైలు కట్ట... పీనిగ...

వద్దు... భగవాన్లూ... రేయి నువ్వు కాదురా... అనుకుంటూ...

"జాన్...జాన్... బండీ స్టార్ట్ చేయి... రా... త్వరగా... రా... జాన్ ప్లీజ్..." జాన్సన్మాట్లాడకుండా... హోండా స్టార్ట్ చేశాడు...

"రైల్వే ట్రాక్దగ్గర్కిపోనీ..."

కళ్లు బైర్లుకమ్ముతున్నాయి... చెవుల్లో జెట్విమానాలూ... పరిగెడుతున్నాయి... అయిదు నిముషాల్లో వాటర్ ట్యాంకుపక్కన రైల్వే ట్రాక్దగ్గర చిన్న గుంపుగా జనం...

బండీ ఆగీ ఆగక ముందే దిగబోయి రోడ్డు మీదకి ధబ్మనీ బొక్కబోర్లా పడ్డా... పెదవి చిట్లింది... మోకాల్దగ్గర పాంటు చినిగి దోక్కుపోయింది...

పరిగెత్తి... ఆ గుంపు వెనక ఆగిపోయా...

కాదు... ఇది... ఇది... భగవాన్లు కాదు... వాడెందుకు? వాడేయెందుకు?

ఊహూ... కాదు... ఒక్కో మనిషినీ తప్పిస్తూ... చూడకూడదనీ...

చూళ్లేననీ... అది వాడు కాకూడదనీ... కాదనీ... నెమ్మదిగా నెమనెమ్మదిగా తలెత్తి చూసా...

భ....గ....వా....న్లు!!!

వొంటిమీద నీలం రంగు కడ్రాయర్తప్ప నూలుపోగు లేదు. ఒక కాలు తిన్నగా ఉంది... ఇంకో కాలు ఎడంగా మడత పెట్టి ఉంది... ఎడమ చెయ్యి... తల వెనక్కి కుడి చెయ్యివెల్లకిలా వేసి విసిరేసినట్టు... నోట్లో నుంచి ఈగలు ఇంకేవేవో పురుగులూ వస్తున్నాయి... ఒక్కో అడుగేస్తూ... వాడిని సమీపించబోతూంటే..."ఏయ్...దూరం...ఫోఫో దగ్గర్రానీకల్యా" ఖాకీ కాఠిన్యం... ఎందు... ఎందుకనేడుపు రావటం లేదు... ఎక్కడో ఏదో చీకటి మూల నా మనస్సు వాడి రాహిత్యాన్ని కొరుకుంటూనే ఉన్నందుకా?...

వద్దూ... వద్దూ...

జీపొచ్చి ఆగింది... వెంకు...

"ఏయ్... జరగం డ్జరగం దందరూ దూరం దూరం..."

కానిస్టేబుల్లాఠీ ఊపుతూ... అందర్నీ తరుముతున్నాడు... భగవాన్ల శవాన్ని చూసి కూడా... వీసమెత్తు మారలే వాడి ముఖ కవళికలు... నన్ను చూసీ చూడనట్టు... పక్కక్తిరిగి సబిన్స్పెక్టర్తో మాట్లాడుతూ... మళ్లీ జీపెక్కి వెళ్లబోతూంటే... ఇక ఆగలేక...

"రే...య్..." అని పరుగెత్తి స్టీరింగ్వీల్మీద చెయ్యేసి...

"వెంకూ...! వరేయ్..." వెంకూ... బగాన్లురా... బగ్గిగాడ్రా... మన మచ్చుల్మకప్పుచ్చు మొగమోడ్రా... రేయ్... వాడు చచ్చిపోలేద్రా... వాణ్ణి... చంపేసినార్రా... వెంకూ... వద్దురా... నువ్వెళ్లిపోద్దురా..."

"షటప్... ఏం పొద్దున్నే తాగొచ్చినావా... ఏసోబూ... దిగి... వీణ్ణి తోలెయ్యి..."

ఏసేబు నోర్తెర్చుకుని మళ్లీ ఠప్పున మూసుకుని.. నా దగ్గర్కొచ్చి.. 'పా సార్..

పా. యీలెక్కన్నాచనమంది సస్తాంటార్గానీ... నువ్వు... పా...” అని సున్నితంగా రెక్క పట్టుకు లాక్కొచ్చాడు.

హన్మంతుగాడి రిక్షా తుమ్మచెట్టుకిందాగుంది...

జానకీ మస్తాన్లు... చూస్తున్నారాత్రంగా...

కానిస్టేబుల్చేతిలో నన్ను చూడగానే మస్తాన్పరిగెత్తుకొచ్చాడు...

“వద్దు వద్దు పాసా... ఇంటికి ఇంటికి పోంపా”

“మీ మనిషేనా... తీస్కపో... పొద్దుగాలే తాగినట్టుండాడు...” అని కానిస్టేబులు వెనక్కెళ్తోంటే...

సుడిగాల్లా మళ్లీ పరిగెత్తా... వెంకు దగ్గర్కి...

“వెంకూ... వెంకూ... ప్లీజ్... నేనిక్కడే ఉంటారా... బగాన్లురా... మన బగాన్లు... యెమ్మెడబల్లిట్గాడ్రా...”

కంట్లోంచి ధారగా నీళ్లు పొంగుతున్నాయి... చిట్లిపోయిన పెదవి నుంచి రక్తమూ కార్తోంది... మొహం బాధగా పక్కకు తిప్పుకుని...

జీప్రివర్స్ చేసుకుని... రయ్మని దూసుకెళ్లిపోయాడు....

“ఆ” అన్నే యెలుగెత్తి అరిస్తే చెళ్లుమంది చెంప...

ఒక్కసారి ప్రపంచం ఆగింది...

గౌరి...గౌరీ... న...న్ను....

తల పక్కకిప్పి చూస్తే... వాడు... నా ఆత్మీయుడు అప్పుడెప్పుడో కసవుకుండీ పక్కన కళ్లు తెరచీ...

ఇనుపచక్రాలు దొర్లే... రైలు పట్టాల పక్కనకళ్లు మూసీ... భగాన్లు “దొంగముండా! నీకు... నీకూ వాడ్చచ్చిపోవడమే కావాలే... నాక్తెల్సే... నీ...నీకు వాడంటే అసయ్యం, దయ్యం ముండా... వాడు...వాడు... నాకు... ఆకలైతే అన్నం పెట్టి... మందు కావాలంటే డబ్బులిచ్చి... నీకు వాడంటే కచ్చి...” నేనేం మాట్లాడుతున్నానో నాకు తెలీదు...

చెళ్లుమని ఇంకోసారి...

జానకి కళ్లల్లో నిరామయత

బలవంతంగా హన్మంతూ... మస్తానూ నన్నీడ్చుకొచ్చి... రిక్షాలో కుదేసి...

జానకి పక్కన్కూచుంటే... కాళ్ల దగ్గర మస్తాన్... రయ్‌మని తొక్కుతూ... జానకీ వాకిట్లో నిలబెడ్తే...

మౌనంగా రిక్షా దిగి... ఇంట్లోకి నడిచి... కంట్లో నీళ్లూ... పెదవి చిట్లిన్నెత్తురూ అంతా కల్సి కలగల్సి ప్రవహిస్తూ... గోడ కానున్కూచుంటే...

చిన్నగిన్నెలో నీళ్లూ టవల్ తెచ్చి... నా పక్కన్కూచుంది....

జా...న...కి...

టవల్నీళ్లతో అద్ది... చిట్లిన నా పెదవిని తుడిచింది.. ఆమె కంట్లోంచి నీళ్లు ఐకుతున్నాయి....

మోకాల్దగ్గర చినిగిన పాంటంతా రక్తంతో తడిసింది... లుంగీ తెచ్చి...

“ఊ లెండి...” అనంటే లుంగీ చుట్టకుండానే ప్యాంటుని విప్పేసా... మొకాల్దగ్గర కూడా చల్లనీళ్లతో తుడిచి... నెబాసల్ఫ్ పౌడర్వేసింది.

మస్తాన్... ఖొజ్జా... హిజ్డా... షండ... ముండల అండ... మస్తాన్... సంచీ జానకి చేతికిచ్చి... నన్ను జాలిగా చూసి... మస్తాన్...

గ్లాసులో సగానికి విస్కీ వొంపి ఇంకో సగం నీళ్లేసి...

“ఊ” అని జానకంటే...

పట్టుకు యెత్తుకు దించక... గటగటా త్రాగి...

‘హా’ అని... జేబుల్తడుముకోవడానికి పోయి... చేతికి లుంగీ తగిల్తే...

సిగరెట్పేక్మీద పారదర్శకప్పొర వొలిచీ... బేగడ విడదీసి... సిగరెట్‌ని నా నోట్లో పెట్టి అగ్గిపెట్టె వెలిగించి... జా...న...కి...! పెద్ద దమ్ములాగి... చిట్లిన పెదవి చిమ చిమ లాడుతుంటే... భగవాన్లు... శవాల బండీ టాక్సీ డ్రైవరెమ్మే డబల్లిట్ప్ర్వర్ట్గాడి శవం... రైలు పట్టాల్పక్కన పడుకుని...

శవాలు మోసే శవాల బండీ భగవాన్ల శవం మోసేందుకు... అందుకు ఇంకో శవాలబండీ... భలే... భలే...

“యింకోటి...” గ్లాసు జాపితే...

శోకస్రోతస్వినీ జానకి...

ఇంకో సగం గ్లాసు... విస్కీ వంపి...

పువ్వుల రేకులు... గువ్వలై...

వసంతాల వాకిళ్లల్లోంచి గుంపులు గుంపులై...

సుమ రజస్సులు... విద్రుమ తేజస్సులై...

చీకటుల చెలరేగి రేగి పెనుగాలుల వీగి వీగి

అనుభూతుల్మరచి మరచి...

శతకోటి శతహ్రదల విరిచి విరిచి...

అరచి...అరచి...అసహాయ... అన్నీ స్వాహాయ... భస్మీపటలం...వైశ్వానర... ఉద్వేగం... ఆకలి...

రాం... రాం... రమ్మని

కమ్మని కలల జీవితాల... కల్లోలపరచి... ఉన్మీలనం మరచిన ముకుళాల మరచీ... చెరచీ... జీవన్ముక్తం... చేసిన... ఓ వికృతి... ఇనుపకమ్ముల్పక్కన... నోట్లో ఈగలు... నామనసు వాకిట్లో... డేగలు...

నే నెడారై...

తడి ఓ బొట్టూ లేక... విడిది... చోటూ లేక... ఆ ఆత్మ... ఆఖరికి... నా కనుకొలుకుల చేరిన కన్నీటి చుక్కన కూడా చోటు లేక... కాఠిన్యం...లోకానిది...కాదు...

లౌక్యబద్ధ... శుద్ధ... స్వార్థ మానసుడినై నాదికూడా...

భ...గ...వా...న్లూ....

నన్ను క్షమించరా...

నేను నిస్తుషితంగా...

నీ ముందు నిల్చున్నారా!

రే...రేయ్... బగాన్లూ...

గ్లాసెత్తి గట గటా గరళాన్ని... నిమ్మళంగా మింగా...

⁕ ⁕ ⁕

మరణ రహస్యాల మర్మాన్ని ప్రశ్నిస్తూ... నేను... నేను... తమస్సమాధిలో... తెలుస్తుంది... నాకూ... నీకూ... అతనికీ... ఆమెకూ... అందరికీ... అప్పుడే కనులు తెరిచిన శైశవానికి కూడా మరణగానం ఆలపించడం తెల్సు.

కానీ పాడే పాటకు అర్థం తెలీకుండా పాడ్తామా?

లే...లేదు మన... మనకందరికీ తెల్సు...

మరణమంటే ఏమిటో...

కానీ అనుభవించే వరకూ... ఆకలంటే ఏమోతెలీదు... మెతుకు గతికే వరకూ

శారీరక లిప్సలు... కామం... క్రోధం... క్షుత్తు... మత్తు... అనుభవించిం తర్వాతే... మన భాష్యాలు...

జీవచైతన్యపు లోలోపలి పొరల్లోకెళ్లి... కేంద్ర బిందువున స్నాతమై...

పునీతమైనప్పుడే...

నిర్జీవమంటే ఏమిటో తెల్సేది...

మరణ చైతన్యాన్ని మన చుట్టూ కప్పుకుని... హృదయ నేత్రాన్ని జీవితం వైపు వికసింపచేసి చూస్తే కదా? మరణం... జీవం... ఒక్కటే కావా?

ఒకటి నిశ్చల జల సమాధి...

ఇంకోటి... చంచల ఝురి... ఇది వెళ్ళి అందులో కలవాల్సిందే!

అంతే... అది అంతం కాదు... అదే జీవ చైతన్యం... మనం మన స్వప్నాల్ని అమ్ముకోకుండా నమ్ముకుంటే... ఆ స్వప్నాంతర్గత రహస్య సమాధానాల్లో తెర్చుకునే వాకిళ్ళు... గళ్లు... మన మనోగాత్ర అంగుళులకు తగుల్తాయని... తెలీని మనం...

మనం... చీకట్లో...

మట్టి పొరల కింద మత్తుగా పడుకున్న విత్తనం మొలకల కలలు కన్నట్టు...

కొన్ని కోట్ల యుగాల నుంచీ...

మానవ మేథోపొరల అరల నడుమ... సుప్తమైన ఆలోచనా బీజం... గేయమై... మాయాగానమై... రెక్కలు విచ్చుకునే క్షణానికై వేచి వేచి... వీచే ఈదురుగాలుల్లో... మండే ఎండల్లో... రగలే సూర్యుడి కింద నగ్న స్నానానికై తపిస్తూ... శ్వసితం... కంపనమై... కంపిత శ్వాసయై

జీవ చైతన్యార్ణవ సంకేతాలై...

ప్రకంపనలై...

ఎగసి... అలసి... సొలసి... మళ్లీ... మళ్లీ... సాగి... ప్రాకృతిక సంకేతాక్షరాలై 'నేనై'... నేను చీకటై... నేనూచీకటి...

* * *

నాకు తెలుసు.

ఆమె ఆకాశపు కనురెప్పలెత్తి శూన్యాంతరాళాలతో నన్ను స్పృశిస్తోందని...

"జా...న...కీ" గౌరి... గౌరీ మనోహరి మాయమైన మంత్రక్షణం...

మరణ క్షణం... క్షణ మరణం... తమో కిరణం... చినుకు చినుకై ప్రేమను వర్షిస్తున్న కాదంబినీ గౌరిని చూస్తూ... మళ్లీ పిలిచా

"జా...న...కీ!"

ఆమె నేత్రాకాశం నుంచీ మళ్లీ ఓ జల్లు... "నిజం చెప్పు జానకీ! శవం మీంచి వాడు సొమ్ములు దొంగిలించాడా? వాడు... బగాన్లు... మనశ్శాంతుల్ని మాత్రమే దొంగిలించడం తెల్సు జానకీ నాకు..."

ఆ శూన్యాంతరాళాల్ని ఆకాశపు కనురెప్పలు కప్పేశాయి... ఉద్వేగాలావర్తించిన ఓ కేక నిశ్శబ్దంగా విచ్చుకున్న ఆమె పెదవుల్మధ్య నుంచి తీగలుగా సాగిన మరణ గానంగా... "వద్దు... వద్దండీ... వద్దు..."

ప్రపంచంలోని యావద్దయనూ ఆర్థిస్తూ...

నిజమే... ఆ... ఆర్థన...

చచ్చిపోయిన భగవాన్ల శవం కూడా వింటోంది...

"జానకీ!"

తుఫానులాగా ఆమె లేచిపోయింది...

చినుకు చినుకై రాలే ఉద్వేగాల చూరుకింద కూచున్నా... నే...నే...నెవరు? జానకి... జా...జానకి... గౌరీ మనోహరీ... ఆర్... గౌరీ మనోహరీ... జానకి బియస్సీ ఫైనలియర్... ఎవరు? ఈ ప్రపంచమేమిటి?

గోడకి పెచ్చులూడి; మచ్చల్పేరుకు... మా మనస్సుల్లాంటి గోడకి చేరగిలబడి కూచున్నా... మందు... విస్కీ... చెలరేగి నర్తిస్తోంది... నరనరాన విద్యుత్తల్లే ప్రవహిస్తోంది...

చిట్లిన చీకటి కాంతుల్లోంచి... నీడలాగా... అడుగడుగూ... యుగాలని దాటుతున్నట్టు వేస్తూ... నాగరకత ల్నధిగమిస్తున్నట్టు... తనే ఓ నాగరకతై... చీకటి యుగాంతానావిర్భవించినో నాగరకతల్లే...

జానకి...

వచ్చి... నా ముందు... ఓ శైథిల్యమ్ముందు...

మత్తు గోలిన శిథిలం ముందు... పునరుత్థానం కోసం... వేచి చూచే... విశాల ఆశానేత్రమై

జా...న...కి... కూచుంది... భావరాహిత్యాన్ని ధరించిన నా చూపులు ఆమెను చూస్తూ... చూస్తూ...

అనుమానం... అవమానం... అపప్రథ అన్నీ కల్సి కలగల్సి...

ఆమె తెల్ల శుష్క హస్తం... ముకుళించిన హస్తం... ఒక్కో రేకై... విడివడుతూ... అరచేతిలో... ఓచిన్న ముడతల్తో ఓ పొట్లం... గుండె గతి తప్పి... మళ్లీ లబ్ డబ్ డబ్మని... ఏ... ఏమిటది...? అది...అది కాదు కదా! ఎందుకో... ఎందుకనో ఇన్సెక్యూర్ ఫీలింగని ఏడ్చిన జానకి...

భగవాన్ల పేరెత్తితే భయమంతా తానేయైన జానకి... కాదు... నో... కాకూడదది... అది... అది నేననుకుంటున్నది కాకూడదు...

తెల్లటి గౌరి...

గౌర గౌరి... శ్యామలా గౌరిలా కనబడ్తోందేం?

గౌ...గౌరీ...ను...నువ్వు కూడా...! నీ క్కూడా మనసు... మౌనంగా యుద్ధం చేస్తోంది...

ఆమె కుడి చెయ్యి కదలి...

వద్దు... తెరవద్దు... భగవాన్ల మూసిన పెట్టె లాగా...

పెట్టుడు మీసాల్గడ్డం సెట్టూ... చూచుకాల్దగ్గర కత్తిరించిన నల్లటి బ్రా... ముట్టు బట్టా... ప్లాస్టిక్ సంచీ... నిండుగా ఏవో వెంట్రుకలూ...

జా...న...గౌరీ...వద్దు...నీ మనో తమో మంజూష తెరవద్దు...

ఒక్కో మడతా విప్పుతోంది... ఆ పొట్లాన్ని... తనని తాను... మావత్వాన్ని... దిగంబరం చేస్తూ... విలువల వలువల్ని వలుస్తున్నట్టూ... పొరలుగా... కాదు... కాకూడదని ఆశ... స్వనిస్తో... అవును... అవునని నిజం... నినదిస్తో... రేకు... రేకూ... విడిగే చీకటి పువ్వై... ఆ పొట్లం విడివడి...

చివ్వుమని... చీకటి కిరణాలు... నిజ మరణాలై...

కసుక్కున నా కళ్లలోకి ప్రవహించి... రెండు... వజ్రాల దుద్దులు... అప్రయత్నంగా నా పెదవుల్విచ్చుకుని...

నే...నేను... చీకట్లో...

చీకటి... గదిలో... వెల్తుర్లేక... నే... నేనే... చీకటై... మనస్సు... తమస్సులో... తమస్సు తపస్సులో... నిజాల నీడలు... జాడలు... ఎండిపోయిన... నదీ జలాలు

వదిలేసిన జీవ చైతన్య స్రవంతుల్వదిలేసిన జాడలు... చారికలై... మదిపేలికలై... పేలిన... నిజం ఖనిజాల... గుట్టలై... రెక్కల్విరిగిన పిట్ట ఱెట్టలై...

బహిష్టులై... రొష్టులై... భ్రష్టులై... ముష్టికోసం... మూయనుచేతగాని కుష్టులై... కునిష్టులై...

వాడేం చెప్పాలనుకున్నాడు?

"నీ....జా....ర...."

ఆ మూడూ చీకటి అక్షరాలేనా?... ఇక నా... నా జీవితాంతం వరకూ... తపించి... నాకు నేనై... ఏదేదో ఊహించి... వాడు... నా ప్రియుడు... హితుడు...

స్నేహితుడు...

శవాల టాక్సీ డ్రైవరెమ్మె డబిల్లిట్ పర్వట్‌గాడు...

భగవాన్లు... దొంగ అంతేనా? దొంగ కూడానా?

"నీ....జా....ర...."

మనిషి... అంతరాంతరాళాల్లోకి...

తమస్సులో...

తప్పటడుగల్వేస్తూ... తడుముకుంటూ...

ఆ గర్భలయాన్ని చేరుకున్నానో, లేదో తెలీని తనపు చీకటిలో...

ఆ చీకటి గర్భాలయంలో...

చీకటి న్ఛూస్తూ... చీకటి న్ఛూసేదేమిటి?

వికసించిన నేత్రాలు... ముకుళాలై... కాంతిరేకులు... తడుముకుంటూ...

నే...నేను...

చీకటితో... మమేకమై... జపిస్తూ... తపిస్తూ... తమిస్తూ... తమో ప్రేమతో... తమస్సు వ్రమిస్తూ ప్రేమలో... క్షామంలో... కామంతో కళ్ళు తెరిచున్న దృష్టి రాహిత్యంలో ఆ గర్భాలయాన... చీకటి చూస్తూ...

నే...నేనూ...చీకటి... అప్రయత్నంగా... రెండుచేతులూ... జోడించి... మనోష్ఠాలుచ్చరించిన తమోక్షరాలు...

**తమో నమః**

# చదివింతర్వాత....

నేనూ–చీకటి!

నేనూ–చీకటి ఏమిటీ? నేనూ చీకటి వేరు వేరా? అయితే నేనెవరు? ఆ చీకటెవరు?? నేనెవరు అనే ప్రశ్నని గుండె జేబులో తడుముకునే నేనెవరు? స్పర్శలకందక తడమబడే ఆ పెను చీకటెవరు?? నువ్వు అవుననూ, కాదనూ! మనిషి ఒకటి కాదు, రెండు! – నేనూ–చీకటి!

నా నుంచీ నా చీకటి వేరా? కాదని అనలేను... ఆ చీకటి మాత్రమే నేనా? అవునని ఒప్పుకోలేను.

వెలుతుర్లో చీకట్లుండవా?

చీకట్లో వెలుతుర్లుండవా?

మసక వెలుగు మసక చీకటి వేరు వేరా? చీకటి వెలుగుల మనిషిని ప్రేమించకుండా ఉండలేని సహానుభూతిలోంచీ తమోనమః అని పలవరించిన కవితాత్మక నవల నేనూ–చీకటి... ఒకనిగా పుట్టి రెండుగా విడిపోయి బతకడం మనిషి ప్రధాన సమస్య! కోరుకునే వాడూ–కోరబడేది... ఈ రెండింటి మధ్యా మోసులెత్తిన ఇచ్ఛ విజృంభణలో కొన్ని ఆదర్శాలూ నైతిక సూత్రాలూ మనిషికి గగన కుసుమాలవుతాయి... అట్లా జరక్కూడదు. నిజమే! కానీ అట్లాగే జరుగుతూ ఉంటుంది. అదీ మనిషి బతుకులోని అసలు విషాదం. ఈ విషాదాన్ని ఆవిష్కరించాడు నేనూ–చీకటి రచయిత. అందరు మనుషులూనైతిక సూత్రాలు తప్పిన వాళ్లుగానే ఉంటారా? అంటే ఉండరు. ఎవరో కొందరు మహానుభావులుంటారు. భక్తులూ, యోగులూ, సూఫీలూ, మహర్షులూ! అట్లాంటి మహానుభావుల కోసం ఈ రచయిత ఈ నవల రాయలేదు. తనలోని పెంజీకటిని భద్రంగా కాపాడుకుని, సమాజంలోని చీకటితో పోరాడడం చాలామంది బుద్ధిజీవులకు సౌకర్యంగా ఉంటుంది. అట్లాంటి పక్షపాతపు చైతన్యదారులకక్కూడా ఈ నవల సంతోషం కలిగించదు...

మరి ఎవరికోసం ఈ నవల.

చిట్లిన బిందువున తననుతాను ఆవిష్కరించుకునే వారికోసం! ఏ మత్తమృగమో చిందించిన ఓ వీర్యకణాన్ని వ్రణం చేసుకున్న జానకీ హృదయుల కోసం! వైభవోద్రిక్త దినాలూ, పాపపులిప్సలూ మోసే అతి మామూలు మనుషుల కోసం!!

'నేను' పాత్రను తప్పొప్పుల దృష్టితో కాకుండా ఒక జీవన సరళిగా చూస్తే తప్పు; ఆ పాత్ర మానసిక సంచలనాలు మనకు బాగా అర్థం కావు.

'నేను' అంటే ఏమిటి?

కులమూ, మతమూ, జాతీ, జెండరూ, వర్గమూ... ఇవన్నీ కలగా పులగమై పోయి మనిషిలో భాసించే ఒక ఇరుకు అస్తిత్వం! పగలబడే నవ్వులూ, గోర్వెచ్చటి కన్నీళ్లూ... శాంతీ, సంఘర్షణా, సహ్యాసహ్యాలూ; ఆకాశమంత ఔన్నత్యమూ, పాతాళమంత పతనత్వమూ... ఇవన్నీ పడుగు పేకల్లా అల్లుకుపోయిన ఒక వైయక్తిక ప్రపంచం!! ఈ 'నేనూ'. చట్రపు ఉక్కు నిర్మాణం నుంచీ పెనుగులాడిన ఒక కళాకారుని పరితప్త సృజన ఈ నేనూ–చీకటి నవల.

నువ్వూ ప్రపంచమూ ఒక్కటే! నిన్ను తెలుసుకో ప్రపంచం తెలుస్తుంది అంటారు భారతీయ తాత్వికులు. మనిషి ప్రపంచాన్ని తన మనసు ద్వారా చూసి గ్రహిస్తాడు. ఆ మనసు మళ్లీ ప్రపంచమే! భౌతిక ప్రపంచం శాస్త్రజ్ఞుడికీ, అనుభవ ప్రపంచం సృజన కళాకారుడికీ ముఖ్యమైన కార్యక్షేత్రాలవుతాయి... అందుకే, నీళ్లని మోసే చిన్ని కూజానీ, మరణానికి చిటికెడు దూరం లోని తల్లి కాన్పునీ పాఠకుల అనుభవ ప్రపంచానికి కొంగ్రొత్తగా పరిచయం చేయగలిగాడు ఈ రచయిత.

సృజనకు 'నేను' గరిమనాభి.

'నా పరిసరాల బొంగరానికి నేను ములికి'

ఈ కళాసూత్రంతో సాహితీ క్షేత్రాన్ని సారవంతం చేసిన చలం, బుచ్చిబాబూ, రావిశాస్త్రిలాంటి రచయితలూ, తిలక్, ఇస్మాయిల్, పల్లవ హనుమయ్యలాంటి కవులూ మనకున్నారు. అదే కళాసూత్రం ఈ నవలాకారుడిని కూడా పరిపాలిస్తూ ఉంది.

శవాలబండీ టాక్సీ డ్రైవరెమ్మె డబిల్లిట్ భగవాన్ల గది, అమ్మహల్యా వెంకట్రాముల ఇల్లూ, ఆఫీసనబడే కట్టడమూ, ప్రపంచ వికృత ధ్వనులన్నీ కేంద్రీకరించబడిన బజారూ, టెక్కుల పైకప్పుల మేకప్పుల కాత్యాయనీ, వైకుంఠశుంఠా, సుగంధ దుర్గంధరావూ, ఖాకీ బట్టలు పెకలించుకునే సియ్యె వెంకటేశుల్రెడ్డీ, ఆర్. గౌరీ మనోహరీ జానకీ,, బియస్సీ ఫైనలియర్; మానవత్వపు రూపమైన హిజ్డామస్తాన్... ఈ అన్ని పరిసరాలకూ 'నేను' పాత్ర కేంద్రమై గిరగిరా తిరిగి పాఠకుల చెవుల్దగ్గర లోకపు బొంగరాన్ని గింగిర్లు తిప్పి హృదయాల్లో సూక్ష్మమైన ప్రకంపనల్ని పుట్టించే అనుభూతి పరమైన నవల నేనూ–చీకటి.

మానవ సంబంధాలు ఎంత అనివార్యమైనవో అంత పరిమితమైనవి. ఈ పరిమతత్వాన్ని కొంచెం విస్తృతం చేసి తాగుబోతుల్ని, వేశ్యల్నీ, షండల్నీ, పర్వర్టనీ, అట్టడుగు వర్గపు అమ్మల్ని, వారి నిష్ఠుర జీవితాల్ని, అంతర్లోకాల్ని, మానవత్వపు మహోదధుల్ని, జీవిత మాధుర్యాల్ని, పాఠకులకు పరిచయం చేసే నవల ఇది.

అమ్మ అనేది ఒక భావం!

తనను పుట్టించిన తల్లిని తప్ప మానవ పశుపక్ష్యాదుల్లో లోకమంతా నిండి పోయిన అమ్మల్ని గుర్తించలేని వాడికి సృష్టిలోని ప్రేమసూత్రం అనుభూతం కాదు.

'అవును... అమ్మశ్రాద్ధం...

శ్రావణశుద్ధషష్ఠి... 16న అంటే...

పరిగెత్తి... క్యాలెండర్ను... కాలాన్ని ప్రార్థిస్తూ...

ఈ రోజింకా పంచమి... ఉంచు రేప్పొద్దునకి కొద్దిగా షష్ఠి ముష్ఠి వెయ్యి.

కాలానికి కనికరం లేదు.

నిరామయంగా పయనిస్తూంటుంది.

అ.....అ....అమ్మా.....!

దబదబా తలుపుచప్పుడు

వెళ్ళి అలాగే తలుప్తీసా.

యెదురుగా యెంకట్రాముడూ... అహల్యా...

"యెంకట్రాముడన్నా! అమ్మదినమన్నా... ఆ పొద్దునే... నేం... చేయలే... నాగ్గుర్తులేదన్నా...

అమ్మహల్య కళ్లొత్తుకుంటూ...

"పాన్లే నాయనా! ఆవిటి మాటేంటిగ్గాని...దా... యింతన్నం తిందువు గానీ, దా..." అమ్మహల్యనబడే అహల్యమ్మ కంచంలోకన్నం వేసి యేదో పచ్చడి వేసి కసాబిసా కలిపి కలిపి...

"ఇంద పట్నాయనా... ఇద్దిను..." అని నా చేతికిస్తే...

"ముద్దాముద్దా... పిండం...

అమ్మశ్రాద్ధం...

అమ్మ... చచ్చిపోలేదు...

లేదు.

అమ్మకు చావులేదు.

అహల్యై... ఆడతనమై ఈ ప్రపంచమంతా విస్తరించుకుంది అమ్మ".

"మా"

అని 'నేను' పాత్ర పలవరిస్తుంది. తన చుట్టూ అలుముకున్న ఒక సాంస్కృతిక నిర్మాణం నించీ పెల్లగించబడిన మానవానుభూతి; దానికి భిన్నమైన సామాజిక సాంస్కృతిక నిర్మాణాలను అధిగమించి అహల్యమ్మవైపు ప్రసరించి ఏదో విశాలత్వంలోకి పర్యవశిస్తుంది ఇదొక అనుభూతి ప్రక్రియ.

భగవాన్లెవరు?

కసపుకుండీ పక్కన... రక్తపుగుడ్డుగా... యుక్తాయుక్త విచక్షణ మరచిన మానవత్వపు మరకగా... చుట్టూ మూడు కుక్కలు కోరలు తెరుచుకుని గుర్రు గుర్రుమని చొంగ కారుస్తూ ఎప్పుడు చైతన్యం ఆగిపోతుందా... యెప్పుడు చీలికలు పేలికలు చేసి లప్టాయిద్దామాని... చూస్తుంటే... బ్యాండేజీల బట్టల కట్టల ముట్టు బట్టల కంపులో, ఆపుకోలేని అవసరాలు తీర్చేసుకుని తుడిచేసిన చేతిగుడ్డల మధ్యన... మలమూత్రాల మధ్యన ఏడుపు తప్ప ఏమీ తెలీక... స్ఫోటక్మచ్చల్తో బాహ్య సౌందర్యం కూడా ప్రకృతి వాడినుంచీ దోచేస్తే... ఈ మహోదగ్రకాల ప్రవాహంలో ఏద్దొరికితే దాన్ని పట్టుకోవాలని చేతుల్చాపి... అసహాయుడై... జానకి(ని) తనకు మాత్రమే ఏకాంతంలో స్వంతంగా తన గుండె లోపలి సింహాసనమ్మీద కూచోబెట్టుకున్న ఒక అనాథ! బగ్గిగాడు...!!

మస్తాన్ ఎవరు?

కొజ్జా మస్తాన్; షండ మస్తాన్... ముండలరండల బ్రతుకుల పిండిన చీకటి చుక్కల చిక్కుల చిక్కని మరకల తుడిచే హిజ్డా మస్తాన్..." తనతో కలిసి గౌరి కిచ్డీ ఆమ్లెట్ కలిపి తింటుంటే; ఆమె... "ఇంద... ఆం...అను" అని ఆమ్లెట్ ముక్కని తన ప్రియుని నోటికందిస్తూంటే... ఆ దృశ్యానుభవానికీ ప్రేమతో కరిగి కన్నీరై "ఆ" అని యేడుస్తూ అతని భుజమ్మీదో చేయీ, గౌరీ నడుం చుట్టో చెయ్యీ వేసి ఆ యిద్దర్నీ కౌగలించుకునేడ్చిన ఒక మానవతారూపం.

ఆర్. గౌరీ మనోహరీ జానకి. బి.యస్సీ. ఫైనలియరెవరు?

'పునరుత్థానం కోసం వేచిచూసే విశాల ఆశానేత్రం! గౌరీ! నువ్వు కూడా?'

చీకటి చీకటి, ఈ చీకట్లో ఎక్కడెక్కడి కిరణాలో ఒక్కటై అల్లుకున్న ఆలయ శిఖరాలూ వీరంతా...

మనిషికి తన మనోస్వభావాన్ని ప్రశ్నించే తత్వ విచారణ అర్థమయినట్లుగా స్వస్వరూపాన్వేషణాసక్తి గల తత్వవిచారణ అర్థం కాదు.

ఈ రచయిత 'నేను' పాత్రతో మమేకమై...

మనస్సంచీలో రకరకాల ముఖాలు దాచుకుని, కావాల్సినప్పుడు కావల్సిన ముఖాన్ని తగుల్చుకుని మన అసలుముఖమేదో మనమే మరచిపోతామన్నప్పుడు, ఈ తత్వవిచారణను అర్థం చేసుకోవడానికి మనిషి మనో స్వభావం ఒక ఆధారంగా దొరుకుతుంది. కానీ ఈ రచయితే--

మరణ చైతన్యాన్ని మన చుట్టూ కప్పుకుని హృదయనేత్రాన్ని జీవితంవైపు వికసింపచేసి చూస్తే కదా! అన్నప్పుడు ఆ తత్వవిచారణను అనుభూతం చేసుకోవడానికి తన సాధనా,

సంస్కారమే, తప్ప మనిషికి మరో భౌతికాధారం లభించదు.

"నీలో వైరుధ్యాన్ని నువ్వు వదుల్చుకోలేని క్షణాలుంటాయని" రచయిత అంటే కాబోలని తలలూపుతాము.

జీవిత పూర్ణత్వం గూర్చి నానా శకలాలైనమనస్సు ఆలోచన చేయటం వింత అన్నప్పుడు మాత్రం...

నా మనిషి మెదడుకు లొంగని పూర్ణత్వం అసలు వుండడానికే వీలులేదు పొమ్మని మళ్ళీ మన బౌద్ధిక నిర్ణయాల్లోకే జారిపోతాం... ఇంకా "నేను... నేనని అనుకుని నేనుకాని నేను... మరెవ్వరో...?" అంటాడు.

"ఈ పార భౌతిక అస్తిత్వాన్ని ఎలా చెప్పను" అంటాడు. నేను శూన్యమనీ శూన్యభావ తమస్సుననీ అంటాడు... ఏ 'నేను' పార భౌతిక అస్తిత్వం? చీకటి అంటే లేనిదా? తెలియనిదా? రెండూనూ?? ఈ జిజ్ఞాసను చదువరుల చింతనకూ సాధనకూ వదలివేయడమే ఉత్తమ మనుకుంటాను.

ఈ నవలను రచయిత కర్నూల్లో రాసి కళ్యాణదుర్గం హోటల్లదుల్లో వినిపిస్తే... ఇంకొంచెం అర్థమయ్యేటట్టుగా రాయకూడదా అని మూలిగాడు విశ్వప్రేమికుడనబడు షేక్షావలి మిత్రుడు... డిక్షనరీ ఎన్‌సైక్లోపిడియాలవైపు పాఠకుల్ని పరుగెత్తించడం తగ్గిస్తే మాలాంటి సోమరి పాఠకులు మరింత సంతోషపడతారు కదా! అని ఆశపడతాను. కానీ 'నేను' పాత్ర భాషా భూమికకు ఈ వ్యక్తీకరణ అతికినట్లు సరిపోయిందని మాత్రం ఒప్పుకోకుండా ఉండలేను.

మనిషి చైతన్యానికి సామాజిక స్పృహ, జీవన స్పృహ రెండు పార్శ్వాలు, జీవన స్పృహ కొరవడుతున్న నేటి సాహితీ సందర్భంలో – అనుభూతిపరంగా నేనూ – చీకటీ లాంటి కవితాత్మక మనస్తాత్విక నవలనందించిన కాశీభట్ల వేణుగోపాల్ గారికి హార్ధికాభినందనలు...

11.12.1997 **స్వామి**

కళ్యాణదుర్గం

# నేనూ-చీకటి

.... అగాధాలలోంచి బయలుదేరే నల్లని అలలు మొహాన కొట్టి, ఉక్కిరిబిక్కిరై, తుపాను హోరు చెవుల గింగురుమని, నమ్మిన కాళ్లకింద భూమి దొలుచుకుపోతూ వుంటే... అంటూ కవిగా చలం, శ్రీశ్రీ మహాప్రస్థానానికి యోగ్యతాపత్రం ప్రారంభించిన సంగతి ఇప్పుడిక్కడ జ్ఞాపకం చేస్తూ ఈ సమీక్ష ప్రారంభించవలసి వస్తున్నది.

మనందరం మనమన జీవితాలను కష్టమో, నిష్ఠురమో, మన ప్రయత్నంతో కొంత, మన ప్రమేయమేమీ లేకుండా సమకాలీన జీవన ప్రవాహంలో కొట్టుకుపోతూ కొంత, జీవించిపారేస్తాం. మనిషి చర్మానికి పొరలున్నట్టే. మనజీవనానుభవాలకీ పొరలుంటాయి. కాగా పోగా, దెబ్బలు తగిలితే కొన్ని పైపై చర్మం చిట్లి, గాయం మానిపోతుంది. మరొకసారి మాంసభాగానికంటా తగిలి కుట్లుపడతాయి. ఓపట్టాన 'మాను' పట్టదు. అదిగో, అటువంటి గాయాల బాధలోంచి పుట్టిన నవల 'నేనూ-చీకటి'- చలం చెప్పిన ఉక్కిరి బిక్కిరి, అస్తిమితం కలిగించే దినుసుతో తయారైనదీ నవల.

'నేనూ-చీకటి' రచనలో పాత్రలు ఉదాత్తమైనవీ. ఆదర్శప్రాయమైనవీ, కానేకావు - వాళ్ళ జీవనవిధానాల దృష్ట్యా.

ఈ నవలలో కథనంతా చెప్పే 'నేను' (First Person) ఓ గెడ్డపోడు. ఓ బాపన్నాకొడుకు. 40 ఏళ్ళు వచ్చే దాకా 'ఆనార్కీ'తో బతుకుతూ తన తాగుడు కోసం, ఇతర అవసరాల కోసం, లంచాలు తింటూ, ఎస్.టి.వో. ఆడాలో ప్రభుత్వోద్యోగం చేసే గుమాస్తా అయితే బాగా చదువుకున్నవాడు. ఆ చదువు ద్వారా చాలా సున్నితమైన Sensibilities నశించిపోకుండా మిగిలినవాడు. తల్లి చచ్చిన బిడ్డ. "My very existence is a sacrilage for this so called brahmins and brahminism" అనీ, "I am an out cast" అనీ, ప్రకటించుకున్నవాడు. ఈ ప్రపంచంలో మోసానికీ, భయంకరహింసకీ, హిపోక్రసీకి, నిరంతరం తనలో తను రగిలిపోతూ, కట్టెకున్న నిప్పు కట్టెను కాల్చేస్తుందన్న సామెతగా తన ఆలోచనాగ్నికి దగ్ధమైపోతున్నవాడు. Ice Berg మాదిరిగా పైకి చాలా కొద్దిభాగం - అది కూడా అతి నేలబారుగా - కనిపిస్తూ లోపల మహాంతర్భాగం "తనలోకి మునిగి" వున్నవాడు. స్నేహానికి ప్రాణంపెట్టగలడు. ఇతనికంటూ వున్న చిరునామా అహల్య. ఎంకట్రాయుడు అనే దంపతులుండే ఓ చిన్న సైజు కాలనీలాంటి ఇంట్లో గది- ఇది తప్పిస్తే... శవాల్ని వహించే వాహనాల్ని... వాహనాన్ని నియంత్రించే భగవాన్లు ఎం.ఏ. డబిల్లిట్‌గాడి గది - అదీ తప్పిస్తే, ఎస్.టి.వో. 'ఆడా'లో కాత్యాయిని అనే ఓ అంతర్దుఃఖితురాలి పక్క సీటు.

ఇంకా - సుగంధరావు, యల్లయ్య, జాన్సన్, వైకుంఠం, సౌభాగ్యం, సామ్యేలు,

అచ్యుతరామయ్య, కుంటి సరోజ, మస్తాన్, రిక్షా హనుమంతు, సియ్యో వెంకటేశు(రెడ్డి, జానకి అనే గౌరీ మనోహరి అనే మరి పన్నెండు మంది బతుకులతో ముడిపడిన బాహ్యాంతర ప్రపంచాలతో అతనికి గాఢసంబంధం వుంది–

నేనూ–చీకటిలో ఇతివృత్తస్వభావం శ్రీ వేణుగోపాల్ రాసిన ముందు మాటల్ని బట్టి మనం సులువుగానే పోల్చుకోవచ్చు. వీటిలో రెండు ప్రకటనలు ముఖ్యమైనవి.

1. మనిషి వైయక్తిక మానసికస్థితీ, విద్యాపరిసరాల నిసర్గగుణమూ... అతని చుట్టూవున్న సమాజమూ, అతను పెరిగిన సంస్కృతీ, అతను నేర్చిన భాషా, ఆఖరుగా వ్యాకరణమూ, అనబడే different stages నించీ అవుతూ– ఆలోచన, వాక్యం అన్న సీతాకోక చిలుకై శబ్దరూపమో, రచనారూపమో తీసుకుంటుంది.

2. ఏ కళ అయినా... అతని వ్యక్తవక్తిత్వంలోంచి మాత్రమే సమాజం వాటిని చూడాలి. చూస్తుంది కూడానూ... నిజానికి ఆ కళ. క్రిందన చీకట్లో వున్న మౌలిక మానసికావస్థనించీ ఉద్భవించిందన్న సత్యం చాలామంది గ్రహించలేరు. ఆ చీకటే ఈ నేనూ–చీకటిలోని చీకటి.

ఈ రెండు ప్రకటనలూ ఈ నవలలోని రెండు Planes ని వివరించే ప్రయత్నం చేశాయి.

ఒకటి : జీవితాన్ని భౌతికంగా అందిన అవకాశాల మేరకి జీవించుకుపోవడం.

రెండు : జీవితాన్ని మానసికంగా అనుభవిస్తూ, వ్యక్తం చేయడానికి ప్రయత్నించడం. మొదటిది employer స్థితి అనుకుంటే, రెండోది employee సిద్ధి అవుతుంది.

నేనూ–చీకటి నవలలో 'కథ' అనే భాగం చాల సన్నని దారం.

ఈ కథ చెప్పుకునే మనిషి, భగవాన్లనే స్నేహితుని ద్వారా గౌరీమనోహరి (జానకి) అనే వేశ్య పరిచయంలోకి వెళ్లి – ఆమెలో గొప్ప హృదయసంస్కారాన్ని గ్రహించి ఉప్పొంగి పోయి తోడుగా తనకి వుండిపోవాలని గాఢంగా కోరుకోవడం. దానిని సాధించుకోవడం – ఇంతే.

అయితే – ఈ నవలలో భగవాన్లు పాత్ర, గౌరీ మనోహరి పాత్ర ఈ Narrator పాత్రకి ఎడా పెడా నిలబడి అతనికి ఈ జీవితపు విలువల్ని తెలియజెప్పారు.

ఇక్కడొక తమాషా–తెలుగు దేవదాసు సినిమాలో, ఉత్తమ వేశ్యతో దేవదాసుకి పరిచయం కలగజేసినవాడిపేరు కూడా భగవాన్లే!–అయితే, అందులోని దేవదాసులాగ ఇందులో నాయకుడికేమీ విఫలప్రేమ కథగాని, సంశయగ్రస్తత, సెల్ఫ్‌పిటీ వంటి దుర్లక్షణాలు లేవు.

నేనూ–చీకటి నవలలో 'ప్రస్తుతం' ప్రవర్తిస్తున్న పాత్రకి (ఒక్క భగవాన్లని తప్పించి) హేతువులుగా నిలిచే 'పూర్వఘటనలు' గాని పూర్వవాసనలు గాని ఏమీ వుండవు. అవి వర్తమానంతో ప్రవర్తిస్తూంటాయంతే. ఒక్క భగవాన్లు మాత్రం పుట్టుకదగ్గర్నించీ, చదువుకునే

రోజుల్లో హాస్టల్ జీవితం దగ్గర్నించీ, శవవాహక చక్రవర్తిత్వంవరకూ, గత చరిత్రతో ముడిపడినవాడు. నాయకుడు ఒకనాడు రహస్యంగా భగవాన్లు పెట్టె తెరిచినపుడు కంటబడిన సరంజామా, అతనిలో అంతర్వ్యక్తిత్వాన్ని మొదటిసారిగా బయటపెట్టి, కథానాయకుణ్ణి ఉక్కిరిబిక్కిరి చేసింది – ఇదే మొదటిసందర్భం. భగవాన్ల మీద నమ్మకం పోయినా, స్నేహబంధం మాత్రం అట్లానే వుంది. అందుకే, రైలు కట్టమీద భగవాన్ల శవం పడివుండగా, చూడడానికి వెళ్ళి స్నేహితుణ్ణి పొగొట్టుకున్న తీవ్రత అంతతీవ్రంగానూ ప్రకటించాడు.

చిట్టచివర, గౌరీమనోహరి ముడివిప్పిఎదుట పెట్టిన – ముసిల్దాని శవం మీంచి భగవాన్లు దొంగిలించిన రెండు వజ్రాల దుద్దులు – కథా నాయకుడికి భగవాన్ల మీద వుండే భ్రమని బద్దలు కొట్టేశాయి. మొట్టమొదటిసారిగా భగవాన్ల శవాన్ని సైతం 'పర్వట్‌గాడు' అని యీసడించవలసిన స్థితిలో పడ్డాడు. ఇది రెండో సందర్భం.

సుగంధరావు, వైకుంఠం, కాత్యాయన్ని చంపేసి బెయిల్‌మీద బయట తిరిగే ఆమె భర్త, గౌరీ మనోహరిమీద శారీరక భీభత్సం సృష్టించిన 'గంజి ఖద్దరుగాళ్ళు', ఒళ్ళమ్ముకునే సౌభాగ్యం... అందరూ కథానాయకుడి అంతరంగం నిండా చీకటి కెరటాల్నే హోరెత్తించారు. భగవాన్లు కెరటమైకాదు, పెద్ద చీకటి ఉప్పెనై, కథానాయకుడి అంతరంగపునాదుల్ని కుదిపేశాడు.

జానకి అనబడే గౌరీమనోహరితో పరిచయం యేర్పడి, ఆమె అంతరంగపు సంస్కార సుగంధాలు సోకి, తను లోపల, బయట క్షాళనం "కావింపబడే" వరకూ, ఈ కథానాయకుడు కూడా మురికి చీకటి రొచ్చులో పొర్లాడుతున్నవాడే.

అతనికీ జీవితం మీద చివరి ఆశగా మిగిలిన కిరణాలు అహల్య. ఆమె భర్త ఎంకట్రాయుడు, ఖొజ్జా మస్తాన్ మాత్రమే. గౌరీమనోహరొక్కర్తే, ఆవరించిన వెన్నెల. చాలా సామాన్యమైన మధ్యతరగతి "మేధావి అనార్కిస్ట్" అంతరంగ కథనం యీ నేనూ–చీకటి.

కృష్ణశాస్త్రి 'అయ్యోమనిషీ' అని ఒక గీతం రాశారు. అందులో ఒక చరణం

"క్షుద్రతిత్తిరికుటిలవృశ్చికక్రూరవృక
రుద్రమారణయంత్రరుగ్మతలు తానైన
మనిషిలోనే పెద్దమడతుంది
మనిషికే పెడబుద్ధి పుడుతుంది"–

అని వస్తుంది. మనిషిలో యీ పెద్దమడతల్ని పెంచే చీకటి గురించి శ్రీ వేణు గోపాల్ మాట్లాడదలిచినట్టు ఈ 'నేనూ–చీకటి' నవల చదివితే తెలుస్తుంది.

ఇటువంటి పుస్తకాలు ఎవరి ఏకాంతంలో వారు చదవాల్సిందే– నేనూ–చీకటి నవల వెంటాడి చదివిస్తుంది. చదివాక వెంటాడుతుంది.

**– ఇంద్రగంటి శ్రీకాంత శర్మ**

*(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 2, మార్చి 1998)*